దేవాంగపురాణము

தேவாங்க புராணம்



దేవలబ్రంహ్మాఋషి

అగ్నిదత్త - దేవదత్త

దేవాంగ పురాణం

தேவாங்க புராணம்



మహిషాసురమర్ధిని

దేవాంగ పురాణం

తొలి ముద్రణ- 1913

రెండవ ముద్రణ- 2015

వెల - అమూల్యము

ప్రతులకు

నాప రామలింగం - శ్రీమతి సత్యవతిగార్ల

కుమారుడు

నాప. బాల సుబ్రహ్మణ్యం

444/3, V.O.C. Street,
N.S. Nagar,
Madarapakkam, Gummidipoodi Tk
PIN - 601 202.
Cell : 9840131037

బ్రహ్మశ్రీ

పండిత పురాణం - సూర్యనారాయణతీర్థుల వారిచే

దెలింగింపించి

శ్రీ వాణి నిలయ ముద్రాక్షర శాలాధికారిచే ముద్రించి ప్రకటించబడినది.

చెన్నపురి - 1913.

ముద్రణ:

కాట్న ప్రింటింగ్స్

No 4, Mannappa Street, Ch-21.
Cell : 9382874496

ఓం

ఓం శ్రీ దేవాంగ పరబ్రహ్మణే నమః

విఘ్నేశ్వరధ్యానమ్

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే
వాగీశాద్యా స్సుమనస స్సర్వార్థానా ముపక్రమే
యం నత్వా కృతకృత్యా స్స్యుస్తం నమామి గజాననమ్.

గురుధ్యానమ్

అజ్ఞాన తిమిరధ్వంసం విజ్ఞానస్య ప్రవర్ధనం
స్వర్గాపవర్గ ఫలదం గురురాజ మహం భజే.

ఈశ్వరధ్యానమ్

య స్యాజ్ఞయా బ్రహ్మ ముకుంద కాల
రుద్రాః ప్రభావస్థితి సంహృతీనాం
కర్తృత్వ మాపు ర్జగతస్త మీశం
వందే శివం శంకర మాత్మ రూపమ్.

దేవీస్తోత్రమ్

దివ్యాంబరాంకిత తనుం మిహిరాగ్ని చంద్ర
నేత్రాం సుధాంశుమకుటాం హిమసన్ని భాభాం
సింహాసనాం పరశుఖడ్గధరాం భుజాభ్యాం
బ్రహ్మేంద్ర విష్ణు నమితాం త్రిపురాం భజేహమ్.

గాయత్రీధ్యానమ్

ముక్తా విద్రుమ హేమ నీల ధవళ చ్ఛాయైర్ముఖై స్త్రీక్షణై
ర్యుక్తా మిందు నిబద్ధ రత్నమకుటాం తత్త్వార్థవర్ణాత్మికాం

గాయత్రీం వరదా భయాంకుశకశాంశుభ్రం కపాలంగదం
శంఖం చక్రమ దారవింద యుగళం హస్తైర్వహంతిం భజే.

శ్రీమద్దేవాంగ పరబ్రహ్మ స్తోత్రమ్

ఓం, అస్య శ్రీ గురు దేవాంగ పరబ్రహ్మస్తోత్ర మహా మంత్రస్య, ఏకోరామాచార్య ఋషిః, అనుష్టుప్ ఛందః శ్రీ దేవాంగ పరబ్రహ్మ దేవతా, ఓం బీజమ్, నమః శక్తిః, శివాయ ఇతి కీలకమ్, మమ శ్రీగురుదేవాంగ పరబ్రహ్మ ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః –

ఓం దేవలాయ అంగుష్ఠాభ్యాం నమః
ఓం నం సూత్రాత్మ కాయ తర్జనీభ్యాం స్వాహా
ఓం మం బ్రహ్మోపదేశ కారణాయ మధ్యమాభ్యాంవషట్
ఓం శిం గాయత్రీనిర్మితాయ అనామికాభ్యాం హుమ్
ఓం వాం పరశివఫాలచక్షురుద్భ వాయకనిష్ఠి కాభ్యాంవౌషట్
ఓం యం సత్యస్వరూపాయ కరతల కరపృష్ఠాభ్యాం ఫట్.

అథ హృదయాది న్యాసః

ఓం దేవలాయ హృదయాయ నమః
ఓం నం సూత్రాత్మకాయ శిరసే స్వాహా
ఓం మం బ్రహ్మోపదేశకారణాయ శిఖాయై వషట్
ఓం శిం గాయత్రీ నిర్మితాయ కవచాయ హుమ్
ఓం వాం పర శివ ఫాలచక్షురుద్భవాయ నేత్రత్రయాయవౌషట్
ఓం యం సత్యస్వరూపాయ అస్త్రాయ ఫట్.

ఓం భూర్భువస్సువరో మితి దిగ్బంధః

ధ్యానమ్

వందే నిత్యం భవ భయహరం సర్వ లోకాధివాసం
నిత్యాకారం సకలజగతాం సూత్రధర్తార మాద్యం
భావాతీతం త్రిగుణరహితం తత్త్వమస్యాది గమ్యం
దేవాంగాఖ్యం పరమ పురుషం సచ్చిదానంద రూపమ్.

అథ మానసిక పంచపూజా

లం – పృథివ్యాత్మనే శ్రీ మద్దేవాంగాయ గంధం సమర్పయామి
హం – ఆకాశాత్మనే శ్రీమద్దేవాంగాయ పుష్పం సమర్పయామి
యం – వాయ్వాత్మనే శ్రీమద్దేవాంగాయ ధూపమాఘ్రాపయామి
రం – తేజసాత్మనే శ్రీమద్దేవాంగాయ దీపం దర్శయామి
వం – అమృతాత్మనే శ్రీమద్దేవాంగాయ అమృతోపహారం సమర్పయామి
సం – సర్వాత్మనే శ్రీమద్దేవాంగాయ సర్వోపచారపూజాం సమర్పయామి

అథమూల మంత్రమ్

స్వాచార్య సకాశాత్ లబ్ధోపదేశః శ్రీ దేవాంగద్వాదశాక్షరీ మహామంత్రం యథాశక్తిం జపిత్వా, పునఃధ్యానం మానసికపూజాం హృదయాది న్యాసంచ కుర్యాత్, భూర్భువ స్సువరో మిత్యుత్తర దిగ్విమోకః.


శ్రీ స్కాందపురాణాంతర్గత శ్రీ దేవాంగాష్టోత్తర శతనామధ్యానశ్లోకాః.


శ్రీ దేవాంగో మహాదేవో దేవలో దేవపాలకః
మహాదేవ స్థితజ్యోతిః సృష్టిస్థిత్యంతకారకః
చూడాంబికాఖ్యసమ్ముక్తా శక్తి చిచ్ఛక్తిధారకః
బ్రహ్మవిష్ణీశసంపూజ్య పాదపంకజభాసితః
పరమాత్మా పరంజ్యోతిః పరబ్రహ్మో పరాత్పరః
పరేశ్వర సహస్రార పద్మాంతర ప్రభాసకః
యజ్ఞకర్తా యజ్ఞభోక్తా యజ్ఞసూత్ర స్వరూపకః
విశ్వకర్తా విశ్వభర్తా విశ్వరా ద్విశ్వకారణః
నిరాలంబో నిరాకారో నిరాభోసో నిరాకులః
నిర్వికల్పో నిరాతంకో నిష్కళంకో నిరంజనః
సర్వకర్తా సర్వసాక్షీ సర్వకారణకారకః
సూత్రకర్తా సూత్రధారీ సూత్రాత్మా సూత్రదాయకః
వేదవేదాంగసంవేద్యో సచ్చిదానంద విగ్రహః
మహాదేవో మహద్రూపో మహావాక్యార్థగోచరః
నిత్యశుద్ధో నిత్యతృప్తో నిర్గుణో నిరుపద్రవః
సత్వాదిగుణసంయుక్తో సాకారో సకలాన్వితః
సర్వలోక ప్రతీకాశ స్సర్వలోక ప్రియంకరః
సర్వభూత స్వరూపశ్చ సర్వభూతాధినాయకః
భూర్భువాదికలోకేశ స్సతలా ద్యధినాయకః
సద్యోజాతముఖోత్పన్నో బ్రహ్మణేవేదదాయకః
సూర్యచంద్రాగ్నినిలయో సౌమ్యో ప్రణవమందిరః
శైవఫాలాక్షసంభూతో శివ శ్శైవాగ మార్చితః

శైవముద్రాంకితధరో శైవాజ్ఞాపరిపాలకః
చూడాంబికాతనూజాతః పంచాచార్యప్రతిష్ఠకః
గాయత్రీజననాధారః గాయత్రీపీఠనిర్ణయః
క్షీరాబ్ధిసంగత స్స్వర్ణతంతుసంపాదనోత్సుకః
శ్రీమన్నారాయణధ్యాన చింతనోల్లాసమానసః
దేవగంధర్వ సంసేవ్యో దేవదత్తామనోహరః
నంది కేతనసంయుక్తో నక్రకుండలధారకః
మాయాతీతోమను బ్రహ్మోమాయాంగోమహిమాఢ్యకః
జ్యోతిర్మయశ్చిన్మయాత్మా శ్శుచిర్భాత స్సుఖప్రదః
ఆమోదపత్తనాధీశ స్స్వగ్నిదత్తా మనఃప్రియః
బ్రాహ్మణ్యకప్రతిష్ఠాతా బ్రహ్మవిద్యాప్రదాయకః
రామలింగేశ్వరాకారో రామచంద్ర ప్రపూజితః
విద్యాధరః పుష్పదంతో బేతాళో భూతశిక్షకః
వరవిద్యావ్యాపకశ్చ వరరుచ్యవతారకః
చింతి తాచ్యుతపాదాబ్జ శ్చిత్రయోగి స్వరూపకః
దేవశాలిసమాఖ్యాతో దేవదాసో మహామతిః
దేవాంగ బ్రహ్మవంశాద్యో దేవయజ్ఞఫలప్రదః
అష్టాంగయోగనిరత స్స్వప్రాకృత ద్విజావనః
చతుష్షష్టికళాధీశ శ్చాతుర్వర్ణ్యోపదేశకః
జగదంతర్బహిర్వ్యాప్తో జగత్సేవ్యో జగద్గురుః
ఏవం శ్రీదేవదేవాంగ నామ్నా మష్టోత్తరంశతం
స్వర్గాపవర్గఫలదం సర్వారిష్టనివారణం
పఠతాం శ్రుణ్వతాం భక్త్యా సర్వాభీష్ట ప్రదం శుభం
త్రిసంధ్యంచ పఠన్నిత్యం సర్వాన్ కామాన్ అవాప్నుయాత్

ఇతి శ్రీ స్కాందపురాణే సనత్కుమార సంహితాయాం
రజతాచలఖండే గురుజ్ఞానసుధార్ణవే అష్టాదశోధ్యాయః.


దేవల మహర్షి


దేవర దాసమయ్య
ఏడవ అవతారము



శ్రీరస్తు

శ్రీ చౌడాంబాయై నమః

దేవాంగపురాణము

శ్లో॥ నమః శ్రీరామలింగాయ చౌడాంబాయై నమో నమః ।
దేవలాయ నమో యేన కృతం దేవాంగగౌరవమ్ ॥

మొదటి అధ్యాయము

పూర్వ మొకప్పుడు నారదుడు లోకుల నమగ్రహించుతలంపుతో సత్యలోకమునకు బోయి బ్రహ్మకు నమస్కరించి యిట్లనియె.

నార – ఎవనియాజ్ఞచే బ్రహ్మవిష్ణు మహేశ్వరులు లోకములను సృజింపను, పాలింపను, సంహరింపను గర్త లగుచున్నారో అట్టి పురాణపురుషునకు నమస్కరించుచున్నాను. పితామహా ! ఏది సమస్త పాపములను బోగొట్టి పుణ్యమును శుభములను గలిగించి లోకులను గృతార్థులను జేయునో అట్టి కథ చెప్పుమనగా బ్రహ్మ యిట్లనియె.

బ్రహ్మ – నారదా ! రహస్యమును, సంతోషమును, గలిగించు నదియు, పాపములను బోగొట్టి పుణ్యమును గలిగించునదియు, ప్రాచీన మయినదియు, శివునిమాహాత్మ్యమును దెలుపునదియు, విన్నవారిని కృతార్థులను జేయునదియునగు దేవాంగ చరిత్రమును జెప్పెదను వినుము. సచ్చిదానందస్వరూపుడును శాశ్వతుడును సర్వలోకములకు బ్రభువును, సర్వవ్యాపియు, పరాత్పరుడును, అప్రమేయుడును, నిర్గుణుడును నగుపరమశివు డొకప్పుడు సృష్టిచేయవలయు నని తలంచెను. ఆతని యిచ్ఛవలన త్రిగుణాత్మికయగు శక్తిపుట్టినది. ఆమె దివ్యజ్యోతియై వెలుంగుచుండగా శివుడుచూచెను. ఆదిశక్తియు లోకముల కాధారభూతురాలును నగు నామెను శివుడుచూడగానే రజోమూర్తియగు నామెవలన నేను బుట్టితిని.

సాత్త్వికమూర్తివలన విష్ణువుపుట్టెను. తామసమూర్తివలన మహాబలుడగు కాలరుద్రుదు పుట్టెను. అని చెప్పగా విని నారదు డిట్లనియె.

నార – దేవా ! ఆ ప్రకృతివలన బుట్టి నీవేమేమిచేసితివి. నీయిచ్ఛ యెట్లుండెను. నీవెట్లు సృష్టికర్తవైతివి? ఆయీసంగతులు విస్తరించి చెప్పుమనగా బ్రహ్మ యిట్లనియె.

బ్రహ్మ – నారదా ! బాగుగా నడిగితివి. చెప్పెదను వినుము. అట్లుపుట్టి నేను శివునిగూర్చి తపస్సు చేసితిని. నా తపస్సునకు సంతోషించి శివుడు ప్రత్యక్షమాయెను. నే నతనిని పెక్కు విధముల స్తుతిచేసితిని. నాస్తుతికి శివుడు సంతోషించి యిట్లనియె.

శివు – చతుర్ముఖా ! నీతపస్సుకు మెచ్చితిని. నీయిష్టమైన వరము వేడుము. ఇచ్చెదను. అని యనగానే సంతోషించి యిట్లంటిని. దేవా ! నీయాజ్ఞాప్రకారము నేను లోకములను సృజింపదలంచుచున్నాను. అనగానే విని యత దట్లేయగుగాక యనెను. మఱియు, చతురాననా ! ఇదిమొదలు నీవు చరాచరప్రపంచమును సృజింపుము. అని యాశివు డదృశ్యమాయెను. నే నాతనియనుగ్రహమువలన నీచరాచర ప్రపంచమును సృజించితిని. దేవతలు మనుష్యులు మొదలగు నా సృష్టిలోని వారందఱును పశువులవలె వస్త్రములులేక దిగంబరులై తిరుగుచుండిరి. స్త్రీలకు గాని పురుషులకుగాని మానసంరక్షణము లేకపోయినది. అందు గొందఱు చర్మములు, ఆకులు మొదలగువానిచే మానమును గాపాడుకో మొదలిడిరి. ఇట్టి ప్రజలను జూచి నేను జాలసిగ్గుపడి యందఱకును ముఖ్యాలంకారమగు వస్త్రములను సిద్ధముచేయు రీతిని దెలిసికొనుటకై కైలాసమునకు బోతిని. అచ్చట దేవతలు మొదలగువారు ఆకులు మొదలయినవి కప్పుకొని సేవించుచుండగా వజ్రసింహాసనముపై గూర్చున్న శివుని దర్శించి యనేకవిధములుగా స్తుతిచేసితిని. నాస్తుతులకు సంతోషించి శివుడిట్లనియె. బ్రహ్మ ! నీకును నీవు సృజించినప్రపంచమునకును క్షేమమేకదా ! నీవు చరాచర ప్రపంచమును సృజించితివిగాని వారు వస్త్రములు లేనికారణమునుబట్టి దిగంబరులై చూచుట కనహ్యాముగా గనుపట్టుచున్నారు. కావున వారి యలంకారమున కును మానసంరక్షణమునకును వస్త్రములను నిర్మించు వానిని సృజింపుము. లోకము మిక్కిలి యసహ్యాముగా నున్నది. నీబుద్ధిచేతనే యాలోచించుము. అనుశివునిమాటలు విని చేతులుజోడించు కొని యిట్లంటిని. దేవా ! దేవరయాజ్ఞాప్రకారము లోకమును సృజించి తినిగాని వస్త్రములను సిద్ధముచేయువానిని సృజింపజాలను, పుట్టించు వాడవును

పెంచువాడవును సంహరించువాడవును నీవేకదా ! నీకింకరుండనగు నాకిట్టియసాధ్యమైనపని యేల చెప్పెదవు? అనినేనగానే శివుడిట్లనియె బ్రహ్మ ! ఏమి ఆశ్చర్యమైనసంగతి చెప్పుచున్నావు? లోకమును సృజించిననీ కిదియేమాత్రపు కష్టము? అని యాయనయన్నాడు. అపుడు నేను మరల నిట్లంటిని. సర్వజ్ఞుడవగు నీతోనేమి చెప్పవలయును? నాకేదిశక్యమో యేదిశక్యముగాదో నీకేతెలియును. పూర్వపుసృష్టిలో దేవతలు మొదలగువారికి వస్త్రములను నిర్మింపను మను వుండెడివాడు. అతడు నీసాయుజ్యమును బొందియున్నాడు. అతడేతప్ప మఱియెవ్వరును నీపనిచేయజాలరు. కావున నాయందును దేవాదులయందును దయయుంచి వస్త్రములను సిద్ధముచేయువానిని నీవే సృజింపుము. అని యూరకయుంటిని. తరువాత శివుడు సంతోషించి మనసులో నాలోచింపదొ డగెను. క్షణకాల మచ్చట నిశ్శబ్దముగా నుండెను. ఇట్లు శివుడు మనసులో నాలోచింపగానే యొకానొక మహాజ్యోతి ప్రత్యక్షమై వెంటనే పురుషాకారమును ధరించెను. అతడు జటావల్కలములను దండాజినకమండలువులను ధరించి వ్రేళ్ళకు దర్భలు పెట్టుకొని రుద్రాక్షకేయూరములును హారములును కంకణములను శరీరమున నలంకరించుకొని సర్వకర్మములకును సాధకమయిన యజ్ఞోపవీతముతో గోటి సూర్యప్రకాశమానుడై యింద్రియనిగ్రహము గలిగి నీతిమంతుడును బుద్ధిమంతుడును జ్ఞానవంతుడునునయి యగపడెను. మఱియు నతడుదారమైన గుణములు గలవాడును సత్యమే పలుకువాడును, దృఢవ్రతుడును చాతుర్యము యుక్తి గలవాడును కుశలియు కీర్తియేయలంకారములుగా గలవాడునునై యందఱకును నాశ్చర్యమును గలిగించెను. తరువాత శివుడందఱును వినునట్లుగా నితడు దేవలుడని నాచే నామకరణము చేయుబడినవాడనెను. తరువాతను దేవలుడు చేతులు జోడించుకొని శివునియెదుట నిలువబడి యనేకవిధములుగా నాయనను స్తుతి చేసి దేవా ! నన్నెందులకు సృజించితివి. నేను జేయదగిన దేదియైన నున్నచో సెలవిమ్ము. ఏదో గొప్పకార్యము లేనిచో నశించుస్వభావము గల యీనాదేహమును సృజింపవు. దేహధారులకు సదా దుఃఖమేకాని సుఖమన్నమాట కలలో దొరికిన మాటయేకదా ! ఈదేహము పంచ భూతాత్మకము. ఇందు పంచప్రాణములున్నవి. పదియింద్రియములు గలవు. మనోబుద్ధిచిత్తాహంకారములతో గూడినది. ఇరువది నాలుగు తత్త్వములు గలసి దేహమని చెప్పబడుచున్నది. నిత్యుడగు జీవుడీ శరీరములోనున్నాడు. దేహసంబంధమునుబట్టీ జీవుడు సుఖదుఃఖముల ననుభవించుచుండును. అజ్ఞానమనుత్రాటితో గట్టుపడి దుఃఖమే

యనుభవించుచున్నాడు. ఇట్టిదియని చెప్పరాని యజ్ఞానమువలన నవివేకము, అవివేకమువలన అభిమానము దానివలన గామము క్రోధము లోభము మదము మత్సరము అనునంత శ్శత్రువులును, ఈర్ష్యాదులును బుట్టుచుండును. అందు మనస్సు వాక్కు శరీరము కర్తృత్వమును బొంది మూడు విధములయిన కర్మమును జేయును. అది ముగియువఱకును అనుభవించి తీఱవలసియే యుండును. సంసారసముద్రములో మునిగియున్న జీవునకు నివారింపరానికర్మమువలన నొడ్డుదొరకుట యసంభవము. దుష్కరమైన కర్మముల ననుభవించుజీవునకు సుఖమెక్కడిది? కావున నిందితమైన యీదేహమును నేనెట్లు భరింపగలను? నన్నెందులకు బుట్టించితివి? నే నేమిచేయవలయును ? అని యిట్లు దేవలుడు విన్నవింపగా శివుడిట్లనియె. నాయనా ! నీవు విచారింపకుము. నిన్ను లోకోపకారమునకై సృజించితిని. నీ వాఱుజన్మములవఱకును లోకములో గీర్తిని వ్యాపింపజేసి యేడవజన్మమున నాసాయుజ్యమునుబొందెదవు. ప్రస్తుతము నేను జెప్పబోవుదానిని వినుము. పూర్వము నావలన వేదములు పుట్టినప్పుడు వానితో గూడ సర్వలోకాలం కారములగు దారములుగూడ బుట్టినవి. అది మొదలవి విష్ణునినాభీకములమునందున్నవి. నీ వావిష్ణునియొద్దకు బోయియాతంతువులను సంగ్రహించి నీనేర్పుకొలదిని వానిని దివ్యవస్త్రములుగా జేసి మానసంరక్షణార్థ మందఱకును నిచ్చి యా దేవాంగముల నలంకరింపుము. దానివలన నీకు గీర్తియు దేవాంగుడనునామమును గలుగును. అని యిట్లు శివభగవానుడు చెప్పినమాటలు విని యాదేవలుడు తన వర్తనమునుగూర్చి యిట్లడిగెను.

దేవా – దేవా ! ఇటుపయిని నాప్రవర్తనవిషయమై చెప్పుము. నే నెచ్చటికి బోయియుండవలయును ? మహేశ్వరా ! నావంశమందెట్టివారు పుట్టుదురు? వారిప్రవర్తన యెట్లుండును ? ఆయీసంగతులన్నియు జెప్పుమన శివు డిట్లనెను.

శివు – దేవలా ! ముందుసంగతి వినుము. సర్వరత్నమయము, భోగాయతనము, ఓషధులతో నిండినది, నానావృక్షములుగలది, అనేక పర్వతములు మొదలగువానితో నిండి యేడుద్వీపములు తొమ్మిదిఖండములుగల భూమి యున్నది గదా ! అందు జంబూద్వీపము గలదు. అందు దేవతలందఱకును వాసయోగ్యమయిన మేరుపర్వతముగలదు. అది యుమ్మెత్తపువ్వువలె బంగారువికారముగా నున్నది. దాని యౌన్నత్యము ముప్పదిరెండులక్షలయోజనములు. పాతాళములో బదియాఱులక్షల యోజనములవఱకును పాతుపడియున్నది. ఆపర్వతమునకు

దక్షిణభాగమున భరతఖండము గలదు. అందు సర్వసౌఖ్య నిధానమగు సగరదేశమున్నది. ఆదేశములో బహు విస్తారముగల యామోదపట్టణము గలదు. అది స్వర్గమును మించి యున్నప్పుడు దానిని వేఱుగా వర్ణింపనేల ? నీవాపట్టణమునకు రాజవై రాజ్యమేలుచుండుము. ఇక నీవంశమువారిసంగతి యడిగితివి వినుము. నీవారందఱును ఉదారులు, సత్యము తప్పనివారు, పరోపకరణపరాయణులు, బుద్ధిశాలులు, సదాచారసంపన్నులు దేవతలయందును బ్రాహ్మణులయందును, భక్తిగలవారు, పరాక్రమవంతులు, నేర్పరులు, అయియుందురు. ఇక నీవు వేగముగా విష్ణునియొద్దకు బోయి ముందాపని చూడుము.

బ్రహ్మ – ఇట్లు శివు డాజ్ఞాపించినతోడనే మంచిదే యని యంగీకరించి సంతోషముతో నతనికి నమస్కరించి విష్ణువుని జూచుటకై పాలసముద్రమునకు బోయెను.

ఇట్లు బ్రహ్మాండపురాణములోనియు త్తరఖండమున బ్రహ్మానారద సంవాదమున దేవాంగసంభవ మనునది మొదటియధ్యాయము.

రెండవ అధ్యాయము

బ్రహ్మ – నారదా ! దేవలుడు పోవునపుడు పార్వతికి నమస్కరించి యిట్లనెను. దేవీ ! నన్ను సాదరముగా జూడుము. నీవు లోకముల కీశ్వరివి. నేను శివునియాజ్ఞాప్రకారము సంతోషముగా బాలసముద్రమునకు బోవుచున్నాను. నాయం దనుగ్రహదృష్టియుంచుము. లోకములన్నియు నీయధీనములు. అనియనగానే పార్వతి యిట్లనియె నాయనా ! దేవలా ! నీవు పొమ్ము. అవసరము తటస్థించునపుడు సాయము చేసెదను. నిన్ను శత్రువులు బాధించినపుడు నన్ను స్మరింపుము. నేను బ్రత్యక్షమై నీశత్రువులను సంహరింతును. అని దేవి చెప్పగానే సంతోషించి దేవలుడు పాలసముద్రమునకు బోయి దానియెడ్డున నొకచక్కని సువర్ణాశ్రమమున నుండెను. వర్ణించుటకు వాక్కులు చాలని యాయాశ్రమములో నుండి విష్ణుమూర్తిని బ్రసన్నుని జేసికొనుటకై యథావిధిగా నియమమవలంబించి తపస్సుచేసెను. అతనితపస్సునకు మెచ్చి విష్ణుడు ప్రసన్నుమాయెను. దేవలుడు విష్ణు ననేకవిధములుగా స్తుతిచేసెను. అతనిస్తుతికి సంతోషించి మందస్మితసుందరవదనారవిందుడై గోవిందు డిట్లనియె. మహాభాగ ! బాగు ! బాగు ! నీతపస్సునకు సంతోషించితిని. నీయిష్టమయిన వరమడుగుము, ఇచ్చెదను. అని చెప్పగానే దేవలు

డిట్లనెను. దేవదేవా ! నీవుసంతోషించుటవలన నేను గృతార్థుడ నయితిని. శివుడు నన్ను వస్త్రములను నిర్మింపుమన్నాడు. నీయొద్ద నున్న తంతువులు నా కిమ్ము. నే నందులకై వచ్చితిని. నీదర్శనమువలన నాకోరిక నెఱవేఱినది. అనగానే మంచిదే. యని తంతువుల నాదేవలుని కిచ్చెను. ఇట్లు చిరకాలమునుండి తననాభీపద్మములో నుంచుకొనియున్న దారముల నిచ్చి యచ్చక్రధరుడు దేవలునితో నిట్లనియె. ఓదేవలమునీ ! ఇవి పూర్వము సృష్టిసమయముననే పుట్టినవి. అది మొదలు నేను వీనిని నానాభిపద్మమునందుంచి దాచుచుంటిని. నీవల నిన్నాళ్లకు వీనికి వినియోగము గలిగినది. ఇవి పట్టుకొనిపోయి నీనేర్చుకొలదిని విలువలేని వస్త్రములను సిద్ధముచేసి దేవతలు మొదలగువారి నలంకరించి వారిమానము గాపాడుము. నీవుపోవునపుడు దారిలో రాక్షసులు మునివేషములతో వచ్చి నిన్నువంచించి దొంగిలింపగలరు. నీవావిషయమై జాగ్రత్త గలిగి నీపరాక్రమమం తయు జూపి యుద్ధముచేసి వాండ్రను జంపుము. ఇట్లు చెప్పి వెంటనే తన చక్రమునుండి చక్రమునుసృజించి యాతనికిచ్చెను. చక్రముపుచ్చుకొని సంతోషించుచు జేతులుజోడించి దేవలు డిట్లనియె. ప్రభూ ! నీవు నాయం దనుగ్రహించి యంతయు జెప్పితివి. నీదయవలన నిక వస్త్రములను నేసెదను. నీయాజ్ఞను శిరసావహించి దేవతలందఱకును వస్త్రము లిచ్చెదను. అనిచెప్పి దేవలుడు భక్తిగా నారాయణునియెదుట నిలువబడి చిత్తము స్వామీ ! యని నమస్కరించెను. భగవంతుడప్పుడే యంతర్ధానమాయెను. అక్కడనుండి తిన్నగా దేవలమహాముని జంబూద్వీపమునకు వచ్చెను. ఉప్పుసముద్రమునొద్దున నొకానొక కృత్రిమమయిన యాశ్రమమును జూచెను. మాయచే జేయబడిన యాయాశ్రమ మునుసంగతి యెంతవింతగా నుండునో చదువరులే పోల్చుకోగలరు. అట్టి యాశ్రమమునుజూచి “ఈయాశ్రమ మెవరిదోకదా ! ఇది నామనస్సును హరించినది. ఈయాశ్రమముయొక్క యజమానుని తపోమహిమ యెటువంటిదయి యుండునోకదా !” యని యనుకొనుచు మెల్లగా నందులోనికిబోయెను. అందొకచో గపటమంతయు శరీరమునుధరించి కూర్చుండియున్నదో యన్నట్లు మునియొక్క డక్కడ నున్నాడు. తన్ను మించినశిష్యులు పరివేష్టించియున్నారు. కపటమంత్రము లను జపము చేయుచున్నాడు. చూచుటకు మహాశుచివలె నున్నాడు. ఇతనినిజూచి నాయనా ! నీవెవరు ? నీపేరేమి ? నీవిచ్చటికి వచ్చినపనియేమి ? అని యతిప్రేమగా నడుగగా దేవలు డన్నాడు. మహాబాగా ! నేను దేవలుడనుపేరుగలవాడను. ఈశ్వరునిమానసపుత్రుడను. శివభగవానుడు నాకు వస్త్రములునేయుమని

యాజ్ఞాపించెను. విష్ణునిదగ్గఱకుబోయి దారములు దెచ్చుచున్నాను. అను నతని మాటలువిని కపటముని యిట్లనియె. నాయనా ! నిన్నుజూచి చాల సంతోషించితిని. నీవు మార్గాయాశము తగ్గించుకొని రేపోయెల్లుండియో పోవుదువుగాక యనెను. మంచిదేయని యారాత్రి దేవలుడు కృతాతి థ్యుడై శయనించెను. రాత్రిగురువుగారు శిష్యులు రాక్షసులై దేవలుని జంప నుద్యుక్తులైరి. వీరికుటిలము దెలిసికొని విష్ణుమూర్తియిచ్చినచక్రమును వాండ్రపయి బ్రయోగించెను. కోటిసూర్యప్రకాశమాన మగు నాచక్రము కొందఱురాక్షసులను సంహరించినది. కొందఱు పదిదిక్కులకును ముందేపారిపోయిరి. ఎట్లోతప్పించుకొని తరువాతను వజ్రముష్టి ధూమ్రవక్త్రుడు, ధూమ్రాస్యుడు, చిత్రసేనుడు, పంచసేనుడు అను నైదుగురు రాక్షసులేకమయి యితనితో యుద్ధముచేయమొదలిడిరి. రాక్షసులు బాణవర్షము గురిపించి లోకమంతయు జీకటిమయము చేయుచున్నారు. కోపించి దేవలుని ఛిన్నభిన్నముగ జేయుచున్నారు. చక్రము వాండ్ర నేమియు జేయజాలకపోయినది. వాండ్రదెబ్బలకు దేవలుడు తాళజాలకపోయినాడు. ఈ చరాచర ప్రపంచమున కీశ్వరియగు చండికను మనస్ఫూర్తిగా దలచుకొన్నాడు. అనేకవిధములుగా నాయమ్మను స్తుతిచేసినవాడు. భక్తపరాధీనురాలు పాపము ! దేవి హఠాత్తుగ నావిర్భవించినది. ఇట్లు ప్రసన్నురాలయిన యాయంబతో సవినయముగా నిట్లని విన్నవించెను. అమ్మా! చండికా ! నీకొక్క నమస్కారము అమ్మా ! నేను నేడు నీపుణ్యమూర్తిని గనులార జూడజాలితిని. నాదికదా ! అదృష్టము. అంబా ! యీరాక్షసులను చూచితివిగదా ! నన్నెట్లు బాధించుచున్నారో ! ఈ మాటలువిని యెంత పర్వతరాజపుత్రియయినను, ఆడుదిగనుక జటుకున మనసుకరగినది. ప్రసన్నురాలై దేవలునితో బరమేశ్వరి యిట్లన్నది. వత్సా భయపడకు. నీకు క్షేమమేయగును. ముహూర్తమాత్రము నా బలముచూడు. ఈ రాక్షసులను శూలముతో, బొడిచిచంపెదను. నేడు వీండ్ర రక్తము బొట్టు పెట్టుకొనియెదను. అని చండిక యొక్కసారి పెద్దనవ్వు నవ్వినది. నాలుగు భుజములు, పెద్దనాలుక, ఎఱ్ఱనికన్నులు, మహాబలముగలదై చేతులతోశూలము, చక్రము, గద మొదలగునాయుధములు ధరించి కోటిసూర్య ప్రకాశమానమగు కిరీటము శిరోభాగమున వెలుగుచుండగా గాటుకబొమ్మవలె నాయమ్మ ప్రత్యక్షమై యొక్క దెబ్బతో రాక్షసులు తమ యబ్బలదగ్గఱకు బోవునట్లు చేయగల నిబ్బరముగల శూలమును గొబ్బున ద్రిప్పమొదలిడినది. వాండ్రును సామాన్యులుగారు. ఇట్లు భయంకరాకారముతో దేవి వచ్చియుండుట చూచి యెట్లయినను దేవిని జంపుదమను తెంపుతో యుద్ధమునకు సన్నద్ధులయిరి. దేవిదివ్యకిరీటపు

గాంతులచేతనే స్తంభించిపోయిరి. ఒక్కహుంకారము చేయునప్పటికి మూర్ఛ పోయిరి. అప్పుడు ఘోరరూపిణియగు వీరమాత తనయాయుధముల నన్నింటిని వాండ్రపయిన బ్రయోగింపవలసి వచ్చినది. కొందఱు కాందిశీకులయిరి. ఎట్లో అయ్యైదుగురుగడ్డు రాక్షసులను యమునియింటికి బంపించినది. దేవులుడపు డైదురంగులు గల వాండ్రరక్తములో దనయొద్దనున్న దారములు దడిపి యయిదురంగులనూలు సిద్ధము చేసికొనెను. చూడమనగా గిరీటము, కిరీటమునుండి బయలుదేఱిన కాంతులచే రాక్షసులందఱును స్తంభించిరి. గనుక జౌడేశ్వరియని యాత్రిభువనేశ్వరి ఏర్పడ్డది. ఆమె ప్రసన్నచిత్తురాలై దేవలునితో నిట్లన్నది. వత్సా ! ఇక నీయిష్టమువచ్చిన చోటికి బొమ్ము. నీవునన్ను దలంచినతోడనే ప్రత్యక్ష మగుచుందును. అని చెప్పి యాయంబ వెంబడి నేయంతర్ధానమయి పోయినది. దేవలమహాముని తిన్నగాను నూలుపట్టుకొని శివునిసెలవుప్రకారముగా నామోదపట్టణమునకు బోయెను.

నారా – పితాజీ ! ఆవజ్రముష్టి మొదలయిన యయిదుగురు రాక్షసులును ఎవరికొడుకులు ? విష్ణుచక్రముగూడ వారి నెందులకు జంపజాలకపోయినది? వారెక్కడివారో కాని యసామాన్యులవలె నున్నారు. వారిసంగతి కొంచెము విస్తరించి చెప్పుము.

బ్రహ్మ – నారదా ! దేవి యుగ్రరూపముతో బ్రత్యక్షముగా గానే యామెను జూచి "మనము చాలమందిమి గుమిగా గూడితిమేని జయింపవచ్చును" అని వెఱ్ఱియాలోచన నిర్ణయించుకొని చతురంగబలముతోడను బయలుదేఱిరి. వారియాలోపము వ్రాయదరముగాదు. దేవితో యుద్ధముగదా ! వాండ్రు దేవిని సామాన్య మయినయాడుది యనియే తలచియుందురు. గాలి కెగరుజెండాగుడ్డల చప్పుడు, కాహళములను వాద్యముల చప్పుడు, గుఱ్ఱములహ్రేషలు, ఏనుగులఘీం కారములు, రాక్షసులు మేఘగర్జనలు, పిడుగులవంటిధనుష్టంకారములు దిక్కులను జెవుడెత్తించినవి. అయ్యా ! రాక్షసబలములను జూచినది. మఱింత కోపము దెచ్చుకొన్నది. గద చేతితో గిరగిరద్రిప్పి రాక్షసులను మొత్త మొదలుపెట్టినది. ఒక్కొక్క దెబ్బకు బలుమందిగా జచ్చిరి. వాండ్రనందఱను దిలలవలె ఖండించినది. కొన్ని యేనుగులు గదాఘాతములచే దంతములు విఱిగియు గుంభస్థలములు పగిలియు నేలగూలినవి. కుంభములనుండి జల్లున ముత్తెములు రాలినవి. గదచే నెముకలువిఱిగి గుఱ్ఱములు చచ్చినవి. రథములు పొడిపొడియయిపోయినవి.

రాక్షసులశిరస్సులు బ్రద్దలయినవి. బలవంతుడగుమానిసి కఱ్ఱతో గుండలుదొంతిని బగులగొట్టినట్లు రాక్షసులశిరస్సులు దేవి గదతో గొట్టుచున్నది. సారథులు చచ్చిరి. అప్పుడు కత్తి చేతబట్టుకొని యేనుగులతొండములు కంఠములు ఖండింప మొదలిడినది. దేవేంద్రుడు వజ్రాయుధముతో గొండల ఱెక్కలు నఱికి పడగొట్టినట్లు రాక్షసులను బడగొట్టినది. ప్రళయకాలమున యముడు దండపాణియయి ప్రజలను సంహరించులాగున నాలుగు చేతులతోను శూలము, కత్తి, గద, చక్రము పట్టుకొని యొక్క మాఱుగా రాక్షసులను జంప మొదలిడినది. ఒక్కొక్కసారి కత్తి పట్టుకొని వజ్రపాణియగు నింద్రునివలె రాక్షసులను వెంటాడించినది. ప్రళయమున భైరవునివలె శూలముతో రాక్షసులను జీల్చినది. చక్రముతోడ ననేకులను ఖండించి యమునియింటికి విందునకు బంపినది. ఘోరరూపిణియగు చండిక యారీతిగా జాలమంది రాక్షసులను జంపి మిగిలినవారిని బరుగెత్తించినది. రాక్షసరక్తము వఱదలై వెల్లువలై ప్రవహించుచున్నది. ఆరక్తమంతయు ద్రావినది. వాండ్రప్రేగులు మెడలో వైచుకొన్నది. చూడశక్యముగాకుండ ఘోరరూపిణియై ప్రళయకాల మేఘములవలె గర్జించినది. చావగా మిగిలినరాక్షసులందఱును నాలుగు దిక్కుల కును బాఱిపోయిరి. ఇట్లు రాక్షసులందఱును జచ్చిపడియుండుట చూచి భూతభేతాళ ఢాకినీ శాకినీ గణములు వచ్చిపడినవి. మాంసమును దిని రక్తమును ద్రావి సంతుష్టిని బొందుచున్నవి. దేవి ననేక విధములుగా స్తుతిచేయుచు బిచ్చి పట్టినట్టు తాండవముచేసినవి. పాఱిపోయిన రాక్షసు లీసంగతియు దమవారగు నితర రాక్షసుల తోడను జెప్పిరి. పూర్వము ప్రళయము దటస్థించినపుడు ప్రపంచమంతయు జలమయియుండగా, భగవంతడగు విష్ణుమూర్తి శేషశయ్యపై నియోగనిద్ర ననుభవించుచుండగా నాయన దేహమున జెమట పట్టినది. అప్పు డాచెమటవలన వజ్రముష్టి మొదలగు నాయయిదుగురు రాక్షసులును బుట్టిరి. గోవిందుడు నిద్రపోవు చుండుట చూచి యతనినే చంప నుద్యుక్తులయిరి. తరువాతను విష్ణుడు మేల్కొని వారితో ఘోరముగ యుద్ధముచేసెను. అప్పుడు వారు చేసిన బాహుయుద్ధమునకు సంతోషించి శౌరి వారితో నిట్లనియె. రాక్షసులారా ! మీరుచేసిన యుద్ధమునకు జాల సంతోషించితిని. మీయిష్టమయిన వరము వేడుడు. అనగానే యారాక్షసులతనితో నిట్లనిరి. దేవా ! నీకు మాయందు దయయున్నచో మాకు నీచక్రముచే, జావులేకుండ వరమిమ్ము. అని యడుగగానే విష్ణుడట్లే యిచ్చితి ననెను. అది మొదలు వజ్రముష్టి మొదలగువారు నిర్భయులై తమ పౌరుషము నాశ్రయించి పాతాళమునకు బోయి యందు సుఖముగానుండిరి. తరువాత నొకప్పు

డా రాక్షసులు భార్గవా[శమమునకు వచ్చిరి. ఆశుక్రాచార్యుని యా[శమములో నాతనికూతును దేవయానయనుదానిని జూచిరి. సర్వాంగసుందరియగు నాసుందరినిజూచి వారందఱును మోహమునొందిరి. ప్రేమపూర్వకముగా నామెయొద్దకుబోయి వినయముగా నిట్లనిరి. సుందరీ ! నీకు మేలగుగాక. హితకర మయిన మాపలుకాలింపుము. మేము ముల్లోకములయందును బేర్పడిన రాక్షసులము. మాయయిదుగురిలో నీ యిచ్చకువచ్చినవానిని వరింపుము. అనియిట్లు వారు చెప్పిన మాటలువిని యారమణి మిక్కిలిని గోపించి యిట్లన్నది. ఓరీదురాత్ములారా ! గురుపుత్రియన్నసంగతి యయినను నాలోచింపక యిట్లనజొచ్చితిరిగా ! బలముచేగర్వించి మీరు మతిలేక నోరికివచ్చినమచ్చున బ్రేలుచున్నారుగా ! నన్నడుగుటకు మీకు నో రెట్లువచ్చినది ? దుర్బుద్ధులారా ! నా బోటి బోటియే మీయాటోపము నణగించును. నాశాపము దప్పనిది. మీబలతేజము లాయబలవలన నశించుగాక, అనియిట్లు వారిని శపించి తనయింటికి బోయినది. ఇట్లు గురుపుత్రిచే శపింపబడి యారాక్షసులు శమదమాదిసంపన్నులయి శివుని దపస్సుచే సంతోషింపజేసిరి. శివుడు ప్రసన్ను డయి యెదుట సాక్షాత్కరించెను. వారాయన నిట్లు యాచించిరి. దేవా ! మాయందు దయయుంచి మారక్తమునం దఱును ధరించులాగున వరముదయచేయుము. అని కోరగానే యట్లేయగునని. వారికి వరమిచ్చి యచ్చటనే యంతర్ధానమాయెను. వారే కాలము సమీపించియుం డుటచే నిప్పుడీలాగున దేవలమహామునిని జంపవచ్చిరి. చౌడేశ్వరిచే మహాబలవం తులగు నారాక్షసులు చంపబడిరి. దేవలుడు వారిరక్తముతో నాదారములు ముంచి యయిదురంగులు గలవానినిగా జేసెను. వారి కీశ్వరు డిచ్చిన వరము సఫల మయినది.

ఇది బ్రహ్మాండపురాణములోని యుత్తరఖండమున బ్రహ్మానారద సంవాదమున దేవాంగచరిత్రమున జౌదేశ్వరీవరప్రసాదము, రాక్షసోపాఖ్యానము నన్నది రెండవ యధ్యాయము.

మూడవ అధ్యాయము

తరువాత నా దేవలు డతిసంతోషముగా నామోదపట్టణమునకు బోవుటకు బయలుదేఱి మార్గమధ్యమున ననేకదేశములను దుర్గమములగు నడవులను కొండలను పుణ్యములగు నదులనుదాటి కొన్నాళ్ళకామోదపట్టణము ప్రవేశించెను. మహాత్ముడగు దేవలునిరాక తెలిసికొని శివునియాజ్ఞప్రకార మచ్చటికి సంతోషముగా నందఱును సమాగతులయిరి. రాజులు మంత్రిపుత్రులు, మహాబలులగు భటులును వణిజులును గాయకులు నర్తకులు గొప్పవాద్య ఘోషములతో నాదేవలుని పురోహితపురస్కారముగా నెదుర్కొనిరి. వారందరు నెదుర్కొని గౌరవించుటచే దేవులుడు మిక్కిలి సంతోషించెను. దేవారా ! యీపట్టణము తమది. మమ్ములనందఱను యథా న్యాయముగా పరిపాలింపుము మేమందఱమును నీవారము. ఇంక సంతోషముగా బట్టణములో బ్రవేశించి యేలుకొనుము. దేవదేవుడగుశివునియాజ్ఞ యిట్టిది. ఇట్లందఱును విన్నవించినతోడనే దేవలుడు సంతోషపూర్వకముగా బట్టణములో బ్రవేశించుట కంగీకరించెను. అప్పుడు శంఖములు మొదలగు వాద్యములు మ్రోగించిరి. ఆచప్పుడు దశదిశలను వ్యాపించినది. అత దౌమోదదాయకమగు నాయామోదపట్టణములో బ్రవేశించెను. ఆపట్టణమునకు బంగారు ప్రాకారము కలదు. బంగారుగోపురములతోనలంకరింప బడినది. కందకములు పాతాళలోకమువఱకును వ్యాపించియున్నవి. మఱియు నాపురిలోనిజెండా లాకాశమునంటుచున్నవి. నదులలో బంగారుపద్మములు విరాజిల్లుచున్నవి. నానావిధములయిన యుద్యానవనములతో నలరారుచు నాకాశమున సంచరించు సూర్యచంద్రాదులకు విశ్రాంతిని గలిగింపజాలు మేడలతో నొప్పుచున్నది. అందలి యుద్యానములు నందనవనముతో స్పర్ధచేయుచున్న నున్నజాలదా యింకవాని రామణీయకమేమని వర్ణింపనగును. అచ్చటి వేశ్యల లావణ్యమునకు బరాజితలై యిప్పటికిని భూమియందచ్చరలు దిరుగమానిరి. ఆపట్టణముసొంపు చూచి దేవగంధర్వాదులు స్వర్గమునువిడిచి సర్వభోగములతో గూడియున్న యాపట్టణముననే వాసముచేయుచుందురు. ఏవీధినిజూచినను రథములే, ఎక్కడజూచినను గుఱ్ఱములే. ఏతోటలోజూచినను కొండలవంటియేనుగు గున్నలే. ఇట్లు సర్వాంగసుందరమైన యాపట్టణములో ప్రవేశింపగానే దేవలునకు బ్రాహ్మణస్త్రీలు నీరాజనముపట్టిరి. మంగళకరమయిన పాటలుపాడిరి, ఆయా మేడలయందు నిలువబడి పూవులు పేలాలు చల్లిరి. నేత్రహస్తులై పరిచారకులు ముందునడుచుచున్నారు. బ్రాహ్మణలందఱును స్వస్తిపాఠములతో వెంట నడువ

మొదలిడిరి. ఇట్లు పురస్త్రీల నేత్రోత్పలములచే బూజింపబడుచు దేవలుడంతః పురములో బ్రవేశించెను. తరువాతను మంత్రులుమొదలగువారు పుణ్యతీర్థముల జలము దెప్పించి మంగళవా ద్యఘోషములతో మంచిదినమున మంచిముహూర్త మును నభిషేకించిరి. తరువాత నిట్లభిషిక్తుడైన యాదేవలుడు మంత్రులు మొదలగు పౌరులతో గూడి సంతోషించుచు దేవతలతో గూడిన దేవేంద్రునివలె నలరారుచుం డెను. మంత్రులు రాజపుత్రులు మొదలగువారు దేవలుని రాజునుగా నభిషిక్తునిజేసి సంతోషపూర్వకముగా నమస్కరించి రాజముద్రిక యాతనిచేతికిచ్చిరి. ఆఱుకోట్ల సువర్ణములరాబడి యున్నదని తెలిపిరి. ఆదేశపుమర్యాద లన్నియు విన్నపించిరి. ఆయుత్సవసందర్భమున నూఱగ్రహారములు శివభక్తుల కిచ్చెను. ఉత్సవార్థము వచ్చినబ్రాహ్మణులు మొదలగు వారికి ధనము కొట్లుపగులగొట్టి పంచిపెట్టించెను. జాత్యంధులు మొదలగువారిని బెక్కురీతుల సంతోషపఱిపించెను. తరువాతను పరిచారకులను రాజకీయపురుషులను బిలిపించి వారివారిని దగురీతిని గౌరవించి యిండ్లకు బంపెను. ఆదేవలునకు నలుగురు మంత్రులుండిరి. సుబుద్ధి, కార్య దక్షుడు, నీతిమంతుడు, దీర్ఘ దర్శనుడునని వారిపేళ్ళు, వారు న్యాయమార్గప్రవర్తకు లయి రాజ్యభారమును సమముగా నవలంభించి రాజన కెంతయు సంతసమును గలిగించుచుండిరి.

నార – తండ్రి ! పితామహా ! పూర్వ మాయామోదపట్టణములో భద్రబాహుని కుమారుడు సునాభుడనువాడు తేజస్వియు బరాక్రమశాలియు నుండెడువాడుగదా ! అతనిచరిత్రయెట్టిది ? వాని ప్రభావమెట్టిది ? ఆరాజకుమారుడు దేవలమునికి రాజ్యమిచ్చుటకుగల కారణమేమి ? అతనిరాజ్యమును దేవలునకు శివుడేల యిప్పించెను ? ఇదియంతయు నాయందు దయయుంచి విస్తరించి చెప్పుము.

బ్రహ్మ – నారదా ! నీయడిగినయట్లే యామోదరాజయిన సునాభునికథ చెప్పెదను వినుము. అట్లుపట్టాభిషేకము కాగానే సునాభుడు దేవలునియొద్దకు వచ్చియిట్లనియె స్వామీ ! దేవలభూపాలా ! ఇంకమేము సెలవు పుచ్చుకొనియెదము. మాకనుజ్ఞనీయవలయును అను నతనిపలుకు విని దేవలుడిట్లనియె రాజా ! ఎచ్చటికి బోయెదవు ? ఇదియేమి యిట్లు చెప్పుచున్నావు ? మనమందరమును గలిపి యిచ్చటనే యుందము. అనుదేవలునిమాటలు విని సునాభుడిట్లనియె. ఇక నిటుపయి నిటనుండదగదు. మనస్సు త్వరపెట్టుచున్నది. నీదయవలనదు స్తరమయిన శాప సముద్రమును దాటితిని. నీయనుజ్ఞను బొందిపోయెదను. ఇట్లు చెప్పగా నాశ్చర్యపడి యతనిచరిత్ర నిట్లడిగెను. రాజా ! నేను జాల నాశ్చర్యపడు

చున్నాను. నిన్నెవ్వరు శపించిరి. అదియెట్టిది ? యథార్థము వినిపింపుము. అని యడుగగా సునాభుడు దనపూర్వవృత్తమును జెప్పనారంభించెను. దేవలరాజేంద్రా ! నీయడిగిన సంగతి వినుము. నేను రుక్మరథుడను గంధర్వ రాజకుమారుడను, మాతండ్రి వీర్యవంతుడు సత్యవాది తపోనిధి యని లోకములయందు బ్రసిద్ధిబొందెను. అతడు మయూరియను నా మెయందెనిమిదవవసువుచే బుట్టింపబడినవాడు. ఆతనిపట్టణము మహేంద్రగిరి కందరమున నుండెడిది. సర్వభోగాఢ్యమైన యాపట్టణములో నుండి గంధర్వులను బాలించుచుండెను. ఆతనికి పద్మకోమలయను భార్య గలదు. ఆమె పారిజాతాద్రినాథుడగు హేమమాలికూతురు, తండ్రిని జయించి మాతండ్రి యామెను దెచ్చుకొనెను. నేనామెకును నతనికిని నేరనుడనగు కుమారుడను. అని చెప్పిన సునాబునిమాటలు విని యతని తండ్రిచరిత్రమును వినదలంచినవాడై యిట్లనియె. రాజా ! నీతండ్రి పరాక్రమాదికము వినిపింపుము. నేనెంతయు గుతూహలముతో వినగోరుచున్నాను. అతడు మయూరియనునామెయందెట్లు వసువుచేగలిగెను ? అని యిట్లుదేవలుడ డునుగగా సంతోషించి తనతండ్రివృత్తాంతమునిట్లని యాసునాభుడు చెప్ప మొదలిడెను. దేవల మహారాజా ! నీయడిగినయట్లు మాతండ్రియగు రుక్మరథుని సంగతి యంతయు జెప్పెదను సావధానచిత్తుడవై వినుము. అని సునాభు డిట్లు చెప్పదొడంగెను.

ఇది శ్రీ బ్రహ్మాండపురాణములోని యుత్తరఖండమున బ్రహ్మానారదసంవాద మున దేవాంగచరిత్రమున దేవాంగుడను పేరుగల దేవలుని పట్టాభిషేక మనునది మూడవయధ్యాయము.

నాలుగవ అధ్యాయము

సునా – దేవలా ! వినుము. పూర్వము సావిత్రుడను నెనిమిదవ వసువు ప్రతిదినమును భక్తిశ్రద్ధాతాత్పర్యములతో శివునినుపాసించుచుండెడివాడు. అతడొక నాడు బాగుగా నలంకరించుకొని విమానమునెక్కి కైలాసమునకు బోయి యచ్చట జంద్రపుష్కరమను పేరుగల యొకసరోవరమును జూచెను. అందలి పద్మములను సంగ్రహించుకొనుతలంపున నొడ్డునకు బోయెను. ఆసరస్సు పద్మములతోను రాజహంసలతోను చక్రకారండవాది జలపక్షులతోను జలకుక్కుటములతోను నిండియున్నది. అందలిపద్మములలోని మకరందమును ద్రావి తుమ్మెదలు మత్తిల్లి జుమ్ముమని ధ్వనిచేయుచున్నవి. శైవాలచికురయు, పద్మవక్త్రయు, పద్మదళేక్షణయు,

చక్రస్తనియు, బిసభుజము, సైకతశ్రోణియు నగు నాసరసిని ఊర్మిమాలా విరాజితను
స్త్రీనివలె దర్శనీయనుగా జూచెను. మఱియు నద్దానియొద్దన ననేకములగు
పుష్పఫలాదులతో నిండారి యుండులతావృక్షాదికమును జూచెను. తద్రామణీయక
ముచే నాకర్షింపబడిన మనస్సుకలవాడై యందలి మందమారుతమునకు
సంతోషించుచు క్షణకాలమచ్చటనుండెను. ఇంతట మన్మథడతనిపైని బుష్పబాణ
ముల బ్రయోగించెను. ఆతడు కామజ్వరపరీతాంగుడై దీనమయినచిత్తముతో
నిట్లువిలపించెను. మారా ! నిష్కారణముగా నన్నెందులకు బాధించెదవు !
నీబాణములు పుష్పములుగావు. మండుచుండు నగ్నికణములు మిక్కిలి
వాడియయినవి. మీదనుండునని తుమ్మెదలుగావు, ధూమమని భావించెదను.
వాయుదేవా ! సానరాతి యొరపిడిని రాలినకణముల వంటిపరాగముల
నెందుకుజల్లెదవు ? మన్మథా ! నీవిపూవుబాణములని ప్రవాదము మాత్రమేకాని
యాలోచించిచూడగా బిడుగులనితోచుచున్నవి. కాకున్నచో నాహృదయము
నిట్లుభేదించి దహింపగలవా? ఇట్లు మన్మథాదుల నుపాలంభించుచు దుఃఖసం
తప్తచిత్తుడై యటు నిటు దిరుగుచున్న యొక యాడు నెమిలిని జూచెను.
కామమోహితుడగునావసు నప్పుడద్దానిని దనమాయాప్రభావమున యువతీరత్నము
నుగా జేసి రమించెను. దానియందు తన తేజస్సుచే దశదిశలను వెలిగింపజాలిన
యొకకుమారుడు గలిగెను. ఆస్త్రీ యెప్పటియట్లు నెమలియై యా యడవిలో
సంచరించుచుండెను. కృతార్థుండగు నావసు నాకుమారుని దనవిమానముపై
నుంచుకొని స్వర్గమునకుబోయి వానిని దనయిద్దఱు భార్యలకును నిచ్చెను. అతడు
దేవతలచే రుక్మరథు డని పిలువబడుచుండెను. వయస్సువచ్చిన యారుక్మరథుడు
తపస్సు చేసికొనుటకై మహేంద్రపర్వతమునకుబోయెను. అట్లుపోయి యొకపవిత్ర
స్థలమున గూర్చుండి నియమ మనవలంబించి లోకకర్తయగు బ్రహ్మనుగూర్చి
తపస్సు చేసెను. ఆతనితపస్సునకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమాయెను. ఏభూతము
చేతను జావు లేకుండ నతనికి బ్రహ్మవరమిచ్చెను. అతడు వరదానగర్వితుడై
యంతటను దిరుగుచుండెను. అతడొకప్పుడు విశ్వకర్మదగ్గఱకుబోయి యిట్లనియె.
విశ్వకర్మా ! నాకు మహేంద్ర పర్వతముపై నొకపట్టణమును నిర్మింపుమనగానే
విశ్వకర్మ కోపించి యతనివాక్యమును దిరస్కరించి గర్హించెను. తరువాతను
రుక్మరథుడును గోపించి యుద్ధమునకు సిద్ధపడెను. ఇద్దఱకును ఘోరయుద్ధము
జరిగినది. రుక్మరథునిచే బ్రయోగింపబడినబాణములకు దాళజాలకయు
నతనివరప్రభావమును దెలిసికొన్న వాడగుటచే దుర్జయుడని యెఱిగియు నతనితో

విశ్వకర్మ సఖ్యము చేసికొనెను. తరువాత నతడు చెప్పిన చొప్పున మహేంద్రపర్వత
ముపై రమ్యమయిన యొకపట్టణమును నిర్మించెను. ఆపట్టణముపేరు
లక్ష్మీవర్ధనము. ఆలోచింపగా నాపట్టణముమట్టిద. అందుండి మాతంద్రి
రుక్మరథుడు గంధర్వులను బాలించుచుండెను. మఱియు నత డనేకులగు
రాక్షసులను యుద్ధములలో జంపెను. దేవతలతనిని రాక్షసులతో యుద్ధము
సంభవించినపుడు సహాయార్థము గోరుచుండెడివారు. అతడొకప్పుడు గంధర్వులతో
బారిజాతపర్వతమునకు వేటకు బోయెను. అతడక్కడ నొక దివ్యమయిన
కొలనుచూచెను. ఆకొలనిలో జెలికత్తియలతో గూడి విహరించుచున్న యొకానొక
సుందరినిజూచి యిట్లనియె. సర్వలక్షణసంపన్నురాల వగు నోసుందరీ ! నీపేరేమి ?
నీ వెవ్వనితనయవు ? అనియడుగగానే యామె గంధర్వరాజగు హేమమాలియను
వానికూతు ననియు, మాతండ్రియీ సమీపముననే విలాసనగర మనుపట్టణములో
నున్నాడనియు నాపేరు పద్మకోమల యనియు జెప్పి యప్పుడే తన చెలికత్తెలతో గూడ
బట్టణమునకు బోయినది. తరువాతను రుక్మరథు డామెయం దాస క్తచిత్తుడై తన
మంత్రులను హేమమాలియనువానియొద్దకు బంపెను. వారాతనియొద్దకు బోయి
తమప్రభువునానతి విన్నపించిరి. ఆమాటలు విని మదించియున్న యాతడు వారిని
దూలనాడెను. మంత్రులారా ! కుత్సితజన్మముగల మీరాజున కుత్తమురాలగు
నాకుమారితనట్లు పెండ్లిచేయదగును? నాకూతురు దేవగంధర్వాదులచే గోరదగి
నది. మిమ్ముల నాదుర్బుద్ధి యెట్లుపంపెను ? పంపెను బో ! మీరెట్లు సిగ్గువిడిచి
యడుగవచ్చితిరి ? స్వయంవరమునకు దగిననాకూతు నెన్నటికిని మీరాజున
కీయజాలను. అనిచెప్పి వారిని నిరాకరించి పంపెను. మంత్రులువచ్చి జరిగినసం
గతి తమరాజుతో జెప్పిరి. ఆమాటలువిని కోపించి రాజు మంత్రులతో నిట్లనియె.
మంత్రులారా ! నే నిపుడే విలాసనగరమును భస్మముపాలు చేసి యాహేమమాలిని
సంహరించెదను. అనిచెప్పి రథమెక్కి త్వరితముగా బయలుదేఱి యచ్చటికి బోయి
శత్రుభయంకరమగు ధనుష్టంకారమును జేసి హేమమాలిని యుద్ధమునకు
బిలిచెను. అతనిరాక దెలిసికొని హేమమాలి కోపించి యుద్ధమునకు సిద్ధుడయి
వచ్చెను. వారిద్దఱును ఘోరయుద్ధము చేసిరి. రుక్మరథుడుప్రయోగించిన
బాణములచేతను హేమమాలి మూర్ఛిల్లెను. తరువాతను రుక్మరథుడు హేమమాలికి
శైత్యోపచారములు చేయగా నతడు కొంచెము తెలివొంది తన కుపచారములు
చేయుచున్న రుక్మరథుని జూచి సంతోషించి యిట్లనియె బాగు ! బాగు ! మహాభాగా !
రుక్మరథా ! నీకు నాకుమారితనిచ్చెదను బరిగ్రహింపుము. ఇట్లని యతనితో

సంధిచేసికొని యతనిని దనపట్టణములోనికి దీసికొని పోయి పద్మకోమలయను తనకూతు నిచ్చి పెండ్లిచేసెను. తరువాత రుక్మరథుడు సంతోషించి యామెను వెంటబెట్టుకొని లక్ష్మీవర్ధనమను పేరుగల తనపట్టణములో బ్రవేశించి యెప్పటియట్లు సుఖముగా నుండెను. నేను రుక్మరథుని వలన నాపద్మకోమల యందు బుట్టితిని. నాపేరు స్వర్ణకేతుడని వ్యవహించుచుండెడి వారు. రాజేంద్రా ! నేనొకసారి చిత్రరేఖ యను భార్యతో గూడ విమానమెక్కి కైలాసమునకు బోతిని. దానిగుహలో బార్వతీ పరమేశ్వరులు క్రీడించుచుండిరి. నాకు దెలియక యావనములో బ్రవేశించితిని. నన్ను జూచి శంకరుడు కోపించి "బుద్ధిహీనుడా ! నీవిపు డెందులకు వచ్చితివి. నాశాపమువలన సామర్థ్యముపోయి మనుజుండవై పుట్టుము. ఈనీభార్య మనుష్య జన్మములో నీకు భార్యయగుగాక." అని యిట్లు శపింపగానే మిక్కిలి వణకుచు శివునిపాదములపైబడి "శివభగవానులవారూ ! తాము దయాసముద్రములు. నాయ జ్ఞానమును మన్నించి నా కీశాపము పోవుట యెప్పటికో సెలవీయవలయును. అగ్నిజ్వాలవంటి యాశాపమును నే నెట్లు భరింప గలను ? నాకిదియెట్లు శాంతించును?" అని ప్రార్థింపగా శివు డిట్లనియె. లోకోపకారమునకుగా నేనెపుడు దేవాంగుడను పేరుగల మునీశ్వరుని సృజింతునో అతడెప్పుడు నీవుండుపట్టణమును కధ్యక్షుడై వచ్చునో అప్పుడు నీ కీశాప మనుఘోర మగు పాపము తొలగిపోవును. ఇట్లుచెప్పి శంకరుడు దేవితో గూడ నచ్చటనే యంతర్ధానమాయెను. నే నామోదరాజగు భద్రబాహుని కిందుమతియందు బుట్టితిని. నాకు సునాభుడని పేరుపెట్టెను. ఇది కలావతి యను పేరుగలది. కాశిరాజుకూతురు. మాతండ్రియే నాకీతరుణిని పెండ్లి చేసెను. ఇది నాసంగతి. నీవడిగితివి గనుక విస్తరించి చెప్పితిని. నాయనా ! దేవలమునీ ! నీదయవలన నేను దుస్తరమయిన శాపసముద్రమును దాటితిని.

బ్రహ్మ - ఇట్లు చెప్పి సునాభుడును భార్యయు మానుష దేహములువిడిచి దివ్యరూపములను ధరించి దివ్యములగు నలంకారములను బూలమాలలను ధరించి విమానమెక్కి ప్రేమగా దేవలు నోదార్చి తమ స్థానమునుగూర్చి పోయిరి. తరువాతను దేవలుడువారిశరీరములకు సత్క్రియలుచేసెను. నారదా ! నీయడిగినట్లు సునాభచరిత మంతయు జెప్పితిని. ఇంకనేమి వినవలతువో చెప్పుము.

ఇట్లు శ్రీ బ్రహాండపురాణములోని యుత్తరఖండమున బ్రహ్మ నారదసం వాదమున దేవాంగచరిత్రములో సునాభాఖ్యాన మనునది నాల్గవయధ్యాయము.

అయిదవ యధ్యాయము

బ్రహ్మ - తరువాతను వస్త్రనిర్మాణవిశారదుడగు దేవలుడు మంత్రులను బిలచియిట్లనియె మంత్రులారా ! నేను శీఘ్రముగా వస్త్రములు నేయవలసియున్నది. కావున నేతసామానులు సిద్ధముచేయదగియున్నది. నేనిపుడు మేరుపర్వతమునకు బోయి వచ్చెదను. అచ్చటను ద్విష్టకుమారుడు మయుడున్నాడు. అతనియొద్దకు బోయి నేతకుపయోగించు సామగ్రిదీసికొనివచ్చెదను. అను దేవలునిమాటలువిని మంత్రు లిట్లనిరి. మహారాజా ! నీవొక్కరుడవును నచ్చటికి వెళ్ళవలదు. మేము గూడ జతురంగ బలముతో వచ్చెదము. ఈవిషయమై యేయభ్యంతరమును జేయదగదు. అనుమం త్రులమాటలు విని దేవలు డిట్లనియె. మంత్రులారా ! మీరట్లు చెప్పకుడు నేను జెప్పునది. వినుడు. నీతిగా మీరీరాజ్యమును బాలించుచునుండుడు. మీరుగూడ నాతో వచ్చినయెడల నిక్కడ బాలించువారెవరు ? కావున మీరాక నాకిష్టములేదు. ఆమయ మహాప్రభుదగ్గఱనుండి నేతసామగ్రిదీసికొని వేగమ వచ్చెదను. అనిచెప్పి సపరివారముగా మంత్రులను మరలించి తానొక్కరుడే పోవనుద్యుక్తుడాయెను. ధనుర్బాణములు పట్టుకొని యామేరుపర్వతమునకు బోయెను. పోవుచు నతడు దారిలో గార్గ్యమహామునియాశ్రమమును జూచెను. నిర్మలజ్ఞానవంతుడును, మునిశ్రేష్ఠుడునునగు గార్గ్యుని దర్శనమునకై యాశ్రమము లోనికి బోయెను. అతడును దేవలునిరాక విని యెదుర్కొని పూజించి యిట్లనియె.

గార్గ్య - మహాభాగా ! నీకు స్వాగతము దేవలా ! నీవు గుశలమేకదా ! నీరాజ్యములో సుభిక్షముగదా ! నీప్రజలందఱును క్షేమముగా నున్నారా ? అనునతని మాటలు విని దేవలు డిట్లనియె. తపోధనా ! మీయనుగ్రహమువలన మేమందఱ మును క్షేమముగానేయున్నారము. మారాజ్యమునంతటను సుభిక్షమే. అనిచెప్పగానే గార్గ్యుడు చాల సంతోషించెను. దేవలునిచేగూడ గుశలాదు లడుగబడి యథాన్యాయ ముగ జెప్పెను. తరువాత నెచ్చటికి వెళ్లుచున్నాననియు నిచ్చటికిరాక గారణమే మనియు నడుగగా సంగతియంతయు జెప్పెను. తరువాత నాగార్గ్య డాతిథ్యమిచ్చి గౌరవించెను. దేవలు డిష్టాలాపములతో నారాత్రి యచ్చటనేకడపి మఱునాటియుద యమున గాల్యకృత్యములు నెఱవేర్చుకొని గార్గ్యునియొద్ద సెలవు పుచ్చుకొని బయలుదేఱి దారిలో ననేకములయిన దేశములను నదులను గొండలను వనములను దుర్గమప్రదేశములనుదాటి నిర్మానుష్యము సింహశార్దూలభేరుండ ఖడ్గగోమృగసంకులము, ఉలాయద్వీపభూయిష్టము, భల్లూకశరభాకులము

వరాహగవయాకీర్ణము, చమరీసంచారసంకులము, కురంగయూథసంబాధము మఱియు నితరములయిన వన్యజంతువులచేనిండి నానావృక్షల తాగుల్మ పరివృతము నగు ఘోరమయిన యరణ్యమునుజూచెను. ఇట్టిమహాఘోరమును దుస్తరమునునగు నాయడవిలోబడి పోవుచుండగా నొకసింహము దేవలునివాసనపట్టి జడలుజాడించుచు నెగిరి తోకయాడించుచు నోరుదెఱచుకొని గర్జించుచు నతనిజంపుటకై పరుగెత్తుకొనివచ్చుచుండెను. దానిరాకను దేవలుడుచూచి పరాక్రమవంతుడు గనుక ధనుస్సెక్కు పెట్టి యగ్నిజ్వాలలవంటి బాణములచే దానినిమర్దించెను. మఱియు రెండుభల్లములచే ఫాలమునగొట్టెను. దెబ్బలు లెస్సగాదగులుటచే నాసింహము వ్యాకులపడి ప్రళయకాలపు మేఘగర్జనలవలె నందఱకును భయము గలుగునట్లుగా గర్జించినది. తరువాతను దేవలుడు మఱింతకోపించి దానినోటినిండ బాణములు పడునట్లుగా గొట్టెను. మఱియొక బాణముచే గంఠము గుఱిచేసికొట్టెను. ఆదెబ్బతో సింహము రక్తముకక్కు కొనుచు గ్రిందబడిచచ్చెను. తరువాతను దివ్యగంధమలందుకొని దివ్య పుష్పములమాలలు దివ్యాభరణములు ధరించి యొక మహాపురుషుడు విమానముమీద నుండి యగపడెను. అతనినిజూచి దేవలుడాశ్చర్యపడి "పురుష వ్యాఘ్రమా ! నీవెవరు ? నీవృత్తాంతమెట్టిది ? నీసంగతినాకు జాలనాశ్చర్యమును గలిగించుచున్నది." కావున జెప్పుము. అనియడుగగానే యాపురుషుడు "రాజేంద్రా ! సాధు ! నీవలన బవిత్రుడనై శాపమను సముద్రమును దాటితిని. పావనా ! నీవలననేను గృతార్థుండను ధన్యుడను నయితిని. రాజోత్తమా ! నావృత్తాంతమును జెప్పెదనాలింపుము. నేను జిరకాలము నుండి దుస్తరమగు నీశాపసముద్రములో మునిగియున్నాను. పుణ్యమూర్తివగు నీవు వచ్చినన్నొడ్డుచేర్చితివి. అని యాపురుషుడు చెప్పుచుండగా దేవలుడు మరల నిట్లనియె. పురుషశ్రేష్ఠా ! నీవెవరోచెప్పుము. నామనస్సు మిక్కిలి విస్మయావిష్టమయియున్నది. వేగముగా నీవృత్తాంతమునుజెప్పి నా యాశ్చర్యమున దొలగింపుము. అని మాటిమాటికి నడుగుచున్న దేవలునిమాటలు విని యక్షు డిట్లనియె.

యక్షు – రాజేంద్రా ! నాకథయంతయు జెప్పెదను వినుము. నేను గుబేరుని యనుచరుడను. నాపేరు కపింజలుడు. నేనొకసారి వేటాడుకోరికతో బెక్కురు యక్షులతో గూడి యొకవనములో బ్రవేశించి యనేకములగు దుష్టమృగములను జంపుచు నాయడవిలో దిరుగుచుండగా నాదగ్గఱనుండిపోవుచు నొకలేడియగపడినది. నన్ను జూచి భయపడి పాఱిపోమొదలిడినది. నేనును దైవప్రేరణచే

దానివెంటబరుగిడితిని. అది యెటు పరుగుపెట్టుచున్నదో నేనును నట్లేపరుగెత్తితిని. ఎంత గురిగా గొట్టినను నాబాణముదానికి దగిలినదేకాదు. ఇట్లింతసేపటికిని గురి కందకపోవుటచే నాకుమిక్కిలి కోపమువచ్చినది. గొప్పబాణమును బ్రయోగించితిని. అది దానిపృష్ఠదేశమునందు నాటినది. అయినను లేడి పాఱిపోవుచునే యున్నది. అట్లుపరుగెత్తి తిన్నగా గౌతమాశ్రమములో బ్రవేశించినది. ఇంతలో గౌతము డచ్చటికివచ్చెను. రక్తముస్రవిం చుచుండగా భయపడి పరుగున వచ్చిన లేడిని వెంట ధనుర్బాణములు చేతబట్టుకొని పరుగునవచ్చుచున్న నన్నును గౌతముడు చూచెను. దయాళుడగు నాముని నాపై గోపించి యిట్లనెను.

గౌత–దుర్మార్గుడా ! మాయాశ్రమమృగమును జంపవచ్చితివిగా ! పాపాత్మా ! మాయాశ్రమములోనికి వచ్చియున్న యీలేడిపిల్లను జంపుటకు వెంట బరుగెత్తివచ్చితివంటరా ! ఓరిదురాత్మా ! యీ కారణమున ఘోరారణ్యములో సింహమవయి ఘోరముగా జంతువులను భక్షించుచు బాపము సంపాదించుకొనుచు నుండుము. అని యిట్లు ముని శపింపగానే నేను మిక్కిలి భయపడి యతనిని "మునీంద్రా ! నాయపరాధమును మన్నించి శాపాంతమును దయచేసిచెప్పు" మని యనేకవిధములుగా బ్రార్థింపగా "శివునిమానసపుత్రుడగు దేవలుడు దేవాంగుడని పేరుపడినవాడు సకలలోకములకును మానమును గాపాడువాడువచ్చి నీశాపమును దొలగించును. అంతవరకును నీవరణ్యములోనుండుము. అని చెప్పి యాగౌతము డెందేని బోయెను. నేను వెంటనే సింహమునయితిని. మహాత్మా ! చిరకాలమునుండి శాపదగ్ధుడనయి యీయడవిలో బడియుండి యిపుడు నీదయవలన ముక్తకలుషుడనయి పవిత్రమయితిని. ఇది నావృత్తాంతము. ఇచ్చట కుత్తరముగా వామదేవాశ్రమము గలదు. అది మిక్కిలి మనోహరమయినది. అచ్చటికి బోయి యామహానుభావుని జూడగలవు. అని దేవలునితో జెప్పి క్షేమముగా నుండుమని పరమానందము నొందుచు నాయక్షుడుతనయింటికి బోయెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని యుత్తరఖండమున బ్రహ్మ నారద సంవాదమున దేవాంగచరిత్రలో యక్షోపాఖ్యానమనునది యైదవయధ్యాయము.

ఆఱవ యధ్యాయము

తరువాత నా దేవలుడు వేగముగా నాయడవిదాటి గంగాతీరమున బ్రవేశించెను. ముల్లోకములను బవిత్రము చేయునదియు, దివ్యమైనదియు, పాపములను మేఘములకు గాలివంటిదియు, శివునిజటాజూటమున విహరించు నదియు, విశదకాంతిగలదియు, పాతాళమువఱకును వ్యాపించియున్నదియు, పెక్కు జలజంతువులతో, గూడియున్నదియు, పూలమాలవంటి తరంగములతో నిండియున్నదియు, అందుందు దలలుపై కెత్తు జలజంతువులచే గంగలోస్నానము చేసినవారి పాపములు నశించునని చెప్పుచున్నట్లు గనుపడుచున్నదియు తనలో స్నానముచేసినంత మాత్రమున సమస్తపాపములనుహరించి మనుష్యులను సర్వ సౌఖ్యములను గలిగించు వైకుంఠమునకు బంపజాలునదియు, తన్ను సందర్శించిన మాత్రముననే వారిపాపములను దూదిని నిప్పువలె భస్మముచేయుచు వెంటనే పరమపదమునకు బంపునదియు, నగుగంగనుజూచెను. మఱియు నాగంగ పాపహారియగు తన ప్రవాహములో స్నానము చేసిన వారి బ్రహ్మ హత్యాదికములగు ఘోరపాపములను దూరముగా జేయును. అందు మునిగినవారిని మహాపాతక ములు కాలినయినుమును ప్రాణులు ముట్టజాలనియట్లుగానే ముట్టజాలవు. ఆగంగాతీరమునందు మూడురాత్రులు నివసించి స్నానపానాదులచే లోపలివెలుపలి పాపములను బోగొట్టుకొని యుత్తమలోకములకు బోవుదురు. మఱియు బుణ్యపుణ్యంబులగు నాగంగోధకములచే బితరులకు దర్పణాదులు చేసినచో వారును, వారివంశములో బుట్టినవారును, వారిమిత్రులును, బంధువులును, గురువులును, ప్రభువులును, ఇంకను వారికిష్టులును దమతమవారలతో గూడ దుస్తరములగు నరకముల నతిక్రమించి యానందభరితులయి నృత్యము చేయుచు శాంకరలోకమునకు బోయి నిత్యమును సంతోషించుచుందురు. మఱియు నాగంగానదిని మునులు యోగులు బ్రహ్మాదులు మొదలగువారు ముక్తినిగోరుచు నాశ్రయించియుందురు. అటువంటిగంగానదిని జూచి దేవలుడు తనయాహ్నిక కృత్యములను దీర్చుకొని శీఘ్రముగా నచ్చటినుండి బయలుదేఱి తిన్నగా వామదేవాశ్రమ మునకుబోయెను. అది ఫలములచేతను పుష్పములచేతను నిండియున్న వృక్షములుగలదై పద్మవిహారనిబిడములగు చెరువులతో గూడి వైరములెఱుగని నానాజంతుసంతానముచే నలరారుచు లెక్కకు మిక్కిలియగు పక్షులరొదలచే శ్రావ్యమయి తపస్సు చేసికొనువారికి సంతోషమును గలిగించుచు నావామదేవమహామునియొక్క తపోమహత్త్వమునకు నాదర్శమై యొప్పుచున్నది. ఆదేవలు డిట్టి యాశ్రమమును జూచి మిక్కిలి సంతోషించుచు స్వాధ్యాయపరాయణు

లగు శిష్యులచే సేవింపబడుచున్నవామదేవుని జూచెను. మఱియు వేదవేదాంగముల యథార్థ మెఱిగిన వాడును, పరమపావనుడును, నిష్కల్మషుడును, వినయాచారసం పన్నుడును, జ్ఞానవిద్యా విచారుడును, తేజోరాశియు, మండుచుండు నగ్నిహోత్రము వలె దురాధర్షుండును నయి యొప్పాఱుచుండెను. ఇట్టి వామదేవమహామునికి నమస్కరించి యతనిచే క్షేమాదులడుగబడి యతనిసన్నిధిలో గూర్చుండి దేవలు డిట్లనియె, మునీంద్రా ! యిపుడు మీదర్శనముచేతను బవిత్రుడనయితిని. జ్ఞానభూషణా ! నేను ధన్యుడనయితిని. అని యీరీతిగా నతని గొనియాడుచు మరల నిట్లనియె.

దేవా – మునిభగవానులారా ! తమయందఱకును గుశలమేకదా ! తపోనిధీ ! మీతపశ్చర్య సులభముగా జరుగుచున్నదికదా ! అని యడిగినవిని వామదేవు డిట్లనెను.

వామ – మహాబాహుడవును, అమితవిక్రమశాలినియు నగునో దేవలా ! యేమనిచెప్పగలను ? మేమందఱమును నింతవఱకును సుఖముగా గాలముగడుపు చుంటిమి. మాతపస్సులు స్వాధ్యాయములు యజ్ఞములు నిర్విఘ్నముగా జరుగుచుం డెను. మా కేవిధమయినభయమును లేకుండెను. కాని ప్రస్తుతము మాతపస్సులు మొదలగువానికి విఘాతము తటస్థించినది. ఇపుడు మాయాశ్రమమునకు మహాభీతి కలిగినది. ఇపు డిచ్చటిమునికుమారులకు జాలపీడకలిగినది. ఆశ్రమ మృగములకు నాశము సంభవించినది.

బ్రహ్మ – నారదా ! ఇట్లావామదేవముని చెప్పగావిని దేవలుడు వినయముగా నిట్లడిగెను.

దేవ – మునిచంద్రా ! మీతపోవనమునకు బాధగలిగించు పాపాత్ముడెవడు ? వాడెచ్చటనుండును ! వానిపేరేమి ? వాడురాక్షసుడా ? భేతాళుడా ? మనుజుడా ? చెప్పుడు వాడియగు నాబాణములచేతను వానిని జంపి యమునియింటికిబంపి మీబాధ తొలగించెదను. బంగారుపుంఖములు గలిగి పిడుగులతో సమానములైన నాబాణములచే వానిశిరస్సు నిపుడే నిస్సంశయముగా ఖండించెదను. అని యిట్లు దేవలుడు చెప్పగానే వామదేవముని చాలసంతోషించి యిట్లనియె.

వామ – దేవలా ! చెప్పెదను వినుము. ఇచ్చట కర్ధయోజన దూరమందు దుర్మార్గుడు కుండికుడను రాక్షసుడు గలడు. వాడు గొప్పబలము గలవాడు. కొండ గుహలోనుండును. వానిని జూచి ప్రాణులన్నియు భయపడి పాఱిపోవుచుండును. వానిని మేము తపోబలముచేతను నశింప జేయుదుముగాని తపస్సు పోవునని

శాంత మనలంభించి యుంటిమి. నీవు మహాబలవంతుడగు రాజవు. బ్రాహ్మణులకు గలిగిన సంతాపమును హరించుట రాజులకు ముఖ్యధర్మము. బ్రాహ్మణులను రక్షించుటకంటె రాజులకు గొప్పధర్మములేదని కదా పెద్దలు చెప్పుదురు ! ఆర్తులు, దుర్బలులు, తపస్వులు అగు బ్రాహ్మణులకు దప్పక యభయమియ్యదగినది యనియు నది పరమ ధర్మమనియు మన్వాదులగు పెద్దలచే జెప్పబడియున్నది. బ్రాహ్మణులకు సంతోషము గలిగించునందువలన గలుగుపుణ్యమనంతము. బ్రహ్మహత్యకంటె మించినపాపము, బ్రాహ్మణరక్షణకంటె మించిన పుణ్యము లేదందురు. బ్రాహ్మణులతో ద్వేషించిన పాపాత్మునిదుఃఖమును కంతముండబోదు. అట్లు ద్వేషించిన పరమ పాపాత్ముడు ఘోరనరకముల ననుభవించి తరువాతను నీచయోనులయందు బుట్టుచుండును. బ్రాహ్మణులను రక్షించిన ధర్మాత్ముడు భూలోకమున సమస్తసుఖములనుభవించి తరువాతను స్వర్గమునం దుత్తమ భోగముల ననుభవించును. ఆ పుణ్యము క్షీణించిన తోడనే యారోగ్యవంతుడై ధనవంతులు కులీనులు మొదలగు నుత్తములయిండ్ల బుట్టును. అతని కెప్పుడును సుఖమేకాని దుఃఖమన నెట్టిదో తెలియదు. బుద్ధిమంతుడయి యీశ్వరప్రీతిగా బ్రాహ్మణులకు దృప్తి గలుగజేసినవాడు పునరావృత్తి రహితమయి శాశ్వతమయిన పదమునుగూర్చి పోవును. ఏకారణముచేతనయినను బ్రాహ్మణులకు దృప్తిని గలిగించినవాడు దేవతలందఱను దృప్తిని బొందించినపుణ్యమును బొందును. వానికృత్యములకు దేవతలందఱును దృప్తిని బొందుదురు. వేదవిదుడగు బ్రాహ్మణుని యనయవయములయందు సమస్త దేవతలును నివసించియుందురు గనుకను మఱియు నతనిదేహము నాశ్రయించి సమస్తపుణ్యనదులును తీర్థములును ఉండును. గనుకను బ్రతిదినమును నతడుపూజింప దగినవాడు వేదవేత్తలగు బ్రాహ్మణులకు సంతోషముగా బ్రతిదినమును నమస్కరించుచుండుటమంచిది. అతనికి నమస్కరించినచో సర్వదేవతలకు నమస్కరించినట్లగును. రాజా ! ధర్మమాచరింపదలచినవారు తప్పక బ్రాహ్మణులను సంతోషపఱచువలయును. అందువలన గొప్పధర్మము లభించును. వేయేల ? మహామతీ ! ముఖ్యమయిన సంగతి చెప్పెదను వినుము. వేలకొలది యశ్వమేధములు, కోట్లకొలది గంగా స్నానములును బ్రాహ్మణరక్షణయొక్క పదియాఱవవంతును బోలవు. కావున నోదేవలా ! మేమారాక్షసునివలన జాల భయపడుచున్నాము. అట్టి పరమపాపాత్ముని నీ బాహుబలము నాశ్రయించి చంపుము. వానిని జంపి మాబాధను నివర్తింప జేయుము. నీవు సాధువులకుపకారము చేయు నిమిత్తమై యీశ్వరునిచే బుట్టిం

పబడినవాడవు గదా ! ఆరాక్షసుడు దుర్బలులమగు మమ్ములను సదాబాధించు చున్నాడు. వాని కెవ్వనివలనను భయములేదు. ప్రాణికోటిని భక్షించుచున్నాడు. నీకుక్షేమమగు గావుట. వానినెట్లయినను జంపుము.

బ్రహ్మ - నారదా ! యిట్లు వామదేవుడు చెప్పినమాటలు విని దేవలు డిట్లనెను.

దేవ - మునీంద్రా ! ఇపుడు పాపాత్ముడగు నా రాక్షసుని జంపెదను. మీరందఱును నిర్భయులయి యుండుడు. అనిచెప్పి యుద్ధసన్నద్ధుడై వామదేవుని యనుమతిని బొంది వానిని జంపుటకు బయలుదేఱి యారాక్షసుడు నివసించు గుహాద్వారమును సమీపించెను. అది మిక్కిలి భయంకరమును, అసహ్యకరమును దుఃఖమును, ఆశ్చర్యమును గలిగించునదియునై యున్నది. అటువంటి రాక్షసనివా సమును జూచి దయావంతుడగు దేవలుడు దుఃఖించుచు మాటిమాటికిని దలపం కించుచున్నవాడై అకటా ! పాపాత్ముడగు రాక్షసు డెన్ని జంతువులను నిత్యమును వధించుచున్నాడు ? అని యాలోచించి శీఘ్రముగా ధనస్సునెత్తి పిడుగు చప్పుడు వంటి టంకారములచే రాక్షసుని క్షోభింపజేసెను. రాక్షసుడు గ్రమైనతేజస్సుగల యాదేవలు నిధనస్సు చప్పుడు విని క్షోభించి కొండగుహలోనుండి బయటికి వచ్చెను. కాటుకకొండ వంటి యాకారముగల యారాక్షసుడు రక్తముతో దడిసియుండు తనశూలమును గిరగిర ద్రిప్పుచు గన్ను లెఱ్ఱజేసికొని జుట్టు విఱియబోసికొని దేవలునిమీదికి బరుగెత్తుకొని వచ్చెను. మహాబలశాలియగు దేవలుడను తీక్ష్ణములగు బాణములచేతను రాక్షసుని గట్టిగా బీడించెను. ఆరాక్షసుడు బలవంతుడగు దేవలునిచేతను బాగుగా గొట్టబడినవాడై మిక్కిలిని గోపించి పెద్ద అంకెలు వైచెను. ఆచప్పుడు పదిదిక్కులను నిండినది. శూలముచే దన్ను గొట్టుటకై యతి వేగముగా వచ్చుచున్న రాక్షసుని మూడు బాణములచేతను గొట్టి మరల మూడుబాణములు ప్రయోగించి వానిశూలమును ఛేదించెను. శూలము ముక్కలుకాగానే పండ్లు పటపట కొఱకుచు నారాక్షసుడొక చెట్టు పెల్లగించి రాజుమీదికి విసరెను. దేవలు డావచ్చుచున్న వృక్షమును బొడిపొడిగా జేసి రాక్షసునివైపు చూచి యిట్లనియె దురాత్ముడా ! నీశూలము పోయినది. నీవు ప్రయోగించిన వృక్షమును ముక్కముక్కలుచేసితిని. ఇక నేమిచేయనుంటివో చేయుము. దుర్బలులగు మునీశ్వరులను భక్షించి మిక్కిలిని గర్వించి యుంటివి. నీ కెవ్వరి వలనను భయమున్నట్టు తోచదు. నీవు చాల బాప మార్జించితివి. దానికి సమయము తటస్థించినది. నిమిషమాత్రములో నాబాణములచే నీగర్వమును బోగొట్టెదను. అని

యిట్లు దేవలుడు చెప్పుచుండగా రాక్షసుడు కోపముగలవాడై యొక పెద్దరాయితీసి "చావుము" అని రాజుమీదను విసరెను. ఆవచ్చుచున్నశిలను వజ్రమువంటి బాణముల చేతను బొడిగావించి యారాక్షసుని సర్వాంగములయందును బాణములను నిండించెను. తరువాతను రాక్షసుడు కోపపూరితుడయి "ఓరీ ! మూఢుడా ! కాలచోదితుడనయి నాకంటబడితివి. ఇక నెక్కడకుబోయెదవు ? ఇపుడు నిన్ను వజ్రసదృశమయిన నా పిడికిలితో బొడిచి చంపి నీరక్తముద్రావి తృప్తినిబొం దెదను" అని చెప్పి మీదికి బిడికిలిపట్టి పరుగెత్తుకొని వచ్చుచున్నరాక్షసునిపై నొక్కవాడిబాణమును బ్రయోగించి యాచేయి ఖండించెను. మఱియొక బాణము చేతను రెండవచేయిగూడ ఖండించెను. ఇట్లు రెండుచేతులును దెగిపడిపోవుటచే బలవంతుడగు రాక్షసుడు నోరు తెఱచికొని కోఱలతో వానిని బీడింతునుగాక యని వచ్చుచుండగా నంతట దేవలు డర్ధచంద్రాకారముగల బాణము ప్రయోగించి రాక్షసునిశిరస్సు తెగగొట్టెను. వానిశిరస్సు వజ్రాయుధముచే గొట్టబడిన కొండ శిఖరమువలె నేలగూలినది. తరువాతను విమానమెక్కి దివ్యరూపధరుడగు నొకానొకపురుషుడు తనతేజస్సుచే దశదిశలను వెలిగించుచు దేవలునికగపడెను. అతనినిజూచి యాశ్చర్యపడి నీవెవరు ? అని దేవలు డడిగెను. ఇట్లడుగగా నతడిట్లనియె రాజేంద్రా ! సాధు ! సాధు ! పవిత్రుడినయితిని. నీధర్మమున దుస్తరమయిన శాపసముద్రమును దాటితిని. నాశాపాగ్ని హోత్రమును జల్లార్చితివి. నావృత్తాంతమంతయు జెప్పెద నాలింపుము. నేనిక్ష్వాకుపుత్రుడగు విశాలుని కుమారుడను. నేను మహబలపరాక్రమములు గలవాడను. నాపే రగ్రధన్వ యందురు. నేను బాగుగా రాజ్యమేలితిని. నాపట్టణము విశాలయను పేరుగలది. నేను రాజ్య మేలు కాలముందు వికటు డనుపేరు గల రాక్షసుడు దేశములను బాధించుచు మునీంద్రులను భక్షించుచున్నవాడు. నేనాసంగతిదెలిసికొని యాపాపాత్మునిజంపి యందఱకును సంతోషమును గలిగించితిని. రాజా ! ఆపాపరాక్షసునితమ్ముడు కర్కశుడను పేరుగలవాడు నాతో యుద్ధముచేయజాలక కపటోపాయము నవలంబించి మాయింట వంటలవాడై యుండెను. నాకాసంగతి యిసుమంతయు దెలియదాయెను. ఇట్లుండగా నొకనాడు దుర్వాసముని భోజనార్థియయి మండుచుండునగ్నివలె మాయింటికి దయచేసెను. పాపాత్ముడగు నారాక్షసుడు మనుష్యమాంసమును వడ్డించెను. కేశసంకీర్ణమయిన మనుష్య మాంసమును జూచి యాయన్నమువిడిచి కోపపరీతాత్ముడై యాముని "దురాత్ముడ నగు రాజాధమా ! నాకు మనుష్యమాంసమునటరా వడ్డింపజేసితివి ?" అని నేనెంతగా బ్రతిమాలుకొనుచున్నను నామాటవినిపించుకోక "పాపాత్మ ! నాకు

మనుష్య మాంసమును బెట్టించినందులకు ఫలముగా దురాచారుడవై మనుష్యమాం సము దినుచుండుము. అని నిర్దోషుడనని మొఱపెట్టుచున్నను నన్ను శపించెను. ఆశాపమువిని మిక్కిలిని బరితపించిన వాడనయి భయపడి "మునిచంద్రా ! నాయందు దయదలంచుము. నాశాపమున కంతమును గల్పించుము." అని యనేకవిధములుగా బ్రార్థింపగా నపుడతడు "శివునిమానసపుత్రుడగు దేవాంగు డనునతడు సమస్తమైన వారికిని మానసంరక్షకుండు ముందు పుట్టగలడు. అతడువచ్చి నీశాపమును దొలగించును. అంతవఱకును నీవు రాక్షసుడవై యుండుము" అని చెప్పి యాముని యంతర్ధానమాయెను. వెంటనే నేను రాక్షసుండనయిపోతిని. చిరకాలమునుండి శాపదగ్ధుడినయి యీయడవిలో బడియుంటిని. నేను భక్షించిన జంతుజాలములకు లెక్కయేలేదు. రాజేంద్రా ! యిన్నాళ్ళకు నీవలన సమస్త పాపములు పోయి పవిత్రుడనయితిని. ప్రభూ ! నావృత్తాంతమంతయు నీ యడిగినయట్లు చెప్పితిని. నేను నీయొద్ద ననుజ్ఞాతుడనయి పోయెదను. నీకెప్పుడును క్షేమ మగుకాక.

బ్రహ్మ - నారదా ! అత డిట్లు చెప్పి పరమసంతోషమును బొంది దేవలోకమునకు బోయెను. మహాశూరుడగు దేవలుడు వామదేవమహాముని సన్నిధికి వచ్చెను. ఆమునిచే విశేషముగా సత్కరింపబడి యతనియొద్ద సెలవుపుచ్చుకొని యచ్చటనుండి క్రమముగా మేరు పర్వతమునకు బోయెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని యుత్తరఖండమున బ్రహ్మ నారద సంవాదమున దేవాంగ చరిత్రమున రాక్షసశాప విమోచన మనునది యాఱవ యధ్యాయము.

ఏడవ యధ్యాయము

తరువాతను దేవలుడు మేరుపర్వతమును సమీపించి మయుని యింటికి బోయి యతనిచే సత్కరింపబడి యానందమును బొందుచునుండగా మహాబలుడగు నామయుడు దేవులుని జూచి యిట్లనియె. రాజేంద్రా ! మహామతీ ! ఇచ్చటికి వచ్చిన కార్య మేమి ? నీ వొక్కరుడవును వచ్చుట చూడగా నాకు మిక్కిలి యాశ్చర్యమగు చున్నది. అనుమయునిమాటలు విని దేవలుడిట్లనియె ఓయీ ! మయుడా ! నా రాకకు గారణము వినుము. నేను వస్త్రములు నేయుటకు సామగ్రికై వచ్చితిని. నీవు నేర్పరివి. ప్రాజ్ఞుడవు. సమర్థుడవు. కావున నోప్రభూ ! నీవు నాకు నేత్రసామగ్రిని

సిద్ధముచేసి యిచ్చిపంపుము. నేనుశీఘ్రముగా దేవాదులకు వస్త్రములు నేసి యీయవలసి యున్నది. అని దేవలుడు చెప్పగానే మయుడు మంచిదే యని క్షణకాలములో నేత సామగ్రినంతయు సిద్ధము చేసెను. అతడు వజ్రమయమయి సుందరముగా నుండు వస్త్రమును జుట్టుసాధనమును, మధ్యమధ్యను రత్నములతో పొదుగబడిన వైడూర్యమణి వికారమైన దట్టింపుపలకను, వజ్రమయము దంతమయమునగు సూదిని, మరకతమణివికారమయి పుష్పరాగపుబువ్వులచే నలంకృతమయి గోమేధకములు కంఠభాగమునందుగల నేతకఱ్ఱను, గరుడపచ్చ తోడి నాడిక్రోవిని వజ్రమయమయిన కీలనుజేసెను. చుట్టునట్టి యావజ్రమయ మయిన కీలయందొక్కొక్క పలక యెక్కొక్క రత్నముచే బ్రకాశించునదిగా జేసెను. ఈరీతిగా వస్త్రములను జుట్టుసాధనమును నిర్మించెను. వజ్రపుబిడియు వజ్రకీలయు రత్నపుష్పవిరాజితము, అయోమయియు, హేమపట్టయునగు చూఱకత్తిని జేసెను. ఇట్లు మయుడేడువిధములయిన నేతసామగ్రిని సిద్ధముచేసి దేవలునకిచ్చి యిట్లనియె. రాజేంద్రా ! హర్షమును గలిగించునట్టి వీనిప్రభావమును వినుము. అనేకవస్త్రము లీవేష్టనికిజుట్టినను నిది పరిపూర్తిని బొందదు. దీనిప్రమాణమట్టిది. మఱియు నిసూదియు నేతకఱ్ఱయు నీయనుబంధ ప్రమాణముచే రమ్యముగానుండు గలవు. ఇందు సందియములేదు. ఈ నాడిక్రోవిచీలలు నీతలంచినట్ల కాగలవు. లోకులమానమును గాపాడెడు. మహానుభావా ! పంచవిధములయిన రంగులుగల నూలు కండెలయందు జుట్టియున్నను వానిలో నుండి ప్రకృతమున కుపయోగిం చురంగులుగలనూలే బయటికి వచ్చుచుండును. మఱియు నైదురంగుల నూలు చుట్టియున్న యాసాధనమునందలి యైదుదారములును బ్రకృతమున కుపయోగిం చునట్లగుచుండును. అన్నియు వేఱువేఱుగానే ప్రకృతము ననుసరించి వచ్చుచుం డును. ఐదువిధములగు కండెలును నొకేమాదిరిగా దిరుగుచుండును. అని వానివానిసంగతులన్నియు జెప్పి హేమపట్టయు, వజ్రమయియు, అష్టఘంటావిరాజి తమునగు నొకమహాశక్తి నాదేవల రాజనకిచ్చెను. తరువాతను దేవలుడామయుని భూషించి యతనిచే భూషితుడై తనపట్టణము ప్రవేశించెను. అనుబంధముయొక్క మనోహరమయిన ప్రమాణము తనయిచ్ఛాధీన మగుటంజేసి తానే కట్టెను.

మునులు – మాతా ! దేవలుడే యనుబంధము గట్టెననించెప్పితివి. మయుడెందులకుగట్టి యీయకపోయెను ? నేత సామగ్రియంతటిలో ననుబంధము గట్టుటయే కఠినముగదా ! అట్టియనుబంధము గట్ట నేర్పరియయిన దేవలునికి మయుడిచ్చిన సామగ్రిమాత్రము నిర్మించుటకు శక్తిలేకపోయినదా ? తానే స్వయముగా నెఱిగినవాడు మయుని యాచించుట కేలపోయియుండెను ?

యథార్థమెఱిగినవాడవు గనుక మాసందియముల దీర్పవలయు నన సూతు డిట్లనియె.

సూతు – మునులారా ! అనుబంధముగట్టుట దేవలునికి శంకరా నుగ్రహమువలన సిద్ధించియున్నది. మఱియు నేతసామగ్రియంతయు నిర్మింప దేవలుడు శక్తిగలవాడే అయిననుదనచే సింహమునకును రాక్షసునకును శాప విమోచనము చేయవలసియుండుటంజేసి సామగ్రిని సంపాదించునిపచే మయునిదగ్గఱకు బోవలసివచ్చినది. బ్రహ్మతో పమానమయిన సామర్థ్యముగల యాదేవలునకు మూడు లోకములయందును సాధ్యముగానిది యొకటియుండునా? ఇట్లు యావత్సామగ్రియు సిద్ధముచేసికొని యాదేవలుడు భక్తితో జౌడేశ్వరియను పేరుగల చండికాదేవిని మనస్సులోదలంచెను. ఇట్లు దేవలుడు స్మరించినంతనే యాదేవి దేవలునికి బ్రత్యక్షమయి ప్రీతిపూర్వకముగా నిట్లనియె. వత్సా ! దేవలా ! నన్నెందులకు స్మరించితివి? అని యడుగగా నతడిట్లనియె. దేవేశీ ! నీదరిసెనమువలన ధన్యుడ నయితిని. నీదయవలన నామనోరథము సఫలమయి నది. నేను శివునియాజ్ఞవలన వస్త్రములు నేయుటకు గోరుచున్నాను. భక్తవత్సలు రాలవగు నోదేవీ ! నీ కటాక్షము వలననే నేసినవస్త్రములక్షయములగుగాక, నేను మూడులోకములవారికిని వస్త్రము లీయవలసియున్నది. వారివారికోరికప్రకారము వస్త్రములు సిద్ధముచేసి యీయవలెను. అట్లుచేసి కృతార్థుడను గావలయును కనుక నట్లు నాకు వరమీయవలయును. అని యిట్లతడు కోరుగానే యామె ప్రేమపూర్వకముగా నిట్లనియె. రాజేంద్రా ! నీవు కోరినట్లే యగును. ఇదిగో నేనిచ్చుకంకణమును జేతికి ధరించి నీనేర్చుకొలదిని నానావర్ణములు గల వస్త్రములను నేయుము. ఒక్కొక్కరంగుగల నూలుతో నొక్కొక్క వస్త్రమునేయుము. అవియన్నియు నక్షయములగును. నీవెట్టివస్త్రములునేసినను నవి యక్షయములే యగును. మచ్చునకుగా నొక్కొక్కటిమాత్రము నేయుము. అనిచెప్పి కంకణమిచ్చి రాజును సంతోషపఱచి యచ్చటినే యంతర్ధానమైనది. తరువాతను దేవలుడు సిద్ధాంతులను బిలిపించి మంచిముహూర్తము నేర్పఱిపించి బ్రాహ్మణుల నుబిలిపించి స్వస్త్యయనముచేయించి వారికి దక్షిణలిచ్చి సంతోషపెట్టెను. తరువాతను నేతకుపక్రమించుచు నాయంబ యిచ్చిన కంకణమును జేతికి ధరించెను. బుద్ధిశాలియగు నాదేవలుడు విలువగల వస్త్రములను నిర్మించెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని యుత్తరఖండములో బ్రహ్మనారద సంవాదములో నేతసామగ్రిని సంపాదించుట, చౌడేశ్వరియిచ్చిన వస్త్రాక్షయవర ప్రదానము నన్నది యేడవయధ్యాయము.

ఎనిమిదవ యధ్యాయము

సూతు – అంత నాదేవలుడు తననేర్పందఱకును వెల్లడియగు నట్లు నానా విధములయిన రంగులుగల వస్త్రములను నేసెను. ఆవస్త్రములకు నడుమ గన్నులవంటివియు, హంసవంటివియు, చంద్రునివంటివియు, నక్షత్రములవంటివియు బువ్వులు గలుగునట్లుగా నానావిధములయిన రంగులనూలుతోను నేయ బ్రారంభించెను. మఱియు మబ్బురంగుగలవస్త్రములను మఱియు ననేకవిధములు గల వస్త్రములను నేయుచుండెను. ఇటులనేకవస్త్రములు నేసి యవిపట్టుకొని తిన్నగా విష్ణుమూర్తి దగ్గఱకు బోయి యతనికి బీతాంబరము నిచ్చెను. తెల్లనివస్త్రమును లక్ష్మికిచ్చెను. ఎఱ్ఱని వస్త్రమును భూదేవికిచ్చెను. మఱియు నచ్చట నున్నవారందఱకును వారివారి కోరిక కనుకూలమయిన వస్త్రములను బ్రీతితో నిచ్చెను. అచ్చట శ్వేతద్వీపములో నున్న వైష్ణవులందఱును బలువిధములయిన వస్తువాహనాదులిచ్చి దేవలుని సత్కరించిరి. మఱియు లక్ష్మీనారాయణులుగూడ నతనిని విశేషముగా గౌరవించిరి. ఇట్లచ్చట సత్కరింపబడి యక్కడనుండి బ్రహ్మలోకమునకు బోయి బ్రహ్మకు రక్తాంబరమును సరస్వతికి శ్వేతాంబరమును సావిత్రికి బీతాంబరమును గాయత్రికి రక్తాంబరమును బ్రజాపతికి దెల్లని వస్త్రమును పులస్త్యుని కాకుపచ్చనివస్త్రమును మఱియు నచ్చటనున్న గంధర్వులు కిన్నరులు సిద్ధులు సాధ్యులు మహర్షులు చారణులు మొదలగువారికి వారివారియిష్టప్రకారము కోరినవస్త్రములనిచ్చి బ్రహ్మకు నమస్కరించి యిట్లనియె. స్వామీ ! యికమీదను మావంశస్థులందఱకును వస్త్రములు నేయుటకుదగినట్టుగా నూలుదొరకునట్లు చేయుడు. అనియడుగగా విని బ్రహ్మ యిట్లనియె. దేవలా ! నీవంశమువారి కందఱకును నూలు దొరుకునుపాయమును జెప్పెదను వినుము. మాని, అభిమాని యనుపేరుగల వీరిద్దఱును విష్ణునాభీకమలమునందున్నవారు. ఈస్త్రీ లిద్దఱును ముందు ముందు భూమిపై వృక్షములయి పుట్టెదరు. ఆచెట్లవలన గావలసినంత నూలు దొరుకుట కేవిధమయిన యభ్యంతరమును గలుగ కుండును. అని యిట్లు బ్రహ్మచెప్పగానే విని సంతోషించి యాయనచే ననుజ్ఞాతుడై స్వర్గమునకు వచ్చి దేవేంద్రునికి రక్తాంబరమును, శచీదేవికి బీతాంబరమును జయంతునికి దెల్లని వస్త్రమును నిచ్చి మఱియు నచ్చటనున్న యెనమండ్రువసువులకును ద్వాదశాదిత్యులకును, ఏకాదశరుద్రులకును వారువారు గోరినప్రకారమున వస్త్రముల నిచ్చెను. మఱియు బ్రహ్మఋషులకును దేవర్షులకును మిగిలిన దేవతలకును గంధర్వులకును మంచిమంచివస్త్రములిచ్చి వారందఱచేతను వస్తువాహనాదులచే సత్కరింపబడెను. మఱియు నాదేవతలందఱురు వివిధములైన యస్త్రములుగూడ నిచ్చిరి. తరువాత నప్సరస్త్రీలందఱకును

గోరినప్రకారము దివ్యమైన వస్త్రము లిచ్చెను. అచ్చటనుండి మేరుపర్వతమునకు బోయి యచ్చటనున్న దేవతలు, విద్యాధరులు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, సాధ్యులు, కింపురుషులు, యక్షులు, కిన్నరులు, గరుడులు, మునులు మొదలగు యావజ్జనమునకును, దెల్లనివి, యెఱ్ఱనివి, పచ్చనివి, నల్లనివి యింకను బలురంగులు గలిగినవియునగు వస్త్రములనిచ్చి వారిచే దానమానాదులచే సత్కృతుడై మయునిసన్నిధికిబోయి యతనికోరినవస్త్రములిచ్చి యతనిచే ననేకములగు నాయుధములు మొదలగువానిచే సత్కరింపబడి యచ్చటినుండి మహేంద్రపర్వతమునకు బోయియచ్చటనున్న వారందఱకును వస్త్రములిచ్చి వారిచే సత్కృతుడై మలయాద్రికి బోయెను. అచ్చటివారినిగూడ వస్త్రములతో నలంకరించెను. తరువాతను సహ్యపర్వతమునకుబోయి యచ్చటనుండెడు కిన్నెరాదులగు వారికి మంచిమంచి వస్త్రములిచ్చి యచ్చటినుండి కృతసత్కృతియై హిమవత్పర్వతమునకు బయనమాయెను. అచ్చట నున్నవారినందఱను వస్త్రములచే సంతోషపఱిచి యచ్చటినుండి వింధ్య పర్వతమునకు బోయి యచ్చటివారికి వస్త్రములిచ్చి యచ్చటినుండి బయలుదేఱి ఋక్షవంతమను పర్వతమునకు బోయి యచ్చటనుండు విద్యాధరాదులగువారికి వస్త్రములు బహుమానముచేసి పారిజాతపర్వతమునకు బోయి యచ్చటి గంధర్వ సమూహమునకును సాధ్యులకును విలువగలవస్త్రములిచ్చి సంతోషపెట్టెను. మఱియు నచ్చటనున్న మునులకును, అడవివాండ్రకును మహాత్ములకును వారువీరను భేదము లేకుండ మానసంరక్షణను గోరువారందఱకును వస్త్రముల నిచ్చెను. ఇట్లు స్త్రీలకును బురుషులకును వస్త్రములిచ్చి యగ్నిహోత్రుని పట్టణమునకు బోయి యతనికి నల్లనివస్త్రమునొసంగెను. అతనిచే సత్కృతుడై యమునిపట్టణమునకు బోయి యతనికిని యతనిభక్తులకును నల్లని వస్త్రము లిచ్చెను. అక్కడినుండి నైరుతి పట్టణమునకుబోయి యతనికి బీతాంబరమునిచ్చి యచ్చటినుండి వరుణలోకమునకు బోయి యాతనికి దెల్లనివస్త్రమునిచ్చెను. మఱియు నావరుణునిలోకములో నున్న వారినందఱకు వస్త్రదానముచే సంతోషింపజేసి వరుణాదులగు వారిచే రత్నములు హారములు మొదలగువానిచే సత్కృతుడయి యచ్చటినుండి వాయులోకమునకుబోయి యతని కాకుపచ్చనివస్త్రమునిచ్చి యతని యనుజ్ఞనుబొంది యలకాపట్టణమునకుబోయి యచ్చటనున్న కుబేరనికి విచిత్రవర్ణముగలవస్త్రములను నలకూబరునికి దివ్యవస్త్రము లను నిచ్చెను. కుబేరాదులు దేవలునికి రత్నకుండలములను కోటిసూర్య ప్రకాశమాన మగు కిరీటమును మఱియు నెన్నేని నగలను సమర్పించి గౌరవించిరి. అచ్చటినుండి బయలుదేఱి యీశానునిదగ్గఱకు బోయి యతనికి దెల్లనివస్త్రమును ప్రమథులు మొదలగు భూతగణములకు విలువగల

యనేకములగు వస్త్రములను నిచ్చి వారందఱచేతను లెస్సగా సత్కరింపబడెను. ఇట్లు ధర్మాత్ముడును, కీర్తివంతుడును నగు దేవలుడు సర్వలోకములవారిని వస్త్రములచే సంతోషపఱిచెను. అతడు మూడులోకములలో నుండువారికిని మానము గాపాడెను. దేవాంగములను వస్త్రములచే నలంకరించినవాడగుటచే నతనికి దేవాంగు డనియే పేరు ప్రసిద్ధి కెక్కినది.

ఇట్లు బ్రహ్మాండపురాణములోని యుత్తరఖండములో బ్రహ్మ నారద సంవాదమున దేవాంగదేవలోకవస్త్రప్రధానమన్నది. యెనిమిదవ యధ్యాయము.

తొమ్మిదవ యధ్యాయము

సూతు - తరువాతను రాజర్షియగు దేవలుడు భూలోకమునకు వచ్చి పృథుచక్రవర్తిచే బాలింపబడుచున్న జంబూద్వీపములోని వజ్రపట్టణములో బ్రవేశించి పృథుచక్రవర్తికిని నచ్చటనుండువారికిని యధేష్టముగా వస్త్రములనిచ్చెను. ఆ చక్రవర్తియు వస్తువాహనాదులచే దేవలుని సంతోషింపజేసెను. పిదప ఖ్లక్షద్వీపము నకుబోయి శూరసేనుడను రాజనకును బట్టణములో నుండువారికిని గోరినప్రకారము వస్త్రములిచ్చి వారిచే గౌరవింపబడి కుశద్వీపమునకుబోయెను. అచ్చట రాజగు కుశియనువానికి వస్త్రములిచ్చి యాతనిచే నశ్వాదులచే గౌరవింపబడెను. అచ్చటినుండి క్రౌంచద్వీపమునకుబోయి యమితౌజస్సుడగు హేమాక్షుడను రాజునకును వాని ప్రజలకును నానావిధములయిన వస్త్రములను నిచ్చి వారందఱచేతను మౌక్తికములు, ఇంద్రనీలములు గుఱ్ఱములు గజములు భూషణములు మొదలగువానిచే సత్కరింపబడి శాకద్వీపమునకుబోయెను. అచ్చటిరాజగు నభిరామునకు గావలసిన వస్త్రములిచ్చి యాతడు రథములు వాహనములు పల్లకీలు నగలు మొదలగువానిచే సత్కరింపగా సంతోషించి యాతనిదగ్గఱ ననుజ్ఞాతుడై శాల్మలద్వీపమునకు బోయెను. దేవలు డాద్వీపాధిపతి యగు శాలిహోత్రునకు వస్త్రములిచ్చి కృతసత్కృతియై యచ్చటినుండి పుష్కల ద్వీపమునకుబోయి యాద్వీపాధిపతియగు భానుమంతునకు సొగసయిన వస్త్రము లిచ్చి యతనిచే గౌరవింపబడి మరల జంబూద్వీపమునకువచ్చెను. మఱియు జంబూద్వీపములోనున్న యంగవంగకళింగాది యావద్రాజులకును వస్త్రములనిచ్చి సంతోషపఱిచెను. నానాదేశేశ్వరులగు రాజులచేతను సమర్పింపబడిన యేనుగులు, గుఱ్ఱములు, రథములు, భూషణములు, పల్లకీలు, బంగారు, రత్నములు, ముత్యములు, వస్త్రములు, గోవులు, ధనము, దాసీగణము, ఇతరదానములు,

మొదలగు వానిచే సత్కరింపబడి రాజశేఖరుండగు నాదేవలుడు పరమానందభరితు డాయెను. వేయేల? ఈజంబూద్వీపములోనున్న నాలుగుజాతులవారికిని గోరినవస్త్రము లిచ్చి సంతసిం పజేసెను. ఆయాప్రముఖులవలన నీయబడిన రథములు మొదలయిన కానుకల సంఖ్యములయిపోయినవి. అయినం గొంతవఱకు వానిసంఖ్య చెప్పెదనాలింపుడు. ఒకకోటిరథములు రెండుకోట్లు గోరథములు, (బండ్లు) రెండుకోట్లు మదపుటేనుగులు, నాలుగుకోట్లుగుఱ్ఱములు, ఒక్కకోటి లెక్కగల పల్లకీలు పదికోట్లదాసీజనములు, ముప్పదియాఱులక్షలు దాసులు, నయియుండెను. వీరినందఱను గ్రమముగా నామోద పట్టణమునకు బంపించి తానుబాతాళలోకమునకు బోయెను. అది సర్పములపడగలయందలి రత్నములకాం తులచేతను నాగకన్యకలచేతను బ్రకాశించుచున్నది. పాతాళలోకమునకు రాజగు వాసుకియొద్దకుబోయి యతనికి నానావర్ణములుగల వస్త్రములిచ్చెను. చిత్రసేను డనువానికి దివ్యములయిన వస్త్రములిచ్చెను. తక్షకునకు నెఱ్ఱనివస్త్రములను నల్లనివస్త్రములను, ఐరావతుడనువానికి దెల్లనివస్త్రములను సౌరభేయుడనుసర్ప మునకు బీతాంబరమును మఱియు నితరులగు నాగులకు వారివారియిష్టమునకు వచ్చినవియు నగు వస్త్రములను నిచ్చెను. వాసుకి మొదలగు వారును అమూల్యము లగురత్నములను దేవలునకిచ్చిరి. మఱియు మిగిలిన నాగోత్తములందఱునుదమకు గలిగినమంచిమంచి రత్నములను దెచ్చి దేవలునికి సమర్పించిరి. తరువాతను శేషు డుండుచోటికి బోయి యతనికి నానావర్ణ విరాజమానములగు వస్త్రముల నిచ్చెను. మఱియు దత్ స్త్రీలకును గోరిన ప్రకారముగానే వస్త్రముల నొసంగెను. ధృతరాష్ట్రుడు మొదలగు శేషునిమంత్రులకును వారిభార్యలకును గావలసిన వస్త్రములను సమర్పించెను. ఇంకను నాగలోకములోనున్న నాగులకందఱకు ను యధేష్టముగా వస్త్రదానముచేసి వారిచే బహుమాన పూర్వకముగా నీయబడిన యనేకములగు మణులు భూషణములు మొదలగువానిచే గౌరవింపబడిన వాడై సంతోషించెను. తరువాతను శేషుడు దేవలుని యందు జాల గౌరవముగలిగి తనకూతును జంద్రరేఖయనుదాని నిచ్చి వివాహముచేసెను. తరువాత నాదేవలుడు శేషు డిచ్చినరత్నములు మొదలగు కానుకలను స్వీకరించి యామించుబోడిని వెంటబెట్టు కొని భూలోకమునకు వచ్చెను. ఇట్లు మూడులోకములలో నుండువారి మానమును కాపాడి తనదేశములో నుండువారికిగూడా ననేకములగు వస్త్రముల నిచ్చెను. దేవలునిమంత్రులు బ్రాహ్మణులు రాజులు వైశ్యులు శూద్రులు మొదలగువారు తమరాజిచ్చిన వస్త్రములనుకట్టుకొని అపరిమితసంతోషమును బొందిరి. ఇట్లు

దేవాంగు డగు దేవలమహారాజు మూడులోకములవారికిని వస్త్రములనిచ్చి మానమును గాపాడి సంతోషించుచు, గీర్తివంతుడై సుఖముగా నుండెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములో బ్రహ్మ నారద సంవాదములోని దేవాంగ చరిత్రములో దేవాంగ మర్త్య పాతాళలోకవస్త్ర ప్రదానమన్నది. తొమ్మిదవ యధ్యాయము.

పదియవ యధ్యాయము

సూతు – తరువాతను దేవలు డమూల్యము లయిన దివ్యవస్త్రములను బట్టుకొని వెంటనే పరమేశ్వరుని జూచుటకై కైలాసమునకు బోయెను. వర్ణనాతీత మయిన యాకైలాసపర్వతమును జూచి చాలసంతోషించి క్రమముగా బంగారుప్రాకారములు గలదియు, రత్నములతో గట్టబడినగోపురములుగలదియు, ఆకాశమునంటుచు జంద్రకాంతమణినిర్మిత మయిన మేడలుగలదియు, ధూపాదుల పరిమళముతో నిండియున్నదియు, కస్తూరిపూతలుగలదియు, సూర్యచంద్రాదుల కాంతుల దిరస్కరించు కాంతులుగలదియు, నగునాశంకరుని దివ్యభవనమును జూచెను. ఆ మందిరములోనున్న దేవాలయములో నదివఱకే యష్టదిక్పతులు, ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, సిద్ధులు, చారణులు, గంధర్వులు, విద్యాధరులు, ఉరగులు, కిన్నరులు, గరుడులు, యక్షులు, సనకాదిమునులు, సాధ్యులు, కింపురుషులు, అప్సరస్సంఘములు, కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, జాబాలి, జమదగ్ని, వసిష్ఠుడు, శుకుడు, హారీతుడు, వామదేవుడు, పరాశరుడు, కణ్వ కుత్స శతానందులు, శైబ్యగౌతమశక్తులు శాండిల్యుడు, చ్యవనుడు, ఉద్దాలకుడు, భృగువు, అగస్త్యుడు, పులస్త్యుడు, పులహుడు, మార్కండేయుడు, ఔర్వుడు, దుర్వాసుడు, విశ్వామిత్రుడు మొదలగువారిచే సేవింపబడుచు బార్వతితో గూడ రత్నసింహాసనముపై గూర్చుండి నిండుకొలువున్న వెండికొండదొరను శంకరునిచూచెను. కుమారస్వామియు, విఘ్నేశ్వరుడు, వీరభద్రుడు, అనేకులు ప్రమధులు, నేత్రహస్తుడై నంది యాసభలోనుండి శంకరునియాజ్ఞను బరిపాలించుచుండిరి. ఇటువంటి శంకరభగవానునిజూచి దేవాంగుడగు దేవలుడు హర్షపులకాంచితశరీరుడై సాష్టాంగనమస్కారము చేసి యనేకవిధములుగా స్తుతిచేయ మొదలిడెను. దేవలుడు భక్తిపారవశ్యముచే ననేకవిధములుగా స్తుతిచేసియిట్లనెయె. మహాదేవా ! జగన్నాధా ! నీయనుగ్రహమున వస్త్రములను నేసితిని. అనిచెప్పి విచిత్రములైన యనేకవస్త్రములు శంకరునికి

సమర్పించెను. ఆవస్త్రములను జూచి శివుడు చాలసంతోషించి యాదేవాంగమునిని బ్రీతిగా నలంకరించి తరువాతను బార్వతియు దానును వస్త్రములను గట్టుకొనిరి. ఇట్లు వస్త్రములను ధరించి పార్వతీపరమేశ్వరులు మిక్కిలిని సంతోషించి మరల నా దేవలమునిని భూషించిరి. తరువాతను గణపతిదగ్గఱ కేగి యాతనికి దివ్యమయిన వస్త్రముల నిచ్చెను. భృంగిమొదలగువారికి వారువారు కోరిన ప్రకారము దివ్యాంబరము లిచ్చెను. పిదప నామోదపురాధిపతియగు దేవాంగరాజు విలువగల వస్త్రముల స్వీకరించి శంకరునియాజ్ఞాప్రకార మంతఃపురములోనికి బోయి మహాదేవియగు భద్రకాళికి రక్తాంబరము నిచ్చెను. కుమారస్వామి భార్యయగు దేవసేనకు తెల్లవస్త్రము నిచ్చెను. తరువాతను తన యిష్టదేవతయగు చౌడేశ్వరికి దివ్యాంబరములీయనుత్సుకుడై యామెను భక్తిపూర్వకముగా స్మరించెను. ఆయంబయు భక్తపరాధీనురాలు గావున వెంటనే యతనికి బ్రత్యక్షమయినది. ఇట్లు ప్రత్యక్షమయిన యాదేవి ననేక విధములుగా స్తుతిచేసి చేతులు జోడించుకొని వినయముగా నిట్లనియె. అంబా ! చౌడేశ్వరీ ! శివా ! శంకరీ ! నీయనుగ్రహమువలన నేననేక విధములయిన వస్త్రములను సిద్ధము చేయ గలిగితిని. భక్తవత్సల వగునో దేవీ ! మూడులోకములవారికిని యధేష్టముగా వస్త్రముల నిచ్చితిని. తల్లీ ! దాసుడు నేసినవస్త్రములను నీవు ధరింపదగినదానవు. అని యాయంబకు దివ్యమయిన వస్త్రములిచ్చెను. ఆదేవాంగుని యందలిప్రీతిచే జౌడేశ్వరి వస్త్రములను ధరించి దేవలు నోదార్చి యచ్చటనే యంతర్ధాన మయినది.

మునులు – సూతా ! మేము పార్వతియే చౌడేశ్వరి యనితలంచుచున్నాము. బుద్ధిమంతుడగుదేవలు డీశ్వరసన్నిధిలోనే యామెకు వస్త్రముల నిచ్చినవాడుగదా మరల నేల యిప్పుడిచ్చెనో ? పార్వతికిని జౌడేశ్వరికిని భేదమని యిపుడు మరలనిచ్చెనో లేక యామెయందు దనకున్నభక్తిచే నిచ్చెనో మాకుసందియము గలుగుచున్నది గనుక నీవు యథార్థమును జెప్పుము. అనవిని సూతు డిట్లనియె మునులారా ! మీరన్నది నిజమే. దుర్గాచౌడేశ్వరులకు భేదమేలేదు దేవాంగుడు తనకు వరములనిచ్చెనని భక్తిచేతను మరల నామెకు వేఱుగావస్త్రములనిచ్చెను. కాని యామె వేఱైన దనుబుద్ధిచే నీయలేదు. శంకరునికి భార్యగనుక శంకరియనిపిం చుకొన్నది. పార్వతియే చౌడేశ్వరి. చౌడేశ్వరియే పార్వతి. యథార్థ మాలోచింపగా వారియిద్దఱకును భేదమేలేదు. తరువాత నాదేవాంగు డాపర్వతమునందున్న కన్నియలకందఱకును యధేష్టముగా వస్త్రముల నిచ్చెను. మఱియు శివునిద్వార

పాలకులగు చండప్రచండులకు రక్తాంబరమును శ్వేతాంబరమునునిచ్చి శివుని ధ్యానించి యాయనయనుమతిపై నిగొలువుకూటమునం బ్రవేశించెను. అప్పు డచ్చట గృతస్థల, ఉర్వశి, రంభ, మేనక, పుంజికస్థల, తిలోత్తమ మొదలయిన యప్సరసలు నాట్యముచేయుచుండిరి. వాండ్రు నాట్యముచేతను. అంగవిక్షేపముల చేతను, భావబోధకములయిన పాటలచేతను, అభినయాదులచేతను శివుని సంతోషపఱిచిరి. శివుడు వాండ్రవిషయమై ప్రసన్నుడయి దివ్యాంబరము లీయదలచి దేవలునిమొగము వైపుచూడగానే యతడాయన యభిప్రాయమును దెలిసికొని దివ్యములయిన వస్త్రముల నంతలోనే సిద్ధముచేసియిచ్చెను. అట్టియద్భుత మైన పనిచూచి యింద్రాదులగు దేవతలందఱును మిక్కలి యాశ్చర్యమును బొందిరి. మహాదేవు డావస్త్రములనుదీసి యింద్రాది దేవతలకును, ఋషులకును, గంధర్వు లకును సిద్ధులకును నిచ్చి తరువాత నాసభలోనున్న సర్వాప్సరసలకును నిచ్చి సంతోషపెట్టెను. తరువాతను శివభగవానుడు సుచంద్రకమను ఖడ్గమును వృషభధ్వజమును దేవలునికీయగా భక్తిచే బరిగ్రహించిన యతనితో నిట్లనియె దేవాంగా ! సర్వశత్రువులను సంహరింపగల యీధ్వజముచే ముల్లోకములయం దును జయమును బొందుము. మఱియు నెల్లప్పుడు సుఖివై యుండుము. అప్పుడు దేవాంగముని స్వామిపలుకును శిరసావహించెను. తరువాతను శంకరుడు సూర్యునిజూచి యిట్లనియె. సూర్యుడా ! నీతో బుట్టువు దేవదత్తయను కన్య నీదేవాంగ రాజున కిమ్మనగా సూర్యుడు సంతోషించి దేవా ! మాకును నట్లే కోరికయున్నది. ఆమెను దగినవరు డీతడేయని మేమును నిర్ణయించుకొంటిమి. తమదయవలన మాకోరినకోరిక పూర్తియగును. అని యిట్లు సూర్యుడు చెప్పగానే యాసభలోని వారందఱును సాధు ! సాధు ! అని యుగ్గడించిరి. తర్వాతను బార్వతియు నట్లేచేయుమని సూర్యునకాజ్ఞాపించినది. సూర్యుడునట్లేయనెను. తనమాట నెరవేఱిచినందులకు శివుడును సంతోషించెను. ఇంద్రాదిదేవతలును సంతోషించిరి. ఇట్లు శివుడు రాక్షసులకుదక్క దక్కినవారికెల్లరకును వస్త్రములిచ్చి సభచాలించి పార్వతితో గూడ నంతఃపురములోనికిబోయెను. తరువాత శివునిసేవింప వచ్చిన యింద్రాదులందఱుకు దమతమయిండ్లకుబోయిరి. దేవాంగుడును దనయామోద పట్టణమువైపు బయలుదేఱెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండాపురాణములోని దేవాంగ చరిత్రములో దేవాంగ శంకర వస్త్రప్రధాన నంది ధ్వజసంపాదనమన్నది పదియవ యధ్యాయము.

పదునొకండవ యధ్యాయము

తరువాతను దేవలుడు కైలాసపర్వతమునుండి బయలుదేఱి యామోద పట్టణమునకు వచ్చుచు దారిలో నొక సరస్సును జూచెను. అతడచ్చటశివపూజ చేయు తలంపుతో స్నానముచేసెను. నిత్యకర్మములన్నియు బూర్తిచేసికొని పద్మాదు లగు పుష్పములచే స్వామినిబూజించి యతిభక్తిగా బ్రార్థించెను. దనపట్టణమునకు బోవ నుద్యుక్తుడాయెను. ఇంతలో సర్వవిమోహినియగురంభ సుందరుడగు దేవాం గుని బూర్వమునుండియు మోహించి యుండుటంజేసి సమయము కనుగొనుచుం డెను. ఇన్నాళ్ళకు దానికంటి కేకాకిగా దేవలరాజగపడెను. సర్వాంగ సుందరియగు రంభ కొంచెము పయ్యెదచెంగుజార్చి స్తనములను జూపుచు హావభావవిలాసములచే మోహింప జేయుచు మందగమనముతో దేవాంగునియొద్దకు వచ్చినది. ఇట్లు వచ్చినరంభను జూచి దేవాంగు డిట్లనియె రంభా ! నీవెందులకు వచ్చితివో చెప్పుము. చెలికత్తెనైనను వెంటదీసికొనిరాకుండ నేకాకినివై వచ్చుటకు గారణమేమి ? అని దేవలుడడుగగా రంభ మోమునంచుకొని చిఱునగవు ముఖము నలంకరింప బాదాంగుష్ఠముచే భూమిని గీయుచు నిట్టనియె రాజేంద్రా ! దేవాంగమునీ ! నీవు మన్మథునితో సమానమైన యాకారము గలవాడవు. పూర్వమే వెండికొండయందు నిన్నుజూచి మోహించితిని. ఎంతమరల్చుకొంద మన్నను నామనస్సు మరలకుం డనున్నది. కావున నోదేవా ! నీవు నామనోరథమును దీర్పకతప్పదు. జాగుసేయ కుము. నేనిక మరుబారినిపై పజాలను అని యిట్లుచెప్పు రంభమాటలువిని చెవులుమూసికొని శివశివా ! యని ప్రాజ్ఞుడును జితేంద్రయుడును గనుక దానితో నిట్లనియె. రంభా ! నీవును గొంచెము గొప్ప ప్రాజ్ఞురాలవు. నీవంటిది వచ్చి నన్నట్లనగూడునా ! ఎట్లుచూచినను మావంటివారి కిటువంటిపని యోగ్యమయినది గాదు. కావున గామినీ ! నీకోరిక పూర్తిసేయుటకు సాధ్యపడదు. నేను విరాగినని యెఱుగవా ! అట్టి నన్నెందులకు గోరితివి ? దేవాదులు నీకోరికను బూర్తిచేయువారు లేకపోయిరా ? కనుక వారి యొద్దకుబోయి సుఖమునుబొందుము. అంతియేకాని మాబోట్లవలన నీకేపాటిసంతోషము గలిగెడిని ? ఇటువంటిపనిచేసినచో మావంటి వారికి దేజోహానియు, కర్మలోపమును గలుగును. అదిగాక వేశ్యలతోడిసహవాసము సత్పురుషులకు బాపమును గలిగించునది యందురు. అందుఋచేతను నిందితురా లగు వేశ్య చెడుస్వభావముగల వారిచేతనేయనుభవింపదగియుండును. కామవశం వదులై యుక్తాయుక్తములు తెలియక యోగ్యులును, అయోగ్యులునుగూడ భ్రాంతిచే

వేశ్యలన నుభవింతురు. అట్లనుభవించిన వారందఱును బాపాత్ములే యగుదురు. ఏమోయగు గాక నీవు వేశ్యవుగనుక నిన్ను నేను విడిచితిని. నాచే నీకేవిధమయిన ప్రయోజనమును లేదు కనుక నీయిష్టమువచ్చినచోటికి బొమ్ము. నేనును వేగముగా నామోదపట్టణము నకు బోవలసియున్నది. సుందరీ ! నావలన నీమనోరథము నెఱవేఱదు గావున నీవు తిన్నగా స్వర్గమునకు బొమ్ము.

సూతు – ఇట్లు దేవాంగుడు చెప్పగానే యారంభ కోపము వినయమును దోప తలపంకించుచు నిట్లనియె. రాజేంద్రా ! ఏ మట్లంటివి ? బాగు బాగు ! మంచిమాటయే చెప్పితివి. బుద్ధిమంతుడ నగునీ విట్లనరాదు. నన్ను సాధరణస్త్రీని జూచినట్లు చూడదగదు. నేను రంభను. త్రిలోకసుందరిని, అట్టినేను నిన్ను మోహించి వచ్చితిని. అట్టినన్ను నీ విట్టిమాటలా అనబూనితివి ? మహామతీ ! నీవు గణికవు నిందితురాలవునని యేమేమో యంటివిగా ! యథావిధిగా యజ్ఞములు చేసినవారికి నాసంభోగమే ఫలమని పుణ్యాత్ములగు ఋషులు చెప్పగా వినవే ? మఱియు వేదములయందును జెప్పబడియేయున్నది యదియైనను వినలేదా ? అందును విశేషముగా బావనురాలునగునన్నుమాత్ర మనమానింపకుము. ముల్లోకములయందును నాతో సమానురాలయిన యందకత్తె లేదుసుమా ! పరాశరుడు, అత్రి మొదలగు మహామునులుగూడ నామొగము చూచి మోహగ్రస్తులై తమతమ తపస్సులను బాడుచేసి కొనిరి. వేయేలా ? యెట్టిదృఢచిత్తులయినను నన్ను జూచి మోహమును బొందకపోరు. జితేంద్రియులమని పేరుపొందిన మహామహులను యోగులను నిర్మలచిత్తులను నిర్మలజ్ఞానభూషణులను నేను నిరసించినదానను జుమా! నన్ను జూచినవా రెట్టివారయిననువిట శేఖరులు కాకతీరరు. అట్టి రూపవంతురాలను పవిత్రురాలను లోకసుందరిని నిన్ను గోరివచ్చినదానను అగునన్ను నీవేమి స్వీకరింపకున్నావు ? ఎంతో పుణ్యము చేసిననే కాని నాసంభోగము లభింపదు అట్టియనన్యదుర్లభను నిందితురాలని తృణీకరింపజూచుచుంటివిగా, కోరివచ్చిన దానవని యవమానింపకుము. పురుషులలో జయంతుడు, రతిరాజు వసంతుడు, నలకూబరుడును స్త్రీలలో నేనును జక్కనివారలమని పరిగణింపబడియున్నాము. వారు నీలో బదియాఱువవంతై నను జక్కదనము గలవారు గారని నాకు దోచినది. కావుననే నిన్ను జూచినది మొదలు నామనస్సు నీయందు జిక్కుకొన్నది. నాకు స్వాధీనము గాకుండనున్నది. ఎప్పుడు దేవాంగుని జూచెదను ? ఎప్పుడతడు నామనోరథమును దీర్చును ? అని యెదురు చూచుచుంటిని. రహస్యముగా నీముఖచంద్రు నెప్పుడు చూచెదను ? నా

కట్టిసమయ మెప్పుడు సమకూడును ? అని యిట్లు నిన్నే చింతనచేయుచు నీమాటలే తలచుకొనుచు నెట్లో యింతకాలమును వెళ్ళించితిని. పండుకొన్నప్పుడుగాని నడుచుచుండునపుడుగాని కూర్చుండునపుడుగాని మాటలాడునపుడుగాని మఱి యేవిధమయినపనులు చేయునపుడుగాని నిన్ను మఱవలేదు. నిన్ను జూచినదే మొదలు మన్మథుడురాత్రింబవళ్ళు నన్ను మిక్కిలిని బాధించుచున్నాడు. వానిబాణములు పూవులనుమాటమాత్రమే కాని యవి యగ్నిగుళికలనితోచుచున్నవి. అవి తగులుటయే మొదలు నాదేహ మంతయు జ్వలిత మయి యున్నది. మహాప్రభూ ! నన్నామన్మథచండాలుని బాణములకు గుఱి సేయకుము. నాయందు దయయుంచి వెంటనే నాతాపమును జల్లార్చుము. నీయధరా మృతము గ్రోలనిమ్ము. నాయంతస్తాపము తీఱును. నేనిట్లు యాచించుచుండగా నిరాకరించుట తగదు. దయానిధీ ! స్త్రీని బాధించుటయే మంచిదని యెంచితివా ? నందష్టాధరపల్లవముగ గాఢాలింగనము దయచేయుము. ఆహా ! నీమనస్సు వజ్రముచే జేయబడినదియా ? కావున నే నే నింతగా బ్రతిమాలుకొనుచున్నాను. గరుగకుండ నున్నది. మూకవలె మాటలాడవేమి ? త్రిలోకసుందరి యనిపించుకొన్న రంభ వచ్చి నిన్నింతగా బ్రతిమాలుటా ? అవుననికాని కాదని కాని పలుకరాదా ? అందునకును యోగ్యత లేదా ? పోనిమ్ము పొమ్మని చెప్పినచో బోవుదును. అని యిట్లు దీనదీనముగా యాచించుచున్న రంభను జూచి నవ్వుచు దేవాంగు డిట్లనియె. సుందరీ ! నేను మొదటనే చెప్పితిని. నే నిటువంటిపని చేయజాల నంటిని. ఈదేహము మలమూత్రనిధానము. మిక్కిలి నిందిత మయినది. బహురోగపూరితము. ఇట్టి దేహమునకు స్థిరమయినసుఖ మెక్కడిది ? తెలివిగలవా డెవడయినను నిట్టితుచ్ఛభోగముల కాసించునా ? ఆసించునుపో ! మఱింత పాపమే సంభవించును గాని యేమిలాభమున్నది ? కావున దప్పక విడుచుకో దగినదియే కాని యంగీకరింప దగినది కాదు. ఏమూఢుడు తనస్త్రీని విడిచి యితరస్త్రీలను గామించునో వానిపుణ్యములన్నియు నశించును. అన్యస్త్రీలను గోరువాడు ఘోరములగు నరకముల ననుభవించును. బుద్ధి తక్కువవాడై మతిచలనముచేతను పరస్త్రీలను గౌంగిలించుకొన్నచో యమకింకరులచే మిక్కిలిగా బాధింపబడుచుండును. అట్టివానిచే గాల్చిన యినుప ప్రతిమను గౌగిలింపజేతురు. మోహముచే నెవడు పరస్త్రీహస్తమును స్వీకరించునో వానిని తేళ్ళగోతులో బడద్రోయుదురు. పరస్త్రీలను ముద్దుపెట్టుకొన్న దుర్మార్గునిచే విషపూర్ణములయిన పాములను ముద్దులాడింతురు. కామమోహితుడయి యెవడు పరస్త్రీని జూచునో వానికన్నులు సూదులతో

బొడుతురు. నేయేల ? పరస్త్రీప్రసంగము చేతను పాపము వృద్ధియగును. అన్నిపాపములలోను పరస్త్రీగమనము వలన గలిగిన పాపము గొప్పది. దేనికయినను ప్రాయశ్చిత్త మున్నది. గాని పరస్త్రీగమనపాపమునకు ప్రాయశ్చిత్తమే లేదు. కావున నేనిటువంటిపాపుని కంగీకరింపను. నేనట్టిదానను, ఇట్టిదానను, నాభోగము నటువంటివారు. ఇటువంటివారు గోరుదురు. అని యేమేయో వ్యాఖ్యానము చేయుచున్నావు. కాని యాలోచింపగా నది యంతబాగుగా లేదు. ఏరీతిగా జూచినను జెడ్డదియే యగునీదేహమునకు మంచియనగా నేమున్నది ? దేహమే నిత్యము గానప్పుడు నీవంటిదానిభోగముమాత్ర మెట్లు నిత్య మగును ? నీచే భంగపడినవారితో నా కెట్లుసామ్యము చెప్పవచ్చును. ఎవరియిష్టము వారిది. తాముతాము చేసికొన్నపుణ్యములో పాపములో తామే యనుభవింతురు. కావున నొకరు చేసిరిగదాయని మఱియొకరు చేయరాదు. నీతో బెక్కుమాట లాడనేల ? నీ వెంతగా జెప్పినను నేను వినను. నీయిచ్చకు వచ్చినమచ్చున బొమ్ము. అని యిట్లుదే వాంగమహాముని నిరాకరించినతోడనే యారంభ కోపశోకపరీతచిత్తురాలై యతని నిందించుచు నిట్లనియె ఛీ ! మూఢుడా ! ఇంతకఠినచిత్తుడ నని యనుకోనైతిని. నీనిత్యానిత్యవివేకము కాల్పనా ? నీజ్ఞానమెందుల కుపయోగించును ? నీవు నిజముగా బురుషుడవేనా ? ఇట్టి నీరసహృదయమునకు నావంటిదానిభోగ మెట్లబ్బగలదు ? ఎంతో రసికశేఖరు డైననే కాని యెంతో పుణ్యము చేసిననే కాని నాపొందు దొరకదు. నీవు వట్టిబుద్ధితక్కువవాడవనియు నీరసుడ వనియు నిపుడు దెలిసికొంటిని. నే నింత దైన్యముగా బ్రతిమాలుకొన్నను నన్ను గ్రహింపకపోతివి గదా! కావున నీవు శత్రువులచే జిక్కి దైన్యమును బొందెదవుగాక వారు నిన్ను బంధింతురుగాక, దుర్బుద్ధీ ! నే నిచ్చినశాపము నీ కమోఘ మగుగాక, నీపౌరుష మంతయు నెందులకును బనికిరాకుండ బోవునుగాక నీవిటుపయి నయిదువేల సంవత్సరములు శూద్రుడ వయిపోవుదుగాక. అటుపయిని మరల బ్రాహ్మణుడ వగుదువు. అని యిట్లు శపించి రంభ యతనిని విడిచి పోయినది. తరువాత దేవాంగుడును గొంతవఱకు జింతించి చేయునది లేక "యీశ్వరాజ్ఞ యిది" యని నిశ్చయించుకొని తనపట్టణమువైపు బయలుదేఱెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములో దేవాంగ చరితమున దేవాంగునికి రంభాశాప ప్రధాన మన్నది పదనొకొండవ యధ్యాయము.

పంద్రెండవ అధ్యాయము

తరువాతను సూర్యుడు తన చెలియలిక వివాహము చేయ నిశ్చయించుకొన్న వాడై బ్రహ్మయొద్దకు బోయి యిట్లనియె. దేవా ! దేవదత్త యనుపేరుగల నా చెల్లెలిని దేవాంగుని కిచ్చి వివాహము చేయ నిశ్చయించితిని. కావున నీసిద్ధాంతప్రకారముగా మంచిముహూర్త మాలోచించి చెప్పుము. నీవు మాకు బ్రభువవుగదా ! అని చెప్పిన సూర్యుని జూచి బ్రహ్మ యిట్లనియె. ఓ సూర్యుడా ! నేటి కెనిమిదవనాడు వైశాకశుక్ల పంచమీదినము సోమవారమునాడు రాత్రి యేడుగడియలు దాటినతరువాతను ధనుర్లగ్న మున వివాహము చేసినచో శుభావహమగును. అని బ్రహ్మ చెప్పగానే మంచిదేయని యంగీకరించి దేవరా ! తాము సపరివారముగ వివాహమునకు దప్పక దయచేయవలయునని చెప్పి యచ్చటినుండి కైలాసమునకు బోయి శంకరునితో నిట్లనియె మహాదేవా ! తమయనుమతిని శిరసావహించి మాచెల్లెలిని దేవాంగమహా రాజున కిచ్చి పెండ్లిచేయ నిశ్చయించితిని. రాబోవు పంచమీదినమున వివాహము గనుక మీదంపతులు సపరివారముగా దయచేసి వివాహమహోత్సవము యథావిధిగా జరిపించి వధూవరులను దీవించి నన్నానందింపజేయుదురుగాక. అనగానే వారు మంచిదే యనిరి. తరువాత సూర్యుడు కుమారస్వామిని వీరభద్రుని నందిని మఱియు మిగిలినప్రమథులను బ్రయత్నపూర్వకముగా బిలిచి యచ్చటి నుండి తిన్నగా శ్వేతద్వీపమునకు బోయెను. అట్లుపోయి విష్ణుమూర్తిని జూచి యిట్లనియె. నారాయణా ! రాబోవుపంచమీసోమవారమునాడు నాచెల్లెలు దేవదత్తను దేవాంగుని కిచ్చి వివాహము చేయుటకు బెద్దలచే నిర్ణయింపబడినది. గనుక మీదంపతులు సపరివారముగా దయచేసి వివాహమహోత్సవము యథావిధిగా జరిపించి వధూవరుల నాశీర్వదించి నన్నానందింపజేయునది యనగానే యాయనయు నంగీకరించెను. తరువాతను లక్ష్మీదేవిని భూమిని పరివారమును వేఱువేఱుగా నాహ్వానించి యక్కడనుండి స్వర్గము ప్రవేశించి శచీసహితుడయిన యింద్రుని మిగిలినదేవతలను బిలిచెను. జయంతుడు మొదలగువారిని మిగిలిన దేవతులనుగూడ ప్రేమపూర్వకముగా వివాహమహోత్సవమునకు దప్పక రావలసిన దని కోరెను. మఱియు నచ్చట నున్న బ్రహ్మర్షులను దేవర్షులను, ఆదిత్యులను, రుద్రులను, గంధర్వులను మిగిలినదేవయోని విశేషులను బిలిచి తనలోకమునకు వచ్చెను. నందుడు, ఉపనందుడున నువా రిద్దఱు సూర్యుని మంత్రులు గలరు. వారు సూర్యునియాజ్ఞవలన దిక్పతులు మొదలగు నందఱును బిలిచి యాసంగతి సూర్యునితో జెప్పిరి. అంత నక్కడ దేవాంగుడు సుబుద్ధికార్యదక్షుడు నను తన మంత్రులను బిలిచి యిట్లనియె ఓ మంత్రులారా ! మీరిద్దఱును సూర్యునియొ ద్దకు

బోయి వివాహలగ్న మెప్పుడు నిర్ణయింపబడినదో తెలిసికొని వేగముగరండు అని చెప్పగానేవారును సూర్యునిదగ్గఱకు బయలుదేఱిరి. త్రోవలో మంచిశకునములు కనుబడినవి. వారురాగానే సూర్యుడు తగురీతిని గౌరవించెను. వారు ముగ్గురును వివాహమునుగూర్చి మాటలాడుకొనిరి. సూర్యుడు బ్రహ్మచే నిర్ణయింపబడిన ముహూర్తముసంగతియంతయు జెప్పెను. ఆమాటవిని మంత్రులు వేగముగా దమరాజుతో నాసంగతి చెప్పుటకై యామోదపట్టణమువచ్చిరి. తాము వెళ్ళినపని యంతయు దమరాజుతో జెప్పిరి. తరువాత నక్కడ సూర్యుడు తమమంత్రియైన వీరమార్తాండునితో నిట్లనియె. ఓయీ వీరమార్తాండా ! నీవు శీఘ్రముగా నామోదపట్టణమునకు బోయి నేటికి మూడవనాడు పంచమీసోమవారము వివాహముహూర్తమని దేవలునితో జెప్పి యతనిని సపరివారముగా దోడుకొని రమ్ము. అనగానే మంత్రి చతురంగబలముతో గూడి యామోదపట్టణమునకు బోయెను. సూర్యునిమంత్రి వచ్చి యున్నా డన్నసంగతి విని దేవాంగుడు తనమంత్రులను బిలిచి యెదుర్కొనుటకు బంపెను. వారును వేగము గా వాద్యఘోషపురస్సరముగాబోయి యెదుర్కొని వీరమార్తాండుని బట్టణములోనికి దీసికొనివచ్చెను. క్రమముగ నతడు దేవాంగుని యంతఃపురములోనికి దగుసత్కార ముతో బోయి దేవాంగునితో నిట్లనియె. రాజా ! నేటికి మూడవనాడు పంచమీ సోమవారమున వివాహముహూర్తము నిర్ణయింపబడినది. గనుక నాతో గూడ సపరివారముగా బయలుదేఱిరమ్ము. అని చెప్పి యతనిమంత్రుల నందఱను వేఱువేఱుగా బిలిచి యందఱమును గలసియే వెళ్ళుద మని యనుచున్న వీరమార్తాం డుని జూచి దేవాంగు డిట్లనియె. మహాభాగ నీ విపుడు వెళ్ళుము. రేపు తెల్లవాఱు జామున బయలుదేఱి మేమందఱమును వచ్చెదము. అనగానే యతడు మంచిదే యని యింటికి బోయి వృత్తాంత మంతయు సూర్యునితో జెప్పెను. తరువాతను సూర్యుడు విశ్వకర్మదగ్గఱకు బోయి "మామా ! మాదేవదత్తకు వివాహము తటస్థించినది గనుక వేగముగా గల్యాణమంటపము సిద్ధముచేసి యిమ్ము." అని చెప్పగానే యతడు శుభకరమయిన వివాహమంటపము సిద్ధముచేసి యిచ్చెను. అది హేమప్రాకారనిలయము పగడముల స్తంభములతో శోభితము. వజ్రపుపలకలతో గప్పబడినది. మఱియు మంచిపూజలతో బనివాని తనమంతయు జూపి సిద్ధము చేయబడినది. మఱియు రత్నాలవలభులు, పుష్యరాగములతలుపులు గలిగి వివిధరత్నములచే స్థగితమయి యనేక మంచసంకీర్ణమయి బలుద్వారములతో గూడి యద్వితీయముగా శోభించునట్లు చేయబడినది. ఆమంటపము సుమారుగా నొకయోజనము వెడల్పుగలుగునట్లుగా నిర్మింపబడినది. దానిమధ్యమున

ముత్యాలతో నొకమంటపమును నిర్మించెను. దాని క్రిందను నలుపలకలుగా నొకయరుగు కట్టెను. వధూవరుల నిమిత్తమయి దానియందు రెండుపీఠములు కల్పించెను. మఱియు బ్రాహ్మణులకొఱకు నెన్నోపీఠములు నిర్మించెను. అంతటను నానారత్న వినిర్మితములయిన సింహాసనములు ఉన్నతములు హ్రస్వములు నయి యుండునని కల్పించెను. ఈరీతిగా దనపనివానితన మంతయు జూపి చేసినమం టపమును దెచ్చి విశ్వకర్మ తనయల్లుడగు సూర్యునికి సమర్పించెను. దానిని జూచి సూర్యుడును జాల స్తుతిజేసెను. తరువాతను దేవాంగుడు కైలాసమునకుబోయి తనవివాహమునకు బ్రభువగు శంకరభగవానుని బిలిచి శ్వేతద్వీపమునకుబోయి విష్ణుని బిల్చి యచ్చటనుండి స్వర్గమునకుబోయి యింద్రుని బ్రహ్మను దిక్పాలురను వివాహార్థము వచ్చుటకై ప్రార్థించెను. మఱియు భూలోకములోనుండు రాజులను మంత్రులను సపరివారముగా బిలిచెను. తరువాతను దేవాంగుడు తెల్లవాఱుజామున జతురంగబల సమేతముగా బ్రాహ్మణులను పురోహితులను బురస్కరించుకొని మంగళవాద్య ఘోషములతో వందిమాగధులు స్తుతిచేయుచుండుగా బయలుదేఱి సూర్యలోకమునకు బోయెను. తరువాతను బ్రహ్మాదిదేవతలు శివుడు ప్రమథగణ ములు విష్ణువు మొదలగు భాగవతులును దేవలునివివాహము చూచుటకై సంతోషముతో సూర్యలోకమునకు వచ్చిరి. తరువాతను మహాతేజశ్శాలియగు సూర్యుడు దేవతలయందఱు యెదుటకును దేవత్తను దీసికొనివచ్చి దేవాంగుని కిచ్చెను. త్రిలోకసుందరి యగునాబాల ముల్లోకములను మోహింపజేయుచు నుండెను. మఱియు నామె సర్వాంగసుందరి యగుటచే బ్రహ్మప్రయత్నపూర్వముగా సృజించినట్లున్నది. శచీదేవి యింద్రునకుంబలె నామె దేవాంగునకు దగియున్నది. తరువాత నాదేవలమహారాజు బ్రహ్మ మొదలగు దేవతలసమక్షమున నామెకంఠము నందు మంగళసూత్రమును గట్టెను. బ్రాహ్మణులు మంత్రములు చదువుచు నక్షతారోపరణము చేసిరి. సువాసినులు మంగళగానములు పాడుచు నీరాజనము పట్టిరి. ఇంద్రునియాజ్ఞచేతను కల్పవృక్షము కామధేనువు చింతామణీ యందఱకును భోజనమును సమకూర్చినవి. ఈరీతిగా నాలుగుదినములు వివాహమహోత్సవము జరిగినది. తరువాతను దేవాంగరాజు సంతోషించుచు నుత్సనో పయోగములయిన దివ్యవస్త్రములను ముందుగా బార్వతీపరమేశ్వరుల కిచ్చెను. తరువాత బ్రహ్మ విష్ణువు మొదలగు ముఖ్యదేవతల కిచ్చి యనంతరము పెండ్లికి వచ్చిన వారందఱకును వారివారి యోగ్యతకుదగినవస్త్రముల నిచ్చెను. పిమ్మట నొక దివ్యాంబరమును బైరవున కీయబోగా నతడు పుచ్చుకోక మిక్కిలి కోపించి శిరస్సు కంపించుచు దేవలున కిట్లనియె రాజా ! యింతసేపటికా నేను నీ కగపడితిని ?

అందఱకును ముందుగా వస్త్రము లిచ్చి తరువాతను గడా మిగిలినగుడ్డముక్క నా కీయ వచ్చితివి. మొదటనే నా కీయవలదా ? నే నిపుడు పుచ్చుకోను. దత్తశేషము నాకు దగదు. అని యతడు తన కిచ్చినవస్త్రమును జింపి జమ్మిచెట్టుపైని పడవైచి నాకు దివ్యమయినవస్త్ర మింకొకటి యిమ్మనెను. అది విని దేవాంగుడు "నే నిచ్చిన వస్త్రము నీరీతిగా జేసితిని గావున మఱి నీ కీయగూడదు. నీయిష్టము వచ్చినచోటికి బొమ్ము. అనగానే దుష్టాత్ముడగుభైరవుడు పరమేశ్వరునియొద్దకు బోయి యాయనకు నమస్కరించి యిట్లనియె. దేవా ! దేవాంగుడందఱకును వస్త్రము లిచ్చి నన్ను మఱచిపోయి తుదకు మిగిలినది నాకీయవచ్చెను. అని చెప్పగానే శివుడు దేవాంగుని జూచి వీనికి స్వచ్ఛమయిన దివ్యవస్త్ర మిమ్మనెను. అప్పుడు దేవాంగుడు శివునకు నమస్కరించి దేవా ! నేను దివ్యవస్త్రము నీయగా దానిని జింపి జిమ్మిపైని వైచియున్నాడు చిత్తగింపు దనగానే భైరవు డీశ్వరునివంక జూచి "అయ్యా ! అత డిచ్చినవస్త్రమును నేను గోపించి చింపి జిమ్మిచెట్టు మీదను వైచినను నాకు మంచివస్త్ర మీయకపోయెను." అని యనుచున్న భైరవునిజూచి శివుడు "నీవు కోపించి యట్లు చేసితివి గనుక నెప్పుడును జిమ్మిక్రిందనే యుండుము" అని వానిని శపించెను.

తరువాత సూర్యుడు తనచెల్లెలగు దేవదత్తకును మఱుదికిని బెక్కుమదపు టేనుగు లను గుఱ్ఱములను రథములను, ఆభరణములను దాసీదాసజనమ్మును గానుకగా నిచ్చెను. వివాహము పూర్తికాగానే బ్రహ్మాదిదేవతలందఱును దమతమ మందిరములకు, బోయిరి. దేవాంగ మహారాజును దనభార్యను బరివారమును వెంటబెట్టుకొని ఛాయాదే వియొద్దను సూర్యునియొద్దను సెలవు పుచ్చుకొని యామోదపట్టణమునకు వచ్చి యెప్పటియట్లు సంతోషముగలుగునట్లు ప్రజలనం దఱును బరిపాలించుచు దేవదత్త యను భార్యంగూడి యింద్రుడు శచీదేవితో బలెనే చిరకాలము సర్వసుఖముల ననుభవించుచుండెను. ఎవడు భక్తిశ్రద్ధాతాత్పర్య ములతో నీదేవాంగమహారాజు వివాహ వృత్తాంతమును వినునో చదువునో వినిపించునో యతడు సకలమనోరథములను బొందును. మఱియు నీదేవాంగమహా రాజుయొక్క వివాహకథను జదివినపుడు వస్త్రములను మంగళసూత్రమును దానము చేసినవారికి శివునియనుగ్రహము వలన నెల్లసుఖములును గలుగును.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున దేవాంగుని వివాహమన్నది పండ్రెండవ యధ్యాయము.

పదుమూడవ యధ్యాయము

సూతు- మునులారా ! తరువాతను దేవాంగుడు యథావిధిగా బ్రజలను పాలించుచుండెను. ఆత డింద్రు డమరావతిని బాలించునట్లు పాలించుచుండగా బ్రజలందఱును గడుపున బుట్టినబిడ్డలవలె సంతోషించుచుండిరి. ప్రజలు నానాటికి వృద్ధి నొందుచుండిరి. భూమి ఫలవంత మయినది. గుణవంతుడగు పెనిమిటి దొరకినప్పుడు స్త్రీ సంతోషించునట్లు భూమి సంతోషించుచుండెను. కాలము తప్పక వానలు కురియుచుండెను. ఏజంతవునకును బీడలేదు. ప్రజలు విద్యావినయ సంపన్నులైరి. బ్రాహ్మణాదులు తమతమవర్ణధర్మముల నాచరించుచుండిరి. అందఱును మంచివారు. గోపోషణముందాసక్తులు సదాచారతత్పరులు పురాణ ములయందాసక్తి గలవారు. అందఱకును జ్ఞానమునం దభిలాషయెక్కుడాయెను. మఱియు నాతనిరాజ్యమందుదుర్మార్గులు, దుఃఖితులు, దరిద్రులు, కుంటివాండ్రు, గ్రుడ్డివాండ్రు, రోగులు, గొడ్డువాండ్రు మొదలగునింద్యులు లేరు. పిన్నలకు బెద్దలు త్తరక్రియలు చేయునవసరము తటస్థింపలేదు. పతివ్రతాధర్మము బాగుగా నుండెను. ఎక్కడ జూచి నను కలహమనుమాటయే లేదు. మత్సరము లేదు. లోభితన మెట్టిదో అతనిప్రజలకు దెలియదు. ఆకస్మికభయాదులు లేనేలేవు. అందఱును సంతోషిం చుచు నన్యోన్యప్రేమగా నుండెడివారు. ఇట్లు సర్వానందకరముగా రాజ్య మేలుకొనుచుండగా నాదేవాంగ మహారాజునకు దివ్యాంగుడు, విమలాంగుడు, ధవళాంగుడునని ముగ్గురు కొడుకులు పుట్టి యగ్ని హోత్రత్రయమువలె వారు పెరుగుచుండిరి. తలిదండ్రులాకొడుకులచే జాల సంతోషమును బొందుచుండిరి. దేవాంగుడు సకాలమున వారికి జాతకర్మాది క్రియలు నిర్వర్తించుచుండెను. వారు సర్వవిద్యలును నేర్చుకొనిరి. ధర్మాసక్తులు, వారుక్రమముగా యౌవనవంతులయిరి. వారికి మేనమామయగు సూర్యుని కుమారితలను స్వర్ణప్రభ, పద్మాక్షి, చపలాక్షి యనుబాలికలను దెచ్చి తండ్రి వివాహములు చేసెను. దేవాంగుడును దేవదత్తయును కుమారులను గోడండ్రను జూచుకొని చాల సంతోషించుచుండిరి. తరువాతను దేవాంగుడు పెద్దకుమారుడగు దివ్యాంగునికి యౌవారాజ్యపట్టాభిషేకము చేసెను. అతడు బుద్ధిమంతుడు గనుక మంత్రులతో గూడి యథావిధిగా రాజ్య మేలుచుండెను.

మునులారా ! దేవాంగుడు శేషునికూతురగు చంద్రరేఖయందు సర్వలక్షణసంపన్నుడును ధర్మాత్ముడును మహాబలుడును నగుసుధర్ముడనుపేరుగల

కుమారుని గనెను. అతడు శుక్లపక్షపుచంద్రునివలె వృద్ధినొందుచుండెను. తరువాతను కరూశదేశాధిపతి యగు శూరసేనుడు గర్వించి దేవాంగునిరాజ్య మంతయు క్షోభింప జేసెను. వాడు చేసిన యపకారముసంగతి యంతయు దెలిసికొని తనపరాక్రమముచే వానిని రణరంగమునకు బలి యిచ్చి ధర్మవర్ధనుం డగు తనకుమారుని సుధర్ముడను వానిని వానిరాజ్యమును స్థాపించెను. ఆకుమారుడును పుండరీకపురమునం దభిషిక్తుడై తండ్రివలెనే ధర్మముగా బాలించుచుండెను. తరువాతను కరూశాధిపతి యగుసుధర్ముడనువాని కవంతిరాజ కూతురును పుష్కల యనుదానిని దెచ్చి దేవాంగుడు పెండ్లిచేసెను. నిర్వక్రపరాక్రమ నిధి యగుసుధర్ము డాసుందరితో గూడి సర్వభోగముల ననుభవించుచు యథాన్యాయముగా రాజ్య మేలుకొనుచుండెను. దేవాంగుడును దక్కినపుత్రులతో గూడి తనరాజ్యమును పరిపాలించుకొనుచుండెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున దేవాంగ రాజ్యపరిపాలన మన్నది. పదుమూడవ యధ్యాయము.

పదునాల్గవ యధ్యాయము

ఇట్లుండగా రాక్షసులు దేవగంధర్వాదులందఱును దివ్యవస్త్రములను గట్టుకొని తమ్మును నవ్వుట చూచి వారందఱును దేవాదులనడువడి యంతయు దమప్రభువగు వజ్రదంష్ట్రునితో జెప్పిరి. పూర్వవైరముచేత దేవతలశ్రేయస్సును సైపజాలక యావజ్ర దంష్ట్రుడు కోపించి యింద్రాదిదేవతల నందఱను జయించి శత్రువులు లేకుండ దానే మూడులోకములను పాలించుచుండెదనుగాక యని తలంచి యాదుర్బుద్ధి తనతమ్ములను వ్యాఘ్రవక్త్రుడు, సర్పజిహ్వుడు ననువారిని బిలిచి యిట్లనియె. తమ్ములారా ! వింటిరికదా ! దేవతలపొంగు. దివ్యవస్త్రములచేత నలంకరించుకొని గర్వించి తిరుగుచున్నారట ! మీదు మిక్కిలి వస్త్రములు లేవని మనలను నవ్వుచున్నారట! వారికి దేవాంగుడు వస్త్రములు నేసి యిచ్చువాడట ! వాడును వారినే యనుసరించి యున్నాడుట ! వాడు ముల్లోకములవారికిని వలసినట్లు దివ్యవస్త్రములను నేసి యిచ్చియు మన కొక్కరికిని వస్త్రము లీయకపోయెను. చూచితిరిగదా ! వానిపొగరు బోతుతనము ! పోనిండు. సేవాలయములో నున్నప్పుడు శంకరుడును వస్త్రములందఱకును నిచ్చి మన కిచ్చుట మానివాడు దేవతలు వస్త్రములచే నలంకృతులయి యుండుట చూచినదగ్గఱనుండియు నామనస్సు మిక్కిలి పట్టుదలగలదైయున్నది. ఇంత

బలవంతుల మయ్యును చేతగానియట్లు వాండ్రు వేళాకోళములు చేయుచుండగా సహించియుంటిమి. ఇంతకంటె నేమికావలయును ? కనుక మనమిపుడు దేవతలను వినాశమును బొందింతము. ఇంద్రుని జయించి స్వర్గము నుండి గెంటివైచి శత్రుమాత్రము లేకుండ మనము ముల్లోకముల నేలుకొందము. అట్లు చేసితిమేని వైభవమంతయు మనదియేయగును. అనియిట్లు చెప్పినయన్న మాటలువిని తమ్ము లిట్లనిరి. అన్నా ! నీవన్నమాట సత్యమే. నిస్సంశయముగా దేవతలు మనలను నవ్వుచునేయున్నారు. ఇక నీవు చెప్పిన రెండవసంగతిమాత్రము కష్టసాధ్యమని తోచుచున్నది. ఏమనగా మనము పరాక్రమించినతోడనే యింద్రు డోడిపోయినచో నాసంగతివిని విష్ణుమూర్తి చక్రము పట్టుకొనివచ్చును. ఆవిష్ణు మూర్తిని మనము జయింపజాలము. ఒక్క విష్ణునిదక్క దక్కిన వారి నోర్చగలము గాని వానితో మాత్రము యుద్ధము చేయనోపము. అని ఇట్లు చెప్పిన తమ్ములమాటలు విని యాలోచనాపూర్వకముగా నన్న యిట్లనియె. తమ్ములారా ! మీరు మొదటినుండియు విష్ణుమూర్తికి భయపడుచునేయున్నారు. ఏమయినను సరియే. మనలను నవ్వుచున్న యింద్రాదిదేవతలనుమాత్రము యుద్ధరంగమునందు బీడించి పదిదిక్కులకును బరుగులెత్తునట్లు చేయుదము. అట్లు చేసితిమేని మనలను నవ్వినందులకు శిక్షయగును. నామనోరథమును బూర్తియగును. దేవతల నెట్లయినను జంపవలయు ననియే నామతము. ఇంద్రాదులను ముందుగా బీడించి మనోరథమును బూర్తి చేసికొందము. పయినిజిష్ణువో విష్ణువో వచ్చుగాక. చూతము అంతగా వచ్చినప్పు డప్పటిసంగతి యాలోచించుకొందము. ఒకవేళ మీకు విష్ణునివలననంతగా భయ మున్నచో లెండు. శివునిగూర్చి తపస్సు చేయుదము ఆయన కరుణించి వరముల నిచ్చును. తరువాతనే యింద్రాదులను జయింతము. మనకు వారివలన గలిగినయవమానమును దీర్చు కొందము. కావున మనము ముందుగా దపస్సునకు బోవలయుటనామతము మీయుద్దేశముగూడ జెప్పుడని యనగానే వారిద్దఱును గూడ నంగీకరించిరి. ఆముగ్గురన్నదమ్ములును నిర్జనప్రదేశమునకు బోయి ఘోరములయిన నియమముల నవలంబించి తమశరీరములను దపస్సుచే గృశింపజేసికొనుచుండిరి. తరువాతను శివుడు ప్రత్యక్షమయి యిట్లనియె. రాక్షసులారా ! మీతపస్సులకు మెచ్చితిని మీకు గావలసినవరములడుగుడు. ఇచ్చెదను అని శంకరుడనగానే యారాక్షసులు ముగ్గురును దురదృష్టవంతు లగుటంజేసి యిట్లని యడిగిరి. దేవా ! మాతపస్సులకు మెచ్చితివేని లోకములో నంతటను సూర్యుని వెలుగు లేకుండ బోవునట్లు వరమిమ్ము. ఇదియే మాకోరిక

దీనిని బూర్తి చేయుము. అని యడిగినవారిమాటలు విని శంభు డిట్లనియె. రాక్షసులారా ! మీరు కోరినవర మీయరానిది. మఱొకవరము గోరుకొనుడు. సూర్యుడు త్రిమూర్తిస్వరూపుడు. సర్వదేవతాస్వరూపుడు. జగత్తులకు గన్ను. కర్మములకు సాక్షి. అతడే కర్తయు ధర్తయు హర్తయు నయి రక్షించుచుండును. సుకృత మొనరించిన వారి కతడే స్థానము. ఆత డుదయించిననే యన్నకర్మములను జేయబడుచుండును. మఱియు నందఱును మేలుకొందురు. అత డస్తమించినతోడనే యందఱును నిదురింతురు. అట్టిసూర్యునియుదయమే లేకయున్నచో లోకము సంగతి యేమగు ననుకొంటిరి ? గాఢాంధకార మగ్నము గాదా ? కర్మము లన్నియు నేమి యగును ? మీరాలోచింపకుండ నిటువంటివరము గోరితిరి. మీరు గోరితిరి గాని లోకములకు నాశము చేకూరువరము తెలిసియుండి నే నెట్టీగలను ? మఱియేదేని వరము కావలసినచో నడుగుడు. అది యెట్టి దయినను దప్పక యిచ్చెదను. అని యిట్లు శివుడు చెప్పగానే వారు విషాదమును బొంది యిట్లనిరి. దేవేశా ! అటులేని సూర్యుని వెలు గొక్కసంవత్సరము మాత్రము ప్రకాశింపకుండ వరమిమ్ము. నీవు భక్తవత్సలుడ వటకదా ! అని వారనగానే శివుడు క్షణమాత్ర మాలోలించి యట్లే వరమిచ్చితి నని యచ్చటనే యంతర్ధానమాయెను. వెంటనే బ్రహ్మాండమంతయు గాటుకకూరినట్లు గాఢాంధకారమగ్న మయిపోయినది. అట్టిసమయమున వజ్రదంష్ట్రుడు వీరమాహేం ద్రపట్టణమునకు బోయి దూతలతో నిట్లనియె. దూతలారా ! మీరు నాలుగు దిక్కులకును బోయి మనవాండ్రు రాక్షసు లెక్కడెక్కడ నున్నారో కనుగొని యింద్రునిమీదికి యుద్ధమునకు వెళ్ళవలయుటను జెప్పి తీసికొనిరండు. వారందఱతోడను గలసి యుద్ధమునకు బోదము. అని చెప్పిన వజ్రదంష్ట్రునిమాటలు విని దూతలు బయలుదేఱి మహావేగముగా రాక్షసు లున్నచో ట్లన్నియువెదకి రాక్షసరాజు చెప్పినయాజ్ఞ నందఱకును వినిపించిరి. వారును నాడే బయలుదేఱి యుద్ధసన్నద్ధులై వచ్చిరి. తుదకు వారును వీరును గలసి యింద్రాదులతో యుద్ధము చేయుతలంపుతో స్వర్గమువైపు బయలుదేఱిరి.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితములో రాక్షసుల యుద్ధసంరంభమన్నది పదునాల్గవ యధ్యాయము.

పదునేనవ అధ్యాయము

సూతు – తరువాత నారాక్షసులు వజ్రదంష్ట్రునియాజ్ఞవలన దమపట్టణము నుండి బయలుదేఱిరి. రాక్షసరాజగు వజ్రదంష్ట్రుడును. జతురంగబలముతో గూడి యుద్ధము చేయుటకు గృతనిశ్చయుడై బయలుదేఱెను. తరువాతను వానితమ్ము లిద్దఱును సైన్యముతో గూడి బయలుదేఱిరి. సూర్యకోపుడు, అగ్నికోపుడునను వజ్రదంష్ట్రుని కుమారు లిద్దఱును వలసినంతసైన్యముతో గూడి తండ్రిని వెంటనంటి పోయిరి. వాని మేనల్లుళ్ళిద్దఱు ధూమ్రనేత్ర ఖడ్గజిహ్వులనువారును బెక్కుమంది రాక్షసులతో గూడి మేనమామకు సాయము వెళ్ళిరి. వారు బయలుదేఱునపుడు మిక్కిలిగా భేరులు మ్రోగింపబడినవి. ఇట్లు యావద్రాక్షసులును యుద్ధశ్రద్ధ గలిగి ధనుష్టంకారములు చేయుచు సింహనాదములు చేయుచుస్వర్గమునకు బోయి ద్వారములరికట్టిరి. రాక్షసులిట్లు యుద్ధమునకు వచ్చిరని విని దేవతలును యుద్ధసన్నద్ధులైరి. యుద్ధములో జాలమంది రాక్షసులను గొట్టిరి. రథములను జూర్ణము చేసిరి. ఏనుగులను, గుఱ్ఱములను కాలుబలమును ధ్వంసము చేసిరి. మఱియు దేవతలు కాలదండములతో సమానములగు బాణములను బ్రయోగించి యనేకులను జంపిరి. కొందఱు మావంటివాండ్రు గజములతోడను, మఱికొందఱు గుఱ్ఱములతోడను జచ్చి నేలగూలిరి. ఇట్లు చాలమంది చచ్చినతోడనే మిగిలిన రాక్షసులు కోపించినవారై యేమియు జేయజాలక స్వర్గద్వారములను విడిచి పాఱిపోమొదలిడిరి. స్థానభ్రష్టులయి పాఱిపోవుచున్న రాక్షసులవెంట గొట్టుచు దేవతలు పరుగులెత్తిరి. ఇట్లు దెబ్బలకు దాళజాలక సైన్యము నాలుగవైపులకును బాఱిపోవుచుండుట చూచి వజ్రదంష్ట్రుడు పాఱిపోకుండ నిలువ బెట్టుచుండెను. ఇట్లు వజ్రదంష్ట్రుని చేతను బ్రేరేపింపబడినవారై మహాబలవంతులగు రాక్షసులు యుద్ధోత్సుకులై దేవతలమీదికి వచ్చిరి. అపుడు వజ్రదంష్ట్రుడు తమ్ములతోడను కొడుకులతోడను మేనల్లుళ్ళతోడను గూడి దేవతలతో యుద్ధము చేయుట కుపక్రమించెను. తరువాతను రాక్షసులకును దేవతలకును ఘోరముగా యుద్ధము జరిగినది. ఒకరి నొకరు జయింపవలెనను తెంపు గలిగి యుండిరి. రథములతో రథములు గుఱ్ఱములతో గుఱ్ఱములు, ఏనుగులతో నేనుగులు కాలుబలముతో గాల్బలము పోరదొడగెను. ఇట్లు నానావిధములయిన యాయుధములతోడను యుద్ధము చేయుచుండగా రథములచప్పుడు, ఏనుగులఘీంకారములు, గుఱ్ఱముల సకిలింపులు . పదాతుల సింహగర్జనములు బాహువుల నప్పళించినచప్పుడు ధనస్సులటంకారములు భేరీశంఖాదులచప్పుడు మిగిలినవాద్యములచప్పుడు

కాహళులు తూర్యములు మొదలగువానిచప్పుడు కలిసి మూడులోకములను జెవుడెత్తింప మొదలిడెను. సముద్రములు కలగిపోయినవి. కులపర్వతములు భ్రాంతిని బొందినవి. తరువాతను ఘోరముగా జీకటి వ్యాపించినది. అపుడు రాక్షసుల తమయాయుధముల వెల్తురుచేజూచి దేవతలను గొట్టుచుండిరి. మఱికొందఱు కిరీటములకాంతులచే జూచి కొట్టుచుండిరి. తరువాతను మహాబలవంతులగు రాక్షసులచేగొట్టబడి దేవతలందఱును బరాఙ్ముఖు లయిరి. ఇట్లుపాఱిపోయి భయపడుచు దేవతలు స్వర్గములో బ్రవేశించిరి. ఘోరవిక్రములగు రాక్షసుల దేవతలనందఱను జయించి నేటికి యుద్ధము చాలునని తలంచి సంతుష్టులైక్రమముగా వీరమాహేంద్రపట్టణములో బ్రవేశించిరి.

తరువాత రాక్షసులచే బాగుగా దెబ్బలుతిన్న యాదేవతలందఱును దేవేంద్రునితో గూడి శంకరుని శరణుచొచ్చుటకై బయలుదేఱి కైలాసపర్వతము పైనున్న శివుని జూచి యనేకవిధములుగా స్తుతి చేసిరి. వారు చేసినస్తుతులకు సంతోషించి శివుడిట్లనియె. దేవతలారా ! మీకుగుశలమేకదా ! ఇంద్రా ! నీకు క్షేమముగదా ! నీవజ్రము రాక్షసులగర్వము నణచుచున్నదిగదా ! అని యిట్లు శివు డడుగగా దేవతలాయనతో నిట్లనిరి. ప్రభూ ! తమదయవలన మా కందఱకును క్షేమమే. కాని వజ్రదంష్ట్రుడనురాక్షసుడు మమ్ములను బాధించుచున్నాడు. నిన్నటి దినము వానితో యుద్ధము చేసి చాల బీడింపబడితిమి. అరాక్షసుడు బహురాక్షసులతో గూడి వచ్చి స్వర్గద్వారములను నిరోధించెను. కరుణానిధీ ! తమ్మును శరణు చొచ్చితిమి. మమ్ములను గాపాడవలయును. శంకరా ! మే మారాక్షసులతో యుద్ధము చేయజాలము. ఆరాక్షసులవధోపాయము సెలవీయవలయును. ఇక వానితమ్ము లిద్దఱున్నారు. వారు మఱియు దుర్మార్గులు. యుద్ధభూమిలోనికి వచ్చియున్న వ్యాఘ్రవక్త్రునితోడను సర్పజిహ్వునితోడను యుద్ధము చేయుటకెవరికి శక్తి యుండును ? మఱియు నావజ్రదంష్ట్రునికుమారులు కాలాంతకసములు. సూర్యకోపుడు, అగ్నికోపుడునువారున్నారు. వారిని సహింపమావశము గాదు. ఆరాక్షసునిమేనల్లుళ్ళు ధూమ్రనేత్ర ఖడ్గజిహ్వులసంగతి చెప్పనే యక్కఱలేదు. మహామతీ ! ఆరాక్షసు లందఱును జచ్చునుపాయ మాలోచించి మాకు సెలవీయ వలయును. రాక్షసులను నశింపజేసి మమ్ముల నెట్లయినను గాపాడవల యును. భక్తవత్సలా ! దిక్కులేక నిన్నే శరణు చొచ్చితిమి. అని యిట్లు దేవతలు చెప్పుకోగా శివుడు శిరస్సును కంపించి క్షణకాల మాలోచించి "మంచిది" అని చెప్పి దేవాంగునివంక జూచి యిట్లనియె. దేవాంగా ! నీవు పోయి యింద్రాదులకు

సాయపడుము. రాక్షసులను జయించుము. చతురంగ బలముతోడను నీకుమారుల తోడను గూడి యింద్రాదిదేవతలను వెంటబెట్టుకొని వెంటనే రాక్షసులను జంపుము. అని యిట్లు శివు డాజ్ఞాపించినతోడనే దేవాంగమహా రాజు చిత్తమని యంగీకరించెను. తరువాతను శివుడు దేవేంద్రునితో మరల నిట్లనియె. ఇంద్రా ! నీ వీదేవాంగుని సాయముగా దీసికొని యుద్ధమునకు బొమ్ము. ఇతడు వజ్రదంష్ట్రాదులగు రాక్షసులను దప్పక జయించును. అని యిట్లు శివుడు చెప్పినమాటలు విని సంతోషించి యింద్రు డిట్లనియె. దేవేశా ! యట్లే కానిమ్ము. తమవాక్యముచేతను రాక్షసులు పరాజితు లగుదురుగాక. వాండ్రు మమ్ములను జాల బాధించుచున్నారు. అని చెప్పి దేవదేవు డగుశివునకు నమస్కరించి యతనియాజ్ఞను బొంది దేవాంగునితో గూడ బయలుదేరెను. అపు డింద్రునితో దేవాంగు డిట్లనియె. దేవేంద్రా ! నీ విపుడు దేవతలతో గూడి స్వర్గమునకు బొమ్ము. నేనును జతురంగ బలముతో నీయనుపదమే వచ్చుచున్నాము. అని చెప్పగానే వేగముగా రమ్మని చెప్పి దేవతలతో గూడి సంతోషించుచు నింద్రుడు స్వర్గమునకు బోయెను. తరువాతను దేవాంగ దామోదపట్టణము చేరెను. పణిహారులను బిలిచి చతురంగబలమును సిద్ధము చేయునట్లాజ్ఞాపించెను. తరువాతను వారందఱును గూడిరి వాద్యధ్వనులు మ్రోగుచుండగా రాజపుత్రులతోగూడి స్వర్గమునకు బోయెను. ఇంద్రుడు తనకు సహాయము చేయ వచ్చినవారి నందఱును గౌరవముగా నెదుర్కొని పట్టణములోనికి దీసికొనిపోయి యతిథిసత్కారమును యథేష్టముగా జేసెను. నాడు రాక్షసులు యుద్ధమునకు రారని తెలిసికొని నాటిరాత్రి సుఖముగా వెళ్ళించెను. మఱునాడు తెల్లవాఱగానే పణిహారులను బిలిపించి దేవసైన్యము నంతను యుద్ధము నకు సిద్ధముగా నుండునట్లు చేయుడని యాజ్ఞాపించెను. యుద్ధప్రయాణమునకు సూచకముగా రణభేరులు మ్రోగింపబడినవి. దేవతలందఱును నిత్యకృత్యములను నెఱవేర్చుకొని యింద్రునియొద్దకు వచ్చిరి. రాజపుత్రులతో గూడి దేవాంగుడును మహేంద్రునియొద్దకు వచ్చెను. అందఱును గూడి యున్నారని దేవేంద్ర డనెను. ఇంతట వజ్రదంష్ట్రుడు మొదలగురాక్షసులు వచ్చి దేవతలతో దొమ్మిగా యుద్ధముచేయ మొదలిడిరి. దేవతలు రాక్షసులు పరస్పరమును జయించుతలం పుతో గొట్టుకొనుచుండిరి. శూరులగు దేవతలు రాక్షసులను గట్టిగా గొట్టిరి. రాక్షసులు దిక్కులేక వ్యాఘ్రవక్త్రుని శరణుచొచ్చిరి.

ఇట్లు శ్రీబ్రహాండపురాణములోని దేవాంగచరితమున దేవదానవ సేనా యుద్ధమునున్నది పదునైదవ యధ్యాయము.

పదునాఱవ యధ్యాయము

సూతు - ఇట్లు రాక్షసులు కొట్టబడి చెల్లాచెదరై పోయిన తరువాత మహాబలుడును మహాప్రాజ్ఞుడును శత్రుతాపనుడును నగు దేవలునియొద్దకు వచ్చి యారాక్షసుడు మధురముగా నిట్లనియె. దేవాంగరాజా ! నీవు యుద్ధములో ధనుస్సు పట్టుకొని ప్రళయకాలపు మేఘునివలె బ్రకాశించుచున్నావు. బాణవర్షముచే శత్రువులను ముంచి వైచుచున్నావు. నీతో యుద్ధము చేయుటకు నేను దక్క దక్కినవారు పనికిరారు. అడవిలో సింహము మృగములను బరుగు లెత్తించునట్లు నాశత్రువులను నిర్భయముగా బరుగులెత్తింతును. గొప్పదియగు రథఘోషము చేతను భూమ్యంతరిక్షములు నిండునట్లుచప్పుడు చేయుదును. అమ్ములపొందినుండి పాములవంటి బాణములను దీసి ప్రయోగింతును. ఈశ్వరునితో నంధకాసురుడు యుద్ధముచేసినట్లు నాయొక్కనితోడనే యుద్ధము చేయుదువుగాక. అని యిట్లు రాక్షసుడనగానే దేవాంగుడు సంతోషించి నవ్వుచు ఖడ్గముతో నారాక్షసుని గొట్టెను. ఆదెబ్బకు నొచ్చి యారాక్షసుడు మర్మభేదకములగు బాణములచే దేవలుని గొట్టెను. మరల దొంబదిబాణములచే సకలమయిన మర్మస్థానములయందును గొట్టెను. రాక్షసుడు ప్రయోగించినబాణములు తగిలినయా దేవలుడు కిరణములతో గూడిన సూర్యునివలె బ్రకాశించెను. తరువాత దేవలుడు కోపించి వేలకొలది బాణములు ప్రయోగించి వ్యాఘ్రవక్త్రు డనురాక్షసుని గప్పివుచ్చి సింహనాదము చేసెను. ఆరాక్షసుడు తనబాణములచే నతనిబాణములను వారించి నవ్వుచున్నవానివలెనే యొకబాణముచే దేవలుని నుదుటిమీదను గొట్టెను. నుదుటియందు దగిలిన యాబాణముచేతను దేవలుడు వనమందు గర్వించియుండు ఖడ్గమృగమువలె గన్పట్టుచుండెను. తరువాత నాదేవాంగుడు నవ్వుచు నారాక్షసుని నుదుటికి దగులునట్టుగా మూడు వాడిబాణములను బ్రయోగించెను. మూడుబాణములును దగిలి యావ్యాఘ్రవక్త్రుడు రక్తము స్రవించుచుండగా వర్షాకాలములో ద్రిశృంగములు గలపర్వతమువలె నుండెను. తరువాత నారాక్షసుడు వేలకొలది బాణములతో దేవలుని గప్పివైచెను. కాని గాలి పర్వతమును గదలింపజాలనట్టుగానే యతనిని గదలింపజాలకపోయెను. అట్లే దేవలుడును రాక్షసుని గొట్టెను గాని యుదక ప్రవాహము కొండ నేమియు జేయజాలనట్లే యేమియు జేయజాలకపోయెను. లోకక్షయమును జేయుటకు సిద్ధపడినసూర్యులిద్దఱేకమయినట్లాయిద్దఱును రథములమీద నుండి ప్రకాశించుచుండిరి. ఆమహారథు లిద్దఱును నిర్భయులయి యొకరినొకరు బాగుగా గొట్టుకొనుచున్నారు. మఱియు వారిద్దఱును పెద్దపులులవలె

నుండి పోరుచుండిరి. ఒకరిబాణము లొకరిని గప్పగా నగపడకుండ నుండిరి. అప్పుడు మేఘములు గప్పిన చంద్రసూర్యులవలె నుండిరి. ఒకమాఱు కనుపడుట యొకమారు కనుపడకుండుటయు గలిగి యుద్ధము చేయుచుండిరి. అట్టిసమయమున రాక్షసుడాదేవలుని భయంకరములగు బాణములతో గొట్టుచు నపసవ్యముగా జేసెను. దేవలుడు శత్రువు యొక్క జయచిహ్నాములను జూచి సహింపక తన రథమును గూడ నపసవ్యముగజేసెను. మండలవిభాగములయందును గతప్రత్యాగతములయందును వారిద్దఱికిని ఘోరముగా దొమ్మియుద్ధము జరిగినది. ఒకరి నొకరు చంపుదమను నుద్దేశముతో నాకర్ణాంతము బాణముల నాకర్షించి విడుచుచుండిరి. ఒకరినొకరు విజయునిజేయ నెంచుచుండిరి. తరువాతను మహాస్త్రములు తెలిసినరాక్షసుడు గొప్పగొప్పయస్త్రములను బ్రయోగింప మొదలిడెను. మునివరులారా ! అప్పుడు మహాఘోరముగా నస్త్రయుద్ధము ప్రవర్తించినది. అది ప్రళయాంతమున లోకముల నాశమును సూచించుగ్రహముల యుద్ధమువలె నుండెను. ఆకాశమంతయు బాణములతో నిండిపోయినది. బాణముల రాపిడిచే నగ్ని జ్వాలలు పుట్టినవి. నాశసూచకముగా నుల్కలు పడినట్టున్నది. అప్పు డంతరాళమందున్న సిద్ధులు మొదలుగాగలవా రిట్టియుద్ధ మెప్పుడును జూచియుండలే దనుకొనిరి. మఱియు నిట్టియుద్ధము ముందు జరుగబోదనిరి. ఆహా ! వీరి జ్ఞాన మేమీజ్ఞానము ! పరాక్రమ మంతకు మించినది. రాక్షసపార్థివులధైర్యము నిరూపమాన మయినది. ఏమీ బాణములప్రయోగించు నేర్పు ! ఇద్దఱును బ్రళయకాలపుగాలాంతకుల వలె నున్నారు ! ఇద్దఱు రుద్రులవలె నున్నారు ! ఇద్దఱు సూర్యులవలె బ్రకాశించుచున్నారు. అని యిట్లనేకవిధములుగా సిద్ధులు చెప్పుకొమొదలిడిరి. రాక్షసులును దేవతలును సింహనాదములు చేయుచుండిరి. రాక్షసుడును దేవలుడును నత్యద్భుతముగా యుద్ధము చేయుచు గన్నుల నుండి నిప్పులు రాల్చుచు నొకరి నొకరు దహింతురాయనునట్లు చూడ మొదలిడిరి. ఇట్లతిఘోరముగా యుద్ధము జరుగుచుండు సందర్భమున దేవాంగుడు తన హస్తలాఘవమును జూపుచు నొకబాణముచేతను సారథిని రెండుబాణములచే ధ్వజమును, నాలుగు బాణములచే గుఱ్ఱములను, అర్ధచంద్ర బాణముచే వానిధనస్సును దెగగొట్టి ధనుస్సులేని యారాక్షసుని మూడువందల వాడిబాణములతో గొట్టెను. అట్లు గొట్టి మఱియొకబాణమాకర్ణాంత మాకర్షించి వానిని ఖండించెను. ఆరాక్షసునిశిరస్సు శరీరమునుండి వేఱై క్రిందబడినది. రత్నకుండలములతో వెలుగుచున్న యాశిరస్సు నభోమధ్యమునుండి పడినసూర్యబింబము వలె వెలిగినది. ఇట్లు వ్యాఘ్రవక్త్రుడపడిపోగానే రాక్షసులందఱును భయపడి

పాఱిపోవు చుండగా దేవతలు వెంటదవిలిరి. దేవతలు సంతోషముచే సింహనాదములు చేయ మొదలిడిరి. పటుపరాక్రమశాలి యగుదేవాంగుని దేవేంద్రు డతిసంతోషముచే బూజించెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున వ్యాఘ్రవక్త్రవధ మన్నది పదునాఱవ యధ్యాయము.

పదునేడవ యధ్యాయము

సూతు - మునులారా ! బలవంతుడగు వ్యాఘ్రవక్త్రుడు మృతినొందగానే మిగిలినరాక్షసులు దెబ్బలుతినజాలక తిన్నగా వజ్రదంష్ట్రునియొద్దకు బోయి జరిగిన వృత్తాంత మంతయు జెప్పిరి. తమ్ముడు చచ్చిపోవుటయు రాక్షసులు భయపడి వచ్చుటయు దెలిసికొని వజ్రదంష్ట్రుడు దుఃఖముతోడను, కోపముతోడను గూడినవాడై సగరేశ్వరుండగు దేవాంగునిమీదికి బరుగెత్తుకొనివచ్చెను. అప్పుడు దేవాంగుడును వజ్రదంష్ట్రు నెదుర్కొనెను. పరస్పరము జయమును గోరుచుండు వారిద్దఱకును వృత్రాసురునకును దేవేంద్రునకును జరిగినట్లు యుద్ధము జరిగినది. వజ్రదంష్ట్రుడు దేవాంగునిపై ననేకములగు బాణములను వర్షించెను. కాని యుదకప్రవాహము కొండ నేమియు జేయజాలనియ ట్లాబాణములతని నేమియు జేయజాలకపోయినవి. రాక్షసుడు ప్రయోగించినబాణములను తనబాణములచే నివారించుకొని తాను వానిని ఘోరములగు బాణములతో గొట్టెను. దేవాంగునిచే గొట్టబడి రక్తమును స్రవించుచున్న యారాక్షసుడు వర్షాకాలములో జేగురుకొండవలె బ్రకాశించుచుండెను. తుదకు జాల దెబ్బలు తిని పాములవంటి బాణములతో నాదేవాంగుని గొట్టెను. అనేకబాణములచే సారథిని రెండుబాణములచే ధ్వజమును గొట్టి మూడుబాణములచే దేవాంగుని నుదుటి మీదను గొట్టెను. ఆబాణములు నుదుటికి దగిలియుండగా సగరేశ్వరుడగు దేవాంగమహారాజు త్రికూట పర్వతమువలె శోభించెను. తరువాతను దేవాంగుడు కోపించి ధనస్సును గుండ్రముగా జేసి డెబ్బదిమూడు బాణములచే నారాక్షసుని గొట్టెను. ఒక బాణముచే ధనస్సును మఱియొకబాణముచే ధ్వజమును నాలుగుబాణములచే నాలుగు గుఱ్ఱములను గొట్టిపడవైచి మరల నెన్నేని బాణములు ప్రయోగించి వానిరథమును పొడిపొడిగా జేసెను. మఱియు జాలబాణములు ప్రయోగించి వానిని బీడించెను. ధనస్సు పోయినది. సారథి చచ్చెను. రథము లేదు. గుఱ్ఱములు చచ్చినవి. తాను

గట్టిగా గొట్టబడెను. వేసవిలో బూచినమోదుగవలెనున్నాడు. అట్టిరాక్షసుడు గాలిలోని చెట్టువలె కంపించి గదపట్టుకొని దండపాణియగు యమునివలె దేవాంగునిమీదికి బరుగెత్తెను. అట్లు వచ్చురాక్షసుని జూచి పిడుగులవంటిబాణములు ప్రయోగించి వానిచేతిలోనిగదను ఛేదించి మదించినసింహమువలె దేవాంగుడు ధ్వని చేసెను. దేవతలందఱును సంతోషసూచకముగా గేకలువైచిరి. దేవదుందుభులు మ్రోగినవి. ఆరాక్షసుడు గదపోయి నిరాయుధుడై దిక్కులు చూచుచు నేమియు దోచక హేమకూటముయొక్క శిఖరమును బెల్లగించి చేత బట్టుకొని రాజునొద్దకు బోయి యిట్లనియె రాజా ! పోకుము పోకుము. క్షణమాత్ర ముండుము. నీ వేమో గర్వించి కేకలు వేయుచున్నావు. ఈకొండశిఖరముచే నీపొంక మణచెదను. పిడుగు పడినవడువునబడి నిన్నును నీరథమును బొడిపొడిగా జేయును. ఇంద్రుడు మాతో యుద్ధము చేయజాలక నిన్న దోడు తెచ్చుకున్నాడుగా ! వాడు వానిసైన్యముగూడ నీవు పడిపోగానే భయపడి పాఱిపోవుదురుగాక. నాతమ్ముడగు వ్యాఘ్రవక్త్రుని జంపి నీవేమో గర్వించియున్నావు. భ్రాతృదుఃఖతప్తుండనగు నేను నిన్ను జంపి వాని ఋణము దీర్చుకొందును. దేవతలపీచ మణచెదను. అపుడు సంతోషించుచుం దును. ఓరీ ! మాకు వస్త్రము లీయక తక్కిన యందఱకును నిచ్చెదవుగా ! ఇపుడు చేతికి జిక్కితివి. ఇక నెక్కడికి బోగలవు ? నాయెదుటబడిననిన్ను గాపాడువా డెవడో చూచెదనుగాక. అని యిట్లు చెప్పి రాక్షసుడు దేవాంగునిపయికి గొండశిఖరమును విసెరెను. అపుడు దైవతసైన్యములో హాహాకారము పుట్టినది. దేవలునికి క్షేమమగుగాక యని సిద్ధులు పలికిరి. ఆదేవాంగు డాకాశమార్గమున వచ్చుచున్న కొండశిఖరమును జూచి వజ్రబాణములను బ్రయోగించి పొడిపొడి చేసి క్రింది బడవైచెను. అతడు చేసిన యాయద్భుతకర్మమును జూచి దేవతలు సాధువాదములు పలికిరి. కొండశిఖరము గూలవైచి నవ్వుచు నారాక్షసునిమీదను వాడితోడివాండ్ర మీదను లెక్కకు మిక్కిలిగా బాణములను బ్రయోగించి కాలాంతకునియాకృతిని ధరించి భారవాహమగు ధనుస్సునుటంకారము చేయుచు దనరథమును నాలుగువైపులకును ద్రిప్పుచు నాకాశమును బాణమయముగా జేసి యనేకుల శిరస్సులు ఖండించుచు మిగిలినవారిని నాలుగువైపులకును బరుగులెత్తించెను. శార్ఙ్గమను ధనస్సు చేతబట్టి విష్ణుడెట్లు యుద్ధము చేయునో యట్లే దేవాంగుడును యుద్ధము చేయుచుండెను. చావగా మిగిలినరాక్షసులు ప్రాణములు పిడికిలో బట్టుకొని పాఱిపోయిరి. అపుడు వజ్రదంష్ట్రుడు దేవాంగునితో యుద్ధము చేయజాలక మహామాయను గల్పించి దేవతాసైన్యముపైని పర్వతవర్షమును

గురిపింప మొదలిడెను. అవి ప్రపంచమునంతను గాఢాంధకారమయముగా జేసినవి. ఎక్కడ జూచినను పిడుగులవలె రాళ్ళుపడుచుండెను. మాయామేఘ ములు తెరపిలేకుండ వర్షింపదొడగినవి. మహావాయువులు బయలుదేఱి దేవతలను గంపింప జేయమొదలిడినవి. దీనులైన యాదేవతలు రాక్షసమాయను సహింప జాలక మొఱ్ఱలు పెట్టుచుండిరి. ఆ రాక్షసు డెవ్వరికిని గనుపడకుండ మాయను బ్రయోగించి పీడించుచుండెను. అప్పుడు దేవాంగమహారాజు మాయాసముద్రములో మునిగియున్నదేవతల నుద్ధరించుటకును అదృశ్యు డైనయారాక్షసుని జయించు టకును మనస్సులో నిశ్చయించుకొని శివభగవాను డిచ్చిన శత్రుసంహారకమైన ధ్వజమును రాక్షసులపై వైచెను. ఆధ్వజ మమోఘమైనది. గనుక బ్రయోగించిన తోడనే రాక్షస మాయనుపోగొట్టియనేకులను రాక్షసులను జంపినది. కోట్లకొలదిగా వృషభములు బయలుదేఱి రాక్షసులను జంప మొదలిడినవి. అవి తమ ఱెక్కల తోడను కొమ్ములతోడను, తోకలతోడను రాక్షసులను జంప మొదలు పెట్టినవి. మఱియు మహాసర్పములతోడను సింహములతోడను వ్యాఘ్రములతోడను భయంకరములైన పర్వతములు, మిక్కిలిని భయంకరములగు గండభేరుండములు శరభాదులగు మహామృగములును, ఉల్కాశని మహాపాతములై దానవులసైన్యములో బ్రవేశించి రూపుమాపినవి. ఇవియన్నియు వృషభధ్వజమునుండియే పుట్టినవి. చావగా మిగిలినరాక్షసులు వజ్రదంష్ట్రుడును దమపట్టణములోనికి, బాఱిపోయిరి. ఆరాక్షసుడు కొడుకులు మంత్రులు సైన్యము తమ్ములు మొదలగువారందఱును జచ్చుటచే దుఃఖించుచు బాఱిపోయెను. ఇంద్రునితో గూడి దేవాంగుడు సంతుష్టస్వాంతుడై తనవారితో గూడి స్వర్గములోనికి బ్రవేశించెను. ఇంద్రుండు సత్కరించిన వెనుక దనవారితో గూడి దేవాంగు డామోదపట్టణములో బ్రవేశించెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున ధ్వజప్రభావ రాక్షసపరాభవమన్నది పదునేడవ యధ్యాయము.

పదునెనిమిదవ యధ్యాయము

సూతు - తరువాతను రాక్షసరాజగు వజ్రదంష్ట్రుడు చచ్చిన వారిం దలచుకొని యేడిచి యేడిచి తుదకు దుఃఖ మాపుకోజాలక కోపము దెచ్చుకొని తనకు బావమఱదియగు విద్యుత్కేశునియింటికి బోయెను. ఇంటికి వచ్చినబావనుజూచి విద్యుత్కేశు డత్యంతమును గౌరవించి విషాదమునకు గారణమేమని యడుగగా నావజ్రదంష్ట్రు డిట్లనియె. ప్రియసఖా ! రాక్షసశ్రేష్ఠా ! మహాబలా ! విద్యుత్కేశా ! నాకొకకార్యము చేయవలసియున్నది. అని చెప్పగానే వాడు వినయముతో గూడి యేమిచేయుమన్నను నీయాజ్ఞను శిరసావహించి చేయుదు ననెను. ఆమాట వినగానే వజ్రదంష్ట్రుడు సంతోషించి వానితో నిట్లనియె.

ఓయీ ! నే నిపు డొకటి చెప్పెదవినుము. పూర్వము దేవాంగుడు చేసిన సంగతి యెఱిగియే యుందువు. నావారందఱును యుద్ధములో మృతినొందిరి. ఇదంతయు వానివలననే సంభవించినది. ముఖ్యులందఱును జచ్చిపోయిరి. ఆచచ్చినవారి నందఱను దలంచుకొన్నకొలందిని దుఃఖమే హెచ్చయిపోవుచున్నది. నేను విరథుడ నైపోతిని. గట్టిగా దెబ్బలు తింటిని. వేయేల ? దేవతలయెదుట నన్ను వాడు పలువిధములుగా నవ్వి వేళాకోళములు చేసెను. నేను బన్నినమాయలన్నియు బోయినవి. నాబల మెందులకును బనికివచ్చినదే కాదు. అది యెక్కడనుండి తెచ్చినవాడో కాని వృషభధ్వజమును బ్రయోగించెను. అది మహోత్పాతమును గలిగించినది. సింహమునకు భయపడిన లేడి పిల్లవలె యుద్ధములో నిలువజాలక పాఱిపోతిని. ఇంద్రుడు దేవాంగుని సాయమున జయమును బొంది గర్వించి సంతోషించుచు దేవతలతో గూడ స్వర్గమునకు బోయెను. నగరేశ్వరుడగు దేవాంగునిసహాయముననే యింద్రుడంతగొప్పవాడయిపోయినాడు. ఇంతకును దైవయత్న మెవరికిని దప్పింప వీలుగానిది గదా ! ఇంద్రునకు జయము, నాకు పరాజయము గలుగునని యెన్నడుయినను తలంపవచ్చునా ? నే నారెండుసంగతు లకే మిక్కిలి విచారించుచున్నాను. పౌరుష మెందులకును బనికిరాదనియు దైవమే ప్రబలమనియు దేటపడినది. నాతమ్ముడు వ్యాఘ్రవక్త్రుడు త్రిలోకములను జయించినవాడు గదా ! అట్టివానిని దేవాంగుడు యుద్ధములో బడగొట్టినాడు ఇందుల కేదియైనను బ్రతిక్రియలున్నచో జేసి నాదుఃఖమును బోగొట్టుదు వనునభిప్రాయముచే నీయొద్దకు వచ్చితిని. నాయింతటి దుఃఖమునకును మూల కారణము దేవాంగుడేయయినాడు. వానిని జయించునుపాయ మాలోచింపుము.

మనము కపటోపాయమును బన్నిననే కాని వానిని జయింప జాలము. వాని కాధ్వజ ముండుటబట్టి యసాధ్యుడుగా నున్నాడు. శంభుదత్తమయిన యాధ్వజప్రభావ మిట్టిదని చెప్పుటకు సాధ్యము గాదు. కావున నెట్లయినను నీవు మాయోపాయముచే నాధ్వజమును హరించితివేని యాదేవలుడు మనకు లొంగును. నీవావిషయమున సాయపడుము. ఆమాత్రపుపని చేసితివేని మనపను లన్నియు నెఱవేఱుట కెంతమాత్రమును నభ్యంతరము లేదు అని చెప్పగానే విద్యుత్కేశు డంగీకరించి ధ్వజము నపహరించు తలంపుతో నామోదపట్టణమునకు బోయి దేవలునితో నిట్లనియె. ఓయీ ! దేవలా ! రాజశ్రేష్ఠా ! దయాళూ ! అమితవిక్రమా ! నేను దేవేంద్రునిదూతను. నమస్కరించుచున్నాను. ఆయనయాజ్ఞచే నీయొద్దకు వచ్చితిని. ఇపుడు మరల వజ్రదంష్ట్రుడు లెక్కలేని రాక్షసులతో వచ్చి నిర్భయముగా యుద్ధము చేయుచున్నాడు. నిన్నటిదినము నీవు రాక్షసులతో ఘోరముగా యుద్ధము చేసియలసి యున్నావని యెఱింగి నీకు శ్రమ కలుగజేయ గూడ దనుతలంపుతో నింద్రుడు తానే దేవతాసైన్యమును వెంటబెట్టుకొని యుద్ధమునకు బోయి వజ్రదంష్ట్రాదులగు రాక్షసులతో యుద్ధము చేయుచు "ఓయీ దూతా ! దేవాంగమహారాజుదగ్గఱ శత్రుసంహారిక మగువృషభధ్వజ మున్నదిగదా ! అతని నడిగి యది తీసికొని రమ్ము" అని నన్ను బంపియున్నవాడు. మహారాజా ! శీఘ్రముగా నాధ్వజ మిమ్ము. దానితో యుద్ధదుర్మదులగు రాక్షసులు ధ్వంసము చేయబడుదురు. నిన్నటి యుద్ధములో నాధ్వజ ప్రభావమువలన బెక్కురురక్కసులుక్కుడక్కిరి గదా ! చావగా మిగిలిన రాక్షసులు వజ్రదంష్ట్రుని పురస్కరించుకొని మరల వచ్చి యుద్ధము చేయుచున్నారు. అందఱను జంపగల ధ్వజము దెచ్చి వేగముగా నాకిమ్ము. అని యిట్లు కుటిలుడై వచ్చిన యాదూత మాటలు విని నిజమే యనుకొని దైవవశమున దేవేంద్రునికి మేలు చేయుతలంపుతో నాధ్వజమును వానిచేతి కిచ్చెను. ఆరాక్షసుడు సంతోషించుచు నద్దానిని గైకొని తిన్నగా వీరమాహేంద్రపట్టణము ప్రవేశించి వజ్రదంష్ట్రుని సందర్శించెను. వాడు వానిని జాలగౌరవించి వెంటనే ముఖ్యులగు రాక్షసులను బిలిచి మీరు యుద్ధసన్నద్ధులయి రండు వేగముగా స్వర్గమును ముట్టడింతము. అని వారిని సిద్ధపఱిచెను. రాక్షసులరాక తెలిసికొని దేవేంద్రుడు కోపించి దేవసైన్యముతో గూడి రాక్షసులతో యుద్ధము చేయబో వుచు దేవలునిరాకను గోరి యామోద పట్టణమునకు దూతనుబంపగా వాడు వేగముగ బోయి యింద్రునియానతి విన్నవించెను. దేవదూత మాటలు విని యాశ్చర్యపడి యిది యేమిసంగతి చెప్పుమా? ముందు వచ్చి దేవరాజు పంపెనని యొకడు ధ్వజము తీసికొని

పోయెనుగదా ! ఇప్పుడు మఱొకడు వచ్చి మరల బిలుచుచున్నాడు. ఆధ్వజముయొక్క మహిమగానీ. యుద్ధమునందు దగ్గిపోయినదా ? లేక అది నాది గనుక నింద్రునకు బనికిరాకపోయినదా ? మఱి రాక్షసులుగానీ యింద్రుని జయించి. పట్టుకొని పోయిరా ? అని యనేకవిధములుగా సందేహించుచు బుత్రులతోడను సైన్యము తోడను బయలుదేఱి యతివేగముగా స్వర్గమునకు బోయెను. దేవలునిరాకకు బూర్వమే వజ్రదంష్ట్రుడు దేవతలతో యుద్ధము చేసి పాపాత్ము డాధ్వజమును వారిపై విడిచెను. అధ్వజ మెవరిచేత బూజింపబడి విడువబడునో వానిశత్రువులను యముడు కాలదండముచే బ్రజలను సంహరించునట్లు సంహరించును. అటువంటి ధ్వజము యధావిధిగా బూజించి దేవతలపైకి విడువబడిన దగుటచే నది దేవతలను క్షోభింప జేయ మొదలుపెట్టినది. దానికి భయపడి దేవతలు పాఱిపోయిరి. దేవతలు దెబ్బలు తగిలి పాఱిపోయినతరువాత దేవాంగుడు సైన్యముతో నాయుద్ధభూమికి బోయెను. రాక్షసు డప్పటి కాధ్వజము నుపసంహరించి తనపట్టణమునకు బోవనుద్యుక్తుడై యుండగా రాజు చూచి కోపించి బాణముల వర్షించెను. తరువాతను రాక్షసు లందఱును దేవలుని జుట్టువాఱుకొని యనేకములగు నాయుధములతో గొట్టిరి. దేవాంగునిసైన్యముపై నాధ్వజమును వజ్రదంష్ట్రుడు ప్రయోగించెను. అది విడచినతోడనే దేవాంగునిసైన్యమునంతను దహించినది. చావగా మిగిలినవారు పదిదిక్కులకును బాఱిపోయిరి. తరువాతను రాక్షసు లందఱును నేకమయి దేవాంగుని మీద ననేకాయుధములు ప్రయోగించిరి. కొందఱు రథమెక్కి పగ్గములు పట్టుకొనిరి. మఱికొందఱు సారథిని గట్టివైచిరి. ఇతరులు యుగంధరుని పట్టుకొనిరి. వేఱొక కొందఱు వచ్చి దేవాంగునిచేతిలోని ధనస్సు విఱిచివైచి యమ్ములపొదులు లాగికొనిరి. మిగిలినయాయుధములను విసరివైచిరి. గుఱ్ఱములను జిదుకబొడిచిరి. ఇట్లు రాక్షసులకు జిక్కి విడిపించుకో జాలక యెటు చూచినను దనవారొకరును గంటి కగపడనికారణమున జింతిచు చుండు దేవాంగుని వజ్రదంష్ట్రాదులు రథమునకు గట్టికొని యాధ్వజము నుపసంహరించుకొని జయమును బొంది సంతోషపూర్వకముగా దమపట్టణము నకు బోయిరి. దేవాంగునికొడుకు దివ్యాంగుడు దుఃఖసముద్రములో మునిగి తండ్రిబంధవమును గూర్చి చింతించుచు జావగా మిగిలినవారితో నామోద పట్టణమునకు బోయి తల్లిని బహువిధములుగా నోదార్చి ప్రజల నందఱను మిక్కిలి యూఱడించి మంత్రులతో గూడి యుండెను.

తరువాతను వజ్రదంష్ట్రుడు తనవారితో గూడి వీరమాహేంద్రపట్టణమునకు బోయి దేవాంగుని విశేషముగ సన్మానించెను. తరువాతను రాక్షసరాజ్యగు వజ్రదంష్ట్రుడు వస్త్రనిర్మాతయగు దేవాంగుని మంచిమాటలాడి యతనితో స్నేహమును సంపాదించు కొని తనకూతురు పద్మిని యనుదాని నిచ్చి వివాహము చేసెను. అగ్నిహోత్రునియ నుమతిపై నామెను వివాహము చేసికొని యగ్నిదత్తయని పేరువడసిన యామెయందు శ్యాలుడు హాలుడు బలుడు ననుపేర్లుగల ముప్వురు కొడుకులను గనెను. వారు శుక్లపక్షపుచంద్రునివలె దినదినాభివృద్ధిని బొందుచుండిరి. వారిచే వస్త్రములు నేయించి దేవాంగుడు రాక్షసుల కిప్పించెను. తరువాతను దేవలు డాధ్వజమును గైకొని మామయొద్ద సెలవంది తనయామోదపట్టమునకు వచ్చెను. తరువాతను శివుని సేవించుటకై యతడు కైలాసమునకు బోయి యుండగా నతనిని జూచి శివుడు కోపించి యిట్లనియె ఓరీ బుద్ధిహీనుడా ! నే నిచ్చినధ్వజమును రాక్షసుల కిచ్చి దేవతలను హింసింపజేసితివి కావున నీవు మహిమ పోయినవాడ వయి విద్యాధరుడవుకమ్ము. అనియిట్లు శివునిచే శపింపబడి యచ్చటనుండి యామోదపట్టణమునకు వచ్చి తనవృత్త మంతయు నచటివారితో జెప్పెను. తరువాతను దేవాంగునిశరీరము లింగమై పోయినది. అది యామోదపట్టణమున రామలింగేశ్వరు డనుపేరున బ్రసిద్ధికెక్కినది. దేవాంగునికుమార దగుదివ్యాంగుడు రామలింగేశ్వరుని బూజించుచు భూమిని బాలించుచుండెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున దేవాంగుని యవతార పూర్తి యన్నది పదునెనిమిదవ యధ్యాయము

పందొమ్మిదవ యధ్యాయము

సూతుడు – మునులారా ! మేరువున కుత్తరమున బాంచాలమనుదేశము గలదు. అందు సత్యసంధు డనురాజు పాలించుచుండెను. అతడు దయాళువు కీర్తిమంతుడు ప్రాజ్ఞుడు, తేజస్వి సర్వసమ్మతుడును నయియుండెడివాడు. అతని కిందుముఖి యనుకూతురు గలదు. ఆమె సర్వలక్షణసంపన్నురాలు లోకములలోని లావణ్య మంతయు నొకచోట రాశిపోసినట్లామె వెలుగుచున్నది. ఆమె యొకనాడు చెలికత్తియలతో గూడి క్రీడకై యుద్యానవనములో బ్రవేశించెను. యౌవనవంతు రాలైన యారాజపుత్రి సఖిజనముతో గూడి యుద్యానవనములోని చెట్ల క్రిందను విహరించుచుండగా నొకవిద్యాధరుడుచూచి యామెను మోహించెను. ఆమెతో

మాటలాడుటకు సమయమును గాచుకొని యతడుండెనే కాని యామెను విడిచిపోజాలడాయెను. అట్లుండి చెలికత్తియల కగపడకుండ నామెమనస్సును దెలిసికొంద మనునభిలాషతో నామెకగపడెను. రెండవమన్మథుడో యన నున్నయావిద్యాధరునిజూచి యామెయు మోహవశవందురాలాయెను. ఆమె యతని యభిప్రాయమును దెలిసికొని తనసఖులను దూరముగా విడిచి యొకరహస్య స్థలమున కేగి యావిద్యాధరునితో నిట్లనియె.

ఇందుముఖి – పురుషవ్యాఘ్రా ! నీ వెవరు ? నీ పేరేమి ? ఎచ్చట నీయునికి? నీసంగతి యంతయు నిజముగా జెప్పుము. అని యామెయడుగగా దనకోరిక పూర్తి యగుననుసంతోషముతో నావిద్యాధరు డిట్లనియె సుందరీ ! బ్రహ్మపుత్రుడగు వజ్రమౌళియను విద్యాధరునికుమారుడను నాపేరు హేమవర్ణ డందురు. నిన్నుజూచినది మొదలు నామనస్సు నీయందు లగ్నమయియున్నది. విలాసిని ! విలాసపూర్ణము లగునీ క్రేగంటిప్రసారములచే నన్నానందింపజేయుము, అని యత డనగానే మొదలే యతనినిజూచి మోహితురాలయి యుండుటంజేసి యపుడు మఱింతయనురాగము గలదియై యతనియభిలాషము నంగీకరించినది. మఱియు నతనితో జెప్పవలసినమాటలన్నియు జెప్పి యతనిచే బ్రమాణము చేయించుకొని యతనితోనిట్లు సంకేతము చెప్పినది. సుందరా ! నేను శృంగారపురరాజగు సత్య సంధునికుమారితను మాతండ్రి యింటికి వెనుకభాగమునందు జంద్రకాంతి గలప్రాసాదము నానివాసస్థానము నే నందు జెలికత్తెలతోమాత్రమే యుందును. నీవు నేటిరాత్రికి దప్పకయామేడకు రమ్ము. తరువాత గాగలకార్యమెట్లో యగుగాక. అని యతనితో జెప్పి చెలికత్తెలతో నింటికి బోయినది. తరువాతను సంకేతము దెలిసికొన్న యావిద్యాధరు డామె యొద్దకు బోయి చిరకాల మాసుందరితోగూడి యమందా నందము నొందుచుండెను. ఆదంపత లన్యోన్యమును గాఢానురాగము గలవారైరి కాని యెవ్వరికిని దెలియదాయెను. ఇట్లొకసంవత్సరము గడచినది. అతనివలన నామెకు గుమారుడు గలిగెను. సర్వలక్షణసంపన్నుడగు నాకుమారునికి గమలాక్షు డని నామకరణము చేసిరి. ఆబాలుడు బాలసూర్యునివలె వృద్ధి బొందెను. ఆమె మూడు నెలలవఱకును బాలుని సంగతియే తనతల్లి మొదలగువారి కెవ్వరికిని దెలుపకయే దాచి కాపాడుచుండెను. తరువాత నొకనాడు తనప్రియు డగువిద్యాధరునితొనామె యిట్లన్నది. వల్లభా ! ఇంతవఱ కెట్లో మనమిద్దఱమును సంతోషముగా నుంటిమి గాని యిటుపైన నీ విచ్చట నుంటివేని మనకు మర్యాద దక్కదు. కావున నెట్లో నాయందలి యనురాగలతను గోసివైచికొని నీయిష్టమువచ్చినచోటికి బొమ్ము. నీవు పోవునపు డీబాలుని గూడ దీసికొనిపొమ్ము

నావిషయమై నీవు గాని నీవిషయమై నేను గాని విచారించిన లాభము లేదు. దైవము మన కింతవఱకే సంయోగమును గల్పించియున్నాడు. నీవు విచారింపక వేగముగా బొమ్ము. అని యామె చెప్పినహితవచనములువిని యేమిచేయుటకును దోచక చింతా క్రాంతుడై యావిద్యాధరు డాబాలు నెత్తుకొని తిన్నగా స్వర్గమునకు బోయెను. కమలాక్షు డనునాబాలుడు యౌవనవంతుడై సకలవిద్యలను నేర్చుకొని యందఱును సంతోషింప జేయుచుండెను. అతనికి రానివిద్యయేలేదన్నపు డిక విభజించి చెప్పనేలా ? సమస్త జనులును నతనివిద్యాచమత్కారమున కమందానందమును బొందుచుండిరి. అపు డుశివభగవాను డూరకయుండెను. ఈరీతిగా నాహేమవర్ణుని కుమారుడగుకమలాక్షుడు ప్రతిదినమును శివునిసమీపమున దనయన్నివిద్యలను వినిపించుచుండెను. ఇట్లుండగా నంబికకు బరమభక్తుడును విద్యావంతుడును బుద్ధిమంతుడును నగువివిత్సుడను విద్యాధరు డాకమలాక్షునిచే విద్యలలో నవమానింపబడి వాని నణచుటకై పార్వతిని బ్రార్థించెను. దేవీ ! అంబికా భక్తవత్సలురాలా ! నీకు నమస్కారము. నేను గమలాక్షు డనుపిన్నవానిచే విద్యలో నోటమి చెందితిని. కావున నీవు నాకై దేవీ ! ఎట్టులయినను వానిపొంక మణచక తీరదు. అని యతడు ప్రార్థించినప్రార్థనను జిత్తగించి యాదేవి యట్లే చేయుదునులే, అని యతనిని సంతోషపఱిచినది. తరువాత నొకనాడు శివుని సన్నిధిలో నాకమలాక్షుడందఱు పండితులను విద్యాగోష్ఠిచే సంతోషపఱిచెను. కాని శివుడు మాత్ర మాతనివిద్యావిశేషముల కొక్కింతయు సంతసించుటయే లేదు. అట్లు సంతోషింపనిమగని జూచి దేవి యిట్లనియె దేవా ! కమలాక్షునివంటివిద్వాంసు డెచ్చటను లేడుగదా ! వానివిద్యావిశేషములకు దామేల యానందింపకుండ నున్నారు? అని యడిగినదేవితో దేవదేవు డిట్లనియె దేవీ ! నిజముగా గమలాక్షునివంటి విద్వాంసుడు లేనేలేడు కాని వాడు చిరకాల ముండెడివాడు మాత్రము కాడు. అందుచే నేను సంతసింపనైతిని. ముందువాడు తనయిప్పటి శరీరమును విడిచి పుష్పదంతుడనుపేరున బుట్టగలడు. అని చెప్పినపెనిమిట మాటలు విని యాయనమాటలు ననుసరించి భక్తపోషణతత్పరురాలయిన యాదేవి యపుడే కమలాక్షనిముఖము చూచి "కమలాక్షా ! నీవిటుపయిన శంకరుని యాజ్ఞవలన బుష్పదంతు డవగుము పొమ్ము" అని యనగానే యతడు వ్యాకులపడి శివునికి నమస్కరించి తనయింటికి బోయెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున విద్యాధర ప్రశంస యున్నది. పందొమ్మిదవ యధ్యాయము.

ఇరువదియవ యధ్యాయము

సూతు - మునిపుంగవులారా ! తరువాతను యుగంధరదేశమున హేమవతి యనుపట్టణములో శ్రుతికీర్తి యనురాజర్షికి సోమవతి యను భార్యయం దీకమలాక్షుడే పుష్పదంతుడై పుట్టెను. సింధురాజగువిరూపాక్షునియింట నాకమలాక్షునిభార్య యగుదేవదత్త. యనునామెపుట్టినది. ఆపిల్ల పుట్టగానే యాకాశవాణి యాబాలకు దేవదత్తయని పేరుపెట్టుడన్నది. తలిదండ్రులట్లేచేసిరి. మఱికొన్నాళ్ళు గడచిన తరువాత శ్రుతకీర్తి తనకుమారు డగుపుష్పదంతునకు విరూపాక్షునికూతు రగుదేవదత్తను వివాహము చేసెను. ఆరాజు తనరాజ్యభారమంతయు గుమారుని కప్పగించి భార్యతో గూడ దపోవనమునకు బోయెను. తండ్రి సింహాసమున కధికారయ్యై తండ్రిని మఱపించి యాపుష్పదంతుడు రాజ్యమేలుచుండెను అతడు ప్రతిదినమును బదునొకండువేలదివ్యలింగములకు బూజచేయక జలమయినను ద్రాగువాడుగాడు. శివభక్తివశంవదుడగుటచే రుద్రాక్షులచే గిరీటము హారములు కంకణములు చేయించుకొని ధరియించుచు భస్మాలంకృత శరీరుడైయత డెప్పుడును గనుపించుచుండెడివాడు. మఱియు నతడెల్లవేళలయందును శివునినే ధ్యానించుచు శివునికథలు వినుచు నానందమును బొందుచుండును. తరువాత నాపుష్పదంతు డనేకవిధములయిన లతాపాదపములచే విరాజిల్లు నొకదివ్యమయిన యుద్యానవన మును వేయించి తాను దగ్గఱనేయుండి యన్నింటికిని నీరు పోయించుచు నాయాకాలములయందు దోహదము చేయించుచు నుండెను. అవియు నతని మనస్సు సంతుష్టిని బొందులాగున బూవులతో నిండారి యుండెడివి. అతడాపూలు తానేకోసి ప్రతిదినమును శివుని బూజించుచుండెను. తరువాత నొకనాడు శివరాత్రి వచ్చినది. నా డతడు శివాలయము నకు బోయి భక్తిపూర్వకముగా బూజించి ముప్పదిరెండు శ్లోకములచే శివుని స్తుతి చేసెను. స్తోత్రప్రియుడైన శివు డాతని స్తుతికి సంతోషించి దివ్యతేజోమయుడై యతనికి బ్రత్యక్ష మయి పుష్పదంతుని జూచి యిష్ట మయినవరము కోరుకొమ్మనెను. అనగానే యతడు సంతోషించి శివునికి సాష్టాంగదండప్రణామము లాచరించి "దేవా ! నాయందు గరుణగలవాడు వైతివేని నాకు బ్రతిదినమును మీపుణ్యదంపతులు దరిసెన మిచ్చు చుండగోరితిని. భక్తునియందు దయ యుంచి యీమాత్రపువర మిమ్ము" అని యీ ప్రకారముగా బుష్పదంతుడు యాచించినతోడనే "యట్లే యిచ్చితిని వర" మని యాపుష్పదంతుని సంతోషపెట్టి యచ్చటనే యంతర్ధానమాయెను. తరువాత నాపుష్పదంతుడు

శివునిదయవలన భార్యతో గూడు గైలాసమునకు బోయి ప్రతిదినమును దేవదర్శనము చేసికొని యానందించుచుండెను. పుష్పదంతుదును, అతనిభార్యయు మనోహరముగా బూలహారములు, బంతులు, మొదలగునవి గట్టి యాపుణ్యదంపతులకు సమర్పించుచుండిరి. ఇట్లుండగా నొకనాడు పుష్పదంతుడు పువ్వులు పట్టుకొని పార్వతీ పరమేశ్వరులకు సమర్పించుటకై కైలాసముకు వెళ్లునప్పటికి వారు రహస్యమందున్నారని తెలిసినది. అతడా పుష్పముల సమర్పింపవలయు నన్నభక్తిభావముతో ద్వారమందు వేచియుండెను. అపుడు రహస్యస్థలమందున్న పార్వతిని జూచి చెలికత్తెలు రహస్యమయిన కథచెప్పి సంతోషపెట్టవలయునని కోరిరి. నిర్జనప్రదేశము గదా యని "దేవా ! తాము సర్వజ్ఞులరు. కావున నిదివఱకెవ్వరును విననికథ చెప్పినచో సంతోషించెద" నని దేవి పెనిమిటి నడిగినది. భార్యయందలిప్రేమాతిశయముచేత నతడట్టి కథనే చెప్పెను. ద్వారమందున్న పుష్పదంతుడు గూడ నాకథ విని తరువాతను సమయము చూచుకొని లోనికి వెళ్ళి దేవసన్నిధానమునందు బుష్పములు సమర్పించి మరలి తనపట్టణమునకు వచ్చెను. అతడింటికి వచ్చునప్పటికి జాలరాత్రి మించిపోయినది. ఈలోగా నాతని భార్య దేవదత్త భర్తరాకకై యెదురు చూచిచూచి తుదకు వేసారి యెచ్చటికో జారవృత్తికై పోయి యుండునని నిశ్చయించుకొని నిదురపోయినది. ఇంతట బెనిమిటి యింటికి వచ్చినసంగతి తెలిసికొని యామెకోప పూర్ణురాలై యేపాపము నెఱుగని యాతపస్విని జారుడ వైపోతినని యనేకవిధములుగా నిందించినది. అట్లు నిందించుచున్న భార్యను జూచి యారా జిట్లనియె సుందరీ ! యేమీనన్నట్లనుచున్నావు ? నే నట్టివాడ ననియె భావించుచున్నావా ! ఊరక నన్ను నిందింపక శాంతచిత్తురాలవై నేను జెప్పుమాటలాలకింపుము. నేను శివభగవానుల వారికి బుష్పములు సమర్పించుటకై వెళ్ళునప్పటికి సమయము కాకపోయినది. అంతట నేను ద్వారమునందు గాచుకొనియుంటిని. అపుడు దేవి పరమేశ్వరుని రహస్యమైనకథ చెప్పుమని కోరినది. ఆమె కోరినరీతిగా మహేశ్వరుడు రహస్యమైన కథచెప్పెను. నేనును ద్వారముదగ్గఱ నుండి యాకథ విని తరువాతను బుష్పములు సమర్పించి యిప్పటి కింటికి వచ్చితిని. అందుచేత నింతాలస్య మయినది. అని పెనిమిటి చెప్పగానే యామె నిస్సంశయురాలై యాకథయెట్టిదో నాకు జెప్పు మని కోరినది. ఆమెకోరగానే యతడు బార్యయందలి మోహముచే దాచదగిన యాకథ యంతయు నామెకు వినిపించెను. మఱునాడా దేవదత్తయు బుష్పదంతుడును బార్వతీపరమేశ్వరులను సేవించుటకై కైలాసమునకు బోయిరి. అదివఱకు జెలికత్తెలడిగియున్నవారగుటచే దేవి

యపూర్వమైనకథ చెప్పుచుండగా దేవదత్త యిట్లనియె. సఖులారా ! ఆతరువాతి కథ నేను జెప్పెదను మీరు వినుడు అని యనగానే పార్వతి దేవదత్తనుజూచి నీవే చెప్పుము వినియెదరన్నది. దేవియాజ్ఞ కాగానే రాత్రి శివుడు తనకు జెప్పినరహస్యమైనకథనే దేవదత్త జెప్పినది ఆకథ విని కోపించి వెంటనే పార్వతి శివునియొద్దకు బోయి "దేవా ! బాగుబాగు తాము సర్వజ్ఞులరయ్యు నన్నృతము చెప్పితిరిగదా ! రాత్రి తాము నాకు జెప్పినకథనే యిపుడు దేవదత్త చెలికత్తెలకు జెప్పినది. ఆహాహా ! తమవంటివారే నావంటిదానితో నిట్లు బొంకినపుడిక నేమనగలను" అని పార్వతి యనగానే శివుడు విస్మయక్రోధ మూర్ఛితుడై దేవదత్తను రావించి "దేవదత్తా! నీకాకథ యెవ్వరు చెప్పిరి ?" అని యడుగగా "దేవా ! నాపెనిమిటి నాకాకథ చెప్పెను" అన్నది. ఆమె చెప్పినమాట విని శివుడు పుష్పదంతునిచూచి "ఓయీ ! నీకాకథ యెట్లు తెలిసినదియు నిజముగా జెప్పుము" అని యడుగగా బుష్పదంతుడు వడవడ వనుకుచు హీనస్వరముగా నిట్లనియె. స్వామీ ! నా కేమియు దెలియదు. నిన్నటి రాత్రి దేవరకు బుష్పములు సమర్పించుటకై వచ్చి ద్వారమునందు వేచియుండి తమరు పరమేశ్వరికి జెప్పుచుండగా విని యది దేవదత్తకు జెప్పితిని. నేనే యపరాధిని. నన్ను దండింపవలయును. నాభార్య నిరపరాదురాలు కావున దానిని దండింపదగదు. అని యతడు చెప్పుచుండగా శంకరుడు కోపపూర్ణు డయి పుష్పదంతుని వానిభార్యను శపించెను. మఱియు నతనిని జూచి ఓరీ మూర్ఖా ! నీచా ! కామమోహితా ! రహస్యములయినమామాటలు వింటివిగా ! వినుటయే కాక తెలివిమాలి యని నీభార్యకుగూడ జెప్పెదవుగా ! నీకంత మోహమటరా. ఉండుండుము నీకు దగినశాస్తి చేయించెదను. నీవిటుపయిని బేతాళుడవై ఘోరరూపముతో నుండుము. సఖులకును బార్వతిని నవమానము చేసినవీభార్య దేవదత్త దుర్మార్గురాలు హరిణి యగుగాక అని యిట్లు ఘోరముగ శపించుచున్న శివునిచూచి పుష్పదంతుడు భయపడి దుఃఖించుచు భార్యతోగూడ నిట్లనిప్రార్థించెను. దేవదేవా ! దయాసముద్రా భక్తవత్సలా ! మమ్మును రక్షింపుము. మాశాపమున కంతము సెలవిమ్ము. దుస్తరమగు నీశాపసముద్రమును దరించు నుపాయ మానతిమ్ము. అని యిట్లనేక విధములుగా గొనియాడిన పుష్పదంతుని జూచి శివు డిట్లనియె. ఓరీ ! నీభార్య పగలు లేడిగాను రాత్రి యక్షస్త్రీగాను నగును. మీయిద్దఱకు నన్యోన్య దర్శన మయినతోడనే దుస్తరమగు నాశాపమునుండి ముక్తులగుదురు. ఇటుపయిన కలియుగమందు విక్రమాదిత్యుడనుపేరుగల రాజు పుట్టగలడు. అతడు దయాసముద్రుడు సత్యసంధుడు తేజశ్శాలి పటువిక్రముడు మహాబాహువు నైయుండును. అతనిచే

నిపుడు చెప్పిన దంతయు జరుగును. అని వానితో జెప్పి వెంటనే యంతఃపురములోనికి బోయెను. తత్క్షణమే పుష్పదంతుడు రాజవేషమునం తయు విడిచి ముసలము, ముద్గరము, భిండివాలము, పరశ్వథము, పట్టసము తోమరము, ఖడ్గము, గద, కుంతము, లగుడము, నారితో గూడిన ధనస్సు, బాణములు, భయంకరమైనఛురిక, చంద్రహాసము, శత్రువులను జీల్చుతోమరము మొదలగు నాయుధములు ధరించి యాథర్వ ణమంత్రములకు గురువై సమస్తరాజులకును శిక్ష చెప్పుచు శత్రువులకు భయంకరుడై చతుష్షష్టికలాపూర్ణుడును, సర్వకర్మముల నెఱిగినవాడును, భూతప్రేత పిశాచశాకినీ ఢాకిన్యాదులకు యజమానుడును, వక్రతుండుడును, వక్రపాదుడును, పొట్టిచేతుల వాడును, కృశించిన యుదరముగల వాడును, దీక్ష్ణములయిన దంతములు గలవాడును, కొంగకంఠమువంటి కంఠము గలిగి ముండ్లవంటి గడ్డము మీసము గలవాడై వెడల్పయిన నోరుగలవాడును, ఘోరమైన రూపము గలవాడును, భయంకరుడును దీర్ఘనాసుడును, దీర్ఘకర్ణుడును, భయంకరమైన కన్నులుగలవాడును, పెద్దనుదురు గలవాడును, భయంకరమయిన లక్షణములు గలవాడును, భూతముల కధిపతియు, జటలుగలవాడును, రాజు లందఱకును ఖడ్గయుద్ధము నుపదేశించువాడును, ధనుర్వేదము నుపదేశించు వాడును, నగుబేతాళుడుగా బరిణమించి యుజ్జయినీపట్టణమునకు దూర్పుగా నుండు మహారణ్యములో బ్రవేశించి యతిభయంకరమును శతయోజన విస్తీర్ణమును నగు నాయడవిలోని యొకమఱ్ఱిచెట్టును జూచి యాచెట్టుపైని దూర్పువై పున నున్నకొమ్మ నాశ్రయించి యుండెను. అతనిభార్యయగు దేవదత్త పుష్పిణి యని ప్రసిద్ధి నొందినది. ఆమె పార్వతీపరమేశ్వరుల శాపమువలన లేడిరూపమును బొంది యామహారణ్యమునందే లేడిమందలతో గలసియిట్లు నటు బరువు లెత్తుచు నాలుగు దిక్కులను జూచుచు మాటిమాటికిని దన నీడను జూచుకొనుచు తల పైకెత్తి భయం పడుచు బగటిపూటను దర్భాంకురములను లేతగడ్డి దినుచు నెండమావులను జూచి జల మనుభ్రాంతిచే మాటిమాటికిని బరువు లెత్తుచుండెను. మఱియు నాలేడి రాత్రిసమయమున యక్షిణియయి షడ్జాదిస్వరయుక్తముగను, తంత్రీలయన మన్వితముగను వినువారి కానందముగలుగునట్లుగ శివునిస్తుతితో సంబంధించిన గీతములు పాడుచునుండెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున బుష్పదంతో పాఖ్యానము బేతాళశాపప్రదానము నన్నది యిరువదియవ యధ్యాయము.

ఇరువదియొకటవ యధ్యాయము

సూతు - మునీశ్వరులారా ! తరువాతను భూలోకమున గలియుగము మిక్కిలి దారుణముగా వృద్ధిని బొందుచుండుగా వేదనారాయణపురమునందు విష్ణుశర్మ యను బ్రాహ్మణు డొకడుండెడివాడు. అతనికి మిక్కిలిని దేజశ్శాలు రగు నలుగురుకొడుకులు పుట్టిరి. యజ్ఞనారాయణుడు, వేదనారాయణుడు, వీరనారాయణుడు, చంద్రశర్మ యని వారిపేళ్ళు నాల్గవవాడుదక్క దక్కినముగ్గురును సర్వశాస్త్రవిశారదులయిరి. అందఱును నీతిశాస్త్రపారంగతులు. వ్యవహారజ్ఞానము గలదు. ఆలోచన చెప్పుటయందు మహాబుద్ధిమంతులును గుణవంతులు నయియుండిరి. వారందఱును దమతమపాండిత్యమును జూపించి సభలలో బహుమానింపబడుచుండిరి. బుద్ధిహీనుడగుచంద్రశర్మ యనువానిని శుశ్రూషకై యుపయోగించుచుండిరి. ఇట్లు కొంతకాలము జరుగగా నతడు వారికి సేవ చేయుటకై విరక్తి నంది యిట్లు చింతింపదొడగెను. నేను విద్యాహీనుడ నగుటచే గదా నాయన్నలు నాచేత సేవ చేయించుకొనుచున్నారు. నా కెట్లు విద్యలు వచ్చును ? అని యిట్లనేకవిధములుగా జింతించి దైవప్రేరణవలన దనమనస్సులోనియుద్దేశ మెవ్వరికిని జెప్పకయే యర్ధరాత్రిసమయమున లేచి యిల్లు విడిచి మార్గముంబట్టి పోవుచుండెను. తెల్లవాఱునప్పటికి జాలదూరము పోయెను. నాటిసాయంకాలము దాక నడిచి యొకయగ్రహారము చేరుకొనెను. అచ్చట నున్ననదిలో స్నానము చేసి సాయంసంధ్యావందన మాచరించి వేదమాత యగుగాయత్రిని జపము చేసికొను చుండెను. అపుడానదియొద్దున నున్న రావిచెట్టుపైని జిరకాలమునుండి యున్న బ్రహ్మరక్ష స్సాబ్రహ్మచారినిజూచిసంతోషించి బ్రాహ్మణవేషముతో వచ్చి చంద్రశర్మతో నిట్లనియె. నాయనా ! నీ వెవరు ? ఎచ్చటినుండి వచ్చుచున్నావు ? ఎచ్చటికి బోయెదవు ? చెప్పుము. అని యడిగిన యా బ్రాహ్మణుని నిజముగా బ్రాహ్మణుడే యనుకొని చంద్రశర్మ యిట్లనియె. అయ్యా ! వేదనారాయణపురము విష్ణుశర్మ యనెడి బ్రాహ్మణుడు గలడు. ఆయనకు నలుగురు కొడుకులు గలరు. నేనే చిన్నవాడను, నే నేమహాగురువు నయిన నాశ్రయించి యాయనదయను సంపాదించుకొని చదువుకొంద మనుబుద్ధితో బయలుదేఱి యిట్లు పోవుచున్నాను. ఇది నాసంగతి యని యాబ్రహ్మ చారి చెప్పగా విని యా బ్రహ్మరక్షస్సుబ్రాహ్మణు డిట్లనియె నాయనా ! నేను నీకు వేదవేదాంగాదులగు విద్యలను జెప్పగలను. నీ కిష్టమయినచో నాయొద్ద జదువుకొనుము. అను నతనిమాటలు విని చంద్రశర్మ

సంతోషించి మంచిదే యని యంగీకరించెను. వాని సంకల్పమును విని యప్పు డాబ్రహ్మరక్ష స్సిట్లనియె. నాయనా ! నారూపమును జూడుము భయపడకుము. అనిచెప్పి తనమునుపటిరూపమును ధరించి యగపడగానే యాచంద్రశర్మ చటుక్కున కన్నులు మూసికొని మిక్కిలి భయ పడుచుండెను. తత్క్షణమే యా బ్రహ్మరక్షస్సుమునుపటి బ్రాహ్మణరూపముతో వచ్చి యతని భయము దీఱిచెను. తరువాత నాశర్మను రావిచెట్టుమీదికి దీసికొని పోయి రాత్రింబవళ్ళు నిద్రాహారములు లేకుండ విద్యలు చెప్పుచు నాఱుమాసములు గడచిన తరువాత సుందరాకారుడ వగు నో చంద్రశర్మా ! నేను నీకన్నివిద్యలను నేర్పితిని. నీవలన నాకు శాపమోక్ష మయినట్టే. నీ విపుడే బయలుదేఱి మీయూరికి బొమ్ము. నాయనా ! నీదయవలన నేనును గాశికి బోవుచున్నాను. నీ కిటుపయిని వలసినంత మేలు గలుగుచుండును. నీకు గుణవంతులు నలుగురుకొడుకులు పుట్టగలరు. వారు సామ్రాజ్యము ననుభవించుచు భూమిని పాలింతురు. అని యి ట్లాశీర్వదించి వెళ్ళుట కుద్యుక్తుడైన యా బ్రహ్మరక్షస్సును జూచి చంద్రశర్మ యిట్లనియె. గురువుగారూ ! తాము వేదవేదాంగపారగులు, సర్వశాస్త్రముల తత్త్వము తమకు దెలిసినవిషయమే. ఇట్టితమకు బ్రహ్మరాక్షసత్వము గలుగుట కేమికారణము ? అది యిపుడు పోవుట కేమిహేతువున్నది ? దీనిని వివరించి చెప్పవలయునని కోరుచున్నాడను. అని యడుగగా బ్రహ్మరక్ష స్సిట్లనియె. నాయనా ! నాశాపమోక్షముల సంగతి వినుము. పూర్వము కృష్ణాతీరమున సరస్వతీపురమను నొక యగ్రహారము గలదు. ఆయూరి లోనివా రందఱును బండితులే. నే నా యూరివాడను. వేదశాస్త్రాదివిద్యలన్నియు నేర్చుకొంటిని. నాదగ్గఱ కొకవిద్యార్థివచ్చి నాకు నమస్కరించి "అయ్యా ! నాకు విద్యా దానము చేసి రక్షింపుడు" అని యడుగగా నేను గర్వముతో "ఈలోకములో నే నెవ్వరికిని వేదాదివిద్యలు నేర్పదలచుకో లేదు గనుక శీఘ్రముగా నాదగ్గఱనుండి పొమ్ము" అంటిని. అపు డాబ్రాహ్మణుడు కోపించి "నేను మఱియొకగురువుదగ్గఱకు బోయి సమస్తవిద్యలను నేర్చికొందుము. బ్రాహ్మణాధమా ! నీవిద్యలన్నియు నిష్ఫలములయి నీ యొద్దనే యుండుగాక" అని నన్ను బ్రహ్మరక్షస్సుగా శపించెను. తరువాతను నేను భయముచే గడగడ వడకుచు "బ్రాహ్మణా ! నాయందు నీవనుగ్రహించి దయ తలచుము. శాపాంతమును సెలవిమ్ము" అని యతనిని యాచించితిని. నాప్రార్థన విని "కొంతకాలము గడచినవెనుక జంద్రశర్మయను బ్రాహ్మణుడు దేశాంతరమునందుండి విద్యలు నేర్చుకొనుటకై రాగలడు. నీకతనితో గృష్ణాతీరమున సమావేశమగును. అతనికి నీవిద్యలన్నియు జెప్పుము. తరువాతను

గంగాస్నానము చేయుము. శాపాంతమగును" అని చెప్పి యావిద్యార్థి తనయిష్టము వచ్చినచోటికి బోయెను. అదిమొదలు నేను బ్రహ్మరక్షస్సునై యీచెట్టు మీదనున్నాను. నీరాకకై యెన్నాళ్ళనుండియో యెదురు చూచుచుండగా నిప్పటికి దైవవశమున నీవు వచ్చితివి. శిష్యుడనగు నీ కన్నివిద్యలను జెప్పితిని. నాయనా ! ఇకనేను గంగాస్నానము చేయుటకు బోవుచున్నాను. నీకు సదా భద్రమగుగాక. యెక్కడికి బోయినను నీకు జయమే యగుగాక. సదా సుఖవంతుడవైయుండుము. అని యాశీర్వదించి బ్రహ్మరక్ష స్సాచెట్టు మీదినుండి యాబ్రాహ్మణకుమారుని క్రిందికి దింపి యతనితో జెప్పి పాపహారిణియగు గంగలో మునుగుటకై పోయెను. తరువాతను చంద్రశర్మయు విద్యాపారంగతుడై సంతోషించుచు దనయూరు పోవనెంచి మఱియొకత్రోవను బయలుదేఱెను. తిన్నగా నుజ్జయినీ పట్టణము ప్రవేశించి వేశ్యామందిరము చూచి నిద్రాహారవివర్జితుడును శ్రమాకులుడును నయి యున్నకతమున గృత్యాకృత్యవివేచన పోయి యది బ్రాహ్మణగృహమే యనుబుద్ధిచే నాయింటి యరుగుమీదను గుడ్డ పఱచుకొని యొడ లెఱుంగు కుండ నిదుర పోయెను. సౌందర్యవతి యనుపేరుగల యాయింటిసాని గుంట యతనిని జూచి "యితడు నాకుభర్తయగు గాక" యని మనసులో నిశ్చయించుకొని తల్లి దగ్గఱ కేగి "అమ్మా ! నీయల్లుని జూడుము. నామనోహరుడు రెండవ మన్మథునివలె నాయరుగుమీదను నిద్రపోవుచున్నాడు" అన్నది. తల్లి కూతుమాట విని వేగముగా వచ్చి నగలు నాణెములు లేని యాబ్రాహ్మణుని జూచి "వీడు శుద్ధదరిద్రుడు" అని తలచి కోపపరీతచిత్తయై కూతుం జూచి "అమ్మా ! నీకు వీడు తగినవాడుకాడు. వీడు శుద్ధదరిద్రుడు దరిద్రుని వరించుట కంటె సానిబ్రదుకున కవమాన మనగా నుండునా ? ఎట్టివాడు గాని మనకు ధనవంతుడే మన్మథుడు. తక్కినవానితో మనకెంత మాత్రమును పనిలేదు. ధనమును మాత్రమే మనము చూడవలయును. కావున లేనిపోని యభిలాషలు మాని ధనముగల మఱొక లక్ష్మీపుత్రుని వరింపుము" అని తల్లి చెప్పినది. కాని యాకన్య వినియు విననెట్టె చేసి "నాకితడే భర్త" అని మరల దల్లితోనన్నది. ఎట్టకేలను కూతు నభిప్రాయము వేశ్యమాతయు నంగీకరించినది. ఆఱునెలలనుండి నిద్రాహారము లెఱుంగనికతమున నావటువు కాలుసేతులు గదల్పకుండనే యా లోపలియరుగుమీదను బరుండి నిద్రపోవుచుండెను. రాత్రియు బవలును నట్లే పడియున్న యాబ్రాహ్మణుని జూచి యావేశ్య వేగముగా బోయి యావృత్తాంత మంతయు "రాజుతో విన్నవించినది. ధ్వజకీర్తియను రా జావేశ్య చెప్పినమాటలు విని మిక్కిలి యాశ్చర్యమును బొంది వైద్యులను బిలిపించి

"ఓవైద్యులారా ! మీరు వేగముగా బోయి వేశ్యామందిరమున నిదురించుచున్న బ్రాహ్మణుని జూచి లెస్సగా నతనినాడిని బరీక్షించి యట్టి గాఢనిద్రకు గారణమేమయి యుండునో శాస్త్రమును బట్టి తెలిసికొని వేగముగా వచ్చి మాతో విన్నవింపుడు. అని రాజాజ్ఞాపించినతోడనే రాజవైద్యులు తిన్నగా సానియింటికి బోయి యాబ్రాహ్మణుని జూచి యతనిధాతువులను బరీక్షించి యతనివృత్తాంత మంతయు నిట్లు విన్నపించిరి. రాజోత్తమా ! ఆబ్రాహ్మణుడు నిద్రాహారములు లేకుండ నెందులకో కాని యాఱు మాసములనుండి దీక్ష పట్టినట్టు కనుపట్టుచున్నది. కారణముమాత్రము దెలిసినది గాదు. కాని యతనికి జికిత్స చేయవలయును. అతని దేహమున కన్నపులేపన చేయవలయును. అదియు మెత్తగా నూఱి పెరుగుతో గలిపి పట్టించవలయును. అని రాజుగారితో విన్నపించి వైద్యులు తమయిండ్లకు బోయిరి. తరువాత నామహారాజు వైద్యులు చెప్పిన చికిత్సను బ్రాహ్మణులచే జేయించెను. ఇట్లాఱునెలలు చేసినతరువాత నావటువు నిద్ర విడిచి "నే నెచ్చటను నిద్రపోతిని ? ఈ యిల్లెవరిది ? ఈ సుందరాంగి యగు సుందరియెవరు ?" అని మాటిమాటికిని మనసులో యోజింపమొదలిడెను. తరువాతను దన దోవనుబట్టి పోవుట కుద్యుక్తుడు కాగా నావేశ్యకన్యక యడ్డుకొని యతని వస్త్రాంచలము పట్టు కొని యిట్లనియె. ప్రియా ! నన్ను విడిచి నీవెచ్చటికి బోయెదవు ? నే నాఱుమాసము లనుండి యెప్పుడు నిదురనుండి లేతువోయని యెదురు చూచుచుంటిని. నీకు సేవచేయ చుంటిని. నీవే నాభర్త వని మనస్సులో నిశ్చయించుకొంటిని. మాయమ్మతో ఘోరముగా జగడమాడితిని. కావున నీవు నన్ను బరిగ్రహింపుము. అట్లే నీవు చేయనిచో నియెదుట నే ప్రాణములు విడుచుటకు సిద్ధముగానున్నాను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున జంద్రశర్మోపాఖ్యాన మన్నది యిరువదియొకటవ యధ్యాయము.

ఇరువది రెండవ యధ్యాయము

సూతు - ఇట్లు పట్టుదల వహించి చెప్పుచున్న యావేశ్యకన్యక మాటలు విని బ్రాహ్మణు డిట్లనియె.

సుందరీ ! బ్రాహ్మణుడనగు నే నెచ్చట ? శూద్రస్త్రీ వగు నీ వెచ్చట ? నీకును నాకును బాణిగ్రహణమెట్లు సంఘటించును ? అని యెన్నివిధముల నిరాశా వచనములు చెప్పినను వేశ్యకన్య యాబ్రాహ్మణుని విడువదాయెను. అచ్చట నున్నవా రాతనివృత్తాంత మంతయు రాజుతో విన్నపించిరి. అదివిని రాజు దయగలవాడై

వారినిద్దఱిని బిలిపించి సమాధానపఱుచుటకు శక్తుడుగాక యాలోచించి బ్రాహ్మణులను బిలిపించి యావృత్తాంతమంతయుజెప్పెను. మఱియు నోబ్రాహ్మణోత్తములారా ! మీరే సమాధానపఱుచుడనెను. ఆ బ్రాహ్మణులను రాజు చెప్పినమాటలు విని శాస్త్రములను బర్యాలోచించి స్మృతిచోదితమయిన విధియున్నదని రాజుతో విన్నపించిరి. బ్రాహ్మణునకుముందుగా బ్రాహ్మణకన్యను, తరువాతను క్షత్రియకన్యను పిదప వైశ్యకన్యను, ఆవల శూద్రకన్యను వివాహము చేయవచ్చుననిరి. ఇట్లు బ్రాహ్మణులు చెప్పగానే రాజు చాలసంతోషించెను. చంద్రశర్మయు సంతోషించెను. తరువాతను రాజు మంచిముహూర్తమున బురోహితునికన్యను వివాహముచేయించి తరువాతను, దనకు మారితను జంద్రశర్మకిచ్చెను. తరువాతను గోమటికన్నెను పిదప శూద్రకన్యను బెండ్లిచేయించెను. రాజు తనయల్లుడగు చంద్రశర్మకు జతురంగ బలసహితముగా దన యర్ధరాజ్యమునిచ్చి సుఖముగానుండెను. చంద్రశర్మయు నలుగురుభార్యలతోడను సంతోషించుచు సుఖముగనుండెను. ఇట్లా చంద్రశర్మ యుజ్జయినీపట్టణముననే కొన్నాళ్లుండగా నింతట నాపట్టణపురాజయిన ధ్వజకీర్తి స్వర్గస్థుడాయెను. తరువాతను మంత్రులు పర్యాలోచించి వెంటనే చంద్రశర్మనే రాజుగా జేసిరి. పిదప జంద్రశర్మకు బ్రాహ్మణస్త్రీయందు వరరుచియు, క్షత్రియస్త్రీయందు రాజాధిరాజగు విక్రమార్కుడును వైశ్యస్త్రీయందు భట్టియు శూద్రస్త్రీయందు భర్తృహరియు ననువారుపుట్టిరి. ఆనలుగురును మిక్కిలి బుద్ధిమంతులు. సర్వవిద్యానిపుణులును నీతి శాస్త్రవిశారదులును నయియొప్పుచుండిరి. వారిలో విక్రమార్కుడు మహాబలుడు. సాహసాదిగుణవంతుడు, మహాదాతయని యెఱింగి చంద్రశర్మ యితడు ధ్వజకీర్తి మహారాజనకు దౌహిత్రుడని యాలోచించి యథావిధిగా నతని నారాజ్యమునకు బట్టాభిషిక్తునిజేసి సర్వదేశములకును రాజునుగా జేసెను. వైశ్యస్త్రీయందు బుట్టిన భట్టి నావిక్రమార్కునకు మంత్రినిగా నప్పగించెను. తరువాతను విక్రమార్కుడు చిరకాలము కాళినిగూర్చి తపస్సు చేయగా నామె ప్రత్యక్షమై "రాజా ! నీతపమునకు మెచ్చితిని. నీవు సహస్రసంవత్సరములు జీవించి రాజ్యమేలుకొనుము. నీకు శాలివాహ నుడు దక్క దక్కినవారెవ్వరును శత్రువులులేరు అని యతనికి వరమిచ్చి యచ్చటనే యంతర్ధానమయినది. పిదప విక్రమార్కు డింటికి వచ్చి తనకు గాళికాదేవి యిచ్చిన వరప్రదానమును మంత్రియగు భట్టికి దెలుపగా నాతడు సంతోషించి రాజా ! నేనును నీకట్టివరమునే యిచ్చెదను గైకొమ్మనెను. ఇట్లుచెప్పిన భట్టిమాటలు నాక్షేపించి "ఓయీ ! నీవు నాకెట్లు వరమీయగలవు" అనగానె భట్టి "సహస్రాయువు గలవాడవగు" మనెను. అది

యెట్లనగా నీ వాఱునెలలవఱకును రాజ్యమేలుచుండుము. మఱి యాఱునెలలు భూసంచారము చేయుచుండుము. ఇట్లు చేయుచుంటివేని రెండువేల సంవత్సరములవఱకును జీవింపవచ్చును. అని చెప్పిన భట్టిమాటలకెంతయు సంతసించి యతనియుక్తి వైచిత్ర్యమునకు మెచ్చుకొని "నీవు మంత్రివైనందులకు యుక్తి యుక్తముగా జెప్పితివి. నీవు యుత్తమమంత్రివి. నీ విటుపయినేమిచెప్పినను జేయుచుందును." అని యతని ననేకవిధములుగ సమ్మానించి విక్రమార్కుడు రాజ్యమేలుచుండెను. సూర్యునివలె దేజశ్శాలియు సాహసియు, ధైర్యవంతుడును, ఇంద్రియ నిగ్రహముగలవాడును, విక్రమాక్రాంతలోకుడును, చతుష్షష్టి కళావిశారదుడును, శత్రువనదవానలుండును, నిర్భయుండును, మహాశూరుడును, వీరనిషేవితుడును, సత్య సంధుడును, ఉజ్జయినీనాయకుడును, రాజరాజును, చక్రవర్తి లక్షణవిరాజమానుడునునగు విక్రమార్కమహారాజు రాజులు, మిత్రులు మంత్రులు కవీశ్వరులు, నందిమాగధులు, విద్వాంసులు, గాయకులు, చంద్రముఖులగు స్త్రీలు, భటులు మొదలగువారితో గూడి శ్రేష్ఠములయిన ముత్యములతోడను మాణిక్యములతోడను బ్రకాశించుచు దేవేంద్రుని సభవలె విరాజిల్లుచున్నసభలో బ్రవేశించి తనకు దేవేంద్రుడిచ్చిన యనన్యదుర్లభ మగునవరత్న ఖచితమయిన దివ్యసింహాసనముపై గూర్చుండి వందిమాగధులు స్తుతి చేయుచుండగా రాజకార్యములను నిశ్చలముగ వినుచు భట్టితో మాటలాడుచునుండుగా నపుడు జటాజూట విరాజమానుడును, భస్మోద్ధూళిత దేహుడును, స్ఫటికమాలావిరాజిత హస్తుడును గంటగట్టిన దండముగలవాడును, పులితోలుగట్టుకొన్నవాడును, పాదములయందు విరాజమానములగు దంతపాదుకలు గలవాడును, మొలను చిఱుగంటలు గలవాడును, రుద్రాక్షమాలలు ధరించినవాడును, కాలపూరుష దను పేరుగలవాడునునగు నొక సిద్ధశ్రేష్ఠు డయిన యోగివచ్చి రాజును జూచి "విభూ ! దీర్ఘాయుష్మంతుడవును విజయముగలవాడవును నగుము" అని యాశీర్వదించి సంతుష్టాంతరగుండై యొక దానిమ్మపండు రాజున కిచ్చెను. మఱియు నాయోగి ప్రతిదినమును రాజు సింహాసనము నలంకరించి యుండగానట్లే యుత్తమ మయిన ఫలము దెచ్చి యిచ్చుచుండెను. అతడు దినమును దెచ్చియిచ్చిన ఫలములను కోశాధ్యక్షునిచేతి కిచ్చి వీనిని భద్రముగా గాపాడు చుండుమని రాజు చెప్పగా వాడునునట్లే చేయుచుండెను. మరల నొకనాడు సిద్ధయోగి వచ్చి రాజు సింహాసన మలంకరించి యుండుగా నట్లే దానిమ్మపండు దెచ్చియిచ్చెను. అపుడెచ్చటి నుండియో యొకక్రోతి యదృచ్ఛగా వచ్చినది. విక్రమార్కు డాకోతిని జూచి కుతూహ

లాక్రాంతచిత్తుడయి యాపండాక్రోతి కీయగా నది యపుడే చీల్చినది. ఆపండులో నుండి వెలలేని ముత్యములు రత్నములు క్రిందనుపడినవి. అవి చూచి విక్రమార్కు డాశ్చర్యపడి వెంటనే కోశాధ్యక్షుని బిలిపించి నేనిదివఱ కిచ్చిన దాడిమఫలము లన్నియు దెమ్మనెను. వెంటనే వాడును బోయి తెచ్చి రాజునెదుట సమర్పింపగా రాజు వానిని చీల్చెను. మితిలేని రత్నములు ముత్యములు చూచి రాజు పరమానంద భరితుడయి యోగితో నిట్లనియె యోగీంద్రా ! నీ కీఫలము లెచ్చట సంప్రాప్తించినవి? నందన వనమునుండి తెచ్చితివా ? లేక చైత్రరథమును కుబేరుని యుద్యానము నుండి తెచ్చు చుంటివా ? అది గాక యిటువంటి యత్యద్భుతము లయిన ఫలములను ప్రతిదిన మును దేచ్చి మాకేల యిచ్చుచుంటివి ? నీపేరేమి ? నావలన నీకు గావలసిన ప్రయోజన మేమున్నది ? నీవాసస్థల మెక్కడ ? నావలన నీ కేదియైన గావలసియున్నచో సిద్ధమయినదనియే నమ్ముకొనుము. అని యిట్లు చెప్పుచున్న రాజుమాటలు విని సంతోషించి యోగి యిట్లనియె రాజేంద్రా ! ఈఫలములు దేవప్రసాదమువలన లభించినవి. నాకొక మహాకార్య ముండుటచే నివి తెచ్చి తమకు సమర్పించుచున్నాడను నాపేరు కాలపూరుషుడందురు. నానివాసము శ్మశాన భూమి. కందమూలములే నాకు భోజనము. నేను మత్స్యేంద్రుని శిష్యుడను. నాకార్యము మహారహస్య మయినది. రెండవవారికి దెలియకుండ జేయవలసి యున్నది. ఒక్కనికి దెలిసినచో నీటిమీది నూనె బిందువువలెనంతటను వ్యాపింపక మానదు. అట్లే యగునేని నాకార్యమునకు భంగ ముగలుగును. నీవు ధ్వజకీర్తి మహారాజునకు దౌహిత్రుడవు. చంద్రశర్మకు గుమారుడవు. నీతో సమాను డీ ముల్లోకములయందును లేడు లేడు లేడు. నే నెందఱురాజులనో చూచియుంటిని. నీగుణములో గోటియవపాలయినను వారియందెన్నండును జూచి యెఱుంగను. అదిగాక దేవింద్రు డిచ్చిన నవరత్న ఖచిత దివ్యసింహాసన మధిష్ఠించి విరాజిల్లు చున్నాడవు. సూర్యభగవానుడిచ్చిన కుండలములు నవరత్న ఖచితములు చెవుల ధరించియున్నావు. నీ వుదయపర్వత మెక్కితివి. సూర్యునిప్రసాదమువలన నభేద్యకవచము గలవాడ వయితివి. నీవలె ధర్మముగా రాజ్య మేలినరాజున వినియు గనియు నెఱుగను. సాహసియున్నను శూరు డన్నను, సర్వవిద్యావిశారదు డన్నను, ధైర్యశాలి యన్నను, నీతికోవిదు డన్నను నిన్నే చెప్పవలయును. కావున నాకార్యము నీతో విన్నపించెదను. నేటికి బదునేనవవాడు నీ వేకాకివై నేనుండు శ్మశానభూమికి రావలయును. అచ్చట నాకార్యము విన్నపించెదను. వెంటనే చేయుము. అని యోగి చెప్పకోగా దయాళువై యారాజట్లే యనెను. యోగి రాజనొద్ద సెలవుపుచ్చుకొని తన

నివాసమునకు బోయెను. రాజు రాజకార్యములు నిర్వర్తించి యంతఃపురములోనికి బోయెను. తరువాతను యోగిచెప్పినపదునేనవదినము వచ్చినది. భట్టియను మంత్రితోడను, నీతివిశారదులగు సభ్యులతోడనుసభలో బ్రవేశించి యప్పటియా వశ్యకకృత్యములు నెఱవేర్చి మరల నంతఃపురమునకు బోయెను. సూర్యభగవాను డును రక్తుడై వారుణీసంగమమునకు గాబోలును పోయియున్నాడు. పద్మినితనభర్త యగపడకుండుటకు జాల జింతించి విరహమువలన మోహమును బొందినదో యన ముకుళించినది. క్రమక్రమముగా జీకటి వ్యాపించినది. అర్ధరాత్రి మయినది. అందఱును నిద్రపోవుచున్నారు. సిద్ధుని, సంగతి జ్ఞప్తికివచ్చి రాజులేచి శ్మశానము నకు బోవ నుద్యుక్తుడాయెను. దివ్యాంబరములు దివ్యములయినయాభరణములు ధరించి యభేద్య కవచము దొడిగికొని కుండలము లలంకరించుకొని పూలమాలలు వైచు కొని మహాశృంగారవేషముతో ధైర్యసాహసములు మూర్తిమంతమై యొప్పు చున్నవో యున్నట్లు పాదుకలు దొడిగికొని శత్రుభయంకరమగు కత్తి చేతబట్టి తన తేజస్సుచే దిశదిశలను వెలిగింపజేయుచు శ్మశానమువైపు బయలుదేఱి త్రోవలో నెవ్వరికిని గనుపడకుండనే మహాభయంకరమగు రుద్రభూమిలో బ్రవేశించెను. రాజు ప్రవేశించునప్పటికి భూత ప్రేతపిశాచ శాకినీఢాకినీగణములు వేలకొలదిగ గూడి రాజును సంహరించుట కుద్యుక్తములయినవి. సాహసి యగు రాజు వాని నన్నింటిని ఛేదించెను. అవి యన్నియు గర్వము విడిచి వచ్చినత్రోవనే పోయినవి. తరువాత రాజు యోగిని పేరుపెట్టి పిలిచెను. ఎక్కడ ను న్నావయ్యా ! యని పిలిచి పిలిచి వేసారి వెదక మొదలిడెను. ఎంత పిలిచినను వెదకినను యోగిజాడ యంతయు లేకపోగా నేను ద్రోవతప్పితినా లేక యిది యోగియుండు శ్మశానము కాదా యని విచారించి యటుగాక యోగికి జెవుడేమో లేక నిదురించుచున్న వాడోయనియు నిట్లనేక వికల్పములను బొంది యోగీంద్రా ! నీమాటప్రకారము నామాట యథార్థము చేసికొనుటకు వచ్చి యున్నానయ్యోయి ! నీ వీ పితృభూమిలో నెంత పిలిచినను బలుకవు. ఎంత వెదకినను గనుపడవు. కారణమేమయి యుండును. నీవెచ్చటవైనను మౌనమును సహించి జపము చేయుచున్నావా ! నీవే యథార్థము తప్పినవాడ వైపోతివి. సరి నే నిదిగో నింటికి బోవుచున్నాను. అని రాజు పలుకు నప్పటికి యోగి ప్రత్యక్ష మాయెను.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున విక్రమార్కో పాఖ్యాన మన్నది యిరువది రెండవ యధ్యాయము.

ఇరువదిమూడవ యధ్యాయము

సూతు – మునిపుంగవులారా ! తరువాతను యోగిచేసిన చేష్టలు చెప్పెద. నాలకింపుడు. అట్లు రాజు గట్టిగా బిలువగా దుదకు యోగి బెత్తము చేతబట్టుకొని రాజునొద్దకు వచ్చి రాజును జేతితో బట్టుకొని రాజా ! నే నింతసేపును నిన్ను బరీక్షిం తమను బుద్ధిచేతనే మౌనమును వహించి యుంటిని. నాయెడ గోపముంచకుము. నిజముగా రాజ రాజ నన్నును సత్యసంధుడ వన్నను నీవే. నీవంటి సాహసిని శూరుని నే నింతవఱకు విని కని యెఱుగను. నీవు నాకార్యమును బూర్తిచేయుటలో నించు కంతయు సందేహములేదు. ఇక నాకార్యము చెప్పెదను సావధానము గావినుము. ఇక్కడికి యొకయోజన దూరములో నొకమఱ్ఱిచెట్టున్నది. ఆ చెట్టుమీదను బెద్ద శరీరము గలవాడును మహాబలపరాక్రముడును, కోట్లకొలది భూతప్రేతపిశాచ శాకినీఢాకినీ బ్రహ్మరాక్షసాది సంఘములతో గూడి యుండువాడును, నాతపస్సునకు మాటిమాటికిని విఘ్నము చేయుచుండువాడును మహా మాయాధురంధరుడును, పర్వతముల నెత్తు గలవాడును తేజస్సుచే శంకరునివంటివాడును, జటాధారియు, భయము లేనివాడును, శర్వశత్రునిబర్హణుడును నగునొకడున్నాడు. నీవు పోయి వానిని జయించి నాయొద్దకు దీసికొని రమ్ము. నే నీకాళికాలయములో నుండెదను. నీవు వేగముగా బొమ్ము అను యోగిమాటలు విని విక్రమార్కుడు కత్తి చేతబట్టుకొని తిన్నగా మఱ్ఱిచెట్టున్నచోటికి బోయి చూచునప్పటి కది రెండవ వింధ్య పర్వతములాగున గనుపడ్డది. మఱియు నది భూమిని, ఆకాశమును నంటి మిక్కిలిని భయంకరముగా నున్నది. దానియందున్న భూతప్రేతాదుల సంఘములకు హద్దులేదు. అటువంటి మఱ్ఱిచెట్టుమీదను తలక్రిందకును గాళ్ళు మీదికిని వ్రేలాడుచున్న వాడును, నరమాంసము దినుచుండు భూతప్రేత పిశాచాదిసంఘ ములచే జుట్టువాఱుకో బడినవాడును, ఘోరములయిన కోరలు, అంతకుఘోర మయిన రూపము, జడలు గలిగి మహాభయంకరుడయియున్న బేతాళుని జుట్టుకొన్న పిశాచాదులను జూచి విక్రమార్కు డిట్లనియె. నేను లోకములో శత్రుభయంకరుండని పేరువడి, యున్నవిక్రమార్కుడను, సిద్ధునియాజ్ఞచే మీప్రభు వగుబేతాళుని దీసికొని పోవుటకై వచ్చితిని. నేనెట్లయినను వానిని దప్పక దీసికొని పోవుదును. ఇందు సందేహమేలేదు. ఓపిశాచాదులారా ! మీరు మీప్రాణములను రక్షించుకొనుడు. ఎందేని బాఱిపొండు. నేనిపుడు శ్మశానములోనుండు భూతప్రేత పిశాచాదులను

జాలవఱకు జంపి యిచ్చుటనున్న మిమ్ములను జంపుదమను నుద్దేశ ముతో వచ్చియుంటిని. కావున మీకు బ్రాణములయం దిష్టముగలదేని దూరముగా బాఱిపొండు. ఇట్లు చెప్పుచున్నరాజతో బిశాచము లిట్లన్నవి. రాజా ! స్వల్పబలము గలిగియు గర్వించి మాటలాడుచున్నావు. నీ బెదరింపులకు మేము భయంపడు వారముగాము. మిక్కిలి ప్రేమాస్పదములయిన నీప్రాణములను రక్షించుకోవలయు ననుతలంపు గలదేని మాదగ్గఱనుండి వేగముగా బొమ్ము. లేదేని నిన్ను జంపి మే మందఱమును భక్షించెదము. రాజాధమా ! నీవు రుద్రుడవా? విష్ణుడవా ? బ్రహ్మవా? దుర్బుద్ధీ ! నీవు వచ్చి మమ్ములను బెదరించుచున్నావుగా ? "గ్రుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినదట" అను సామెత యిట్టిదే కాబోలును. పొమ్ము పొమ్ము దూరముగా దొలగిపొమ్ము నీ వెక్కడ ? బేతాళు డెక్కడ ? మీ కిద్దఱకును హస్తిమశకాంతరమున్నది మెక్కడ పిల్లి, పెద్దపులితో నెదుర్కొన బోయినట్లున్నది. ఓరి రాజాధమా ! ఇంకను బాఱి పో వేమిరా ? "నీకు బ్రదుకవలయునను నాస లేదుగాబోలును. సరియే, అటు లేని మే మిపుడే నీకంఠము నులిపి నురుగలు గట్టుచున్న వేడివేడి రక్తము ద్రావి తాండవ మాడెదము. ఉండుండుము. నీపాదములు, చేతులు, తొడలు, గుండెలు, శిరస్సు మొదలగు నవయవములు నువుగింజలవలె బొడిచేసి మే మందఱమును బంచుకొని తినగలము. వేగము పొమ్ము పొమ్ము అని యిట్లు రాజుతో జెప్పి రాజును జుట్టుకొని రక్త మాంసములు వర్షింప మొదలిడినవి మఱియు మూత్రపురీషములు, రాళ్ళు, చెట్లు, కొండ శిఖరములు మొదలగునవి తమకోపము దీఱ రాజు పయిని విసర మొదలిడినవి. అపుడు విక్రమార్క మహారాజు భుజముల నాస్ఫాలించి బేళ్ళమందల మీదికి సింహము పరుగెత్తినట్లుగా నాభూతములమీదికి బరుగెత్తెను. మాటిమాటికిని సింహనాదములు చేయుచు గర్జించుచు వాడియగుకత్తితో వానిని జాలవఱకు నఱికివైచెను. కొన్నింటికి ముక్కులు, కొన్నింటికి జేతులు, కొన్నిటికి మెడలు, కొన్నిటికి బాదములు, ఈరీతిగా విక్రమార్కుడు నఱకగానవి యచట నిలువజాలక దీనదీనముగా రోదనము, చేయుచు బాఱిపోయినవి. మఱికొన్ని మూర్ఛపోయినవి. లేళ్ళను సింహము, మేకలను పెద్దపులి వ్యాకులపెట్టినట్లావిక్ర మార్కుడు వ్యాకుల పెట్టగా జాలవఱకు భూతములు నశించినవి. ఈరీతిగా భూతప్రేత పిశాచాదులను గత్తితో జంపి చంపి సింహనాదములు చేయుచు నచటనే నిలువబడెను. ఇట్లు రావణాది రాక్షసులను జంపిన శ్రీరామునివలె సింహనాదములు చేసిచేసి క్రమముగా బేతాళు దున్నచోటికే మెల్లగా వెళ్ళి వానిని జూచి రా జెట్లనియె. బేతాళా ! నాచే నీ

సైన్యమంతయు నంతయు నొందింపబడినది. నిన్ను బట్టి తీసికొని పోవుటకై వచ్చితిని. నిన్ను దీసికొని పోయి కాలపూరుషుడనుయోగికిచ్చెదను కావున నోబేతాళుడా ! నీవు శీఘ్రముగా నాయొద్దకు రమ్ము. అని యిట్లు గర్వయుక్తముగా బలికినరాజుమాటలువిని భయపడి తనమంత్రులను బిలిచి యిట్లనియె. మంత్రులారా ! ఇతడు విక్రమార్కుడు మనసైన్యమును జాలవఱకు జంపియున్నాడు. నన్ను గట్టి తీసికొనిపోవుటకు వచ్చియున్నాడు. ఇతడు కుబేరుడో, ఇంద్రుడో, నాలుగ ముఖములు గల బ్రహ్మదేవుడో, విష్ణువో, కాలరుద్రుడో నాకే మియు దెలియకుండ నున్నది. ఇపుడు నే నేమిచేయుదును ? ఎచ్చటికి బోదును ? నాకింకెవ్వరు దిక్కు ? అని యిట్లుబేతాళుడనుచుండగా నతని మంత్రు లేడుగురును పండ్లు పటపటకొఱుకుచు దమరాజుతోనిట్లనిరి. ప్రభూ ! మనుష్యాధముడగు వీనివలన నీవెందులకింతగా భయపడుచున్నావు? నీయాజ్ఞను శిరసావహించుటకు మేమందఱమును సిద్ధముగానున్నాము. ఇంతకును నీవు మాత్రము సామాన్యుడవా ? విష్ణునివంటి బలశాలివి, మేరువువంటి ధైర్యము గలవాడవు, రుద్రునితో సమానమయిన కోపముగలవాడవు. సంహరించు విషయమయి ప్రళయకాలపు యముడవే, నీపేరుచ్చరించునప్పటికే మూడులోకములును గడగడ వడకుచుం డును. ఆమనుష్యాధముని జంపుటకై మమ్ములను బంపుము. బేతాళరా జెక్కడ ? మనుష్య డెక్కడ ? అనియిట్లు మంత్రులు తమరాజును స్తుతి చేయుచుండగా బేతాళరాజు వారిని జూచియిట్లనియె మంత్రులారా ! శీఘ్రముగాబోయి యారాజాధముని జంపి జయమునుబొందిరండు. మీరందఱును యుద్ధవిశారదులు గదా ! అని యిట్లు బేతాళరాజుచే నాజ్ఞాపింపబడి యాయేడుగురు మంత్రులును విక్రమార్కునియొద్దకు వచ్చి గర్వించి యిట్లనిరి. రాజాధమా ! రుద్రునివంటివాడు, మహానాదము చేయువాడు, కాలాగ్నితుల్యుడు అట్టిమాప్రభువును గట్టితీసికొని పోవుటకు నీకే మాత్రపుశక్తి గలదురా ! ప్రాకృతము లగుభూతాదులను జంపినట్టి యనుకొను చున్నావేమి ? అంతమాత్రమునకు గర్వింపకుము. మేమట్టివారము గాము. మేము బాహువులతో బెద్దపెద్దకొండలను బెల్లగింప గలము. అట్టిమా యెదుట నిలువబడు టకు నీకు యోగ్యత యెక్కడిది ? యుద్ధమునంగతి దూరముగనుండనీ అనిచెప్పి యేడుగురు బేతాళులును విక్రమార్కునితో యుద్ధము చేయుటకు సన్నద్ధులై నిలువబడిరి. తరువాతను విక్రమార్కుడు వారినందఱును సింహము క్షుద్రమృగములను జూచినట్టుగా జూచెను. వారితో యుద్ధము చేయుదమనుతలంపుగలవాడై సింహ నాదములుచేయుచు. మాటిమాటికిని

గర్జించుచు, వజ్రాయుధమువంటి మహా ఖడ్గమును గిఱగిఱద్రిప్పుచు, శత్రుభయంకరుడై నిలువబడెను. తరువాతను దొమ్మిగాను, రోమాహర్షణముగాను యుద్ధము ప్రారంభమయినది. అదివఱకెన్నండునునటువంటి యుద్ధముకాలేదు. కనుక నింద్రాదిదేవతలందఱును విమానములతో వచ్చి యాయుద్ధమును జూచుచుండిరి. గంధర్వులు, కిన్నరులు, విద్యాధరులు, యక్షులు, ఋషులు, పన్నగులు, నారదుడు, తుంబురుడు, అప్సరసలు, చారణులు మొదలగువారు విమానములపై నుండి విక్రమార్కునికి జయమును గోరుచుండిరి. పున్నమనాటిచం దమామను జూచి సముద్రముపొంగునట్లు విక్రమార్కుడాదేవసంఘమునుజూచి పొంగుచుండెను. అట్లు యుద్ధములో వృద్ధినిబొందుచున్న విక్రమార్క రాజచంద్రుని నాచ్ఛాదించుటకు బేతాళులందఱును రాహువులవలె వచ్చిరి. ఆవచ్చినభూతములన్నియు గత్తి చేతబట్టుకొని యుద్ధముచేయుచు రాజుపయిని నానావిధాయుధములను బ్రయోగించి నొప్పింప మొదలిడినవి. ఆదెబ్బలకు నొచ్చి రాజు కోపముచే రక్త నేత్రుడయిన సింహమువలె నార్చుచు నెల్లరకును భయము గలుగునట్లుగా నాయేడుగురు బేతాళులకును ముక్కులు కోసి వైచెను. తుదకు వారి యందఱ కంఠములునుగూడి దెగ గోసెను. ఇట్లు బేతాళులందఱును హతులుగా మీదనున్న దేవతలందఱును సాధువాదములుచేయుచు సంతోషించిరి. గంధర్వులు పాడిరి. అచ్చరలాడిరి. దేవతలందఱును జయమును బొందుమని యాశీర్వదించిరి. కలహ భోజనుడగు నారదుడు సర్వాద్భుతమయిన యా యుద్ధమునుజూచి పరమానంద సముద్రములో మునిగెను. తరువాతను దేవతలందఱును రాజు నొద్దకువచ్చి వరము వేడుమనిరి. దేవతలారా ! మీరు నాయందు దయ గలవారై వచ్చితిరేని యాబేతాళుడు నాకు స్వాధీనుడగునట్లు వరమిత్తురు గాకయని రాజుకోరెను. దేవతలట్లే యగుగాక యని వచ్చిన త్రోవనేపోయిరి. పిదప విక్రమార్కుడు, మఱ్ఱిచెట్టెక్కి సప్తబేతాళ నాయకుడగు బేతాళరాజుతో నిట్లనియె. ఓయీ ! నీచే బంపబడిన బేతాళులందఱును నాచే జంపబడిరి. నీగర్వముతీఱినది. అని చెప్పి యా బేతాళునిజడలు పట్టుకొనెను. మెల్లగా వానినిగట్టివైచి మఱ్ఱిచెట్టు దిగి యోగీంద్రు డున్న చోటి కాబేతాళుని దీసికొనివచ్చుచుండుగా బేతాళుడు త్రోవలో నంతర్ధానమా యెను. అట్లంతర్ధానమగుటచూచి మరల విక్రమార్కుడు మఱ్ఱిచెట్టెక్కి వానినిబట్టుకొని గట్టిత్రాళ్ళతో గట్టి యోగీంద్రునియొద్దకు దెచ్చుచుండగా మరల భేతాళు దంతర్ధా నమాయెను. మరల విక్రమార్కుడు మఱ్ఱిచెట్టెక్కి వానితో నిట్లనియె. ఓరీ ! బేతాళా ! దుర్బుద్ధీ ! నీవు మహామాయాధురంధరునివలె నున్నావు. నిమాయలన్నియు నాకు దెలియ లెమ్ము.

ఇంక నెక్కడికి బోగలవు ? ఇంద్రలోకమునకు బోయినను, చంద్ర లోకమునకు బోయినను బ్రహ్మలోకమునకు బోయినను, విష్ణులోకమునకు బోయినను రుద్రలోకమునకు బోయినను దితిగర్భములో బ్రవేశించినను నిన్ను మాత్రము విడువను విడువను విడువను. నీవు మాటిమాటికి నీమఱ్ఱిచెట్టెక్కుచున్నావు గావున నికనీచెట్టే పెల్లగించి పట్టుకొనిపోయెద. ననురాజుతో బేతాళు డిట్లనియె రాజా ! నీవు మహాసాహసివు, ధీరుడవు. ప్రాజ్ఞుడవునని యెఱుంగుదును. నే నిపుడు నీ కిరువదియైదు కథలు చెప్పెదను. నీవు వానికిదగినసమాధానము చెప్పెదనేని నీకు. నే నధీనుడనగుదును అని చెప్పి నిర్భయముగా నా చెట్టుమీదనుండెను. మఱియు బేతళుడు రాజును జూచి రాజా ! నేనడిగిన ప్రశ్నలకు సదుత్తరము నీవెఱిగియు జెప్పవేని నీశిరస్సు వెంటనే భిన్నముగాగలదు. అను నా బేతాళునిజూచి రాజిట్లనియె. బేతాళా ! నాకు దెలిసి యున్నకథకు నేను సదుత్తరము చెప్పెదను. అని యా బేతాళునిబట్టుకొని తన వృష్ఠభాగమునందుంచి మెరెయుచు గమనముకొఱ కుద్యుక్తుడాయెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున విక్రమార్కోపాఖ్యానములో బేతాళగ్రహణమన్నది

ఇరువదిమూడవ యధ్యాయము

ఇరువదినాల్గవ యధ్యాయము

సూతు – మునులారా ! తరువాతను బేతాళరాజు మొదటికథ రాజునకు జెప్పమొదలిడెను.

బేతా – రాజా ! వినుము. పూర్వము కృతయుగమున విశాలయను పట్టణము గలదు. అందు వీరమాహేశ్వరుడనురాజు రాజ్యమేలుచుండెను. అతడు సత్యవాధి, జితేంద్రియుడు చిరకాలమున కతనికి బద్మావతి యనుకుమారిత పుట్టినది. తండ్రి యామెకు సకలశాస్త్రములును, జెప్పించి యెవనికిచ్చి పెండ్లిచేయదగును? అని చింతించి మంత్రిని బిలిపించి యిట్లనియె. మంత్రీ ! నాకుమారిత పద్మావతికి యౌవన ము, ప్రాదుర్భవించినది. ఇక దానికి బెండ్లి చేయకతప్పదు. కావున నీవు తగినవరుని వెదకి తీసికొనిరమ్ము. అని చెప్పినతోడనే మంత్రి మంచిదేయనెను. రాజు పురోహితుని బిలిపించి మంత్రికి జెప్పినట్లే చెప్పెను. తానును మంచివరునికై వెదకుచునేయుండెను. తరువాతను రాజు తనకుమారితకు దగినవరు నొకనిని

బిలుచుకొనివచ్చెను. పురోహి తుడొకవరుని బిలుచుకొనివచ్చెను. మంత్రి యొకవరుని రప్పించెను. ఇట్లు ముగ్గురును ముగ్గురువరులను దెచ్చిరి. ముగ్గురువరులును జతురంగబలములతోను బెండ్లికివచ్చి యూరిబయటను విడిసిరి. అప్పుడు రా జెవ్వరికి గన్య నీయవచ్చును ? అని చింతింప మొదలిడెను. ఇంతలో నా రాజుభార్య తనయన్నకొడుకును రప్పించినది. అతడును మేనయత్త కూతుం బెండ్లియాడుదమను సంతోషముతో వచ్చి యూరిబయటనుండెను. అప్పుడు రాజు కార్యార్థీనుడై యుండుటంజేసి బావమఱది కొడుకును రావించినందులకై తనదేవిని నిందించుచు నిట్లనియె. ఓసీ ! దుర్మార్గురాలా ! ముగ్గురువరులు వచ్చి యూరు చుట్టుకొనియుండగా నీ మేనల్లునిగూడ నెందులకు రప్పించితివి ? నాకు మొదలే మతి పోయియుండగా నీవిట్లేల చేసితివి ? అని యనేకవిధములుగా దిట్టుచుండగా నాగట్టివా రాజుతో నిట్లులనియె. నీవు నాయన్న కుమారుని కిచ్చి మనపిల్లకు బెండ్లి చేయవైతివేని నే నిపుడే నీ యెదుటనే విషము దిని ప్రాణములు విడిచెదను. అనియిట్లు చెప్పిన భార్యమాటలు విని యతికాముకు డగుటచే భార్యమాట దాట జాలకపోయెను. అతడే యన్నమాట యేమి ? లోకములో నెక్కడనో కాని సామాన్యముగా బ్రతిపురుషుడును స్త్రీకి స్వాధీనుడేయయి యున్నాడుగదా ! ఆడుదానికి లొంగియున్నవారు సత్యమును, ధర్మమును, తనయు లను, బంధువులను, పెద్దలను గురువులను, విడుచుట కొక్కింతయు వెనుదీయు వారుగారు, ఆడుదియనగా శక్తిస్వరూపిణి గాదా ! ఇందాశ్చర్యమేమున్నది. తరువాతను రాజు వచ్చియున్న ముగ్గురు వరులను నిరాకరంచి భార్యమేనల్లునకే కూతు నిచ్చుటకు నిశ్చయించెను. రాజుగారి యభిప్రాయము దెలిసికొని మొదటి ముగ్గురు వరులను గోపించి యుద్ధసన్నద్ధులయి రాజునకును వాని బావమఱది కుమారునకును "మమ్మును యుద్ధముల జయించిన తరువాతనే పెండ్లి చేసికో వలసినదని వర్తమానముల నంపిరి. మఱియు దరువాతను బెండ్లి సంగతిచూచు కోవచ్చును ముందుగా యుద్ధమునకు రండనియు బంపిరి. దూతలవలన వారియభిప్రాయము దెలిసికొనిరాజు మంత్రులను బిలిపించి యాలోచింప మొదలిడెను. అపుడు మంత్రులు బాగుగా నాలోచించి రాజుతో నిట్లనిరి. రాజా ! ఇపుడు తమకుమారితనెవ్వరి కిచ్చుటయు దెలియకుండనుండుగా మేమెట్లు బదులు చెప్పగలము ? వారితో యుద్ధము చేయుటకు మావలన సాధ్యపడదు. వారు మహాబలవంతులు అయినను మేమొకయాలోచన చెప్పెదము. తాము కోపము చిత్తగింపక విందరేని విన్నపించుకొందుము. అని మంత్రులు చెప్పగా రాజు వారిని

మంచిమాటలాడుచు నిట్లనియె. మంత్రులారా ! మీ మనస్సున కిష్టపడినవిషయము నాకుమాత్ర మెందుల కిష్టపడదు ? భయపడక మీకు దోచిన యాలోచన యేదియో నాతో జెప్పుడు. అని రాజడగుగా మంత్రు లిట్లనిరి. రాజా ! పట్టణమునకు వెలుపటను గొప్ప యగ్నికుండ మొకటి ప్రజ్వలింపజేసి దాని యెదుట దమకుమారితను నిలువబెట్టుడు. నలుగురువరులను నాలుగు వైపులను నిలువనబెట్టించి "మీ నలువురిలో నెవడు ముందుగా వచ్చి నాకుమారిత చేయిపట్టుకొనునో వానికేనాకూతునిచ్చెదను" అని చెప్పవలయును. అని మంత్రులు చెప్పగానే రాజట్లే చేయించెను. అట్లు పెద్దయగ్నికుండము ప్రజ్వలించుచుండగా గుమారితను బాగుగా నలంకరించి యాకుండము దగ్గఱ నిలిపి యాకుండమునకు నాలుగువైపులను సమస్థలములయందున్న నలుగురు వరులను బిలిచి కుండము దగ్గఱనున్న నాకూతురును గ్రహింపుడనెను. అట్లు రాజు చెప్పినవెంటనే నలుగురును నేనుముందు నేను ముందని యొక్క మాఱుగావచ్చి యొక్కసారిగానే నలుగురును బట్టుకొనిరి. వారి యీడుపులకు సహింపక యామె యాకుండములోబడినది. అగ్నిజ్వాలలో బడినమిడతవలె నయిన యాబాలికవిషయ మయినలుగురును హా ! సుందరీ ! యని యేడువ మొదలిడిరి. వారిలో సాహసి యగునొక డాకుండములో బడెను. మఱియొక డామెయందలి మోహముచే వైరాగ్యవంతుడై తీర్థయాత్రకు బోయెను. ఇంకొకడు సన్న్యసించి భిక్షాశనుడై దేశదేశములు తిరుగ బోయెను. నాల్గవవాడుమాత్ర మాపట్టణములోననే భిక్షావృత్తిచే గాలము గడపుకొను చు నాయగ్నికుండముపైని చక్కనిమంటప మొకటి కట్టి యాసమీపముననే యొక పూదోట వేయించి యామంటపముమీదను గౌరిని బ్రతిష్ఠించి ప్రతిదినమును బూజిం చుచుండెను. సన్న్యసించి దేశాటనము చేయబోయినవాడు క్రమముగా గాశీపట్ట ణము చేరి కొన్నాళ్లుండెను. ఒకప్పుడత డాకలికొని యొకదరిద్రునియింటికి బోయి యతనిభార్యను జూచి యాతిథ్య మిమ్మనెను. పతిభక్తివశవందురాలైన యామె యతనిని బూజించి తనయింట నేమియు లేకుండుటచే నతనితో నిట్లనియె. ఓస్వామీ! నాపెనిమిటి యాచనకు బోయియున్నాడు. ఇంటనేమియు లేదు. ఆయన వచ్చువఱకును దయచేసి యుండి భుజించి వెళ్లదగునని యామెయనగానే సన్న్యాసి కోపించి నేనంతవఱకును నుండజాలను. నన్నాకలి చాల బాధించుచున్నది. నీమగ డెంతసేపటికి వచ్చునో యేమో ? లేదంటివేని పోయెదను. లేదా యిప్పుడే నాకు భోజనము పెట్టుము. అనియత డనగానే యామె పొరుగింటికి బోయి వెంటనే కొన్ని బియ్యమప్పుదెచ్చి యన్నము వండుచుండగా నామెశిశువు రోదన మారంభించెను.

వంటపని కడ్డము వచ్చిన కుమారు నామె వంట పొయిలో బడవైచినది. తరువాత వంటచేసి వడ్డించి యాసన్న్యాసిని దినుమన్నది. మొదటినుండియు నామెచేయుచున్న దంతయు జూచిన వాడగుటంజేసి యాసన్న్యాసి యాహా ! యని విచారించి శివ శివా! నే నెచ్చటను నిట్టిఘోరకృత్యము చూచి యెఱుగను. అమ్మా ! బిడ్డని పొయిలో బడవైచి యన్నము తినుమందువు. శిశుహత్యచేసిన పరమ పాపాత్మురాలిచేతి, యన్నము నే నెట్లుతిందును? ఎప్పటి యట్లు నీబాలుడు లేచి వచ్చినచో నీయన్నము తిందును. అని యనుచుండగా నాసన్న్యాసి ననేక విధములుగా నామె బ్రతిమాలుకొన్నది. ఎంత బ్రతిమాలినను సన్న్యాసి యంగీకరింప డాయెను. ఇంతటి నామె మగ డింటికి వచ్చెను. సన్న్యాసి యొక్కయు దనభార్యయొక్కయు వివాదమును వినెను. అతడు వెంటనే నీళ్లుమంత్రించి పొయిలో జల్లెను. ఆబాలుడు మునుపటి వలెనే కలకలలాడుచు వచ్చెను. సన్న్యాసి యా బ్రాహ్మణుని మంత్రప్రభావమున కాశ్చర్యపడి యిట్లనియె. దయాసముద్రుడవగు నోబ్రాహ్మణా ! ఆమంత్రము నాకుపదేశింపుము. దానివలన నాకోరిక పూర్తి యగును. అనుసన్న్యాసిని జూచి యాయింటిబ్రాహ్మణు డుపదేశింప జాలనని బదులు చెప్పెను. చేతితో నాపోసానము పట్టుకొని నీవామంత్రమును నాకు జెప్పవేని నేను భోజనము చేయననెను. ఆతిథ్య మిచ్చునపుడు కోరినదాని కభ్యంతరము చెప్పగూడదు గనుక విధిలేక యాతని కామంత్రము నుపదేశించెను. తరువాత సన్న్యాసి భుజించి శుచియై మంత్రమును బరీక్షింప నెంచి యచ్చట జచ్చిపడియున్న యొకగాడిదమీదను నీరు మంత్రించి చల్లునప్పటి కాగాడిద బ్రదికినది. వెంటనే సన్న్యాసి విశాలపట్టణమునకు వచ్చెను. వెంటనే రాజకుమారితపడిన కుండమును ద్రవ్వించి నీరు మంత్రించి చల్లునప్పటి కామె యెప్పటియట్ల బ్రతికిపైకి వచ్చినది. ఆమె పడినప్పుడాకుండ ములో బడినవాడును బ్రదికి పయికి వచ్చెను. ఇంతట, వైరాగ్యముచే దీర్థయాత్రలకు బోయినవాడును దిరిగి వచ్చెను. అతడా మెయందలి మక్కువచే బ్రతితీర్థమునందును బిండదానాదిక్రియ లాచరించుచుండెను. మరల నలుగురును నొకచోట గూడిరి. ఈ రాజకుమారిత నా దని ప్రతివాడును జెప్ప మొదలిడెను. రాజా ! ఆ నలుగురిలో నెవనిది యాకన్య చెప్పుమనగా బుద్ధిశాలి యగు విక్రమార్కు డిట్లనియె. తీర్థములలో బిండదానాదిక్రియలు చేసినవాడు కుమారుడగును. చచ్చినదానిని మంత్ర ప్రభావముచే బ్రదికించినవాడు తండ్రి యగును. అగ్నికుండములో బడి చచ్చి మరల గూడ బుట్టిన వాడు సోదరుడు. ఇక నామె చచ్చినను ఆచోటు వదలక యామెనే తలంచుచు నామె చచ్చినచోటును గాపాడుచున్నాడు గనుక నామె యతనికే భార్యకా

దగ్గది అని సదుత్తరము చెప్పగానే బేతాళుడు విడిపించుకొని పాఱిపోయి మరల మఱ్ఱిచెట్టెక్కెను. రాజును మరల వటవృక్ష మెక్కి బేతాళుని బట్టుకొని కట్టి మూపుపై నెక్కించుకొని యోగి యున్న చోటికి బయలుదేఱెను. మరల బేతాళుడు కథ ప్రారంభించెను. ఇట్లే యిరువదినాలుగు కథలు చెప్పగా నన్నింటికిని దగిన సమాధానము లారాజు చెప్పగా బేతాళు డిట్లనియె రాజా ! నీవు సర్వజ్ఞుడవు. సాక్షాద్బృహస్పతివి. ఈ భూలోకములో నీతో సమానుడు లేడు. నేనిపు డిరువదియైదవకథ జెప్పెదను దానికిగూడ సమాధానము చెప్పితివేని కృతకృత్యుడ నగుదువు అని యిరువది యయిదవ కథ చెప్ప మొదలిడెను.

రాజా పూర్వము వంగదేశమున జక్రపుర మను పట్టణము గలదు. అందు సుందరి యనియు రూపవతి యనియు నిద్దఱు వేశ్యలు తల్లి కూతుండ్రు గలరు. వారిద్దఱును స్వధర్మమునందాసక్తి గలవారై యుండిరి. వారు కాపురిలో నేవిధమయిన లాభమును లేకుండుటచే మఱియొక పట్టణమునకు బోవుద మని బయలు దేఱిరి. రాముడను పేరుగల యాపట్టణపురాజు శత్రువులచే నోడిపోయి భార్యగూడ జచ్చిపోవుటచే గుమారునితో గూడి మఱియొక యూరికి బోవుచు వేశ్య లిద్దఱును బోవుదారినే పోవుచుండిరి. దారిలో నడుగులు చూచి తండ్రితో గొడు కిట్లనియె తండ్రీ ! ఈదారి నిద్ద ఱాడువాండ్రు పోవుచున్నారు. పెద్దయడుగులదానిని నీవు పెండ్లి యాడుము. చిన్నపాదములదానిని నేను బెండ్లి యాడెదను. అనగానే తండ్రి మంచిదే యనెను. కొంతదూరము పోవునప్పటి కాస్త్రీ లిద్దఱును గనుపడిరి. మొదట ననుకొన్నప్రకారము తల్లిని గొడుకు, కూతును దండ్రి పెండ్లి చేసికొనిరి. ఏమనగా బెద్దపాదములది కూతురు చిన్నపాదములది తల్లి తరువాతను వారికి గూతుండ్రు కొడుకులు పుట్టిరి. ఆపుట్టినవారు శాంతులై వృద్ధి నొందుచుండిరి. వారు తమలో నేమివరుసను బిల్చుకోదగువారో చెప్పుము రాజా ! అని బేతాళు డడుగగా శాస్త్రనింది తమైన యా సంబంధమును దెలియజాలక సంశయగ్రస్తుడై బేతాళుని మోచికొని తనతోవను బోవుచుండెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున బేతాళపంచవింశతిక థాకథన మన్నది యిరువదినాల్గవ యధ్యాయము.

ఇరువదియైదవ యధ్యాయము

సూతు - మునిచంద్రులారా ! ఇట్లు విక్రమార్కుడు, బేతాళునితో జాలదూరము పోవునప్పటికి మధురమయిన సంగీతధ్వని వినవచ్చినది. గానశాస్త్ర ప్రవీణుడగు విక్రమార్కుడట్టిపాట యదివఱ కెప్పుడును విని యెఱుగడు. అక్కారణమున నీగీతము నాడుది పాడుచున్నదా మగవాడే పాడుచున్నాడా యని సందేహించుచు నతివేగముగా నడచి చూచునప్పటి కొకమహాశిలపైని మంజులస్వనమగు వీణయు చేతబట్టుకొని యీశ్వరస్తుతి గీతములను బాడుచున్న యొక సుందరి కనుపడినది. విక్రమార్కుమహారా జాదివ్యసుందరిదగ్గఱకు బోయి యామెశరీరలావణ్యమునకు మోహితుడై యుక్తియుక్తముగాను మధురముగాను నిట్లనియె. సుందరీ ! నీ వెవరు? వీణాగానములో నింతనేర్పుగల నీవు మాతంగివి కాని గావు గదా ! లేక సరస్వతివా? మఱి లక్ష్మీదేవివా ? శచీదేవివా ? ఉర్వశివా చెప్పుము చకోరాక్షీ ! నీమోము పున్నమచందురుని దిరస్కరించుచున్నది. నీదంతములు దాడి మబీజములను వెక్కిరించుచున్నట్లున్నవి. నీ మధ్యప్రదేశము గగనమువలెను. అణువువలెను గనుపడుచున్నది. నీగానమును విని యాడులేళ్ళు కాలు కదుపకుండ నున్నవి. ఎండినచెట్లు చిగిరించు చున్నవి. నీతండ్రి యెవరు? నీభర్తపేరేమి ? నాయడిగిన ప్రశ్నలకు సమాధానము చెప్పుము. మీనాక్షీ ! నీ వేలోకమునుండి యీ భూలోకమునకు వచ్చితివి ? నిన్ను సృజించి బ్రహ్మ మఱి సుందరులను సృజింపమానుకొనెనని తలంచుచున్నాను. నీవు సౌందర్యాధిదేవతవు గానీ కావుగద ! నీవు సర్వవిద్యలును దెలిసిదానవని నమ్ముచున్నాను. నేనడిగిన వానికి సాదరముగా బదులు చెప్పుము. వేయేలా ! నీసౌందర్యమును వర్ణించుటకు వేనోళ్ళగలశేషుడునుజాలడని నాతలంపు. అని యనేకవిధములుగా నడుగుచున్న యారాజుతో యక్షిణి యిట్లనియె. రాజా ! నాపేరు దేవదత్త. నేను సింధురాజు కుమారితను. నాభర్త పుష్పదంతుడు. శ్రుతకీర్తి మహారాజునకు గోడలను. హేమవతీపురము మాకాపురస్థలము. నాభర్త శివునిశాపమువలన బేతాళరూపమును బొందెను. నే నాయననియోగముచే సదా యిట్లు దిరుగుచున్నదానను. నాకెట్లును గాలయాపనగాకుండనున్నది. నేను బగలులేడిని. రాత్రి యీరూపమును బొందుచుందును. ఎప్పుడు నామగనిమొగ మగపడునో, ఎప్పుడు పిశాచరా జగునామగడు నామొగము చూచునో, అపుడే మాయిద్దఱకును శాపమోక్షమగును. మాకు శాప మిచ్చినప్పుడే యీసంగతి శివభగవానుడు చెప్పియున్నాడు. నాపెనిమిటి

యున్నచోటికిబోయి యాయనను జూడజాలకున్నాను. శాపమోహితు డగుటచే నాభర్తయు నన్ను జూడజాలకున్నాడు. విక్రమార్కునివలన మీయిద్దఱకును శాపమోక్షము గాగలదని శివుడే చెప్పియున్నాడు. కాని యామహానుభావుని దరిసెనము మాత్రము మాకెట్లు లభించును ? కాని శివునివాక్య మెప్పుడును వ్యర్థముగాదుగదా ! ఎప్పటికైనను మాశాపము విక్రమార్కుమహారాజవలనే పోదగ్గది. అని మఱియు నాదేవదత్త యిట్లనియె. పురుషశార్దూలా ! నీ వెవరు ? నీపేరేమి ? నీవు దేవుడవా ? వేదవేదాంగపారగుడవగు బ్రాహ్మణుడవా ? ఇంద్రుడవా? విష్ణుమూర్తివా ? లేక సరస్వతీవల్లభుడవగు బ్రహ్మవా ? ఒండె రాజరాజశిఖామణి నగు విక్రమార్కు మహారాజవా ? మహాబలా ! ఈయర్ధరాత్రసమయమున నీమహారణ్యములోనికి రా గారణమేమి ? అని యామెయడుగగా రా జిట్లనియె.

సుందరీ ! నే నుజ్జయినీపురాధినాథుడు నగు విక్రమార్కుడను, కాలపురుషుడను యోగిప్రేరణవలన బేతాళుని దెచ్చుటకు బయలుదేఱి మహోన్నత మగునొక మఱ్ఱిచెట్టుపై నున్న బేతాళుని జూచి యతడు చెప్పిన మంచిమంచికథ లన్నింటికిని సదుత్తరములు చెప్పి యతని నోడించి యతని దీసికొని వచ్చుచున్నాను. ఇపు డతనిని యోగియొద్దకు గొనిపోయెదను. అని రాజు చెప్పగానే దేవదత్త నవ్వుచు నిట్లనియె. రాజేంద్రా ! భూతబేతాళనాయకుండగు నాభర్త యెచ్చట నున్నాడు ? నీవు పట్టి తెచ్చుచుంటివేని నాకొకసారి చూపింపుము. నేనెంతయు సంతసింతును. అని యామె కోరగానే రా జాబేతాళు నామెకు జూపించెను. విమానముమీదను గూర్చున్న దేవతవలె నారాజు వీపుమీదనున్న మగని బేతాళుని జూచినది. అతడును నవ్వుమొగము గల తనభార్యను జూచెను. అన్యోన్యదర్శనమువలన వారియిద్దఱకును శాపము తొలగిపోయి నది. ఇద్దఱును దివ్యరూపమునుధరించి దేవగంధర్వ సేవితులయి దివ్యాంబరముల గట్టుకొని దివ్యములయిన నగలుపెట్టుకొని దివ్యవిమానముపయిని గూర్చుండి యంతరాళమున వెలుగుచుండిరి. అన్యోన్యమును జూచుకొని యెంతసేపటికిని దృప్తిని బొందకుండనున్నారు. వారు సంతోషముచే వెనుకటిసంగతులు మాటలాడుకొను చుండిరి. విశ్వావసు మొదలగు గంధర్వులు మధురముగా వారిచరిత్రను గానము చేయుచుండిరి. అప్సరలనాట్యము ప్రారంభమయినది. దేవదుందుభులు, మ్రోగించిరి. పుష్పవర్షము గురిసినది. కైలాసమందున్న వారందఱును విశేషముగా సంతోషించిరి. పార్వతీపరమేశ్వరులుగూడ మహానందమును బొందిరి. బ్రహ్మాదిదేవత లానందించిరి.

దేవదత్తతో గూడి విమానముమీదను గూర్చుండి యున్నదేవాంగుని జూచి యాశ్చర్యపడి యిదేటిసంగతియో కదా యని యాలోచించుచు నిశ్చేష్టితుండై యానందసముద్రములో మునిగియున్న విక్రమార్కునిజూచి దేవాంగు డిట్లనియె. రాజేంద్రా ! విక్రమాదిత్యా ! మహాబలపరాక్రమా ! నీవనెడినావ నవలంబించి దుస్తరమయిన మాశాపసముద్రమును దాటితిమి. నీవు మాకు జేసినయుపకారము నకు బ్రత్యుపకృతియేలేదు. అయినను నావలన గావలసినది నీకెద్దియైన నున్నచో దప్పక నెఱవేర్చెదను గోరుము. అని యిట్లు భార్యతోగూడ దేవాంగుడన్నమాటలు విని యతిమేధావియగు విక్రమార్కుండు మాటిమాటికి నాలోచించుచు నతనికి నమస్కరించి యిట్లనియె. ఓయీ ! దేవాంగా ! నీవు మహాదేవునిభక్తులలో మొదటివాడవు. అట్టి నీవు నాయెడ సంతోషము గలవాడ వైతివేని నేను దలంచినపుడు నీవు బేతాళరూపముతో నా యొద్దకు వచ్చుచునుండుము. నేను జెప్పినపని చేయుచుం డుము. నీ కిష్టమయినచో నాకీవర మిమ్ము. అని యడుగగా దేవాంగుడు నట్లేయని యంగీకరించెను. ఇట్లు వర మీయగానే వెళ్ళుచున్నానని తనయొద్ద సెలవు పుచ్చుకొన్నవాడును త్రైలోక్యసుందరుడును నగు విక్రమార్కుని జూచి దేవదత్తయొక్క ప్రేరణచే దేవాంగు డిట్లనియె. రాజా ! కాలపురుషుడను యోగి నిన్ను గాళికకు బలి యీయనుద్దేశించియున్నాడు. కావున నీవు వానివలన నతిజాగరూకుడవైయుండుము. ఎప్పుడాయోగి నిన్ను స్నానముచేయుమనునో అపుడే ముందు నీవు స్నానము చేసి చూపు మనుము. మఱి యెప్పుడు నిన్ను నమస్కరింపుమనునో అప్పుడు ముందుగానీవు నమస్కరించి చూపుమనుము. ఆయోగి కాళికి నమస్కరించుచుండగా నీచంద్రహాసముచే వానితల నఱికి కాళికి బలి యిమ్ము. అపుడే దేవి నీకు బ్రత్యక్షమగును. ఆమె ప్రసన్నురాలై నన్ను నీకు సదా యధీనునిగా జేయుగలదు. భక్తచింతామణియగు నాయంబ నీకు జక్రవర్తిత్వమును దీర్ఘాయువును దయచేయును. అని చెప్పి యాదేవాంగుడు భార్యతోగూడ రాజననుమతిగొని కైలాసమునకు బోయెను. తరువాతను రాజు కాలపూ రుషయోగియొద్దకు వచ్చెను. యోగి రాజును జూచి బేతాళుడేడి ? బేతాళుడేడి ? యని యడుగగా విక్రమార్కు డాబేతాళునివృత్తాంతమంతయు శాంతముగా నాయోగికి జెప్పెను. యోగి యావృత్తాంత మంతయు విని త్వరతో విక్రమార్కునితో గూడి కాళికాదేవాలయమునకుబోయి లోపల బ్రవేశించి రాజును దేవికి బలి యీయ నిశ్చయించి రాజునుజూచి స్నానము చేయుము స్నానము చేయుము అని త్వరపెట్టెను. అపుడు రాజు దేవాంగుడు చెప్పినమాటలు జ్ఞప్తికి దెచ్చుకొని యోగీంద్రా ! ముందుగా నీవు స్నానము చేయుము. తరువాత నేను స్నానము

చేసెదను. అని రాజు చెప్పగానే యోగి స్నానముచేసి యాహ్నికము నెఱవేర్చుకొని యుండెను. తరువాత రాజును నట్లేచేసెను. ఇట్లే ప్రతిపని యోగిచేతనే ముందుచేయించెను. తరువాత యోగి కత్తి చేతబట్టుకొని రాజును నమస్కరింపుమనుడు రాజు యోగివర్యా ! నీవే ముందుగా నమస్కారము గూడ జేసిచూపించుమని యాదరముగాబలికెను. యోగి నమస్కరించుచుండగా రాజు చంద్రహాసము పట్టుకొని యొక్కవేటున కక్కపటిని గాళికకు బలియిచ్చెను. వెంటనే దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము గురిసినది. గంధర్వులు పాడిరి. అచ్చరలాడిరి. దేవతలు రాజునకు జయజయధ్వనులు పలికిరి. భక్తవత్సల యగుకాళి ప్రత్యక్షమై రాజున కిట్లనియె రాజా ! నీమనసులో నిష్టమయిన వరము వేడుము అనగానే రాజితరులకు దుర్లభమయిన యాదేవిదయకు బాత్రుడై తల్లీ ! నేను స్మరించినతోడనే దేవాంగుడు బేతాళరూపముతో నాదగ్గఱకు రావలయును. నన్నుజక్రవర్తిని జేయుము. దీర్ఘాయునిమ్ము. నాకింతకన్న నక్కఱలేదు. అనిరాజు ప్రార్థించినతోడనే యట్లేయగునని దేవియంతర్ధానమయినది. ఆయంబయొద్ద ననుజ్ఞపుచ్చుకొని రాజుజ్జయినిలోనికి వచ్చి జరిగినయాపద్వృత్తాంతమును సంతోష పూర్వకముగా సభలోనివారికందఱకునుజెప్పెను. నందిమాగధులు స్తోత్రపాఠములు చేయుచుండగా నింద్రుడిచ్చినసింహాసనముపై గూర్చుండి సామంతరాజులు సేవించుచుండ దేవరాజు స్వర్గలోకము బాలించుచుండునట్లు విక్రమార్కుడు చతుస్సము ద్రముద్రితభూమినే కాకుండ ద్వీపాంతరములను గూడ జయించి యవియు నేలుచుండెను. అట్టిమహారాజు రాజ్యమేలుచుండగ నప్పటిప్రజ లెట్లుండురో వేఱుగ జెప్పవలయునా ? రాజెట్టివాడయిన బ్రజలును నట్టివారే కదా యగుదురు. ఇది బేతాళరూపు డయినదేవాంగునియొక్కయు నతనిభార్యయగు దేవదత్తయొక్కయు శాపమును విడిపించిన కథ. ఇది చదివినవారికిని వినినవారికిని భూతబేతాళ బ్రహ్మ రాక్షస శాకినీఢాకిన్యాదిభూతములవలన భయ ముండదు. సదా దీనిని భక్తశ్రద్ధా తాత్పర్యములతో జదివినవారి కీశ్వరునిదయవలన జన్మాంతర మునసైనను దప్పక యష్టసిద్ధులునుగలుగును. మఱియు నిది యీశ్వరుని మానసపుత్రుడయిన దేవాంగునిచరిత్రగనుక దీనిని జదివినవారిని బార్వతీపరమేశ్వ రులు ప్రేమగా గాపాడుచుందురు. మునులారా ! ఈదేవాంగునిచరిత్రమును బ్రహ్మదేవుడు నారదాదిమునులకు జెప్పెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరిత్రమున బేతాళమోక్షణమన్నది యిరువదియయిదవ యధ్యాయము.

ఇరువదియాఱవ యధ్యాయము

సూతు - ఒకనాడు శివుడు కైలాసముపై నిండుకొలువైయుండుగా నారదుడు వచ్చి యాయన ననేకవిధములుగా స్తుతిచేయ మొదలిడి యాపాటలతోనే తనకు సర్వసిద్ధులును గలుగునట్లును సిద్ధులకు సిద్ధులిచ్చుశక్తి గలుగునట్లును, తానుగుబేరునితో సమముగా గీర్తియుధనము గలవాడగునట్లును చిరకాలము బ్రదుకునట్లును సంపదగలుగునట్టును వరము గోరెను. అతనిభక్తికిసంతోషించి కోరినవరములన్నియు దయచేసి నారదుని జూచి శివభగవానుడిట్లనియె నారదా ! నీవుత్రిలోకసంచారివి. భూలోకములోని విశేషములెవ్వియైననున్నచో వెంటనే విన్నవించుకొనుము. సావధానముగా జిత్తగింతుము. అని శివుడడుగగా నారదు డిట్లనియె దేవా ! భూలోకవృత్తాంతము విన్నవించుకొనుటకే వచ్చితిని. కలిముదిరిన కొలది భూమిపై నపశబ్దములంతటను వ్యాపించెను. వ్యాకరణము వేదములు తెలిసినవారులేరు. సర్వకర్మములయొక్క యర్థములను జూపుఋగ్యజుస్సామాథర్వణ వేదములను, పదక్రమ జటాదులను జెప్పువారేలేరు. వేదగ్రంథములయందు, శాస్త్రగ్రంథములయందు, ఆగమములయందు, పురాణములయందు శబ్దసౌష్ఠవము లేదు. వేదాంగములను, మీమాంసాతర్కములను ఇతిహాసములను దెలిసినవారు లేరు. బ్రాహ్మణులందఱును పురాణాదులయర్థములను దెలిసీ తెలియనివారై యుండిరి. నేయేలా ? ఒక్కభోజరాజ తక్క దక్కినవా రెవరును విద్వాంసులుగారు. అనియిట్లు శివునియెదుట నారదుడు చెప్పుచుండగా వచ్చట వినుచున్న మునీశ్వరు లలో హాహాకారము పుట్టినది. శివభగవానుడది యంతయు విని యాసభలో నున్నతనమానసపుత్రుని దేవాంగుని జూచియిట్లనియె. ఓయీదేవాంగా ! నీవు సర్వజ్ఞుడవు వేదశాస్త్రములు దెలిసినవాడవు. నాఫాలనేత్రమునుండి పుట్టినవాడ నగుటంజేసి నాయంతటిజ్ఞానము గలవాడవయితివి. అఱువది నాలుగుకలలను దెలిసినవాడవు నీవే. నీకంటె మూడులోకములయందును మఱియొకడు లేడు. మహామతీ ! ఇపుడు నారాదుడు చెప్పినదంతయు వింటివిగదా ! కావున నీవు వేగముగా వివేకము జ్ఞానము లేని భూలోకమునకేగుము. అచ్చట నున్నబ్రాహ్మణుల నందఱును బండితులను జేయుము. భూమిలోకమునందుండు గ్రంథములన్నియు నపశబ్దములతోనిండియున్నవి. అవియన్నియు బాగుగా సంస్కరించి తప్పులు లేకుండ వ్రాయుము. మఱియు నీవు భూమిలో దొమ్మిది వ్యాకరణములు శిష్యులకు జెప్పుము. వేదములు వేదాంగములు శాస్త్రములు బాగుగా వ్యాపింపజేయుము. అని యిట్లు శివుడాజ్ఞాపించినతోడనే యతడు భక్తకల్పవృక్షమగు శివువిట్లు ప్రార్థించెను.

దేవా ! నేను మనుష్యశరీరము నవలంబించి యెచ్చట నున్నప్పటి కిని సదా నీపాదములయందు స్థిర మైనభక్తి యుండులాగున వరమిమ్ము. అని కోరగానే శివుడట్లే యని వర మిచ్చి భూలోకమునకు బంపెను. తరువాతను దేవాంగుడు శివునకు బ్రదక్షిణనమస్కారములు జేసి సూర్యకోటి సమప్రభమగువిమాన మెక్కి సంతోషముగా భూలోకమునకు వచ్చెను. పిదప బ్రాహ్మణరూపమును ధరించి విమానము దిగి బ్రహ్మవర్చసముచే రెండవ సూర్యునివలె బ్రకాశించచుండెను. అతడు దివ్యాభరణములను ధరించి నుదుట మూడు రేఖలుగా విభూతి దిద్ది నవరత్న ఖచితములయినకుండలములు గండములపయి దాండవ మాడుచుండగా బంగారు యజ్ఞోపవీతము గలిగి చేతికి బవిత్రము పెట్టుకొని సంతతము పంచాక్షరిని జపించుచు జేతులయందు నవరత్నఖచితములయి సింగపుదలలచే బనితనముగా జేయబడిన కంకణాదులు వేలుగుచుండగా ధారాపట్టణములో బ్రవేశించెను. దేవేంద్రునియమరా వతిని మించియున్న యాపట్టణములోని యాయావిశేషము లను జూచుచు భోజరాజును జూచు కుతూహలముతో రాజమార్గమునుండి పోవుచుండగా నతనిని జూచిన వారెల్ల బూజింప మొదలిడిరి. క్రమముగా బృహస్పతి దేవసభలో బ్రవేశించినట్లు దేవాంగుడు భోజరాజసభలో బ్రవేశించెను. నవరత్న ఖచితసింహాసనముపై నుదయగిరి పై వెలుగుచుండు బాలసూర్యునివలె నొప్పుచు శరీరమును ధరించి వచ్చిన మన్మథుడేమో యనిచూపఱకు భ్రాంతిని గలిగించుచు సామంతరాజులచే సేవింపబడుచు నందిమాగధుల స్తోత్రపాఠము లాలించుచు సర్వాంగ సుందరులగు సుందరులు వింజామరలు వీచుచుండుగా సామాద్యుపాయ ముల నెఱింగిన మంత్రులకు సమాధానము చెప్పుచునుండు భోజరాజును దేవాంగుడు చూచెను. అతడును దేవాంగుని జూచి సగౌరవముగా సింహాసనము దిగి యాతనికి సాష్టాంగ దండ ప్రణామము లాచరించి యుచితాసనముపై గూర్చుండ బెట్టి కుశలాదులడిగి యిట్లనియె. ఓ పండిత సార్వభౌమా ! ఏ దేశము నుండి వచ్చుచున్నావు ? తేజస్సుచే నిన్ను బ్రాహ్మణునిగా దలంచుచున్నాను. నీవు బ్రహ్మవా ? శివుడవా ? విష్ణుమూర్తివా ? నీ వెవరో యసాధారుణుడవుగాని సామాన్యవ్యక్తివి గావనినమ్ముచున్నాను. కావున నీవే యథార్థము చెప్పి నాసందియమును దీర్పవలయునని కోరగానా దేవాంగుడు భోజమహారాజుతో నిట్లనియె. రాజేంద్రా ! నేను వరరుచి యనువాడను. కాశీదేశము నుండి యిక్కడికి వచ్చితిని. మాయమ్మపేరు పార్వతి, తండ్రిపేరు శంకరుడు. నేను సర్వశాస్త్రములు సర్వవేదములు చదివితిని. నాకు దెలియని పురాణేతిహాసములు లేవు. ఇది యది

యను నేల ? అన్ని విద్యలును నాకు జిహ్వాగ్రమందున్నవి. పదు నెనిమిది పురాణములును దెలియును. ఆగమగ్రంథములు చదివితిని. స్మృతిగ్రంథము లన్నియు స్మృతిపథమం దుంచితిని. సర్వబ్రాహ్మణులును నాకు వందనము లాచ రింతురు. కావ్యాలంకారములయొక్కయు నాటకగ్రంథముల యొక్కయు జంపూగ్రంథ ములయొక్కయు తత్త్వము నాకు బాగుగా దెలిసియున్నది. పదక్రమజటలలో నన్నెవరును గెలువజాలరు. వేదములకు నేనే యుత్తమగురుడను. వేయిమాటలు చెప్పి యేమిప్రయోజనము నే నొకటేమాట చెప్పెదను వినుము. లోకు లందఱును నన్ను సర్వజ్ఞుడందరు అది యట్టిదే అని యిట్లు పలుకుచున్న వరరుచిని బహువిధములుగా భోజరాజు గౌరవించి ధనధాన్యసమృద్ధి మయిన దివ్యభవన మొకటి యాయన కిచ్చెను. మఱియు నూఱు మదపుటేనుగులను, మంచిజాతివి వేయిగుఱ్ఱములను, కుండలాద్యలంకారములను, ఆమూల్యములగు వస్త్రములను రత్నాలవి ముత్యాలవి హారములను నిచ్చి సన్మానించి యాయనను దనసభలో నధికారినిగాను విద్యచ్చూడామణినిగాను నిర్ణయించెను. తరువాతను వరరుచిని జూచి భోజుడిట్లనియె. అయ్యా ! వరరుచిపం డితులవారూ ! సాదరముగా నాపలుకు వినుడు. తా మీబ్రాహ్మణుల కందఱకును వేదములు శాస్త్రములు నేర్పుదురు గాక. మఱియు ఆగమములు, అష్టాదశ పురాణములు, పదక్రమజటలు, నవవ్యాకరణ ములు, శబ్దసొష్ఠనవిజ్ఞానము బ్రాహ్మణులకు గలుగునట్లు చేయుడు. అని భోజుడు చెప్పగానే యావరరుచి బ్రాహ్మణులందఱకును సమస్తవిద్యలను జెప్పి గొప్పవారినిగా జేసెను. బ్రాహ్మణులందఱిలోనను దానే యుత్తము డనిపించుకొనుచుండెను. ఇట్లుండుగా నుజ్జయినీపట్టణములో భట్టాచార్యుడను బ్రాహ్మణుడొకడు గలడు. ఆతని కతిసుందరి కలావతియను కుమారిత గలదు. ఆమె సర్వశాస్త్రములు, వేదవేదాంగములు, సంగీతవిద్య, నాట్యవేదము, మొదలగునవి యన్నియు నెఱింగిన జాణ, శుచిస్మిత యగునాసుందరి పెనిమిటికై యిట్లు ప్రతిజ్ఞ పట్టినది. "మన్మథసుం దరడగు నెవడు నన్ను విద్యావాదములో గెల్చునో ఆకవీశ్వరుని నేను దప్పక పెండ్లియాడెదను" అను నామెప్రతిజ్ఞ విని నానాదేశములనుండి పండితులు వచ్చి యామె నోడింపబోయి యోటమిచెంది తిలదానము పట్టిన బ్రాహ్మణులవలె మోమువంచుకొని వచ్చినదారినే పోవుచుండెడివారు. ఇట్లుండగా నొకప్పుడు వరరుచి యీవృత్తాంతమంతయు విని భోజరాజుచే ననుజ్ఞాతుడై యుజ్జయినీపట్టణ మును గూర్చి పోయెను. క్రమముగా భట్టాచార్యుని యింటికి వెళ్ళి సర్వాంగసుందరియగు నాతని కూతును గలావతి యనుదానిని జూచి సుందరీ !

నేను నిన్ను వాదములో జయించి పెండ్లియాడుటకై వచ్చితిని. ఏమిచెప్పెదవో చెప్పుము. అని యత డవగానే యామె చిఱునగవు మొగము నలంకరింప గర్వముతో నిట్లనియె అయ్యా ! విద్వాంసుడా ! మహావృద్ధవు. మీది యేదేశము ? నీపేరేమి ? నీకెందులో బాండిత్యము గలదు ? వేదములలోనా శాస్త్రములలోనా ? నాటకాలకారసాహిత్యమునందా ? లేక పురాణదులయందా ? యధార్థము చెప్పుము. అన నతడిట్లనియె గంగాతీరమందు వారాణసి యనుపట్టణము గలదు. అది విశ్వనాథునకును విశాలాక్షికిని నివాసస్థానము నానిస్థానమచ్చుటనే నాపేరు వరరుచి యందురు. నేను సర్వజ్ఞుడను, సరస్వతి నానాలుకపై దాండవ మాడుచుండును. అమ్మాయీ ! నీకేగ్రంథములలో బరిశ్రమ గలదో వానిలోనే ప్రసంగింతములెమ్ము. అని యతడుచెప్పినపిదప నుభయులకును వాదము ముదిరినది. ఒకరి నొకరు జయించు నభిలాష గలిగి యున్నవారుగాని జయాపజయములు లేవు. వినుటకై వచ్చిన పండితుల యానందమునకు మితిలేదు. తరువాతను బ్రాజ్ఞుడగువరరుచి యామెను దప్పక జయింతమను బుద్ధిచే వేదాంత ప్రసంగము లోనికి దింపెను. ఆమె వేదాంతశాస్త్ర మంతబాగుగా జదువలేదు. కావున వరరుచి యామెను జయించినవాడాయెను. అపుడు వరరుచి యామెతో నిట్లనియె. కలావతీ ! నిన్ను నేను వేదాంతశాస్త్రములో జయించితిని కనుక నన్ను బెండ్లియాడుము. అను నతనిమాటలు విని యాభట్టాచార్యునికుమారిత వేళాకోళముగా నిట్లనియె ఓయీ ! వరరుచీ ! మూఢా ! నీవు మిక్కిలిని వృద్ధుడవు. నీజుట్టంతయు ముగ్గుబుట్టవలె బండియున్నది. దంతములా లేవాయెను. చేతులగోళ్ళా అంతకుమున్నే లేవాయెను. లోకములో స్త్రీలు కేళిసమయమున దంతక్షత నఖక్షతముల నపేక్షింతురుగదా ! నిన్ను నేను బెండ్లియాడినచో నాయధర స్తనములయందు దంతక్షతనఖక్షతములు చేయు వారెవ్వరో ముందుగా జెప్పుము. అవునయ్యా వరరుచిపండితుండా వృద్ధస్యతరుణీ విషం అను నీతికోవిదులమాట విననేలేదా ? నీవేమో పెద్దపండితుండనే. అదిగాక యింతముసలివాడవు గదా నీకు రతిసామర్థ్య మెక్కడిది ? నేను దరుణిని నన్ను సంతోషపెట్టువా రెవరున్నారు ? స్త్రీలకు రెండురెట్లు భోజనము నాలుగురెట్లు బుద్ధి, ఆఱురెట్లు సాహసము, ఎనిమిది రెట్లుకామము పురుషులకంటెహెచ్చుని యందురు గదా ! అదియైననువిన లేదటయ్యా ! సర్వజ్ఞుడనేమో ? లోకజ్ఞానము తెలియకపోయెనే ! ఇక నెక్కడిసర్వజ్ఞత్వ మయ్యా సర్వాంగసుందరి యగురంభ యెక్కడ ? ధర్మశూన్యుడయి నరక మనుభవించుపరమపాపి యెక్కడ ? దివ్యసుందరవిగ్రహ యగుశచీదేవి యేడ ?

మృతి శీల మగుదేహముగల నహుషుడేడ ? కొంకినక్క యెక్కడ ? స్వర్గలోకమేకడ ? అనియిట్లనేక విధములుగా ధిక్కరించుటచే వరరుచి మహాకోపియై యాపూబోణి కిట్లనియె మూర్ఖురాలా ! అనదగినమాట అనదగనిమాట యెఱుగవు ! పండితురాల ననిమాత్రము గర్వించుచున్నావు. బ్రాహ్మణవంశమున కపకీర్తి దెచ్చుటకై పుట్టిన నీవంటి పరమమూర్ఖురాలితో మాటలాడనేరాదు. అవును నీవన్నట్లే కుక్క యెక్కడ ? పురోడాశ మెక్కడ ? రాక్షసి యెక్కడ ? అమృత మెక్కడ ? గాడిదయేడ ? గందమేడ ? నీవంటియాడుది యేడ ? నావంటిమహాపండితు డేడ ? అయినను నీహితమునకై కొంచెము చెప్పెదను వినుము. నీవు మహాకోపినివలె నగపడుచున్నావు. నేను జెప్పినమాట నీ కిష్టమయినచోనట్లు చేయుము. నాకంటె బండితుడు నాకొడుకు న్నాడు. రెండవమన్మథునివలెనే యుండును.రాజాధిరాజులు ముందు వానిని గౌరవించి పిదప నన్ను గౌరవింతురు. వాదిమత్తేభపంచాస్యుడని బిరుదము నొందినవాడు నీకిష్టమైనచో వానిని బెండ్లియాడుము. అని యతడు చెప్పినసంగతి కానతి యంగకరించినది. ఇది చాలబాగుగా నున్నదన్నది. తరువాతను బుద్ధిమంతు డగువరరుచి యామెచే ననుజ్ఞాతుడయి భట్టాచార్యునియొద్ద సెలవంది బయట వచ్చి క్రమముగా నింటికి బ్రవేశించి కలావతి యన్న చేడుమాటలు తలంచుకొని దీర్ఘకోప మవలంబించెను. అట్టికోపమును సార్థకపఱుచుకొందమని యిట్లు యోజింప మొదలిడెను. ఆధూర్తురాలు నన్ను మొగముచూడకుండ నవాచ్యములన్నది గనుక దానికి బుద్ధిహీను డయినగాడిదలకాపరిని బెండ్లిచేసి యప్పుడు నాకోపము చల్లార్పుకోవలయును. అని యాలోచించుచు నా పట్టణములోనే పండితపామరులచే గౌరవింపబడుచు నుండెను. ఒకనాడు వరరుచి స్నానముచేయుటకై యూరిబయ టకు బోవుచుండగా త్రోవలోనొక ! దివ్యమయిన తామరకొలను గనుపడినది. వరరుచి యందు స్నానముచేసి పొడిగుడ్డలు గట్టుకొని పుష్పదర్భాంబుసహితముగా సూర్య భగవానున కర్ఘ్య మిచ్చి నిత్యకృత్యములు నెఱవేర్చుకొని యింటికి బోబోవుచుండగా నాసమీపమున నొకానొకడు బ్రాహ్మ ణాకారము గలవాడు మేకలను గాడిదలను మేతకు దోలుకొనిపోవుచు నగపడెను. వరరుచి వానిదగ్గఱకు బోయి బ్రాహ్మణాకృతిగల యోపిల్లవాడా ! నీపేరేమి ? నీ తల్లిదండ్రు లెవరు ? నీయిల్లెక్కడ ? నాతో జెప్పుమనువుడు పసులకాపరి యాశ్చర్యపడుచు నిట్లనియె. వరరుచిగారూ ! నేను బ్రాహ్మణనికుమారుడను, నాతండ్రిపేరు మాధవశర్మ, తల్లిపేరు లక్ష్మి బ్రహ్మవాది యగునాతండ్రి నాకయిదవయేట నుపనయనము చేసి మాయమ్మతో గూడ నుత్తరలోకములకు బోయెను. నాపేరు కవరత్నము, ఇపుడు

నేను మేకలను గాడిదలను గాయుచున్నాను. ఇది నీచపుపని యయినను జీవనార్థ మవలంబించితిని, అతనిమాటలు విని వరరుచి కొంతసేపాలోచించి యిట్లనియె. అబ్బాయీ ! ఈమేకలను గాడిదలను నీయజమానున కప్పగించి యతనియొద్ద సెలవు పుచ్చుకొని వేగముగా రమ్ము. నీ కుపయోగించునది యొక్క మహాకార్య మున్నది. అనునప్పటి కాపిన్నవాడు చాల సంతోషించి యా బ్రాహ్మణుడు చెప్పిన చొప్పుననే చేసి వరరుచి యొద్దకు వచ్చి నిలువబడెను. వరరుచియు వచ్చియున్న కవిరత్నమునుజూచి "కవిరత్నం ! సావకాశముగా నామాటలు వినుము. ఈ యూరిలో భట్టాచార్యులనెఱుగుదవు గదా. అతనికూతురు కలావతి మహావిద్వాంసు రాలు. అది రెండవసరస్వతియే. దానిని నీకు బెండ్లిచేసెదను.కాని నేను జెప్పిన మాటలు మాత్రము రెండవవారికి దెలియకుండ మనస్సులోనే యుంచుకొని యట్లే చేయుము. ఆకలావతి నిన్నేప్రశ్న చేసినను మౌనముతోనే బదులు చెప్పుచుండుము. నిన్ను జూచి విద్వన్ ! ఎన్ని విద్యలు చదువుకొంటివనియడుగును. అప్పుడు నాలుగ వ్రేళ్ళుమాత్రమే చూపుము. మఱియేమి చదువుకొన్నానని యడిగినపు డాఱువ్రేళ్ళు చూపుము. మరల నెన్నివిద్యలు చదువుకొన్నావనిన నాలుగువ్రేళ్ళు చూపుము. ఈ జగత్తునకు సృష్టి మొదలయినవి చేయువారెందఱని యడిగినప్పుడొక్క వ్రేలుమాత్రమే చూపించుము. అనెను. ఆపిన్నవాడును జ్ఞప్తియందుంచుకొని యట్లేచేయుదుననెను. తరువాతను వరరుచి వానిని దనయింటికి దెచ్చి యాడువాండ్రచే స్నానాదికము చేయించి యనేక భూషణములతో నలంకరించి బంగారుపల్లకీలో గూర్చుండబెట్టి పండితులచే మోయించుకొనివచ్చెను. ఆపల్లకీ మోయుపండితులు పూర్వమా కలావతితో వాదించి యోడినవారే. ఇంతట నచ్చట మహాకోలాహలము గలిగినది. ఇంత మహావిద్వాంసుడుండబోడని చూచినవారందఱును జెప్పుకొనుచుండిరి. రాజమార్గములలో నిసుకవైచినరాలకుండనున్నది. ఇట్లు వరరుచి క్రమముగా వానిని గలావతిమందిరమునకు బల్లకీతో మోయించుకొని రాగా గలావతి సూర్యసమాన ముగా దేజశ్శాలియు, దివ్యాభరణభూషితుడును, దివ్యపీతాంబరధరుడును, దివ్యగం ధమాల్యోపశోభితుడునునగు పిన్నవానిని జూచి యత్యాశ్చర్యసముద్రములో మునిగి యిత డెవరని యడిగినది. వరరుచి వీడే నాకుమారుడు. సర్వవిద్యాపారంగతుడు సర్వజ్ఞుడు వీని పేరు కవిరత్నము రాజరాజులచే సభలలో గౌరవింపబడుచుం డువాడు వేయేలా ? వీడు సరస్వతియొక్క పురుషావతారమే సంశయము లేదు. వీడు ప్రాకృతులగు విద్వాంసులతో బ్రసంగింపడు. ఎవడు ప్రశ్నించినను మౌనముగా బదులు చెప్పుచుండును. అమ్మాయీ ! వీనిని బెండ్లియాడుటకు నీమనస్సు

త్వరపడుచున్నదేని వేగము పెండ్లియాడుము. ఇటువంటివరుడు దొరకుట సామాన్యమయిన సంగతి గాదు. అని చెప్పినయాతని మాటలు విని మహాప్రాజ్ఞురాలగుకలావతి గంభీరముగా నిట్లనియె వరరుచీ ! ఈ నీకుమారుడు సర్వజ్ఞుడే యయినచో వెంటనే నే నడుగుప్రశ్నలకు బదులు చెప్పునుగాక. అని యచ్చటి పండితులందఱును వినుచుండగా నాపిన్నవానితో నిట్లనియె విద్వన్ ! నీవెన్ని విద్యలు చదువుకొంటివనగా నతడు నాలుగువ్రేళ్ళు చూపించెను. మరల నేమి చదువుకొంటి వన నాఱువ్రేళ్ళు చూపించెను. మఱియు నేమి చదివితి వనగానే నాలుగువ్రేళ్ళు చూపించెను. ఈజగత్తునకు సృష్టిస్థితిసంహారములు చేయువారెందఱన నత డాదరముగా నొకేవ్రేలు చూపించెను. ఇట్లన్నిప్రశ్నలకును వ్రేళ్ళు చూపించిన తోడనే యాకలావతి వరరుచి నభిప్రాయమడుగగా నతడిట్లనియె ఇతడు గురువునొద్ద, నాలుగువేదములును జదివెను. గనుక నాలుగు వ్రేళ్ళు చూపించెను. ఇతడు వేదాంగములాఱును గురువునొద్ద జదివెను గనుక నాఱువ్రేళ్ళు చూపించెను. పురాణవిద్య ధర్మశాస్త్రము మీమాంస న్యాయవిస్తరము చదివినందులకై నాలుగు వ్రేళ్ళు చూపించెను. ఈజగత్తునకు సృష్టిస్థితిసంహారములు చేయువాడు పరబ్రహ్మమొక్కడేయని యొకవ్రేలు చూపించెను. అని యిట్లు వరరుచి చెప్పిన సమాధానము విని కలావతి మనస్సులో నాలోచించి పరమానందభరితురాలయినది. తరువాత నామె చిత్తరువులతో గూడినగోడయొకటి చూపి వరా ! ఈపదితలలు ఇరువదిచేతులును గలవాడెవరో వేగముగా జెప్పుమనపుడు వటుడు వరరుచి చెప్పినమాటలు మఱచిపోయి వీడు రాభణుడు కాడా యనెను. ఓయీ ! నీవు సర్వము నెఱిగినవాడవు గదా రాభణుడని యెట్లంటివని యామె యనుడు వరరుచి యామెయనుమానము పోవులాగున "కుంభకర్ణునిలో భకారమున్నది. విభీషణునిలో భకారమున్నది రాక్షసులకులములో ముఖ్యుడగు నితడు రాభణాసురుడే కాని రావణాసురు డెంతమాత్రమును గాడని వీనితాత్పర్యము. ఇంతకును సర్వజ్ఞుడగుటచే వీడేమన్నను జెల్లుటకేమియు నభ్యంతరము లేదు. వీనిమాటను గాదనుపండితుడే యుండడు. నందిని పందిని, పందిని నందిని జేయగల సామర్థ్యము గలదు" అని వరరుచి యుక్తియుక్తముగా బలుకగా గలావతి యానందభరితురాలయినది. తరువాతను వరరుచి భట్టాచార్యులను బిలిచి తనకుమారునికి గన్యాప్రదానము చేయుమనెను. భట్టాచార్యుడట్లే చేయుదునని యొప్పుకొనెను. పిదప మంచి ముహూర్తమున వివాహ మహోత్సవము జరిపిరి. బ్రాహ్మణోత్తములు వేదమంత్రములు చదివిరి. భట్టాచార్యునియిల్లు వాద్యములతోను, ఆటలుపాటలు

మొదలగువానితో నిండిపోయినది వధూవరులకు మంగళస్నానములు చేయించి సర్వాభరణభూషితులనుగా జేసి కళ్యాణమంటపము మీదికి దెచ్చిరి. నవరత్న నిర్మిత మయిన పెండ్లి యరుగుమీద వధూవరులు రోహిణి చంద్రులవలె వెలుగుచున్నారు. పిదప బురోహితుడగ్నిని బ్రతిష్ఠాపించి యధావిధిగా బ్రాహ్మణులతో గూడ హోమములు చేసెను. భట్టాచార్యుడు ధర్మపత్నీ సమేతముగా బీటమీదను గూర్చుండి యల్లునితో నిట్లనియె కవిరత్నం ఇటురమ్ము నాకుమారితను నీకుదారపోయుదును. ఇది మహాప్రాజ్ఞురాలు నీవు సర్వజ్ఞుడవు కావున దీనిని సహధర్మ చారిణినిగా బరిగ్రహింపుము. అని చెప్పి యతనిచేతిలో సమంత్రకముగా దారవోసి యప్పగించెను. బుద్ధిమంతుడగు కవిరత్న మాకన్యారత్నము యొక్క హస్తమును దనహస్తముతో బట్టుకొనెను. అపుడు వాద్యముల మంగళఘోష మాకాశము నంటినది. బ్రాహ్మణుల యాశీర్వాదధ్వనులామంగళవాద్యధ్వనుల నతిక్రమించినవి. భట్టాచార్యుడు పండితులకు భూరిదక్షిణలిచ్చెను. ఈరీతిగా గవిరత్న కలావతులకు వివాహ మహోత్సవము జరుగగా బట్టణములోనిసువాసినులు మంగళగీతములు పాడును. నీరాజనములు పట్టిరి. ఉజ్జయినీపట్టణములోనివా రందఱును సంతోషించిరి. మఱికొన్నాళ్ళకు గలావతి రజస్వలయయినది. నాలననాడు గర్భాదాన మహోత్సవముచేయ నిశ్చయించిరి. ఆరాత్రి పండితులకు ఫలదానము లిచ్చిరి. పెండ్లికుమారుడు ముందుగా గేళిమందిరమునకు బోయి నిద్ర పోయెను. తరువాతను గలావతి లోపలికి బోయి భర్త నిద్రపోవుచున్నాడని తెలిసికొని మేల్కొలుప బోయినది. ఎంతపిలిచినను బలుకమిచే వీణపట్టి వాయించినది. ఎంతసేపు పాడినను మేల్కొనకుండుట చూచివాని వక్షస్థలముపై గంధపునీరు పోసినది. అప్పటికిని మెలుకవరాక యుంటచేదన నోటిలోని తాంబూల మాతనినోట బెట్టినది. అతడు నిద్రలో నిట్లుపలవరింప మొదలిడెను. ముందుగా మేకలు గాడిదలు ధ్వనిచేసినవి. తరువాతను నాగుండెల మీద మూత్రించినవి. ఆపిదప నానోటిలో బురీషించినవి. అనియిట్లు నిద్రపోవుచున్న భర్త యన్నమాటలు విని యనుమానపడి యామె వెంటనే చెలికత్తియలను బిలిచి లేపించి యిట్లనియె. నీవెవరు ? బ్రాహ్మణుడవా కావా ? నీవు నిజముగా వరరుచి కొమారుడవు గావు. నిజము చెప్పుము. నీమాటలును బట్టి చూడగా నీవు పండితుడవు కావని నిశ్చయమయినది. "నీవు నిజముగా మేకలను గాడిదలను గాచువాడనే. ఇట్లడిగిన భార్యమాటలు విని యమాయికు డగుటచే దనవృత్తాంత మంతయు జెప్పెను. అది విని యిది యంతయు వరరుచి చేసినకృత్రిమము గదా యని నిశ్చయించుకొని

గతజలసేతు బంధనము చేసి, యేమిప్రయోజనమనియనుకొని యింతకును దైవ యత్నమును దప్పించుకొనువారు లేరు. అయినను వీలయినంతలో బుద్ధిని వినియోగించి మంచిస్థితిలోనికి దేవలయును గదా యని నిశ్చయించి యప్పటికి దగుగతిని మగనితో నిట్లన్నది. ఈ యుజ్జయినీపట్టణమును రక్షించు కాళి తనపట్టణమును జూచుటకు బయటికి వెళ్లియుండును. పట్టణమంతయు దిరిగి కొంతసేపటికి శక్తిసేనాపరివృతురాలై రాగలదు. కావున నీ విపుడే పోయి యాదేవళములో దలుపు మూసికొని కూర్చుండుము. దేవి వచ్చి నిన్ను దలుపు తీయుమనినచో వెంటనే గడియ దీసి యామెను సాష్టాంగదండనమస్కారములు చేసి తల్లీ ! నాకు విద్యాదానము చేయుము అని ప్రార్థించుము అని యీరీతిగా గలావతి మగనికి దెలిపి చెలికత్తెను దోడిచ్చి కాళికాలయమునకు పంపినది అతడట్లే దేవళములో గూర్చుండి తలుపు మూసికొని యుండెను. భక్తులపాలింట గామధేనువగు నాయంబను మనస్ఫూర్తిగా ధ్యానించుచుండగా నింతట గాళి వచ్చి యెవరు లోపల ? వేగము తలుపు గడియ తీయు మనగానే యోగినీగణసేవితురాలగు నాయంబతో నతడిట్లనియె తల్లీ ! నాజడత్వ మనుగడియ విడిపోవులాగున విద్య నిచ్చితివేని నీకు దలుపు తీసెదను. నీకు నమస్కరించుచున్నాను. నాకు విద్యాదాన మిమ్ము. అను వానిమాటలు విని యాయంబ దగ్గఱనే యున్న బాలయు, ముద్రిణియు వారాహియు, గోపించి యమ్మా! సెలవిమ్ము. మే మీ దుర్మార్గు నిపుడే భక్షింతుము. అనుశక్తులమాట విని దేవి యిట్లనియె. వీడు పూర్వజన్మమునందు నాభక్తుడు సామంత్రము జపముచేయుచు నన్ను మిక్కిలిగా బూజించెను. కావున నిపుడు నేను వీనిమనోరథమును బూర్తిచేసెదను. అని వారితో జెప్పి కాళి, బ్రాహ్మణునితో నిట్లనియె. ఓరీ ! నాలుక చాపుము. అనగానే వాడట్లే చేసెను. దేవి వానినాలుకపయిన వాగ్భవబీజమును వ్రాసినది. వెంటనే యతడు సర్వజ్ఞుడై పరమేశ్వరి ననేకవిధములుగా స్తుతిచేయ మొదలిడెను. అతడు చేసినస్తుతులకు సంతోషించి వీవిటుపయిన కాళిదాసునని ప్రసిద్ధినిబొందెదవు. నీతండ్రి నీకుంచిన కవిరత్ననామము సార్థకమయినది. కాళీదాసా ! నీవు కోరినదంతయు గరతలామలక మయి యుండును. అని వరమిచ్చి పరివారముతో గూడ నాలయములో బ్రవేశించి యంతర్ధానము నొందెను. అచ్చటి నుండి బయలుదేఱి కాళిదాసు భార్యయొద్దకు వచ్చి జరిగినసంగతి యంతయు జెప్ప నామె తనభర్త యిప్పటికి నిజముగా సర్వజ్ఞు డాయెగదాయను సంతోషముచే నతనిని మాటిమాటికి గౌగిలించుకొన్నది. అతడు శచీదేవితో నింద్రుండుంబలె నామెతో జిరకాలము క్రీడించుచుండెను. మఱికొన్నాళ్ళకు గలావతి గర్భమున నొక

కుమారుడు పుట్టెను. మహామతియగు కాళిదాసు జాతకర్మాది సంస్కారములు చేసి యాశిశువునకు గవీంద్రుడని పురోహితపురస్సరముగా నామకరణముచేసి దక్షిణాదులచే బ్రాహ్మణులను సంతోషపెట్టెను. కవీంద్రదనుపేరుగల యాశిశువు కృతోపనయనుడయి తండ్రియొద్దనే వేదములు చదివెను. అతడును దేవి యాలయమునకు బోయి వేదోక్తవిధి నాయంబను బూజింపగా భక్తవత్సలురాలగుదేవి ప్రత్యక్షమయి కవీంద్రునకు నఱువది నాలుగువిద్యలను దయచేసినది. అతడింటికి వచ్చి కాళికాప్రసాదమును దల్లిదండ్రులతో జెప్పెను. ఇట్లుండుగా నొకనాడు కొడుకు దగ్గఱ నుండగానే కాళిదాసకలావతులు విద్యాప్రసంగము ప్రారంభించిరి. వాదము ముదిరినది. నీకేమియు దెలియదని యామె భర్తనన్నది. ఆమాటతో గాళిదాసు కోపించి నీవు నాతల్లివి నీవు గురువవు. అని భార్యపాదములకు నమస్కరించి యింటి నుండి బయటికి వచ్చెను. తనకు నమస్కరించి పోవుచున్నమగని జూచి నీవీకార్యము. చేసితివి గనుక నీకు స్త్రీచేతనే మరణము గలుగును గాక యని కలావతి శపించినది. విద్వద్బృందనమస్కృతుడగు కాళిదాసు తరువాతను వేశ్యయందనురక్తుడయి యాయు జ్జయినిలోనేయుండెను. తరువాతను వరరుచి ధారాపట్టణము ప్రవేశించి యనేక విధములుగా భోజరాజుచే సన్మానింపబడుచుండెను. ప్రతిదినము రాజట్లు వరరుచిని సన్మానించుచుండుట సహింపజాలక యందఱును నొకచోటగూడి యావరరుచి మనలను దిక్కరించి రాజుచే మిగుల గౌరవింపబడుచున్నాడు. కావున వానికిని రాజునకును బెద్ద విరోధము గలిగింపవలయును. అపుడు మనమనస్సులలోని దుఃఖము చల్లాఱ వలయునని యాలోచించిరి. తరువాతను విద్వాంసులందఱును గోపపూరితు లయి రహస్యమందుండి యొకశూద్రుని రావించి వానికి వలసినంతధన మిచ్చి గౌరవించి యిట్లనిరి. ఓయీ ! శూద్రుడా ! నీవు మాకు జేయదగినకార్య మొకటి యున్నది. ఈపట్టణములో భోజరాజుచే గౌరవింప బడుచున్నవాడొకడు గలడు. వానిపేరు వరరుచి నీవును వినియే యుందువు. వానిని రాజుదగ్గఱ మాయన్న యని చెప్పుము. ఇటుపయిని నీకు గావలసినంతధన మిచ్చెదము. అని బోధించి యాశూద్రుని బంపిరి. మరునాడు తెల్లవాఱగానే వాడు భోజసభకు బోయెను. పండితులచేతను సామంతరాజులచేతను నిండియున్న యాసభకు బోయి రాజునకు నమస్కరించి పండితులందఱును వినుచుండగానిట్లని విన్నపించెను. మహాప్రాజ్ఞుడవగునోభోజ భూపాలకా ! నావిన్నపము చిత్తగించి తోచినరీతిని నావ్యవహారము పరిష్కరించుము. అనగానే యదియేదో విన్నపించుకొమ్మని రాజుత్తర నొసంగెను. రాజుగారి

యనుమతి కాగానే వాడు నిస్సంశయముగా నిట్లనియె. రాజా ! ఈవరరుచి యనువాడు నాయన్న నేనును వీడును విభక్తుల మయితిమి. నాధన మంతయు నపహరించి దేశాంతము బోయెను. ఎంత వెదకినను దొరకినవాడే కాడు. ఇన్నాళ్ళకు మీసభలో నున్నాడని తెలిసి వచ్చితిని. నాధనము నాకిప్పించుట ధర్మము. అని రాజుతో చెప్పి నిర్భయముగా వరరుచిని గట్టుకొంగు పట్టుకొని లాగమొదలుపెట్టి "అన్నా! ముందు నీవెంతధనము నాది యపహరించితివో అది యీయకుండ నిన్ను వదలువాడను గాను." అని వరరుచిని లాగుచున్నశూద్రుని జూచి సభాసదు లయినయా పండితులు పరమసంతోషభరితులయిరి. రాజు శూద్రుని జూచి యిట్లనియె. శూద్రా ! నీవ్యవహారము గొప్పది రేపు విచారించెదము. అని వానిని బంపించి పండితులను జూచి యిట్లనియె. పండితులారా ! మీరందఱును నామాటలు వినుండు. నేనిట్టి వ్యవహార మిదివఱ కెన్నడును వినియెఱుగను. రేపుమాత్ర మీవ్యవహార మెట్లు నిర్ణయింపబడగలదు ? ఇదిచాల జిక్కుగ నున్నది. గనుక మీరుగూడ యోజింపుడు. అను రాజగారిమాటలు విని సభాసదు లగుపండితులు కపటము మనసులో నుంచుకొని యిట్లు బదులు చెప్పిరి ప్రభూ ! మే మీవరరుచి యెవరో యెఱుగము వీనికి సంతతి యున్నట్లు తెలియదు. తల్లిదండ్రులసంగతి మొదలే తెలియదు. ఇతడు నిజముగా శూద్రుడే యగునేని వెంటనే బహిష్కరింప వలసియుండును. మేముగూడ జాల దక్షిణలిచ్చి ప్రాయశ్చిత్తము చేయించుకోవలసి యుండును. ఇన్నాళ్లును దెలియక యితనిని గురువని భావించుచున్నాము. బ్రాహ్మణుడై పుట్టినవాడెవడయినను శూద్రునకు నమస్కరించునా ? అని యిట్లుచెప్పిన పండితులమాటలు విని భోజుడు చింతా పరాయణుడై యప్పటికి బండితులనిండ్లకు బంపించెను. తరువాతను రాజు వరరుచినిజూచి యిట్లనియె. వరరుచీ ! నీవును వేగముగా నింటికిబొమ్ము. రేపుదయము పండితులు వచ్చునప్పటికి సభకురమ్ము. అనిచెప్పి యతనినిగూడ నింటికిబంపించి నందిమాగధులస్తుతులువినుచు దన యంతిపురిలో బ్రవేశించెను. తరువాతను వరరుచి చింతాక్రాంతచిత్తుడై యిదియంతయు బండితులు చేసినకృత్రిమ మని నిశ్చయించి యర్ధరాత్రసమయమున లేచి యపవాదని వారకముగ గంగాస్నానము చేయుటకు బయలుదేఱి తిన్నగా గాశీపట్టణము చేరి మణికర్ణికాఘట్టమున యథావిధిగా స్నానము చేసి యమఘర్షణఋక్కులను జపించెను. తరువాతను నిత్యకృత్యములు తీర్చుకొని విశ్వనాథుని విశాలాక్షిని డుండివినాయకుని మిగిలిన దేవతలను సందర్శించి నమస్కరించి తీర్థోపవాసము

జేసి విధిగాశ్రాద్ధముపెట్టి యచ్చటినుండి బయలుదేఱి గయవచ్చి గయలో బితరులకు బిండదానముచేసి ప్రయాగచేరి త్రివేణిలో మునిగియచ్చటినుండి మరల గాసివచ్చి యచ్చట నొకసంవత్సరమువఱకును విద్వత్సేవితుడైయుండెను. బుద్ధిమంతు డగు వరరుచి యొకప్పుడు మణికర్ణికకుబోయి స్నానముచేసి ఓహో భాగీరథీదేవి ! సాగరస్వర్గదాయిని ! జన్హుపుత్రి ! మహాదేవజటాజూటవిలాసిని ! అంబ ! నీదరిసెనమువలననే ముక్తి కలుగునట ! ఇక స్నానముచేసినచో నేమి ఫలము గలుగునో తెలియదు. అమ్మా ! ఇట్టి వ్యాసులమాటయే నిజమయినచో మహాపవాదకు బాలయియున్న నన్ను బవిత్రునిచేయుము. అని యనేకవిధములుగా స్తుతిచేయగా గంగ ప్రసన్నమయి నవరత్నఖచితమయిన కంకణమాపండితునికిచ్చి యిట్లన్నది. ఓయీ ! వరరుచీ ! నీకు బాపమేలేదు. అది నిజమయిన యపవాదము గాదు. సభలోని పండితులు గల్పించినది. కనుక నీవు వెంటనే భోజునిసభకు బొమ్ము. నే నిపుడిచ్చిన కంకణము చూపించి యారాజుతో "ఓ భోజభూపాలకా ! శూద్రుడే నా తమ్ముడయినచో నిట్టిది రెండవకంకణము వానిదగ్గఱ నుండవలయును గదా ! దానిని దెమ్మనుము. వాడు నిజముగా దెచ్చినచో నాకు దమ్ముడే" అనుము అని వరరుచికి బోధించి భోజపురికి బంపి గంగ తానంతర్ధాన మయినది. పిదప వరరుచి సభకువచ్చి గంగ చెప్పిన చొప్పుననే చెప్పెను. "అంత భోజరాజు శీఘ్రముగా సభకు వచ్చి శూద్రుని రప్పించి కఠినముగా నిట్లనియె. శూద్రుడా ! నీవు నిజముగా వరరుచి యనుజుడవేయయినచో నిటువంటిది హస్తకంకణమును వెంటనే మాకు జూపిం పుము. ఇది వరరుచిహస్తకంకణము నీ వతనితమ్ముడవే యయినచో నీ దగ్గఱనుగూడ నిట్టిది యుండి తీఱవలయును గదా ! అట్లు తెచ్చి చూపవేని వెంటనే నీకు శిరశ్ఛేదము చేయింతును. ఇట్లు భోజుడనగానే వాడు భయపడి గడగడ వడకుచు నిట్లనియె. ఓ మహారాజా ! నే నేకర్మమును నెఱుగను. నీసభలోనిపండితు లందఱును నేకీభవించి నాకు జాల ధన మిచ్చి యిట్లనమని బోధించిరి. కావుననే నిట్టినిందిత మయినమాటలంటిని. ఇది యథార్థము. నే నజ్ఞానము వలన జేసితిని నన్ను మన్నింపుము. నేను శూద్రుడను. అజ్ఞానిని నన్ను రక్షింపుము. అని బ్రతిమాలి పాదములమీద బడిన శూద్రుని కశాఘాతములచే నొప్పించి శాస్త్రములను బర్యాలోచించి మహాఘోరమగు కారాగృహములో నుంపించెను. తరువాతను రాజు భయముచే గడగడ వడకుచున్న పండితులను బ్రత్యేకముగా బిలిచి యనేకవిధములుగా నిందించెను. పిదప సింహాసనము నుండి దిగి మహాప్రాజ్ఞుడగు వరరుచిని కౌగిలించుకొనెను. పిదప పాదముల పై బడి నమస్కరించి

యనేకవిధములుగా సుత్తిచేసి చేతులు జోడించికొని యిట్లనియె. వరరుచీ ! నీవే శబ్దశాస్త్రమును బాగుగా దెలిసిన మహాపండితుడవు. అపశబ్దములచే నిండిన గ్రంథముల నన్నింటిని సుశబ్దములచే నలంకరించితివి. పరమ మూఢులగు బ్రాహ్మణులను మహాపండితులను జేసితిని. నీకంటె నధికుడుగాని నీతో సమానుడు గాని యగుపండితుడు లేడు. మహాత్ముడవగు నీవలన వేదశాస్త్రములు నేర్చుకొంటిని ఇటుపయిని నాకు వేదాంతశాస్త్రముగూడ నేర్పుము. అనియిట్లు భోజరాజు ప్రార్థింపగా రహస్యమగు వేదాంతశాస్త్రమంతయు బోధపఱిచెను. సర్వోపనిషత్తుల యర్థమును రాజునకు జెప్పెను. అప్పుడు వరరుచి యిట్లనియె రాజా ! జాగ్రత్స్వప్నసుషుప్తులయం దేదివ్యజ్యోతి వెలుంగుచుండునో అదియే పరబ్రహ్మమని తెలిసికొనుము. బ్రహ్మమొదలు స్తంబమువఱకును నేతేజస్సు నిండి యున్నదో అదియే పరబ్రహ్మమని తెలిసికొమ్ము. ఏది యణువుకంటె నణువుగాను, మహత్తు కంటె మహత్తునునయియున్నదో అదియేపర బ్రహ్మమని తెలిసికొమ్ము. ఏది సర్వజగత్తులకును సాక్షిభూతమయి ప్రకాశించుచుండునో అదియే పరబ్రహ్మ మనితెలిసికొమ్ము. తత్త్వమ స్యాది మహావాక్యముల యర్థములచే యోగులు దేనిని బొందుదురో అదియే పరబ్రహ్మమని తెలిసికొమ్ము. సమస్తజగత్తుల సృష్టిస్థితి సంహారము కేదికారణమో అదియే పరబ్రహ్మమని తెలిసికొమ్ము. దేనివెలుగు ననుసరించి సూర్యు డాకాశమున వెలుగుచుండునో అదియే పరబ్రహ్మమని తెలిసికో ఎవనియాజ్ఞచే మహేంద్రాదులు తమతమపనులయందు బ్రవర్తింతురో అదియే పరబ్రహ్మమని తెలిసికొనుము. బ్రహ్మ విష్ణుశివాదుల కేదిధ్యానింప దగినవస్తువో అదియే పరబ్రహ్మమని తెలిసికొనుము. అని యీరీతిగా ననేకవిధములుగా మాటి మాటికిని బోధపఱిచి యపుడు వరరుచి చిఱునగవుతో నిట్లనియె. రాజేంద్రా ! ఈనీసభాసదులందఱును నిస్సందేహముగా గృతఘ్నులే. కాని వారిపైని గోపింప కుము. ఈబ్రాహ్మణులవిషయమై చేసినయుపకారము బూడిదలో వ్రేల్చినహవిస్సు చందమయినదని యెఱుంగుదును. బ్రాహ్మణులు పరస్పరము సహజశత్రువులు కుక్కలు, సింహములు, గజములు నెట్లోయట్లే వీరును బోరాడుచుందురు. పూర్వము పితృవధచే గోపించిన ప్రతాపవంతుడగు పరశురాముడు తనపరశువుచే భూమి నిరువదియొక్కమాఱు నిఃక్షత్రియనుగాజేసి యారాజుల రక్తముచే బితరులకు దర్పణము చేసి వారిమంచి మాటలచే మరల శాంతించెను. అపుడు భూమినంతను కాశ్యపునకు దారవోసెను. పిదప కాశ్యపుడు పరశురామునితో యట్లనియె ఓయీ ! రామా ! నీవు రాజులనందఱను జంపితివి. నీవే నాకీభూమినంతయు దాన

మిచ్చితివి. అట్టి నాభూమిలో నీవు తపస్సుచేసికొనుచుంటివేని నీతపస్సులో సగముతపస్సు నా కీయ వలసియుండును. అట్లు నీకు సమ్మతమయినయెడల నాభూమిలో నుండుము. లేనిచో మఱియొకచోటికి బోవలయును. గడియయైనను నాభూమిలో నుండవలదు. అని యిట్లు చెప్పిన కాశ్యపుని యత్యద్భుతమైన వాక్యములను విని మహాతేజశ్శాలియగు పరశురాముడు కోపించి "బ్రాహ్మణుల కెప్పటికిని భూమియందాధిపత్యము లేకుండు గాక. ఏమన వీరు పరశ్రేయస్స హనము లేనివారు వీరకెన్నటికిని నైకమత్యముండదు" అని శపించెను. ఇట్లు శపించి యతడు సముద్రుని యాచించెను. అపుడు సముద్రుడిట్లనియె. రామా ! నీకేమాత్రపుభూమి గావలయునో చెప్పుము. అని యడుగగానే పరశురాముడు తనచేతనున్న గొడ్డలి విసరి యిది యెంతదూరముపోవునో అంత వఱకు జాలుననెను. సముద్రుడట్లేయని తొలగిపోయెను. అదియే పరశురామునిచే గల్పింపబడిన కేరళదేశము అచ్చటను బ్రాహ్మణాదులు నాలుగుజాతులవారును గలరు. ఆదేశములోని స్త్రీలు స్వర్గములోని స్త్రీలను మించియుందురు. అచ్చటనే పద్మనాభస్వామి వేంచేసియున్నాడు. అతడు శేషాంకశాయి భక్తకల్పద్రుమము. ఇప్పటికి నతడు బ్రహ్మాదులచే బూజింపబడుచు నుండును. పూర్వము పరశురామునిచే శపింపబడిన బ్రాహ్మణుల కిటుపయిని యముడే శాసకుడు. వారు ఛన్నపాపులు కావున నోభోజరాజా ! నేను నీకొక రహస్యమయినసంగతి చెప్పెదను వినుము. నేను బూర్వము శివభగవానుల వారిచే బ్రేరితుడనై భూలోకమునకు వచ్చితిని. నే నతనికి గుమారుడను. నాపేరు దేవాంగుడు. ఇక గైలాసమునకు బోవ నుద్యుక్తుడనై యుంటిని. అని చెప్పి రాజు నాశీర్వదించి రాజునకు దివ్యవస్త్రములు దివ్యయజ్ఞోపవీతములు నిచ్చి కైలాసము చేరుటకై శివుని స్మరించెను. తలంచినంతనే కోటిసూర్యప్రకాశమాన మగువిమా నము వచ్చినది. ఆవిమానము వర్ణనాతీతమయి యున్నది. దానిని జూచి ధారాపుర వాస్తవ్యులు రాజు పరమానందభరిత లయిరి. తరువాతను రాజు వరరుచిని విధియు క్తముగా బూజించి వస్త్రములు మాల్యములు భూషణములు సమర్పించి చేతులు జోడించుకొని యెదుట నిలువబడెను. తరువాతను వరరుచి భక్తియుక్తులగు రాజదంపతులయొద్ద సెలవంది సంతోషిం చుచు నావిమానము నారోహించెను. ఆపుడు దేవతలు సంతోషించి పువ్వులవాన గురిపించిరి. గంధర్వులు పాడిరి. అప్సరసలాడిరి. దేవదుందుభులు మ్రోగినవి. భూమియందుండు నాలుగు జాతులవారును విమానస్థుడగు వరరుచికి నమస్కరించిరి. వరరుచి తనదివ్యతేజస్సుచే దశదిశలను వెలిగించుచు సిద్ధాదులచే

సేవింపబడుచు విమానముతో గైలాసము చేరెను. తనకొడుకు మరలి వచ్చినందులకు సంతోషించి శివుడు రారమ్మని కౌగిలించుకొనెను. తరువాతను దేవాం గుడు పార్వతీపరమేశ్వరులకు నమస్కరించి భక్తిపూర్వకముగా నిట్లనియె. తండ్రీ ! నీ యాజ్ఞను నెఱవేర్చి వచ్చితిని. నీపుత్రుడ నగునున్న రక్షింపుము. అనుదేవాంగుని దగ్గఱ గూర్చుండ బెట్టుకొని విష్ణురూపుడగు శివుండు పరమానందభరిత డాయెను. ఈరీతిగా వరరుచి కైలాసము చేరినవెనుక గవిశ్రేష్ఠుడగు కాళిదాసు భోజసభకు వచ్చెను. భోజరా జాతని ననేకవిధములుగా గౌరవించెను. మునులారా ! వరరుచియొక్క యవతారకథ యీరీతిగా జరిగినది. దీనిని జదివినవారు విన్నవారు ధనధాన్యముల తోడను బుత్రపౌత్రాదులతోడను గూడి యిహలోకములో సమస్త సుఖములు ననుభవించి దేహాంతమందు గైలాసము చేరి యింద్రాదిపూజితులై పునరావృత్తి లేకుండ నుందురు.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున వరరుచి యవతార మన్నది యిరువదియాఱవ యధ్యాయము

ఇరువదియేడవ యధ్యాయము

సూతు – తరువాత నామోదపురాధీశుడగు దివ్యాంగునికి నందియను కుమారుడును, అతనికి నీలకంఠుడనువాడును బుట్టిరి. నీలకంఠునకు శంభుదేవుడు పుట్టెను. అతనికి హేమాంగుడు అతనికి జంద్రాంగుడు, వానికి భద్రబాహువు, అతనికి వీరభద్రుడు పుట్టెను. వీరభద్రునికివిందుడు పుట్టెను. మఱియు నావీరభద్రునకు శూలపాణి యరిందముడునని మఱియిద్దఱుకొడుకులు పుట్టిరి. ఆశూలపాణికిజయసేనుడనువాడు పుట్టెను. అతనికి జిత్రసేనుడు పుట్టేను. అతనికి సువిక్రముడు, వానికి గంగాధరుడు, పుట్టెను. ఆగంగాధరున కే విద్యావిలాసుడని యింకొకపేరుగలదు. అతనిభార్యపేరు విద్యావాణి. ఆమె పతిభక్తివశంపదురాలు. కాని యాదంపతులకు సంతతి లేకపోయినది. వారు రహస్యమందుండి యిట్లనుకొనిరి. అయ్యో ! బిడ్డలు లేనివారి కెంతధనమున్ననేమి ? ఎంత సంపదయున్ననేమి ? పుత్త్రులు లేనివారికి గతులులేవనికదా శ్రుతి చెప్పుచున్నది. అని వారనుకొనుచుండగా నశరీరవాణి యిట్లనియె. మీకు దప్పక పుత్త్రసంతతి గలుగును. అనుమాట విద్యావిలాసుడు విని చాలసంతోషించి యపుడు భార్యతో నిట్లనియె. విద్యావాణి ! భయపడకుము తప్పక మనకు సంతతి గలుగును. ఆకాశవాణిపలు కెప్పుడును దప్పనదిగాదు. అని భార్య నోదార్చి తాను దీర్ఘయాత్రకై

బయలుదేఱెను. అతడు మహాపండితుడు వలసినంత ధనము లొట్టియలమీద బడవేయించి దాసీదాసాదులతో గూడి సర్వాభీష్టప్రదాయిని యగు వారణాసిలో బ్రవేశించెను. తరువాతను బురోహితసమేతముగా మణికర్ణికకు బోయి యథావిధిగా నందు స్నానముచేసెను. మఱియు నాతీర్థమునందుండు వారికి యథేష్టముగా వస్త్రములు దక్షిణలు మొదలగునవి యిచ్చెను. అక్కడినుండి బయలుదేఱి విశ్వనాథుని విశాలాక్షిని మిగిలిన దేవతలను భక్తిపూర్వకముగా సందర్శించి పూజించి నమస్కరించి యాభరణములు సమర్పించి యచ్చటినుండి బయలుదేఱి గయకు వచ్చి యక్షయవట మూలమున బితరులకు బిండదానము చేసెను. తరువాతను బదరికారణ్యమునకు బోయి నారాయణుని సందర్శించెను. తరువాతను బదరీ కేదారమునకు బోయి. యాదేవుని బూజించి యచ్చటినుండి జ్వాలాముఖి క్షేత్రమునకు బోయి యందు జ్వాలామయుడగు దేవుని విధిగా బూజించి శ్రీశైలమునకు బోయెను. అందు భ్రమరాంబా సహితుడైన మల్లికార్జునుని యథావిధిగా బూజించి యనేకవిధములుగా స్తుతిచేసి యక్కడనుండి వేంకటాద్రికి బోయియందు శ్రీనివాసుని శ్రీదేవితో గూడ బూజించి యచ్చటినుండి కాంచీక్షేత్రము నకు బోయియచ్చట నేకామ్రేశ్వరుని కామాక్షిని జూచి సంతోషించి పూజాదిక మాచరించి యటుపయి శ్రీదేవితో గూడ వరదరాజును సేవించి సర్వదేవనమస్కృత మగు చిదంబరక్షేత్రమునకు బయనమాయెను. అక్కడ నాకాశరూపుడగు శివుని సందర్శించి పూజాదులు చేసి యందఱకును మోక్ష మిచ్చు వరుణాద్రికి బోయెను. అచ్చటి మహేశుని బూజించి వైద్యనాథక్షేత్రము, మాయూరక్షేత్రము, కుంభకోణము మొదలగుక్షేత్రములకు బోయి ప్రధాన దైవతముల బూజించి తరువాత శ్రీరంగక్షేత్ర మును బ్రవేశించెను. వేదశృంగము, ప్రణవాకారము నైయత్తద్భుతసంధాయక మగు విమానమును జూచి స్వామిని సేవించి పిదప గావేరిని సేవించి తిన్నగా నక్కడ నుండి పాండ్యకవాటమునకు బోయెను. అచ్చట మధుర రాజధాని అది దివ్యమంటప శోభితము, దివ్యగోపురసంయుతము, సప్తప్రాకారవేష్టి తము. అందు సుందరేశుని మీనాక్షీవల్లభుని శివుని కదంబవననాయకుని సేవించి విద్యావిలాసు డనేకవిధము లుగా స్తుతించెను. తరువాత నచ్చటినుండి రామేశ్వరమునకు బోయెను. అచట ధనుష్కోటిలో స్నానముచేసి రామలింగస్వామిని సేవించి యచ్చటినుండి యనంతశయనక్షేత్రమునకు బోయి శేషశాయి యగుపద్మనాభస్వామిని సేవించి యక్కడనుండి కల్యాణనిలయమగుతనయామోదపట్టణములో బ్రవేశించెను. ఇంటికి వచ్చి యావిద్యావిలాసుడను బ్రాహ్మణుడు విశ్రాంతి నొందెను. ఆయనభార్య

విద్యావాణి పతిరాకకు జాల సంతోషించి మందహాస సుందరవదనారవిందయై పతి పాదారవిందములకు వందన మాచరించినది. క్షేమపూర్వకముగ వచ్చితిరా ? అని యడిగినది. ఏయేక్షేత్రములు, ఏయేతీర్థములు సేవించితిరి ? సేవించినందుల కేమిఫలము ప్రాప్తించినది ? అది యంతయు దయయుంచి చెప్పవలయు ననగా నతడు సంతోషముగా నామెతో నిట్లనియె. ఓ పతివ్రతాతిలకమా ! మహాభాగురాలా ! సావధానచిత్తురాలవయి వినుము. నేను జూచినవి సేవించినవి యన్నియు జెప్పెదను. గంగాదిమహానదులలో స్నానము చేసితిని కాశి మొదలగు శివక్షేత్రము లన్నియు సేవించితిని. శ్రీరంగము మొదలగు విష్ణుక్షేత్రములు సేవించితిని అని యీరీతిగా దన తీర్థయాత్రావృత్తాంతమంతయు వినిపించినపుడు విద్యావాణి సంతోషముచే మాటిమాటికిని బెనిమిటిని గౌగిలించుకొన్నది. తరువాత నామె భర్తతో నిట్లనియె. నాథా ! కపిలేశుడను మహాదేవుడు భక్తులకు సంతానము నిచ్చునట ! కనుక మీ రాతని బూజింపుడు అని భార్యచెప్పగానే యాబ్రాహ్మణుడు కపిలేశ్వరుని బూజించెను. అతడు ఋతుస్నాత యగుభార్యను కపిలేశ్వరుని మనస్సున దలంచు కొనుచు గవయుడు విద్యావాణి కపిలేశుని యనుగ్రహమువలన గర్భవతియయి భర్త కమందానందమును గలిగించినది. పదినెలలు నిండినతరువాత నామె యొక కుమారుని గన్నది. విద్యావిలాసుడు కుమారుడు పుట్టెనని వినిసంతోషించుచు స్నానము చేసి జాతకర్మ మాచరించి బ్రాహ్మణులకు ధనాదు లిచ్చి సంతసపఱిచెను. తరువాతను బదునొంకడవ దినమున బ్రాహ్మణులను బిలిచి పుత్రదారసమన్వితు డై పుణ్యాహ వాచనము చేయించి కుమారునికి నామకరణమహోత్సవము చేయించెను. లేకలేక పుట్టిన బిడ్డనివిషయమై చేయుమత్సవముసంగతి యెట్లుండునో వర్ణింపనేల? వచ్చిన బ్రాహ్మణులందఱకును ధనము రత్నములును బంధువులకు జీనీచీనాంబరములును మంగళగాయనులకు దివ్యవస్త్రములు దివ్యాభరణములును తాంబూలఫలపుష్పాదులును నిచ్చి సంతోషపెట్టెను. ఆబిడ్డకు తండ్రియుంచిన దేవశాలియను నామముచే భూమిలో బ్రసిద్ధికెక్కెను. ఇట్లు శుక్లపక్షపుచంద్రునివలె నానాటికి వృద్ధి నొందుచున్న కుమారునికి గర్భాష్టమమున వేదోక్తవిధి నుపన యనము చేసెను. అనంతరము శివదీక్ష చేసి విధిగా శివపంచాక్షరి యుపదేశించెను. ఆనాడు విద్యావిలాసుడు తనకుమారుని యభివృద్ధికై యనేకములు దానములు చేసెను. గోదానములు భూదానములు, కన్యాదానము, గజదానము, అశ్వదానము, మొదలగు దానములు బ్రాహ్మణులకు బంధువులకు జేసిసంతోషింప జేసెను. ఇట్లుపనయనము పంచాక్షరోపదేశము కుమారునికి జేసి విద్యావిలాసుడు

కృతార్థుడనైతినని సంతోషించుచుండెను. తరువాతను దేవశాలి యనువాడు చిరకాలము గురుకులవాసము చేసి గురుకృపవలన సాంగము లగువేదముల నభ్యసించెను. మఱియు మీమాంస, న్యాయశాస్త్రము, ధర్మశాస్త్రములు, అష్టాదశపురాణములు, ఉపనిషత్తులు, మఱియు మిగిలిన యితర విద్యలు నేర్చుకొనెను. ఇట్లు గురువువలన విద్యలు నేర్చుకొని యాయనచే ననుజ్ఞాతుడై వైరాగ్యము నవలంబించి దేశసంచారము చేయుచుండెను. మహామతి యగు నాదేవశాలి లోకములమేలుకొఱకు శైవపురాణములు ఆగమములు రచించెను. అతడు కందమూల ఫలాహారుడయి కొండగుహలలో నుండి యింద్రియములను స్వాధీనము చేసికొని యష్టాంగయోగము నభ్యసించుచు సదా హృదయపద్మము నందు శివునిచే ధ్యానించుచు నుండెను. యోగమార్గము దెలిసిన ఋషులు మొదలగు వారిచే మాటిమాటికిని బూజింప బడుచుండెడివాడు. ఇట్లు నిర్వైరముగా నుండు నాదేవశాలికిలోకములో నిరుపమాన మయినకీర్తి గలిగినది. ఆదేవశాలి యొకప్పుడు శూరమానియగు వీరవల్లభు డేలుకల్యాణపట్టణమును గూర్చిపోయెను. కృష్ణాజినమును ధరించి బంగారుజన్నిదము వైచుకొని దివ్యమయినకౌపీనము గట్టుకొని పాదములకు బాదుకలు బాగుగా నమరించి హస్తభూషణముగా బుస్తకము చేతబట్టుకొని సర్వావయవముల యందును భస్మము వెలుంగుచుండగా రుద్రాక్షాభరణములు ధరించి చెవులకు గుండలము లలంకరించి వచ్చుచున్న యాదేవశాలిని జూచి యందఱును భయభక్తులతో గూడి దూరముగా దొలగిపోవుచుండిరి. ఈయాకారముతో గల్యాణపురము ప్రవేశించునప్పటి కచ్చట నెచ్చట జూచినను జైనులే తప్ప నితరమతమువారు గానరారైరి. రాజకూడ జైనమతస్థుడేయగుటచే దానిట్లని యోజించెను. ఈభూలోకములో నున్నజైనమతము నెట్లు నశింపజేయ గలను ? అని విచారించుచు మాటిమాటికి శివకథారసము వెదజల్లుచు జైనుల కందఱకును శివతత్త్వము బోధించుచుండెను. ఇట్లు దేవశాలి బోధింపగా జైనులుతమమతము విడిచి శివ దీక్షాపరులైరి. ఆతనినే సద్గురునిగా భావించి యతనివలన శివపంచాక్షరీమంత్రము నుపదేశము బొంది జపించుచు శివపూజాపరాయణులయిరి. ఈరీతిగా నత దందఱుజైనులను శైవులనుగా జేయుచుండగా నిత దేశంకరుడు భూమిపై నవతరించినవాడు, అని జనులను కొనుచుండిరి. ఒకప్పుడు రాజపుత్త్రుడు జగద్దేవుడు తపోనిష్ఠాగరిష్ఠులచే సేవింప బడుచున్న దేవశాలికి మ్రొక్కి సాదరముగా నిట్లనియె స్వామీ ! నీవేయీశ్వరుడవు. సర్వలోకములకును నీవేగురువవు. నాకును పంచాక్షరీమంత్రము నుపదేశింప

యనుగ్రహింపుము. అని రాజపుత్త్రుడు ప్రార్థింపగా మహాజ్ఞాని యగుదేవశాలి యారాజకుమారునికి శివదీక్ష యిచ్చి యతనికోరిక ప్రకారము శివ పంచాక్షరీమంత్ర ముపదేశించెను. జగద్దేవుడామంత్రమునే సదా జపముచేయుచు శివధ్యానాసక్తు డయిజితేంద్రియుడాయెను. అతడు జైనసంఘమును దూరీకరించి సదా శివభక్తులను జేర దీసికొని సర్వకాలసర్వావస్థలయందును శివపూజాసమాసక్తుడై కనుపడచుండెను. మంత్రులారాజకుమారునిసంగతి యంతయు దెలిసికొని తండ్రితో జెప్పిరి. ఏమని యనిని నోరాజా ! నీకుమారు డగుజగద్దేవుడు మిక్కిలి బుద్ధిమంతుడు మనమతమును విడిచి శైవమతములో బ్రవేశించెను. దేవశాలియను వానివలన నుపదేశమును బొంది శివపంచాక్షరమంత్రమును జపముచేయుచు శివపూజా పరాయణుడై నిత్యమును శివునిచే ధ్యానించుచు శివభక్తులతో గలిసి యుండువాడు. ప్రతిదినమున శివకథామృతమును ద్రావుచునిట్లే ప్రవర్తించు చున్నాడు. ఇట్లని మంత్రులు చేప్పిన మాటలు విని దేవశాలిని దనపట్టణము నుండి బయటికి బంపించెను. తరువాతను మంత్రిసమేతుడై కొడుకును సభకు రావించి రాజు దుఃఖశోఖములచే బీడితుడై యిట్లనియె. నాయనా ! నీవెంతో ప్రాజ్ఞుడవని సంతోషించుచుంటిని. మనజైనమతము కంటె నెక్కువమతము లేదు. తనమత మును విడిచి యెవడయినను మతాంతరములో బ్రవేశించునా ? పిశాచములతో గూడి క్రీడించుట శ్మశానభూమి యిల్లు బ్రహ్మకపాలము భిక్షాపాత్రము, గల రుద్రు నెవరయిన నుపాసింతురా ? కనుక నాయనా ! లోకోత్తరమయిన మన మతములోననే యుండుము. అని యీరీతిగా గుమారుని నియమించి వీరవల్లభమహారాజు కుమారుని జైనుల గురువుతో గూడ స్వగృహమునకు బంపెను. తరువాతను బ్రాజ్ఞుడగుజైనగురువు రాజకుమారునికి జైనశాస్త్రములన్నియు బోధపఱిచెను. ఎంత బోధించినను శైవ మతమును విడువడాయెను. రాజుచే బహిష్కరింపబడిన దేవశాలి తటాకముటచే శోభించు నొక యరణ్యములో బ్రవేశించెను. దేవశాలియాయడవిలో బ్రవేశించి యచ్చటి తామరకొలనిలో స్నానము జేసి చర్మవసనమును గట్టుకొని శుచియై దేహమునిండ విభూతి పూసికొని రుద్రాక్షహారా దికమును ధరించి సంధ్యావందనము చేసికొని రాజయోగము నవలంబించి ధర్మార్థకామమోక్షముల నిచ్చు పంచాక్షరమంత్రమును జపము చేయుచు జ్యోతిస్స్వరూపుడగు శివుని సదా హృదయకమలమునందు ధ్యానము చేయుచు దరువాతను గ్రమముగా ధైర్యశాలియగు నతడు మనస్సును సహస్రారము నందు స్థాపించి చిద్రూపు డగుపరమేశ్వరుని వేదవాక్కులచే స్తుతించెను. ఇట్లు

దేవశాలి చేయు తపస్సుచే జరాచరాత్మకమగు జగమంతయు వేడి యెక్కిపోయినది. అట్టి తనగురువును జాతమను బుద్ధి గలిగి జగద్దేవు డను రాజకుమారుడుండగా నాసంగతి కనిపట్టి వానిస్నేహితులు వాని వృత్తాంత మంతయు రాజుతో జెప్పిరి. రాజు కొడుకు సంగతులు విని భయపడి కొడుకును బిలిపించి కోపముతో నిట్లనియె. ఓరీ ! దురాత్ముడా ! దుర్బుద్ధీ ! శైవమతమును విడువుము. అట్లు చేయనిచో నిన్ను నీగురువునుగూడ జంపించెదను. అని యన్న తండ్రితో గుమారుడు శివభక్తివశంపదుడై యిట్లనియె. తండ్రీ ! అనేకశాస్త్రములచే నిషేధింపబడిన జైనమతము మహానీచమయినదని నాకు దోచినది. కావున శ్రుతిస్మృతిసమ్మత మయిన యీ శైవమతము నవలంబించితిని. మూడు లోకములయందును శివునికన్న నెక్కుడు. దైవము లేదు. రాజా ! నేను జెప్పినమాట యథార్థమని తెలిసికొనుము. శివుడే పరబ్రహ్మము, శివుడే దిక్కు, శివుడే పరంజ్యోతి ఈప్రపంచ మంతయు శివుడే. కావున శివపంచాక్షరమంత్రము ముక్తి ప్రదము శుభము నని తెలిసికొని యోగులు జపింతురు. శివుడే సదా పూజ్యుడు మన మనగా నెంతటివారము. బ్రహ్మాదిదేవతలు మోక్షమును గోరు మునులు నాయననే సదా ధ్యానించుచుందురు. కావున నో తండ్రీ ! నీవును శివపూజాపరాయణుడవై శివపం చాక్షరీమంత్రమును జపము చేయుచుండుము. ఇట్లని కొడుకు చెప్పగానే రాజు కన్ను లెఱ్ఱజేసి సంకిళ్ళు వేయించి కొడుకును జెఱసాలలో బెట్టుడని యాజ్ఞాపించి నగరిలోనికి బోయెను దూతలు రజాజ్ఞను శిరసావహించి రాజపుత్త్రుని కారాగారములో బ్రవేశింపజేసిరి. ఇట్లు చెఱసాలలో నుండి జగద్దేవుడు దుఃఖించి తనగురువగు దేవశాలిని ముక్తికై తలంచెను. మహాతపశ్శాలి యగుదేవశాలి యతడు తలంచినంతనే శిష్యుని సంగతి యంతయు దెలిసికొని కన్నుల నిప్పులు రాల్చుచు దుర్మార్గుడగురాజును జంపుటకై శివమంత్రప్రభావమువలన నడవిలోని జంతువు లను జతురంగబలముగా సృజించెను. సింహములను యోధులనుగాను, పెద్దపులులను మహాబలవంతులను గాను, ఏలుగుగొడ్లను మదపుటేనుగులనుగాను, లేళ్ళను గుఱ్ఱములనుగాను, చక్రవాక పక్షులను వాయువేగమనోవేగముగా బోవురథములుగాను, కంటకవంతములగు వృక్షములను వాడియగు నాయుధము లనుగాను, రావిచెట్లు బాణములుగాను, బొంగు వెదుళ్ళు ధనస్సులుగాను, జనపచెట్లను నారిగాను, లతాకుంజముల నమ్ములపొదులుగానునయినవి బ్రహ్మవృక్షములు, బ్రహ్మాస్త్రములయినవి. ఇట్లు చతురంగబలము పూర్తికాగానే దేవశాలి మిగుల సంతోషించెను. పిదప సైనికు లందఱును వచ్చి వినయముగా

జేతులు జోడించుకొని "ఈశ్వరా ! మమ్మెందులకు సృజించితివి ? మావలన గాదగినకార్యమేది ? సెలవైనతోడనే యది యెట్టిదైనను జేసి తీఱెదను. అని యిట్లు చెప్పినసైన్యమును జూచి మేఘగంభీర వాక్కులతో దేవశాలి యిట్లనియె మహాబలవంతులగు సైన్యకులారా ! మీరు కల్యాణనగరమునకు బోయి సైన్యముతో గూడ వీరవల్లభభూపాలుని జంపివాని కుమారు డగుజగద్దేవుని నాప్రియశిష్యుని జెఱసాలనుండి విడిపించివెంటనేరండని యాజ్ఞాపింపగా దేవశాలియాజ్ఞను శిరసావహించి యాసైన్యమంతయు బయలుదేఱినది. ఇట్లు బయలుదేఱి శత్రువులకు గర్వనిర్భేద మగునట్లు సింహనాదములు చేయుచు యమదూతలవలె భయంకరులై ధనుష్టంకారములు చేయుచు నానాభరణసంయుతులై కల్యాణపుర మును ముట్టడివైచిరి. గోపురములయందును ద్వారములయందును గావున్న సైనికులు దేవశాలియొక్క తపః ప్రభావముచే సృజింపబడిన సైన్యముచే ముట్టడింపబడిన పట్టణముయొక్క యవస్థను జూచి భయపడి యతివేగముగాబోయి నమస్కరించి రాజుతో నిట్లనిరి. వీరవల్లభరాజేంద్రా ! మహాబలపరాక్రమశాలీ ! మనపట్టణమంతయు శత్రుసైన్యముచే ముట్ట డింపబడియున్నది. మహావీరులకు గూడ భయమును గలిగించుచున్నది. మఱియు నాసైన్యము సమస్తమైనట్టి యాయుధములను ధరించి బాణబాణాసనోజ్జ్వలమై యేనుగుల బృంహితముల తోడను, గుఱ్ఱము లసకిలింతలతోడను, భటుల సింహనాదములతోడను, దిగ్గజము లకు గూడజెవుడు గలిగించుచున్నది. ఆసైన్యమంతయు నెక్కడ నుండి వచ్చినదో యెవ్వరు పంపి యుందురో మాకొక్కింతయు దెలియరాకుండనున్నది. ఇట్లు చెప్పిన దూతల మాటలు విని రాజు కోపపూర్ణుడై పండ్లు పటపట కొఱుకుచు మంత్రులతో నిట్లనియె మంత్రులారా ! వింటిరికదా యిపుడు దూతలు వచ్చిచెప్పిన మాటలు. ఇంత యాకస్మికముగా వచ్చినసైన్యమును జంపుటకై నాయాజ్ఞచే మనసైన్యమును బంపుము. అని రాజు చెప్పగానే మంత్రులు త్వరతో గూడినవారై తమచతు రంగసైన్యమును సన్నద్ధముగా జేసిరి. అది శత్రుదుర్వారము సర్వాయుధ సమన్వితము సముద్రముతో సమానమయినది. యెప్పుడును జయమునే కాని పరాజయ మెట్టిదో యెరుగనిది. తరువాత మంత్రులు సైన్యమంతయు సిద్ధమయి యున్నదని రాజుతో విన్నవించిరి. పిదప గల్యాణనగరనాయకుం డగువీరవల్లభుడు సర్వ సైన్యముతోడను గూడినవాడై సర్వశస్త్రాస్త్రసంయుత మయినదియు మంచిగుఱ్ఱములు సారథియు గలదియు నున్నతమయినజెండా గలదియు, నగురథముపై గవచము దొడిగికొని ధనుర్బాణములను ధరించి కూర్చుండి

శత్రువులను జంపుటకై బయలు దేఱెను. అతని సైనికులు సంతోషముతో శంఖముల నూదిరి. మహోత్సాహము గలుగు నట్లురణభేరులు మ్రోగింపబడినవి. మఱి కొందఱుసింహనాదములు చేసిరి. ధనుష్టం కారములు చేసిరి. ఇట్లు మహాటోప ముగా వచ్చియున్నరాజును దత్సైన్యమును జూచి దేవశాలి పంపిన సైన్యమును యుద్ధోన్ముఖ మయినది. ఈ యుభయ సైన్యముల యుద్ధమును జూతమను కోరికచే దేవతలు సూర్యసమానముగా వెలుగుచున్న విమానములపై గూర్చుండి యాకాశము నిండిరి. తపోధను లగుఋషులును, నారదాదులును, గంధర్వులును, సిద్ధులును, జారణులును మఱియు నెనమండ్రు దిక్పతులును వైజయంతమను ప్రాసాదమెక్కి యుద్ధము చూచుచుండిరి. తరువాత యమపట్టణము నిండులాగున యుద్ధము ప్రవర్తించినది. సైన్యములవారును బరస్పరమును ముసలములు ముద్గరములు భిండివాలములు పరశ్వథములుశక్తులు గదలు శతఘ్నులు బాణములు మొదలగు వానిచే గొట్టుకొనుచుండిరి. రథికుడు రథికుని, గుఱ్ఱముపై నున్నవాడు గుఱ్ఱముపై నున్నవానిని, పదాతి పదాతిని, గజారూఢుడు గజారూఢుని నెదుర్కొనిరి. రెండు తెగలవారును స్వర్గమును గోరి యుద్ధము చేయుచుండిరి. సింహ ములవలె గర్జించుచుండిరి. మిక్కిలిగా వీరవాదములు పలుకుచుండిరి. నీ వెంతవా డవురాయన నీ వెంతటివాడవురాయనియు నే నెందఱనో జయించితి నననేనెం దఱనో జయించితి ననియు నిన్ను జయించితిని జూడుమన నిన్ను నేనే జయించితిని జూడు మనియు నాతో సమానుడు లే దన నాతో నేనే జయించితిని జూడు మనియు నాతో సమానుడు లే డన నాతో నంతకుముందే సమానుడు లేడనియు నాయెదుటి నుండి పరాఙ్ముఖుడవై పాఱిపొమ్మన నాయెదుటినుండియే పరాఙ్ముఖుడవై పాఱిపొమ్మనియు ననుచు యుద్ధము చేయుచుండిరి. ఇట్లు రోమహర్షణముగా బ్రవర్తించుచున్న మహాయుద్ధమును జూచి యింద్రాది బృందారకులు మిక్కిలి యాశ్చర్యమును బొంది సాధువాదములు చేయుచు గౌరవించిరి. యుద్ధభూమిలో మొండెములు లెక్కకు మిక్కిలిగా నాట్యము చేయుచున్నవి. రక్తము నదులై ప్రవహించుచున్నది. శివమంత్ర ప్రభావమువలన దేవశాలి సైన్యము పున్నమనాటిచంద్రుని జూచిన సముద్రమువలె వృద్ధి పొందినది. వీరవల్లభమహా రాజు సైన్యము కృష్ణచతుర్దశినాటి చంద్రునివలె క్షీణించిపోయినది. ఇట్లు యుద్ధోన్మత్తులై యాయుధములను బ్రయోగించుచున్న దేవశాలి సైన్యముచే గొట్టబడి వీరవల్లభుని సైనికులు కొందఱు మూర్ఛిల్లిరి. కొందఱు చచ్చిపడిపోయిరి. మఱికొందఱు మూత్రపురీషములు విడుచుచు బాఱిపోయిరి. అపుడు కొందఱు

సైనికులు రాజునొద్దకు వచ్చి శరణు చొచ్చిరి. అట్లు శత్రువులచే బీడితులయి తనయొద్దకు వచ్చియున్న సైన్యమును జూచి వీరవల్లభుడు రోషద్వేషములతో గూడిన వాడై దనుర్ధరులలో బేర్వడినవాడు గనుక యుద్ధభూమిలోనికి వచ్చి దేవశాలిసైన్యమును దహించుచున్నవాడో యనులాగున జూచి వెంటనే ధనుస్సెక్కువెట్టి వేనవేలు బాణములు వారిపై విడిచెను. అపుడు వీరవల్లభునిధనుస్సు నుండి పడుబాణములకు లెక్కయే లేకపోయినది. అట్లు గొట్టబడి దేవశాలిసైన్యము, లోనివారు కొందఱు సింహములవలె గర్జించిరి. మఱికొందఱచే విడువబడిన బాణములచే వీరవల్లభుడు మిక్కిలిని గొట్టబడియపుడు కనులెఱ్ఱజేసి నిరుపమాన మయిన యాగ్నేయాస్త్రమును బ్రయోగించెను. అపుడు దేవశాలిసేనాపతి శంకరుడనువాడు వారుణాస్త్రమును బ్రయోగించి దానిని జల్లార్చెను తరువాతను వీరవల్లభుడు వారుణాస్త్రమును బ్రయోగింప శంకరుడు వాయవ్యాస్త్రమును బ్రయోగించి దానిని వారించెను. పిదప వీరవల్లభుడు యామ్యాస్త్రమును బ్రయోగింప శంకరుడు రౌద్రాస్త్రమును బ్రయోగించి దాని మద మణచెను. వీరవల్లభుడు నారాయణాస్త్రమును బ్రయోగింపగా శంకరుడు మహే శాస్త్రమును బ్రయోగించి వారించెను. తరువాతను శంకరుడనువాడు చాల గోపించి సర్వలోక భయంకర మయిన బ్రహ్మాస్త్రమును బ్రయోగించెను. దానితో వీరవల్లభ భూపాలుని శిరస్సు తెగి క్రిందను బడిపోయినది. వెంటనే దేవశాలిసైనికులు జయభేరి వాయించిరి. పూర్తిగా సంతోషించి శంఖము లూదిరి. మింట దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము గురిసినది. గంధర్వులు పాడిరి. అచ్చర లాడిరి. అపుడు దేవశాలిసైనికులు సేనాధిపతిని బురస్కరించుకొని నిరానందులగు జనులతో నిండిన కల్యాణపురములో బ్రవేశించి మహామతియగు జగద్దేవుని జెఱసాలనుండి విడిపించిరి. పిదప నేనుగు నలంకరించి యతనిని దానిపై గూర్చుండబెట్టి సంతోషముగా దేవశాలియొద్దకు దెచ్చిరి. జగద్దేవుడు తనగురువగు దేవశాలినిజూచి యేనుగునుండి దిగి యాయనపాదములకు నమస్కరించెను. మఱియు శ్రుతి స్మృత్యాగమములయందు జెప్పబడినరీతి ననేకవిధములుగా స్తుతించి పరమాత్ము డగు శివునిఫాలనేత్రము నుండి పుట్టిన యోదేవశాలీ ! ప్రణతార్థప్రదాయక ! విద్యావిలాసతనయా ! సద్గురూ ! నీభక్తుడనగు నన్ను సంసారసముద్రమునుండి యుద్ధరింపుము. దురాచారభూయిష్ట మై యశిష్టులగువారిచే సేవింపబడు చున్నదియు శ్రుతిస్మృతులకు విరుద్ధముననగు జైనమతమును రూపుమాపుము. నేను నీవుపదేశించిన శివపంచాక్షరీమహామంత్రముచే సమస్తపాపములను

బోయినవాడ నయితిని. నీనామమును స్మరించుటచేతనే పవిత్రుడ నయితిని. నీవే నన్నీ చెఱసాలనుండి విడిపించి రక్షించితివి. అని యిట్లు పాదములపైబడి నమస్కరించుచున్న శిష్యుని బద్ధాంజలిని జగద్దేవుని గురువగుదేవ శాలి లేవదీసి కూర్చుండబెట్టి చేతితో నిమురుచు నిట్లనియె. జగద్దేవా ! మహాబుద్ధీ ! మద్భక్తులలో మొదటివాడవు. నేను జెప్పుసంగతి సావధానముగా వినుము. మూడు లోకములయందును శివునికంటె బయిగా నుండి వస్తు వెదియునులేదు. కావున నేనిపుడు జై నుల నందఱను నాశాపాగ్నిచే దహించెదను. అని చెప్పి శపించుటకు జలము చేతబట్టుకోగానే శివభక్తాగ్రగణ్యుడును, భసోద్ధూళిత సర్వాంగుడును, రుద్రాక్ష మాలా విరాజమానుడును నగు నందివచ్చి దేవశాలితో నిట్లనియె. మహామతి వగునో దేవశాలీ ! జైనును జంపుటకు శాపమీయకుము, వలదువలదు. ఇటుపైని జైనమతము శైవమతమే యగును. ఇట్లని శివభగవానులవారితాత్పర్య మయి యున్నది. నేనువచ్చి నీకు స్పష్టపఱిచితిని. శివునియాజ్ఞ నెవ్వరును దాటదగదు ఇట్లు కైలాసమునందుండి శివునియాజ్ఞాప్రకారము వేగముగా యొద్దకు వచ్చితిని. శివుడు చెప్పినదంతయు నెఱవేర్చుకొంటివి. ఇక బార్వతీపరమేశ్వరులను దర్శించుటకు గైలాసమునకు రమ్ము. అని యిట్లు నంది చెప్పగానే దేవశాలి జగద్దేవుని గల్యాణపురమునకు రాజునగా జేసి యతని ననేకవిధములుగా నాశీర్వదించి వెంటనే దేవాంగు డయిపోయెను. అపుడు దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము గురిసినది. గంధర్వులుపాడిరి. అచ్చరలాడిరి. అపుడు శివునిచే బంపబడినదియు శివభక్తులచే నిండినదియు ఘంటామణి మహాధ్వ నులు గలదియు, నృత్యగీతవాధ్యములచే నొప్పుచుండునదియు, గామగమనము గలదియు, గోటిసూర్య ప్రకాశమానమును నవరత్నఖచితమై దివ్యాశ్వములచేతను, దివ్యగజముల చేతను బూన్పబడినదియునగు విమానమును జూచి దేవాంగుడు తనశిష్యుడగు జగద్దేవునితో జెప్పి నందితో గూడ నందధిరోహించెను. అట్లు దేవాంగుడు నందితో గూడి విమానమెక్కినతోడనే యది యర్ధక్షణములో గైలాసముచేరినది. శివాత్మజుడగు దేవాంగుడు విమానమునుండి దిగి పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించెను. అట్లు వచ్చియున్న కొడకునెత్తుకొని ముద్దులాడి శివుడు తొడపయి గూర్చుండబెట్టికొని యమందానందమును బొందెను.

ఇట్లు శ్రీబ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున దేవశాలియవతార పరిపూర్తి యన్నది యిరువది యేడవ యధ్యాయము.

ఇరువదియెనిమిదవ యధ్యాయము

సూతు - మునులారా ! నారదు డొకప్పుడు మహాదేవుని సేవించుటకై కైలాసమునకు బోయి యాయన ననేకవిధములుగా స్తుతించి చేతులు జోడించుకొని యెదుట నిలువబడి యుండగా శివు డిట్లనియె నారదా ! భూలోకములో నాయాచారము బాగుగా జరుగుచున్నదా ? యన నత డాయన కిట్లనియె. దేవా ! భూవలయమునందం తటను నేను దిరుగుచుంటిని గాని యెక్కడ జూచినను వైష్ణవులే మెండుగా గనుపట్టు చుండిరి గాని ముచ్చటకైనను శైవుని జూడ నైతిని. అని యిట్లు నారదుడు చెప్పగానే విని శివుడు దేవాంగుని జూచి యిట్లనియె "ఓయీ ! దేవాంగా ! నీవు భూలోకములో శైవుడ నయి సర్వసంపదల నీయజాలిన నావ్రతమును వ్యాపింప జేయుము. అని యిట్లు శివుడు చెప్పగానే దేవాంగుడు చిత్తమట్లే చేయుదునని భూలోకమునకు బయలుదేఱిన దేవాంగుని జూచి నవ్వుచు బార్వతి యిట్లనియె నాయనా ! నేను బూర్వము చౌడేశ్వరినయి నీశత్రులనందఱను జంపి నీ కిష్టమయిన వరము లిచ్చితిగదా! కావున నీకులమువారందఱును జౌడేశ్వరిని భక్తిశ్రద్ధాతాత్పర్యములతో బూజించుచుందురుగాక ఆమె సర్వదుఃఖనివారిణి. పూర్వము శ్రీరాముడు రావణుని వధించి రామేశ్వరక్షేత్రము నందు బూజించిన రామలింగస్వామిని నీవు సదా పూజించుచుండుము. అతడు పూజింపబడి ధర్మార్థకామమోక్షముల నిచ్చును. మఱియు నాదేవుడు నీవంశపు వారిచే సాదరముగా బూజింపదగినవాడు నీవంశస్థులు రామలింగస్వామిని చౌడేశ్వరిని బూజించుచుండుటవలన సమస్తమైన కోరికలను బొందుచుందురు. ఇట్లని చెప్పి యీశ్వరుని ఫాలనేత్రమునుండి పుట్టిన దేవాంగుని బయనము చేయించి పంపినది. తరువాతను భూమిపై నామోదపురాధీశ్వరుడైన గంగాధరుని కుమారుడు వీరరుద్రుడను నతనికి దేవాంగుడు పుత్రుడై పుట్టెను. తరువాతను వీరరుద్ర మహారాజు పదునొకండవదినమున వేదోక్తవిధానమున జాతకర్మా దికమును జేయుటకు బ్రారంభించెను. అపుడు కుమారస్వామితోగూడ గౌరీపతి వృద్ధ బ్రాహ్మణరూపముతో రాగా నతనిని జూచి వీరరుద్రు డానందించి యథావిధిగా షోడశోపచారములచే బూజించి సువర్ణ వికారమయిన పీటపయిం గూర్చుండ బెట్టెను. తరువాత నాభగవంతుడు సాక్షాత్తుగా, వీరరుద్రునికుమారునకు యథావిధిగా నాగమోక్త విధానమున లింగదీక్ష చేసి యాబిడ్డనికి దేవదాసుడని నామకరణము చేసెను. ఆ యుత్సవసందర్భమున దేవదుందుభులు మ్రోగినవి.

పుష్పవర్షము గురిసినది. గంధర్వులు పాడిరి. అచ్చరలాడిరి. తరువాతను గుమారస్వామితో గూడ నాభగవాను డందఱును జూచుచుండగానే యంతర్ధానము నొందెను. అపుడు "ఇచ్చటి బ్రాహ్మణడేడీ యేడి" అని కోలాహలము గలిగినది. అట్టిసమయమున నాకాశవాణి యందఱును వినులాగున "ఓయీ ! వీరరుద్ర భూపాలా ! రామలింగస్వామియగు శంకరుడు స్వయముగా దయచేసి నీకుమారు నకు లింగదీక్షచేసి నామకరణము చేసి వెంటనే యంతర్ధాన మాయెను. కావున నీకుమారుడు రామలింగస్వామియందు భక్తిగలిగి చౌడేశ్వరీదేవిని బూజించుచుండు వాడగును. బుద్ధిశాలియగు నీకుమారుడు భూలోకములో వీరశైవమతము నుద్ధరింపగలడు" అని వినవచ్చినది. అది విని యందఱును మిగుల నానందించిరి. తరువాతను గుమారుని యభివృద్ధికై వీరరుద్రుడనేకములగు గొప్పగొప్ప దానము లును చిన్నచిన్న దానములును జేయించెను. ఆబాలుడు బాలసూర్యునిపగిది వృద్ధి పొందుచుండెను. అంత నక్కడ గైలాసమున శివుడు గద్దియపై గూర్చుండి యా సమీపమున నున్న దేవాంగుని భార్యను దేవదత్తయను నామెను జూచి "దేవదత్తా ! నీవు బంగాళాధీశ్వరుని భార్యయైన సులక్షణయందు గుమారితవై పుట్టుము" అనగానే యాయనయాజ్ఞను శిరసావహించి యాదేవదత్త బంగాళరాజుభార్య యొక్క గర్భమున బ్రవేశించి పదియవనెలను సర్వలక్షణలక్షితురాలై పుట్టినది. బాలిక పుట్టగానే తండ్రియగు చంద్రశేఖరమహారాజు బంధువులతో గూడ నానందించెను. జాతకర్మాది క్రియలు నిర్వర్తించి విశేషముగా బ్రాహ్మణులను గౌరవించెను. అపు డశరీరి యగుపురుషుడు "రాజా ! నీకుమారితకు దేవదత్తయని పేరుంచి వీరరుద్రమహీపాలునికుమారుడగు దేవదాసున కిచ్చి పెండ్లిచేయుము" అని బంగాళరాజునకు జెప్పెను. రాజామాట వినియట్లే చేయుదుమని నిశ్చయించెను. అప్పటికి దేవదాసు డైదుసంవత్సరములవాడు. ఆబాలుడందఱును మిగుల నానందింప జేయుచుండెను. తండ్రి సకాలమున నుపనయనముచేసి గురువువలన నెల్ల విద్యలను జెప్పించెను. సర్వవిద్యావిశారదుడును బుద్ధిశాలియునగు నీ కుమారుడు దేవదాసునకు నా కూతురును దేవదత్తయను కన్యకను నిస్సందేహ ముగా నే నీయదలచితినని బంగాళరాజు శుభలేఖను బంపెను. తరువాతను వీరరుద్రభూపాలుడు సంతోషించి భార్యాపుత్త్రులతోడను జతురంగ బలముతోడను బురోహితపురస్సరముగా బయలుదేఱి బంగాళ రాజునింటికి నేగెను. బంగాళరాజు వచ్చిన పెండ్లివారిని జూచి చాల సంతోషించి యల్లుని వియ్యంకుని గౌగిలించుకొని తగు విడిది యేర్పాటుచేసి యందు బెండ్లివారినుంచి పట్టణమంతయు నలంకరించు

దని సేవకుల కాజ్ఞాపించెను. సేవకులు, పట్టణములోనివారును రాజాజ్ఞను శిరసావహించి పట్టణమలంకరించిరి. తరువాతను జంద్రశేఖరమహారాజు తౌర్యత్రిక సమేతముగా మాతాపితృ సమేతుడగు దేవదాసుని నెదుర్కొని తనయింటికి దీసికొనిపోయెను. తరువాతను విద్వాంసుడగు పురోహితుడు కల్యాణమంటపమున బ్రవేశించి యచ్చటకు వధూవరులను రావించి యగ్నిని బ్రజ్వలింప జేసి వేదమంత్రములచే వైవాహికవిధామును నెఱపెను. అపుడు బంగాళరాజు తనకుమారితను బాగుగా నలంకరించి మంత్రోదకపురస్సరముగా దేవదాసునికి దారవోసెను. అప్పటి మంగళవాద్యములు చప్పుడు ముల్లోకములను వ్యాపించినది. దేవదుందుభులు మ్రోగినవి. పూలవాన గురిసినది, గంధర్వులు పాడిరి. అచ్చర లాడిరి. నందిమాగధులు స్తుతించిరి. పురస్త్రీలు, గౌరీకల్యాణము మొదలగు పాటలుపాడి నీరాజనము పట్టిరి. అపుడు బంగాళరాజు కూతునకు, అల్లునికిని బరిమితి లేని వస్తువులను గానుకగా నిచ్చెను. మఱియు దక్కినవారిని యథాన్యాయ ముగా సత్కరించెను. అపుడు వీరరుద్రమహారాజు చాల సంతోషించి తన యామోదపట్టణమునకు వచ్చెను. దేవదాసుడు భార్యతో గూడి రతిదేవితో గూడిన మన్మథునివలె సంతోషించుచుండెను. మఱియు నతడు “శివపూజా పరాయణుడును శైవపురాణకథోత్సుకుడును నైయుండెను. ఎప్పుడును శివునినే ధ్యానించుచు శివభక్తులకే యున్నది. దానము లిచ్చుచు శైవగోష్ఠితో నుండెడివాడు. శివప్రియుడగు దేవదాసుడు పలుమందికి లింగదీక్షను జేయించెను. నిరీశ్వరులుగా నుండు వారిమతము నంగీకరింపడాయెను. శూద్రులకు గోమట్లకు రాజులకును శైవమతమును బోధించి వారినందఱను వీరశైవులనుగా జేసెను. అది మొద లందఱును శైవవ్రతము నవలంబించి శివుని యందు భక్తిగలిగి భస్మరుద్రాక్షధారులై ప్రకాశించుచుండిరి. ఇట్లు జరుగుచుండగా నా దేవదాసునకు శివునియనుగ్రహము వలన నేకోరాము డనుకుమారుడు పుట్టెను. అతనికే విరూపాక్షుడని యింకొకపేరు గూడ గలదు. దేవదత్తచే లాలితుడగుచు నాబాలుడు వృద్ధి నొందుచుండెను. దేవదాసుడు ప్రతిదినమును శైవమతమును బ్రకటించుచు రామలింగేశ్వరుని పూజయందాసక్తచిత్తుడై యొప్పారుచుండెను. అట్లుండుటను సహింపక బౌద్ధులు కోపించి శైవమతమును ధ్వంసము చేయవలయునని యాలోచించి దేవదాసుని తప్పులు వెదకుచుండిరి. అతడొకప్పుడు యథావిధిగా రామలింగస్వామిని బూజించి యింటికి మరలుచుండగా బౌద్ధులందఱును నేకీభవించి యతనిని దారిలో నడ్డుకొని “శివు డెవ్వడు ? ఎచ్చట నున్నవాడు ? నీవు శైవమతమే గొప్పది యని లోకములో

జాటుచున్నాడవు ఎవనిమంత్రమును దీక్షను పూజను నీవు కొనియాడుచుందువో అట్టిశివు డెచ్చట నున్నాడు?” అని యనుచున్న బౌద్ధుల మాటలు విని దేవదాసు డిట్లనియె. శివుడు సర్వవ్యాపి నిత్యుడు. విభువు ఆత్మస్వరూపుడు పరాత్పరుడునని యెఱుంగడు. అను దేవదాసునిమాటలు విని బౌద్ధు లిట్లనిరి. ఇపుడు నీవు చెప్పిన శివు డట్టివాడే యయినచో బిపీలికలో నుండి నీవు చెప్పినదాని నతడనవలెను. అను యనుచు నచటినుండి పోవుచున్న యొకపిపీలికను దేవదాసునకు జూపిరి. దేవదాసుడు వారిమాటలు విని పిపీలికను జూచి భక్తశంకరుండగు శంకరుని శివ ! శంభూ ! దయాసిందూ ! నీవు సర్వవ్యాపకుడవనుమాట నిజమే యయినచో బౌద్ధ లన్నరీతిని పిపీలికికయందుండి చెప్పుము.” అని ప్రార్థించెను. ఇట్లు దేవదాసుడు ప్రార్థించిన వెంటనే శివుడు పిపీలిక యందుండి యిట్లనియె. ఓజనులారా ! నేను జెప్పునది వినుడు. మీరందఱును భక్తి గలవారై యుండుడు. నేనే సాక్షాత్తు శివుడను, సర్వత్ర నిండియున్నవాడను, పరాత్పరుడను, పరమాత్మను, జగత్కర్తను, సర్వస్వరూపుడను ఇందు సందియమొందవలసిన పనిలేదు. ఇట్లు చెప్పిన భగవంతుని మాటలువిని బౌద్ధులు పరస్పరము మోములు చూచుకొని దేవదాసునితో నిట్లనిరి. మహాబుద్ధివగు దేవదాసా ! మామాటలు వినుము. ఈపిపీలిక నీమంత్ర ప్రభావమువలన నిట్లన్నది. ఇట్లే రామలింగేశ్వరుడు చెప్పినచో మేమందఱమును శైవులు మయి నీకు శిష్యుల మగుదుము. అని బౌద్ధులనగానే దేవదాసుడు బౌద్ధులతో గూడి రామలింగస్వామి సన్నిధికిబోయి యిట్లనియె. రామలింగేశ ! చిద్రూప ! వేదవేదాంతసంస్తుత ! నీవు సర్వాంతర్యామి వనుసంగతి పిపీలికయందుండి యెట్లు చెప్పితివో అట్లే చెప్పుము. నీకు నమస్కారము అని దేవదాసుడు ప్రార్థించినతోడనే రామలింగస్వామి సింహమువలె గర్జించుచు మధురముగా నిట్లనియె. ఓరీ బౌద్ధులారా ! మీరు నాయందు భక్తిగలిగి నామాటలు వినుడు. నేనే సాక్షాచ్ఛివుడను, సర్వవ్యాపిని, పరాత్పరుడను, మోక్షదాతను, జ్ఞానవిజ్ఞానవిగ్రహుడను, పరమాత్మను, జగత్తులకు గర్తను హర్తను విధాతను సర్వరూపుడనునని యెఱుంగుడు అని యిట్లు రామలింగస్వామి చెప్పినమాటలు విని బౌద్ధులందఱును దేవదాసునకు శిష్యు లయిరి. అప్పుడు దేవదాసు డచ్చట నున్నయందఱు బౌద్ధులకును యథావిధిగా శివదీక్ష యిచ్చెను. తరువాతను దేవదాసుడు బంధుపోషణాసక్తుడయి యన్నదానమును చేయుచు నాపట్టణముననే యుండెను. ఇట్లుండగా నొకప్పుడు కోటిమంది బ్రాహ్మణులు షడ్ర సోపేతముగా నన్నము పెట్టుమని దేవదాసునడిగిరి. అపుడు దేవదాసు డాయూరిలోని

గంగాధరుడను కోమటియింటికి బోయి సంగతియంతయు జెప్పి కావలసిన సంభారము లిమ్మని కోరెను. అపుడు కోమటి యతనిమాటలు విని కోపించి పెద్దగొంతుతో నిట్లనియె. ఓయీ ! నీవు పండ్రెండేండ్లనుండి నాకొక్క కాసయిన నీయకుంటివి. కావున నిప్పుడు వచ్చినత్రోవనే చక్కగాబొమ్ము. మాయింట నీకు గావలసిన తండులాదికమగు సామగ్రి దొరకదు. ఇట్లని యాకోమటి చెప్పగానే పాప! మాదేవదాసు డావృత్తాంతమంతయు భార్యతో చెప్పగా నామె యిట్లన్నది. నాథా ! మనయేకోరాము దనుపుత్రుడున్న వాడుగదా ! వానిచేయి శంఖచక్రపద్మాదిరేఖలతో నొప్పారుచున్నది. వాడు తనకరమును గోరిక నెఱవేఱుటకై పుట్టలో నుంచినయెడల నిస్సందేహముగా శివభగవానుడు. కంకణమిచ్చితీరును. అని భార్య చెప్పగానే దేవదాసుడు కొడుకును బిలిచి సాదరముగా నిట్లనియె. నాయనా ! విరూపాక్షా ! నీవు పుట్టలో జేయియుంచి తివేని పరమేశ్వరుడు తప్పక కంకణమిచ్చును. అని తండ్రిచెప్పగానే విరూపాక్షుడు త్వరగా దన చేయి పుట్టలోనుంచెను. అపుడు సర్పములు కంకణములుగా గల శివుడు నిరుపమానమయి యమూల్యమయిన కంకణము నాతనిచేతి కిచ్చెను. ఆబాలు డది పుచ్చుకొని తనతండ్రిచేతి కిచ్చెను. దానిని బట్టుకొనిపోయి దేవదాసుడు కోమటి కిచ్చెను. అతడు సంతోషించి దేవదాసునకు గావలసినసామగ్రి యంతయు నిచ్చిపంపెను. దేవదత్త యాసామగ్రి వంటచేసి బ్రాహ్మణులందఱకును దృప్తిగా భోజనము పెట్టినది. వారందఱును సంతోషించి మునుపటికంటె నాలుగురెట్లు క్షేమముగా నుండుమని దీవించిపోయిరి. ఇట్లుండగా నాగంగాధరుడను కోమటి యాకంకణము నపహరింపవలయునని మనసులో నాలోచించుచుండగా నాకంకణము పామై వానియింట మహాధ్వని చేసినది. వాడది విని భయపడి దేవదాసునియింటికి బోయి "అయ్యా ! దేవదాసా ! నీవు మాయింట నుంచినకంకణము పామై మాటిమాటికిని గర్జించుచున్నది. నీ వీయవలసినధనమునకును నీకును బదివేల నమస్కాములయ్యా! వెంటనే వచ్చి నీ కంకణమును నీవు దెచ్చుకొమ్ము. నీకు మాయందంత దయయున్నచో దొరకినప్పుడు మాధవ మీయవచ్చును." అని యింటికి బోయెను. దేవదాసు డాతనిమాటలు విని వైశ్యునియింటికి వేగముగా బోయి శైవకంకణమును దీసికొని తిన్నగా దనయింటికి వచ్చెను. తరువాత నాదేవదాసుడు తననేర్పును బ్రకటింపదలంచి యమూల్యమును, చిత్రమును, నిరుపమానమును నగునొక దివ్యాంబరమును నేసి దానిని దేశింగరాజున కమ్ముద మనియుంచెను. అవస్త్రము మూడువందల యఱువది మూరల పొడవును, పండ్రెండు మూరల వెడల్పును గలిగి యుండెను. అది

పరమేశ్వరునికే తగినది. గనుక వర్తకులుదానికి వెల నిర్ణయింప జాలరైరి. కాని యొకడుమాత్రము దానికి మూడులోకములును దగినవెల యనునభిప్రాయము మనసులో నుంచుకొని మూడువ్రేళ్ళు చూపెను. అపుడు విష్ణుచక్రము ప్రళయకాలాగ్ని వలె మండుచు వచ్చి వెల చెప్పిన వర్తకునిమూడువ్రేళ్ళను ఛేదించినది. అపుడు తక్కిన వైశ్యులు దానికి వెలలేదనియు బరమేశ్వరుడే యది ధరింప దగినవా డనియు నిర్ణయించిరి. ఇట్లు చెప్పినవైశ్యుల మాటలు విని దేవదాసు డావస్త్రమును శివున కర్పింతమని యనుకొనెను. అట్లు నిశ్చయించుకొని దానిని శ్రీశైలనాథుడగు భగవంతునికి ధ్వజపటముగా సమర్పించెను. అంత దేవు డావస్త్రముచే సంతోషించి దేవదాసున కంతములే నంత సంపద నిచ్చి సాదరముగా నిట్లనియె. దేవదాసా ! నీవు నాభక్తుల కన్నము యథేచ్ఛముగా నిచ్చుచుండుము. లోకములోనియన్నిమతముల కంటెను. నుత్తమ మగుశైవమతమును స్థాపించి వీలయినంత వేగముగా నాలోకమునకు రమ్ము. అని చెప్పి భగవంతు డంతర్ధాన మాయెను. తరువాతను దేవదాసు డింటికి వచ్చి యావైశ్యునకీయవలసిన ధనమంతయు లెక్కప్రకార మిచ్చివేసి శైవులకు బ్రతిదిన మన్నప్రదానము చేయుచుండెను. మఱియు మహాయోగి యగునాతడు ఋణవిముక్తుడై శైవులకు వస్త్రములు యజ్ఞోపవీతములు దానము చేయుచుండెను. క్రమముగా లోకమంతటను శైవమతమును వ్యాపింపజేసెను. ఇట్లు శైవమతము విస్తార మగుట చూచి బౌద్ధగురువు తనశిష్యుడగు దేశింగరాజు నొద్దకుబోయెను. ఆరాజు తనగురు వింటికి వచ్చుట చూచీ యథావిధిగా బూజించి కుశల మడిగెను. బౌద్ధగురువు తనకుశలమును జెప్పి సాదరముగా రాజును గుశలాదిక మడిగెను. రాజు తనకుశలాదికమును గురువునకును విన్నవించి యాయనతో మధురముగా నిట్లనియె. గురువర్యా ! నేను బౌద్ధుడను నాభార్య శైవమతస్థురాలు. కావున దాము పోయి నాభార్యకు బౌద్ధాచారమును బోధించి బౌద్ధమతమందాసక్తురాలినిగా జేయుడనవు డాగురు నామె యొద్దకుబోయి యుత్తమమయిన బౌద్ధాచారమంతయు నాయింతికి బోధింపగా సంగమాంబ యనునారాజభార్య బౌద్ధాచారమంతయు విని నవ్వుచు వేళాకోళముగా నతనితో నిట్లనియె. ఏమీ ? మాగురు వగుదేవదాసుడు రామలింగేశ్వరస్వామిసన్నిధిలో బౌద్ధులనందఱను జయించెననియునది మొదలు బౌద్ధులందఱును శైవమతము నవలంబించిరనియు వినియుంటిని. ఈసంగతి యందఱు నెఱింగినదే మీచెవుల బడనే లేదా ! మఱియు నో బౌద్ధగురూ ! అపు డొకయాశ్చర్యము గూడ గలిగినదట ! అది యే మనగా బౌద్ధులందఱును

వినుచుండగా రామలింగేశుడు "నేనే శివుడను. సర్వత్ర నిండియుండువాడను, పరమాత్మను, ముక్తి నిచ్చువాడను, జ్ఞానస్వరూపుడను" అని యనేకపర్యాయములు చెప్పగా నానందరూపుడగు నా పరమేశ్వరుని యద్భుత వాక్యములను విని యున్నారట ! అది నీ చెవుల బడలేదు కాబోలును ! అని చెప్పిన రాజపత్నిమాటలు విని రాజునొద్దకు వచ్చి జరిగిన వృత్తాంతమంతయు వినిపించెను. తరువాతను రాజు గురువుతో నాలోచించి భార్యను రావించి యామెతో నిట్లనియె. సుందరీ ! నీగురువును నాగురువును బరీక్షింతము. నీగురువు నాగురువును జయించి నచో నాగురువు శైవుడగును. నాగురవే నీగురువును జయించినచో నీగురువు బౌద్ధు డగుగాక. అని యిట్లు రాజు సర్వలోకసమ్మతముగా బలికి విని యాతనిభార్య యట్లే యని యంగీకరించినది. తరువాత రాజు దేవదాసుని గౌరవముగా రప్పించి యాతనితో నిట్లనియె. విద్వన్ ! ఇతడు నాగురువు. నీవు శైవగురుడవు. అదిగాక నీవు నాభార్య కును గురుడవు. నాకీబౌద్ధగురువు గురుడు. సర్వజ్ఞత్వము విషయమున మిమ్ముల నిద్దఱను బరీక్షింతుము. ఆపరీక్షలో నీవే నాగురువును జయించితివేని యతడు వెంటనే శైవుడగుట కెంతమాత్రము నభ్యంతరము లేదు. ఒకవేళ మాగురువే నిన్ను జయించెనేని యదిమొదలు నీవు బౌద్ధమత మవలంబించి తీరవలయును అని రాజు చెప్పగానే యిరువురును మంచిదేయని యంగీకరించిరి. తరువాతను రాజు కుండలో నొక పామునుంచి సభలోనికి తెప్పించి యిట్లనియె. ఓయీదేవదాసా ! అయ్యా ! బౌద్ధగురూ ! మీరిరువురును బూజ్యులు సర్వజ్ఞులని తలంచుచున్నారు గదా ! కావున నీఘటములో నేమియున్నదో చెప్పుడనగా బౌద్ధగురువు పామున్నదనెను. అపుడు దేవదాసుడు బౌద్ధగురునివాక్యమును ఖండించి సర్వవ్యాపియు మోక్షదాతయునగు శివుడు నాగాభరణధారియై యిందున్నాడనెను. అనగానే రాజు మూత దీయించి చూచునప్పటికి దేవదాసుడు చెప్పినచొప్పుననే నాగాభరణభూషణుడై శివుడు ప్రత్యక్షమాయెను. తరువాతను రాజు శిష్యులతోగూడ గతగర్వుడై మోము పంచుకొనియున్న బౌద్ధగురునితో నిట్లనియె బౌద్ధగురూ ! నీవు దేవదాసుచే జయింపబడితివి కావున వెంటనే శివదీక్షను లింగదీక్షను బొందుమనెను. అని రాజు చెప్పగానే బౌద్ధగురువు భక్తి పూర్వ కముగా దేవదాసునకు నమస్కరించి యిట్లు యాచించెను. దేవదాసా ! సర్వజ్ఞా ! సర్వలోకపూజితా ! ఇపుడు నాకు నాశిష్యులకును, ఈమహారాజునకు గూడ ముక్తికాంత నీయదగిన శివదీక్షను లింగదీక్షను రుదాగమోక్తవిధిగా నిమ్ము. అని బౌద్ధగురువు ప్రార్థించినతోడనే శివప్రియుడగు దేవదాసు దండఱకును నట్లేయిచ్చి

యందఱకును శివపంచాక్షరీమంత్రము నుపదేశించి శివపూజవిధానమును బోధించి తరువాతను సద్యోజాతుడును మహాదేవుడను నగుకుండలోని శివుని దన యామోదపట్టణమునకు దీసికొనివచ్చి యాథావిధిగా స్థాపించెను ఆయనను భక్తిశ్రద్ధాతాత్పర్యములతో వేదోక్తములగు మంత్రములచే బూజించుచుండెను. తరువాతను శిష్యవర్గసమన్వితుడై దేవదాసుడు కల్యాణనగరములో బ్రవేశించి తపశ్శాలియగు జగద్దేవమహారాజును జూచెను. ఇంటికి దయచేసిన తనగురువును జగద్దేవుడుచూచి యథావిధిగా బూజించి యుచితాసనమున గూర్చుండ బెట్టెను. పిదప మహామతియగు దేవదాసుడు జగద్దేవునిపౌరులందఱకును విధిగా శివదీక్షను లింగదీక్షనుజేసి ధర్మార్థ కామమోక్షముల నీయజాలిన శైవపంచాక్షర మంత్రమును గూడ నుపదేశించి శివపూజా విధానమును బోధించి యచ్చటినుండి తన యామోద పట్టణమునకు వచ్చి బంధుబృందసమన్వితుడై తన కుమారుడగు నేకోరామున కుపనయనము చేసెను. ఆయుత్సవసందర్భమున శైవులందఱకును విశేషముగా నన్నప్రదానము చేసి వస్త్రాదులచే సంతోషమును గలిగించెను. అనంతరము దేవదాసుడు తన కుమారుడగు నేకోరామునకు వివాహము గూడ జేసెను. అపుడు శివుడు కైలాసమునుండి దేవదాసునియింటికి వచ్చెను. దేవదాసుడు భార్యతోగూడ యథావిధిగా బూజింపగా శివుడు సంతోషించి మధురముగా నిట్లనియె. దేవదాసా ! నీవు లోకమంతయు నామతముతో నిండునట్లు చేసితివి. నాయనా ! ఇటుపయిని పుట్టబోవువారికి గురువునుగా నీకుమారుడగు నేకోరాముని నభిషేకింపుము. ఏకోరామునకు రుద్రుడనువాడు పుట్టును. అతనికి గాలసేనుడనువాడు పుట్ట గలడు. రుద్రునకునుకాలసేనునకును బ్రహ్మనిర్మితలగు కన్యలు భార్యలుగా గలరు. అనిచెప్పి శివుడంతర్ధానమాయెను. తరువాతను దేవదాసుడు సర్వగుణసంపన్నుడగు కుమారుని శైవగురు స్థానమున నభిషిక్తునింగా జేసెను. ఈరీతిగా నీశ్వరుడు చెప్పినదంతయు ముగించి భార్యతో గూడ సదా హృదయమందు శివుని ధ్యానించుచు బూజించుచు గీర్తించుచు శివసాయుజ్యమును బొందెను. ఈ దేవదాసునిమహాత్మ్యమును జదువు వారికిని వినువారికిని లక్ష్మి దాసురాలై యుండును.

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని దేవాంగచరితమున దేవదాసునియవతార కథాపరిపూర్తి యన్నది.

యిరవదియెనిమిదవ యధ్యాయము.

ఇరువదితొమ్మిదవ యధ్యాయము

సూతు - తరువాత నో మునిపుంగవులారా ! ఆమోదపట్టణాధీశుడును దేవదాసునికుమారుడును నగు విరూపాక్షున కుగ్రవిక్రముడగు రుద్రుడుపుట్టెను. మహాబాహుండగు విరూపాక్షుడు తన కుమారుడగు రుద్రుని సాదరముగా గురుపీఠమునం దభిషిక్తునిజేసి యతడు స్వర్గమునకుబోయెను. పిమ్మట రుద్రుడు శిష్యమండలమును బాలించుచు జిత్ర విచిత్రములగు వస్త్రములునేసి యందఱకు నిచ్చుచుండెను. అతడు శివాజ్ఞానుసారముగా బ్రహ్మనిర్మితయగుకన్యకను విధియుక్తముగా బెండ్లియాడెను. రుద్రు డామెయందు సర్వలక్షణసంపన్నుడగు కుమారుని గని యతనికి గాలసేనుడని నామకరణముచేసెను. త్రిలింగదేశాధీశ్వరుడును శైవవ్రత పరాయణడును నగు సోమనాథుని కూతురగు దుర్గళయను కన్యను దనకుమారుడగు కాలసేనునకు రుద్రుడు పెండ్లి చేసెను. పిమ్మట గాలసేను డామోదపురమున బాలించుచు వస్త్రములునేసి యందఱకు నిచ్చుచుండెను. అతనికి బుత్త్రాభావము వలన నానాటికి జింత యెక్కువయయినది. అతడు బ్రహ్మనిర్మితలగు నేనూఱుగురు కన్యలను బెండ్లియాడెను. గాని యెుక్క తెయందును సంతతిలాభము గలుగకపోయినది. అనపత్యదుఃఖమును సహింపజాలక యాకాలసేనుడు ప్రయత్నపూర్వకముగా శివుని బూజింపమొదలిడెను. ఆతనిదృఢభక్తికి శివుడు సంతోషించి యతనికి బదివేలమంది పుత్త్రులు గలుగునట్టు వరమిచ్చెను. తరువాతను శివప్రసాదమువలన నతనికి బది వేలమంది పుత్త్రులుగలిగిరి. అపుడాతడు చాల సంతోషించుచుండెను. ఆ పుట్టినవారిలో గొందఱపేళ్ళు చెప్పెదవినుడు. మొదటివాడు రూపసేనుడు, రెండవవాడు భద్రసేనుడు, మూడవవాడు చిత్రసేనుడు. అట్లే సత్యసేనుడు, సుషేణుడు, యజ్ఞసేనుడు, సేనాబిందు, యజ్ఞబిందువు, తృణబిందువు, జటాధరుడు, జయవంతుడు, జయశీలుడు, జయబిందువు, జితేంద్రియుడు, సత్యవ్రతుడు, సత్యవాది, సుందరాంగుడు, త్రిలోచనుడు, సాంబుడు, సారస్వతుడు, చైత్రుడు, సర్వజ్ఞుడు, సర్వభావనుడు, సంవిదానుడు, సంప్రహారుడు, సమగ్రుడు, సత్యభాషణుడు, సరసుడు, సాహసి, సహస్వంతుడు, సుముఖుడు, సురానందుడు,సులభుడు, సుందరుడు, సుందరీప్రియుడు, శతానందుడు, శంభుదేవుడు, శంకరుడు, శివదర్శనుడు మొదలగువారు పదివేల మంది కాలసేనుని కుమాళ్ళు, తరువాతను కాలసేనుడు తనకుమాళ్ళందఱకును ఋషిపుంగవులచే నుపనయనములు చేయించి

వేదాదివిద్యల నధ్యాపన చేయించెను. మఱియు వారి యందఱకును సకాలమున బ్రహ్మనిర్మితలగు కన్యలనుదెచ్చి పెండ్లి చేసెను. కాలసేను డెవ్వరిచే గొడుకుల కుపనయనసంస్కారము చేయించెనో ఆమన్వాదులు వారికి గూటస్థు లయిరి. వారు మన్వాదులగు ఋషుల గోత్రముల యెుక్క భేదమునుబట్టి యెుకరిబిడ్డల కొకరు తమ బిడ్డలను వివాహాదుల కీయ నర్హత గలవారైరి. కాలసేనుడు తనపెద్దకొడుకగురూపసేనుని గురుపీఠమునసుంచెను. అతడు గురుపీఠమును బాలించుచు దమ్ములు దానును వస్త్రములు నేసి యందఱకు నిచ్చుచుండెను. ఇట్లు చిరకాలము పుత్త్రులతో గూడి కాలసేను డామోదపురమును బాలించుచు నందఱకును వస్త్రము లిప్పించుచు సుఖముగానుండెను. ఇట్లుండగా బరితాణమను పట్టణమందు శాలివాహనుని కుమారుడు శక్తియనువాడు మహాబలవంతుడు ప్రజలను పాలించుచుండెను. ఆపట్టణమందు సోమశర్మ యనుబ్రాహ్మణుడు వేదపారగుడు గలడు. అతడు సంతతి లేక కులసిద్ధవటమునుగూర్చి పోయి యచ్చటి వారిచే బూజింపబడుచు జంద్రమౌళీశ్వరుడను పేరుతో నందఱకును వరముల నిచ్చుచు శివుడుండుటను విని యచ్చటనే భిక్షాశనుడై సంతతికొఱకాదేవుని నిత్యమును సేవించుచుండెను. మఱియు నత డెప్పుడును జంద్రమౌళీశ్వరునియాలయములో నుండి యా శివుని బూజించుచు రాత్రి యందే నిదురించుచుండెను. ఇట్లుండగా ధనపాలు డనువైశ్యు డొకడు సంతతికై సిద్ధవటమునకువచ్చి యనేకరత్నములచే జంద్ర మౌళీశ్వరుని బూజించెను. రత్నాలపూజకు శివుడు సంతోషించి వైశ్యరత్నమా! నీకు గుమారు నిచ్చితి ననియెను. ఆమాట విని యావైశ్యుడెంతయు సంతసించి యాశివాలయములోననే పాడుచు నాట్య మారంభించెను. ఆచప్పుడు విని నిద్రలో నున్న సోమశర్మ మేలుకొని యానందపరవశుడై నృత్యము చేయుచున్న కోమటిని జూచి మధురముగా నిట్లనియె. అయ్యా ! నీ కేమి యిట్లు నాట్యము చేయుచున్నావు ? నీ సంతోషమునకు గారణమేమి ? నాతో జెప్పుము. అని యాబ్రాహ్మణుడడుగగా వైశ్యుడిట్లనియె. అయ్యా ! నేను సంతతికై యీ చంద్రమౌళీశ్వరుని రత్నములచే బూజించితిని. ఆయన సంతోషించి నాకు బుత్త్రు నొసంగెను. అందుచే సంతోషించి నాట్యము చేయుచుంటిననెను. ఇట్లు బ్రాహ్మణునితో జెప్పి యా వైశ్యుడు శివునకు నమస్కరించి యచ్చటినుండి బయలుదేఱి పోయెను. సోమశర్మ వైశ్యునికి శివు డిచ్చిన వరదానముసంగతి విని స్పర్ధ పూని దుఃఖించి శివునిగూర్చి మొఱ్ఱపెట్టెను. ఆహా ! చంద్రమౌళీశా ! నీవే యింత పక్షపాతము చేయుచున్నావుగదా ! నేను జిరకాలము నుండి నిన్ను భక్తిశ్రద్ధాతాత్పర్యములతో బూజించుచుండగా నాకు

సంతతి నీయక వైశ్యుని కొక్కనాడే సంతోషించి పుత్రుడు కలుగునట్లు వరమిచ్చితివిగా ! ఇట్లు చేయుట నీకు దగునా ? నీ వింత నిర్దయుడవును గృతఘ్నుడవును వనినే ననుకోలేదు. ఇపుడు నీపక్షపాతము దెలిసినది. నే నింతగా బూవులచే బూజించుచున్నను నీకు సంతోషము గలుగక పోయినది. వైశ్యుడు చేసిన రాళ్ళపూజకు వెంటనే సంతోషము గలిగినది. సరే దీనిని బట్టిచూడగా నీకు రాళ్ళపూజ యిష్ట మని తెలిసినది. నీకొఱకు బూవులు నిత్యమును గోయుచుండుటచే నాచేతులు కాయలు కాచినవి. నీపూజకు పత్రిమోసి కొని వచ్చుచుండుటచే నాశిరస్సు బట్టతల యయి పోయినది. నే నింతకష్టపడు చున్నను సంతోషింపక వైశ్యుడుచేసిన రాళ్ళపూజకు సంతోషించితివి. అట్లేని నేనును నీకు రాళ్ళతోనే నీసంతోషమునకై పూజచేసెదను. చిన్నచిన్నరాళ్ళచే జేసిన పూజకే నీకు సంతోషము గలిగినదిగనుక నేను నీకు బెద్దబెద్దరాళ్ళతో బూజ చేసెదను జూడు మని యొకగొప్పబండరాయి తెచ్చి దుర్మతి యగు నాసోమశర్మ "మఱిసంతోషించుము" అని యా శివునినెత్తిమీదను బడవైచెను. ఆరాయి పడినతోడనే లింగము బ్రద్దలై పోయినది. అపుడు దేవుడు కోపించి యగపడకుండనే యా బ్రాహ్మణుని గూర్చి యిట్లనియెను. ఓరీ ! దుర్బుద్ధీ ! నీసాహసము వలన నీకే హాని గలిగినదిరా ! నీవిట్టి చపలాత్ముడవై చేసినపనికి నేను సంతోషింతు ననుకొంటివిగా ! నీకోపము నిన్నే భక్షింపగలదు. నిస్సంశయము. అయినను నీవు మొదట నాకు జేసినపూజకు సంతోషించితిని గావున నీకు బుత్త్రు నిచ్చెదను. అతడు గొప్పవాడుగాగలడు. నీవు పడవైచినరాయితో నాశిరస్సు బ్రద్దలయినట్లే నీకును గొడుకుపుట్టగానే శిరస్సు బ్రద్దలైపోవును. ఇట్టి మహాపాతక మాచరించితివి. గనుక నీకు బుట్ట బోవు కొడుకు హీనవర్ణుడు గాగలడు. ఇట్లని యాచంద్రమౌళీశ్వర దూరకుండెను. సోమశర్మ తరువాతను జింతానందములతో గూడినవాడై పరిటాణపట్టణమునకు వచ్చి జరిగి నవృత్తాంతమంతయు భార్యతో జెప్పెను. శీలసంపన్నురాలగుసోమశర్మభార్య సుశీల యనునామె గర్భవతి యయి పదియవనెలను గుమారుని గన్నది. అతడు పుట్టగానే సోమశర్మశిరస్సు బ్రద్దలయినది. శివునిశాపమమోఘముగదా ! పతివ్రతయగు నతని భార్యయు మృతి నొందినది. తలిదండ్రులు లేనియాబాలుని మేనమామ యగుయజ్ఞ శర్మ తనయింటికి గొనిపోయి భార్య కప్పగించి పోషించుచుండెను. అతనికి ద్రుమళు డని నామకరణము చేసిరి. అత డుపనీతుడై విద్య లభ్యసించుచుండెను. ఇట్లుండగా నొకనా డాద్రుమళుడు మేనమామయాజ్ఞను శిరసావహించి సమిధలు దెచ్చుటకై యొక్కడే యడవికి బోయెను. అతడచ్చట గుక్కతో గ్రీడించుచున్న సింహమును జూచి

యాశ్చర్య పడెను. ఆయాడుకుక్క గ్రామములో నుండునది గనుక దిన్నగా బరిటాణపురము బ్రవేశించి శక్తియను రాజుమందిరములోనికి బోయినది. ద్రుమళు డును దానివెంటనే వచ్చెను కుక్క రాజమందిరములోనికి బోవుట చూచి యతడు తనయింటికి బోయెను. ఆకుక్కకు సింహవర్ణముగల రెండుపిల్లలు పుట్టినవి. ఆ రెండును వీథులలో నెంగిళ్లు తినుచు బెరుగుచుండెను. ఇట్లుండగా శక్తిరా జొకప్పుడు తనయు ద్యానవనములో బ్రవేశించి యనేకలక్ష్యములను గుఱిగొట్టుచుం డెను. అంత నారా జొకతాటిచెట్టును గుఱి చేసి దానితలను గ్రింద బడునట్లు గొట్టెను. అతనియద్భుత కర్మమునకు బౌరులందఱును సాధువాదములు పలికిరి. అపుడు ద్రుమళుడారాజునకు గల్గినగొప్పను జూచి సహింపనివానివలెరాజుతో నిట్లనియె. రాజా ! నీవీచెట్టుమొదలొక్క బాణముచే నఱికితివేని గొనియాడ దగినవాడనే కాని తలనఱికినంత మాత్రమున మెచ్చదగవు. అనియిట్లు ద్రుమళుడను బ్రాహ్మణుడు చెప్పిన మాటలు విని కోపించి ధనుర్బాణములు చేబూని యిట్లనియె. ఓయీ ! ఊరకమాటలు చెప్పి పోవనెంచినచో నిన్నదుగ్గై నను గదల నీయను. ఇదిగో ధనుర్బాణములు నీవంత నేర్పరివి బలము గలవాడవును నగుదువేని యీతాటి చెట్టుమొదలు నఱుకుము చూతమనెను. ఇట్లు శక్తి చెప్పగానే ద్రుమళుడు ధనుర్బాణములు గైకొని యందఱును జూచుచుండగానే పెక్కుతాటి చెట్లమొదళ్ళు తెగి క్రింద బడువడువున నొకేబాణమును బ్రయోగించెను. తరువాత నాశక్తిమహారా జాయద్భుత కర్మమును జూచి చాలసంతోషించి యిష్టమయినది కోరుమనెను. రాజునకు దనయెడ గలిగిన దయకు సంతోషించి యారెండుకుక్కపిల్లలను దన కిమ్మని యాచించెను. రాజు చాల సంతసించి సింహమునకు బుట్టిన యా రెండుకుక్కపిల్లలనే కాక మఱియు నెన్నోగ్రామములను భూషణములను ద్రుమళునకి దయచేసెను. ఇట్లు ద్రుమళుడు రాజుతో సఖ్యము గలిగి యుండెను. మహాబలపరాక్రమములు గల యాయిద్దఱును నొకే శరీరముగా నుండిరి. ద్రుమళు డాకుక్కపిల్లలను దనయింటికి దీసికొనిపోయి పెంచుచుండెను. తానేది తినునో వానికినినదే పెట్టుచుండెను. ఆ రెండుపిల్లలకును జక్కనిప్రక్కలు సిద్ధముచేసి తనపరుండుచోటున వానిని బరుండ బెట్టుకొనుచుండెను. మఱియు నారెంటికిని పట్టువస్త్రములతో గంచుకములు కుట్టించి తొడుగుచుండెను. మహా తపశ్శాలియగు నాతనిమేనమామ యజ్ఞశర్మ యనునతడు తనమేనల్లుడగుద్రుమళు డాచారహీను డగుట దెలిసి కోపముతో గూడినవాడై శూద్రికా ! నీ విటుపయిని మాయింటికి రావలదని నిందించెను. ఇట్లు మేనమామ చెప్పగానే యాద్రుమళుడు

బ్రాహ్మణవేషమును విడిచి శూద్రు డయిపోయెను. అది మొదలతనికి శూద్రికు డనియే పేరు ప్రసిద్ధమయినది. ఆశూద్రికుడు శాలివాహనుని కుమారు డగు శక్తి మహారాజుతో నానాటికి స్నేహము వృద్ధి నొందించుకొనుచునే యుండెను. ఇట్లుండగానే పాళదేశాధీశ్వరుడును బౌద్ధమతస్థుడును నగుసుదారకు డను నతడు శక్తిరాజును సేవించుటకై పరితాణపురమునకు వచ్చెను. అతడు శూద్రికుని యింటికి బోయి యతనిచే గౌరవింపబడి యతని కిట్లు శకునము చెప్పెను. శుద్రికా ! నీవు శక్తిమహారాజునకు బ్రియమిత్త్రుడవు గదా ! ఇట్టి మీయిద్దఱకు నాఱుమాస ములలో గాఢ్రబలవిరోధము రాగలదు. అపుడు నీవు మావైజయంతీపురమునకు రమ్ము. నేను జెప్పిన ప్రశ్న యెన్నటికిని వ్యర్థముగాబోదు. అట్లు మీ యిరువురకును విరోధము సంభవించునపుడు నీవు మఱియే యితర పట్టణమునకును బోక తప్పక మాపట్టణము నకే రమ్ము. అని యతడిట్లు చెప్పగానే శూద్రికుడు మంచిదేయనెను. తరువాత నా బౌద్ధుడు శూద్రికుని సమ్మతింపజేసి తవపురము చేరెను. మఱికొన్నాళ్ళకు శక్తిరాజు సైన్యముతోడను శూద్రికునితోడను వేటకై యడవికి బోయి యందందు దిరిగి యాయామృగములను బెక్కింటిని జంపి రాజు శూద్రికు డొకచోట గూడిరి. బలమంతయు వెనుకను జిక్కియుండగానే వారిద్దఱును మృగములను గొట్టుచు సంచరించుచుండిరి. తరువాతను మహాధ్వనిచేయుచు లొంగకయుండు సింహము నొకదానిని శూద్రికుడు గత్తితో గొట్టి పడవైచెను. అట్లు పడవైచి తనచేత నున్నకత్తితో గ్రుచ్చి యెత్తి యాదరముగా రాజున కిచ్చెను. అంత నాశక్తి సూతపుత్త్రులను బిలిచి యాసింహమును దానే చంపినట్లు చాటింపుడని చెప్పి వారిని బురికి బంపెను. పౌరులు తమరాజుపరాక్రమమునకు సంతోషించి పట్టణమంతయు నలంకరించి రాజు కెదురుగా వచ్చిరి. ఆరాజుభార్య కేశినియను నామె భర్త కెదురుగా బోవనుద్యుక్త రాలై నగల నలంకరించుకొని పూవుల నిచ్చుదానికై యెదురు చూచుచుండుగా నది వచ్చి యనేకవిధములయినపూలదండల నామె కిచ్చినది. ఆలస్యముగా పువ్వులుదెచ్చి యిచ్చినందుకై యామె దానిని బెదరించుచు నిట్లనియె. ఓసీ ! నేను వేగముగా బూవులు దెచ్చి యిమ్మని వర్తమానము పంపినను నీ వింతసేపెచ్చట నుంటివి ? సింహమును జంపి వచ్చుచున్న నాభర్త కెదురుగా బోవలసిన సంగతి యెఱుగవా ! అని కోపపరిపూర్ణురాలయియున్న రాజమహిషిని జూచి పూవులిచ్చునది వేళాకోళముగా నిట్లనియె. అమ్మా ! ఎందులకా తొందర ? కొంచెము శాంతింపుము. నాకు దెలియనిసంగతియే లేదు. నిజముగా నీభర్తయే సింహమును జంపినయెడల

నేనెప్పుడును నీకు వెలపుచ్చుకోకయే పుష్పముల దెచ్చియిచ్చుచుందును. అడవిలో జరిగిన సింహ వధప్రకార మంతయునిజముగా జెప్పెదనువినుము. శూద్రికు డాసింహమును జంపి కత్తికి గ్రుచ్చి నీభర్తచేతి కిచ్చెనట ! నామగడు పూవులకై యడవికి బోయి యావృత్తాంత మంతయు నా కాదరముతో జెప్పియున్నాడు. కావుననే నే డింతయాలస్యముగా నేను బూవులు దేవలసి వచ్చినది. అని చెప్పి పువ్వులది తన యింటికి బోయినది. అది చెప్పినమాటలు విని రాజుభార్య భర్త కెదురుగా బోక స్నానమందిరమునకు బోయినది. తరువాతను రాజు పౌరులచే నెదుర్కొబడియు దన కెదురుగా భార్య రాకుంట కేమి హేతువని యాలోచించి భార్య నడిగెను. సింహము నొక డెవడో చంపగా నీవే చంపినట్లు ప్రగల్భములు చెప్పుకొనుచున్న నిన్నెదుర్కొన్న నేమి లే యని నిందాపూర్వకముగా బదులు చెప్పినది. భార్యమాటలు విని రాజు చాల సిగ్గుబడి వెంటనే శూద్రికుని బిలిపించి విచారణచేయకుండనే యిట్లనియె ఓరీ ! శూద్రికా ! కృతఘ్నా ! నిన్ను నేను నిజముగా మిత్త్రుడ వని నమ్మియుంటిని. నీకును నాభార్యకును నేదో సంబంధము లేకపోలేదు. సింహమును సంహరించినసంగతి నీవే దానితో జెప్పితివి. అట్లు నీవే చెప్పనిచో దాని కావృత్తాంత మంతయు నెట్లు తెలియును ? నిన్నటిదినము నీవు నాభార్యతో నీవృత్తాంత మంతయు జెప్పి నన్నందఱిలోను సిగ్గుపుచ్చితివి. దీనిని బట్టి చూడగా మీ యిద్దఱకును దప్పకుండ సంబంధమున్నదని తేట పడుచున్నది. నిన్ను నేను స్నేహితుడవని తలంచుచున్నాడను గనుక నిన్ను జంపరాదు. కావున వెంటనే నాపురమునుండి పొమ్ము. అని చెప్పి తనకింకరులచే నిర్దోషుడగు శూద్రికుని గెంటించెను. మహాశూరుడగు నా శూద్రికుడు కోపపూర్ణుడయి వై జయంతీపురమునకు బోయెను. సుదారకమహారాజాతని బ్రీతిపూర్వకముగా నెదుర్కొని గౌరవించెను. శక్తిరాజు తనకు జేసిన యవమానమును స్మరించుకొనుచు సుదారకునితో నాలోచించి చతురంగబలమును వెంటబెట్టుకొని శక్తిరాజుతో యుద్ధముచేయుటకై వచ్చి యాతని పట్టణమును ముట్టడించెను. తరువాతను శక్తిరాజు మంత్రులతో నాలోచించి శూద్రికునితో యుద్ధముచేయదగిన శక్తిలేనివాడై మిక్కిలి బుద్ధిమంతుడగుకాలసేనుడనుమంత్రిని బిలిపించెను. అతడును జతురంగబలముతో పరితాణపురమునకు వచ్చెను. కాలసేనునిరాక విని శూద్రికుడు భయపడినవాడై సుదారకునితో నిట్లాలోచిం చెను. మనము మహాబలశాలి యగు కాలసేనునితో నెట్లు యుద్ధము చేయగలము ? పుత్త్రులతో గూడివచ్చిన కాలసేనుని మన మెట్లెదిరింపజాలుదుము ? అని యిట్లా లోచించుచుండగా నపుడాకాశవాణి

యిట్లనియె. "మీరు కాలసేనునకు భయపడ నవసరము లేదు. నామాట వినుడు. సహ్యాపర్వతముపైని పంచపుటుడను బౌద్ధుడు గలడు. అతడు బలవంతుడు మాంత్రికుడు, మాయావియును గనుక గాలసేనుని జయించును. మీరు వెంటనే యతనియొద్దకు బోయి తీసికొనిరండు. మీకు తప్పక యతనివలన జయము గలుగును. అను నాకాశవాణిపలుకులు విని శూద్రికుడు సంతోషపూర్ణు డయి వెంటనే సహ్యాపర్వతమునకు బోయి వినమయుగా నతనిని బ్రతిమాలి యతనితో గూడ పరిఠాణపట్టణమునకు వచ్చెను. తరువాతను మాయావి యగు పంచపుటుడు కాలసేనునికి శివు డిచ్చినయాయుధములను రాత్రి యపహరిం చెను. అందువలన శూద్రికాదులందఱును సంతోషించిరి. తరువాతను శక్తికిని శూద్రికునకును యుద్ధము జరిగినది. కాలసేనుడును పంచపుటుడును యుద్ధము చేయుచుండిరి. రూపసేనుడను సుదారకుడును మఱియొకచోట యుద్ధము చేయు చుండిరి. ఇట్లాయాఱుగురకును ఘోరముగా యుద్ధము జరిగినది. జయమును గోరుచుండ యోధులు పెక్కుమంది చచ్చిరి. దివ్యాయుధము లన్నియుబోవుటచే గాళసేనుడు విక్రమించి పంచపుటునితో యుద్ధము చేసిచేసి యనేకులను జంపి తుదకు యుద్ధములో శరీరమును విడిచెను. అతనికుమారుడు రూపసేనుడు శోక క్రోధములతో గూడినవాడై పంచపుటు నెదుర్కొని యిట్లనియె. ఓరీ ! దురాత్మా ! దొంగతనముచేతనటరా యుద్ధములో జయముపొం దుట! మాతండ్రియగు కాళసేను నియాయుధముల నన్నింటిని నీ వపహరించితివి. ఇక నెక్కడికి రా పోగలవు ? నాచేత జిక్కితివే క్షణమాత్రము నాయెదుట నిలువబడుము. పిడుగుల వంటి నాబాణములచే నీమర్మస్థానములను ఛేదించి యిప్పుడే నిన్ను యమపట్టణము నకు బంపించెదను. జూడుము. అని యిట్లు రూపసేనుడు చెప్పగానే పంచపుటుడు కోపించి యాతనిపై బాణవర్షము గురిపించెను. రూపసేను డాబాణము లచే నాచ్ఛాదింపబడిన వాడై క్షణమాత్రముననే యాబాణముల నన్నింటిని వారించి పంచపుటుని విరథునిజేసి వాడియగు బాణములచే గుండలములతో గూడ నాబౌద్ధునిశిరమును శరీరమునుండి క్రిందబడవైచెను. ఇట్లు రూపసేనుడు తనతండ్రిని జంపిని పంచపుటుని జంపి వానిసేనను బరువెత్తించెను. శూద్రికుడు శక్తినిజంపి యతనిసైన్యమును బరువెత్తించెను. ఇట్లు శూద్రికుడు శక్తిని జంపి యతనికుమారుని చిత్రవర్మ యనువానిని తదాసనమం దభిషిక్తునిజేసి రూపసేనుని కప్పగించి వైజయంతీపురమునకు బోయెను. రూపసేనుడు చిత్రకరుని కొఱ కాపరిఠాణపురములోనే యుండి కొన్నాళ్ళు గడచిన వెనుక దనయామోదపురము

నకు బోయెను. తరువాత నతడు పైతృకమగు సింహాసన మధిష్ఠించి తమ్ములతో గూడ ధర్మముగా రాజ్య మేలుచుండెను. దేవాంగునివంశము వారగు కాళసేనుని కుమారులు సముద్రతరంగములవలె వృద్ధి నొందుచుండిరి. ఋషులచే సంస్కరింప బడిన యాకాళసేనుని కొడుకుల గోత్రములు మొదట నూటరెండుగా లెక్క పెట్టబడినవి. తరువాత నవి క్రమముగా బదునేనువంద లయినవి. మూడులక్షల యేబదివేల యిండ్లవారగు నీ కాళసేనునివలన జన్మించిన దేవాంగ వంశమువారిలో నారదోపదేశమును బొందినవారు వైష్ణవులును దక్కినవారు పరిశుద్ధులగు శైవులును నయి యుందురు. మునిపుంగవులారా ! పవిత్రమును పాపనాశకమునునగు దేవాంగునిచరిత్రమంతయు మీకు జెప్పితిని. ఎవరు దీనిని జదువుదురో యితరులకు వినిపింతురో తాము విందురో వారికి సర్వకార్యములును సిద్ధించును. మఱియు దీర్ఘాయురారోగ్య పుత్ర పౌత్ర ధనకనకవస్తువాహనసమృద్ధి గలిగి యుందురు. ఈదేవాంగచరిత్రను ముందుగా బౌరాణికు నర్చించి మఱియు వినవలయును. అట్టివారికి మహాదేవుని యనుగ్రహమువలన నెల్లమనోరథములును నీడేరును. ఈదేవాంగచరిత్రపుస్తకమునకు బుట్టుదారము నిచ్చువారు నిర్మలమయిన జ్ఞానము గలిగి బ్రహ్మలోకములో బూజింప బడుచుందురు. పరిశుద్ధమయిన యీదేవాంగమౌనిచరిత్రమును వినువారు పార్వతి యనుగ్రహమునకు బాత్రులయి తమతమకోరికలను బొందుచుందురు. అని యిట్లు వ్యాసశిష్యుడగు సూతుడు చెప్పిన బ్రహ్మాండపురాణోత్తర ఖండములోని దేవలమౌని వృత్తమును పుణ్యప్రద మయిన దానిని విని శౌనకాదిమునీంద్రు లందఱును బరమానందమును బొందిరి.

శా. శ్రీదేవీచరణాబ్జభృంగ మయి సుశ్రీ మీఱగా నెంతయు
స్వైదుష్యమ్మును గాంచి మించిన పు. సూ. నా. తీర్థు లన్వానిచే
నీదేవాంగచరిత్ర మీపగిది వ్రాయింపించి ముద్రించె దా
నాదేవాంగకులోద్భవుండు తులసింగాఖ్యుండు ప్రఖ్యాతిగన్

ఇట్లు శ్రీ బ్రహ్మాండపురాణములోని దేవాంగ చరితమును సూతశౌనకాది సంవాదరూప మయినదాన దేవాంగవంశ కథన మన్నది.

యిరువది తొమ్మిదవ యధ్యాయము

దేవాంగపురాణము సమాప్తము.

***